గురువారం
4•1•2018
హైదరాబాద్
•వెల.5 రూ.
•సంపుటి 7 • సంచిక 208
•పేజీలు : 16 + (20/16)

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక
WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM HYDERABAD I KARIMNAGAR I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD



హైటెక్‌సిటీ అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో నిర్మించిన అండర్‌పాస్‌ను బుధవారం ప్రారంభించి పరిశీలిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి కూడా ఉన్నారు.

ఏడేండ్లలో విశ్వనగరి

హైదరాబాద్‌లో సిగ్నల్ ఫ్రీ రోడ్ల కోసం 23 వేల కోట్లతో ప్రణాళికలు

- 111 కిలోమీటర్ల మేర కారిడార్లు, స్కైవేలు, ఫ్లైఓవర్లు
- ఇప్పటికే రూ.3200 కోట్లతో ముమ్మరంగా పనులు
- మరో రూ.3 వేల కోట్ల పనులకు త్వరలో టెండర్లు
- నాలుగు దశల్లో ఎస్సార్డీపీ ఫలాలు
- తొలి ఫలితం అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్
- నిరంతర విద్యుత్ సీఎం కార్యదక్షతకు నిదర్శనం
- అండర్‌పాస్ ప్రారంభోత్సవంలో మున్సిపల్ మంత్రి కేటీఆర్
- 2018.. ఎగ్జిక్యూషన్ ఇయర్‌గా అభివర్ణన

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ/మాదాపూర్:

నగరంలోని రహదారులను 'సిగ్నల్ ఫ్రీ'గా తీర్చిదిద్దేందుకు రూ.23వేల కోట్ల వ్యయంతో వ్యూహాత్మక రోడ్ల అభివృద్ధి పథకం (ఎస్సార్డీపీ) చేపట్టామని రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కే తారక రామారావు చెప్పారు. దీనికింద 111 కిలోమీటర్ల పొడవున ఫ్లైఓవర్లు, స్కైవేలు, కారిడార్లు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధంచేశామని తెలిపారు. మొదటి దశలో 3200కోట్లతో 19చోట్ల పనులు చేపట్టగా, అయ్యప్ప సొసైటీ అండర్‌పాస్ పూర్తితో మొదటి ఫలం అందుకుంటున్నామన్నారు. మిగిలిన చోట్ల పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయన్న కేటీఆర్.. ఈ సంవత్సరాన్ని ఎగ్జిక్యూషన్ ఇయర్‌గా అభివర్ణించారు. ఇదికాకుండా రూ.2900 కోట్లతో కొత్త మార్గాలను ప్రతిపాదించామని తెలిపారు. ఎస్సార్డీపీలో భాగంగా అయ్యప్ప సొసైటీ జంక్షన్‌లో రూ.44.30కోట్లతో నిర్మించిన అండర్‌పాస్‌ను మంత్రి కేటీఆర్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దీనిని 12నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ తొమ్మిది నెలల్లోనే పూర్తిచేశామన్నారు. ఇందుకు కృషిచేసిన ఇంజినీరింగ్ అధికారులను మంత్రి అభినందించారు. ఈ

నిర్మాణం	గడువు
మైండ్‌స్పేస్ జంక్షన్ అండర్‌పాస్	మార్చి 2018
అదే జంక్షన్‌లో ఫ్లైఓవర్	జూన్ 2018
ఎల్బీనగర్ చింతలకుంట అండర్‌పాస్	మార్చి 2018
కామినేని జంక్షన్ వద్ద ఫ్లై ఓవర్	జూన్ 2018
రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్	సెప్టెంబర్ 2018
బయో డైవర్సిటీ ఫ్లైఓవర్	మార్చి 2019
అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తా ఫ్లైఓవర్	సెప్టెంబర్ 2019
రేతిబౌలి-నానల్‌నగర్ ఫ్లైఓవర్	డిసెంబర్ 2019

ఏడాది కొన్ని, వచ్చే ఏడాది మరికొన్ని ఫ్లైఓవర్లు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఇందులో మైండ్‌స్పేస్ జంక్షన్ అండర్‌పాస్ ఈ ఏడాది మార్చికల్లా రాకపోకలు ప్రారంభిస్తుందన్నారు. అదే జంక్షన్‌లో ఫ్లైఓవర్ జూన్‌లో, ఎల్బీనగర్ చింతలకుంట అండర్‌పాస్ మార్చినాటికి పూర్తిచేస్తామన్నారు. కామినేని జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ జూన్‌నాటికి, రాజీవ్‌గాంధీ విగ్రహం జంక్షన్ వద్ద ఫ్లైఓవర్ సెప్టెంబర్‌లో, బయో డైవర్సిటీవద్ద ఫ్లైఓవర్ మార్చి 2019కల్లా పూర్తి అవుతాయని మంత్రి

మిగతా 2వ పేజీలో

చివరి భూములకు చిక్కు

- రైతుల్లో అవగాహనలోపం
- ఎస్సారెస్పీ మొదలు మూసీ వరకు.. అవసరం లేకున్నా నడుస్తున్న మోటర్లు
- సాగునీటి సరఫరాపై పెరిగిన ఒత్తిడి
- ఐదారు గంటలే నడుపుకోవాలన్నా వినడం లేదు: ఎస్సారెస్పీ సీఈ
- రైతుల్లో అవగాహన పెంచడమే పరిష్కారమంటున్న నిపుణులు



కాకతీయ కాల్వనుంచి నీటిని తోడుతున్న మోటర్ పైపులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

శ్రీరాంసాగర్ నుంచి కాకతీయ కాల్వ ద్వారా ఐదు వేల క్యూసెక్కులు వదిలితే.. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్‌కు వచ్చేసరికి రెండు వేల క్యూసెక్కుల ప్రవాహమైనా ఉండాలి! ఎందుకైనా మంచిదని అధికారులు 5500 క్యూసెక్కులు వదిలారు. కానీ సుల్తానాబాద్‌కు వచ్చేసరికి కేవలం 1100 క్యూసెక్కుల ప్రవాహమే ఉంది! అంటే.. 900 క్యూసెక్కుల లోటు! ఫలితంగా.. చివరి భూముల రైతుల గగ్గోలు! ఎల్‌ఎండీ ఎగువన పరిస్థితి ఇలా ఉంటే.. తాజాగా బుధవారం ఎల్‌ఎండీ నుంచి 2200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. డీబీఎం-24 వరకు 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనేది లక్ష్యం. మరి చివరి భూముల పరిస్థితి ఎలా ఉంటుందనే దానిపై అటు రైతుల్లో, ఇటు అధికారుల్లోనూ ఆందోళన నెలకొంది. ఇక్కడే కాదు.. మూసీ ఎడమ, కుడి కాల్వలతో పాటు ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టు కింద కూడా ఇదే సమస్య. రైతులకు ఉచితంగా 24 గంటల కరెంటు ఇస్తున్న నేపథ్యంలో ఎదురవుతున్న అనుభవాలివి. గతంలో కరెంటు సరఫరాలేక నిర్దేశిత ఆయకట్టు రైతులు మాత్రమే సాగునీటికోసం ఎదురుచూసేవాళ్లు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు సమస్య అనేదే లేదు. పైగా.. ఈ ఏడాది నుంచి 24 గంటల నిరంతర, ఉచిత కరెంటు ఇస్తున్నది. అయితే.. పంట అవసరం మేరకు ఓ నాలుగైదు గంటలు తీసుకుంటే సమస్య లేదు.. కానీ నిరంతరాయంగా కాల్వల నుంచి నీటిని తోడుతున్నారు. ఇలా ఒకటీ.. రెండు కాదు.. వేలకొద్దీ మోటర్లు నడుపుతుండటంతో కాల్వ

మిగతా 12వ పేజీలో

మైనార్టీ కమిషన్ ఏర్పాటు

చైర్మన్‌గా మహ్మద్ కమరుద్దీన్



మహ్మద్ కమరుద్దీన్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ కమిషన్‌ను ఏర్పాటు చేసింది. ఈ మేరకు బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. కమిషన్ చైర్మన్‌గా మహ్మద్ కమరుద్దీన్, వైస్ చైర్మన్‌గా రాజారపు ప్రతాప్, సభ్యులుగా మహ్మద్ అర్షద్ అలీఖాన్, డాక్టర్ విద్యాస్రవంతి, గుస్తినోరియా, బొమ్మల

మిగతా 2వ పేజీలో

ముగ్గురు ఐఏఎస్‌లకు పదోన్నతులు

- కార్యదర్శులుగా ప్రమోషన్
- మరో ఇద్దరి డిప్యూటేషన్ పొడిగింపు
- ప్రభుత్వ ఉత్తర్వులు జారీ
- నేడో రేపో రెండో విడుత బదిలీలు
- 8 జిల్లాల కలెక్టర్ల మార్పు? కన్ఫర్డ్ ఐఏఎస్‌లకూ అవకాశం!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

2002 బ్యాచ్‌కు చెందిన ముగ్గురు ఐఏఎస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం కార్యదర్శులుగా పదోన్నతులు కల్పించింది. దీంతోపాటు ఇద్దరు ఐఏఎస్ అధికారుల డిప్యూటేషన్‌ను పొడిగించింది. ఈ మేరకు బుధవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్పీ సింగ్ ఉత్తర్వులు జారీచేశారు. కార్యదర్శులుగా పదోన్నతులు పొందినవారిలో రంగారెడ్డి జిల్లా కలెక్టర్ రఘునందన్‌రావు, ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శి జ్యోతిబుద్ధప్రకాశ్, హెచ్‌ఎండీఏ కమిషనర్ చిరంజీవులు ఉన్నారు. హెచ్‌ఎండీఏ కమిషనర్‌గా కొనసాగుతున్న చిరంజీవులు, డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఫెడరేషన్ లిమిటెడ్ ఎండీగా కొనసాగుతున్న ఐఏఎస్

మిగతా 12వ పేజీలో

జడ్జీల కసరత్తు

ఏపీకి హైకోర్టుపై ఫుల్‌కోర్టు సమావేశం

ఏపీ సీఎం చంద్రబాబు లేఖతో పుంజుకున్న వేగం

- భవనాల పరిశీలన, ఉద్యోగుల విభజనకు హైకోర్టు న్యాయమూర్తులతో కమిటీలు..
- ఎంపిక బాధ్యత తాత్కాలిక చీఫ్ జస్టిస్‌కు..
- ఉమ్మడి హైకోర్టు న్యాయమూర్తుల నిర్ణయం!
- పరిశీలన అనంతరం మరోసారి ఫుల్‌కోర్టు భేటీ
- ఏపీ హైకోర్టు తరలింపుపై పలువురి సందేహాలు!
- వసతులకోసం పట్టుపట్టిన న్యాయమూర్తులు!

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

ప్రస్తుతం రెండు రాష్ట్రాలకు ఉమ్మడిగా కొనసాగుతున్న హైకోర్టు విభజనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఏపీకి ప్రత్యేకంగా హైకోర్టును ఏర్పాటుచేసేందుకు కసరత్తు ముమ్మరమైంది. ఏపీ హైకోర్టును నిర్వహించేందుకు అనువైన తాత్కాలిక భవనాలను పరిశీలించాలంటూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఉమ్మడి హైకోర్టుకు లేఖరాసిన నేపథ్యంలో న్యాయమూర్తులు రంగంలోకి దిగారు. అందుబాటులో ఉన్న న్యాయమూర్తులతో బుధవారం సాయంత్రం ఫుల్‌కోర్టు సమావేశం నిర్వహించారు. హైకోర్టు సమావేశ మందిరంలో జరిగిన ఈ భేటీ.. ఒకింత వాడివేడిగా సాగిందని సమాచారం. ఏం చేయాలనే విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తంకావడంతో ఓటింగ్‌దాకా వెళ్లినట్టు తెలుస్తున్నది. ఓటింగ్‌లో పాల్గొన్నవారు ముందుగా తాత్కాలిక భవనాలను పరిశీలించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారని, అందుకోసం న్యాయమూర్తులతో

మిగతా 11వ పేజీలో

భారతీయులకు హెచ్-1బీ దెబ్బ

3

వీసా పొడిగింపును అడ్డుకునే దిశగా ట్రంప్ సర్కారు.. 15 లక్షలకుపైగా దేశీయ ఉద్యోగులపై ప్రభావం



టీఎస్ ఐపాస్ అద్భుతం

2

డెల్ ఎక్సెల్ ఫార్మా సీఈవో రఘుపతి ప్రశంస

మున్రో ధమాకా

- టీ20ల్లో మూడో సెంచరీతో కివీస్ ఆటగాడి ప్రపంచ రికార్డు
- విండీస్‌పై శతక విధ్వంసం
- భారీ విజయంతో సిరీస్ కివీస్ సొంతం

వివరాలు ఆటలో



తలాక్ బిల్లుపై రాజ్యసభలో లొల్లి

- ఏకమై అడ్డుకున్న విపక్షాలు
- బిల్లును సెలక్ట్ కమిటీకి పంపాలని పట్టు
- లోక్‌సభలో ఓబీసీ సవరణ బిల్లు

5



మేడారం జాతరకు హాజరుకావాలని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడును ఆహ్వానిస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి. చిత్రంలో ఢిల్లీలో తెలంగాణ రాష్ట్ర ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు సీతారాంనాయక్, నగేశ్

మేడారం జాతరకు రండి

ఉపరాష్ట్రపతిని ఆహ్వానించిన మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును బుధవారం రాష్ట్రమంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు ఆహ్వానించారు. గిరిజనులు భక్తిశ్రద్ధలతో జరిపే ఈ ఉత్సవంలో పాల్గొనాలని, సమ్మక్క-సారలమ్మలను దర్శించుకోవాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో ఉపరాష్ట్రపతిని మంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. మేడారం జాతర విశిష్టతను తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తోపాటు ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి లక్షల సంఖ్యలో భక్తులు ఈ జాతరకు వస్తారని మంత్రి ఉపరాష్ట్రపతికి వివరించారు. కోటి మంది భక్తులు జాతరను దర్శించుకుంటారని చెప్పారు. ఈ నెల 31 నుంచి ఫిబ్రవరి మూడో తేదీ వరకు జరిగే ఈ జాతర గిరిజన కుంభమేళా వంటిదని ఆయన పేర్కొన్నారు. మేడారం జాతరకోసం రాష్ట్ర ప్రభుత్వం సకల సదుపాయాలను సమకూరుస్తున్నదని చెప్పారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా హెలిప్యాడ్లను సిద్ధంచేసినట్టు మంత్రి తెలిపారు. అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించే బెల్లం సమృద్ధిగా లభించేవిధంగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వెల్లడించారు. ఉపరాష్ట్రపతి తమ ఆహ్వానంపై సానుకూలంగా స్పందించారని మంత్రి వివరించారు.

టీఎస్‌ఐపాస్ అద్భుతం

- డెలెక్సెల్ ఫార్మా సీఈవో రఘుపతి ప్రశంస
- రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కేటీఆర్‌కు లేఖ
- సానుకూల ఫీడ్‌బ్యాక్ స్ఫూర్తినిస్తుందన్న మంత్రి



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న టీఎస్‌ఐపాస్ అద్భుతంగా ఉన్నదని డెలెక్సెల్ ఫార్మా సీఈవో రఘుపతి కందారపు ప్రశంసించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కే తారక రామారావుకు లేఖ రాశారు. గతంలో తాను పరిశ్రమను ఏర్పాటుచేసేందుకు చేసిన ప్రయత్నాల్లో ప్రభుత్వం, ప్రభుత్వ విధానాలతో ఎదురైన అనుభవాలను మంత్రితో పంచుకున్నారు. పదిహేనేండ్లు అనేక కంపెనీల్లో ఫార్మా రిసెర్చ్ విభాగానికి హెడ్‌గా పనిచేశానని, ప్రస్తుతం ఉన్నటువంటి సులభమైన, పారదర్శక అనుభవం ఎప్పుడూ కలుగలేదని వివరించారు. '2016 జూన్‌లో టీఎస్‌ఐపాస్ ద్వారా అనుమతులు అందుకున్నాను. ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తిచేసి, డ్రగ్ లైసెన్సు కోసం డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ శాఖాధికారులను కలిశాను. గతంతో పోల్చితే ఈ డ్రగ్ లైసెన్సింగ్ విధానం అత్యంత సులువుగా, పారదర్శకంగా ఉంది. ఇది క్లిష్టమైన ప్రక్రియ. కానీ తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ ప్రక్రియ అత్యంత సులభంగా ఉంది. వారంలోపే లైసెన్సు పొందాను' అని పేర్కొంటూ రఘుపతి లేఖలో హర్షం వ్యక్తంచేశారు. వేగంగా అనుమతులిచ్చిన అధికారులకు, ముఖ్యంగా తెలంగాణ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. మంత్రి కే తారక రామారావు కృషి వల్లే ఇది సాధ్యమైందని.. ఆయన పనితీరు తమకు స్ఫూర్తిగా నిలుస్తున్నదని అధికారులు తనకు చెప్పారని పేర్కొన్నారు. 'ఇంతటి స్ఫూర్తివంతమైన మీ నాయకత్వానికి అభినందనలు. ప్రభుత్వం ఇదే తీరుగా ముందుకుపోవాలి' అని లేఖలో కోరారు. పారిశ్రామికవేత్త రఘుపతి లేఖపై మంత్రి కేటీఆర్ స్పందించారు. ప్రభుత్వ విధానాలపై పారిశ్రామికవర్గాల నుంచి వచ్చే సానుకూల ఫీడ్ బ్యాక్ మరింత ఉత్సాహంగా పనిచేసేందుకు స్ఫూర్తినిస్తుందని చెప్పారు. పరిశ్రమ స్థాపన, ఉద్యోగాలు కల్పించాలన్న తమ లక్ష్యాన్ని చేరుకునేందుకు ఇలాంటి ఫీడ్‌బ్యాక్ అవసరమని పేర్కొంటూ.. రఘుపతికి ధన్యవాదాలు తెలియజేశారు.

వెటర్నరీ ఉద్యోగాల ఎంపికకు మరో అవకాశం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పశుసంవర్ధకశాఖలోని వెటర్నరీ అసిస్టెంట్ ఉద్యోగాల భర్తీ కోసం ఇప్పటికే సర్టిఫికెట్ల పరిశీలనకు హాజరైన అభ్యర్థులకు వెబ్ ఆప్షన్ల నమోదుకు టీఎస్‌పీఎస్సీ మరో అవకాశం కల్పించింది. తాము ఏ జిల్లాకు ప్రాధాన్యం ఇస్తున్నారో వెబ్ ఆప్షన్ ద్వారా తెలియజేయాలని టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. www.tspsc.gov.in అనే వెబ్‌సైట్‌లో ఆప్షన్ నమోదుకు ఈ నెల 4 నుంచి 6 వరకు గడువు విధించామని పేర్కొన్నారు.

రాయపేట లిఫ్టుకు నిధులు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పెద్దపల్లి జిల్లా శ్రీరాంపూర్ మండలం గంగారం గ్రామ పరిధిలో ఏర్పాటుచేసే లిఫ్టు స్కీంకు ప్రభుత్వం నిధులు మంజూరుచేసింది. హుస్సేన్‌మియా వాగు కుడి గట్టు వద్ద రాయపేట లిఫ్టు స్కీం ఏర్పాటుచేసేందుకుగాను ప్రభుత్వం రూ.22.18 కోట్లతో పరిపాలనా అనుమతినిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది.

కేజీబీవీ కన్సల్టెంట్‌గా జీడీ ప్రియదర్శిని

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలోని పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల సంస్థ (కేజీబీవీ) సొసైటీ కన్సల్టెంట్‌గా మాజీ ఐఏఎస్ అధికారిణి జీడీ ప్రియదర్శినిని నియమించారు. ఈ మేరకు బుధవారం పోస్టింగ్ ఆర్డర్ ఇచ్చామని ఆశాఖ డైరెక్టర్ జీ కిషన్ చెప్పారు. అటవీశాఖలో అదనపు ప్రిన్సిపల్ చీఫ్‌కన్జర్వేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఐఎఫ్‌ఎస్ అధికారి పీ రఘువీర్‌కు పీసీసీఎఫ్‌గా పదోన్నతి కల్పిస్తూ సీఎస్ ఎస్పీ సింగ్ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు.


ఏరియా దవాఖానగా గజ్వేల్ సీహెచ్‌సీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: మెదక్ జిల్లా గజ్వేల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను ఏరియా దవాఖానగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ మేరకు బుధవారం వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రాజేశ్వర్ తివారీ ఉత్తర్వులు జారీచేశారు. రాష్ట్ర వైద్యవిధాన పరిషత్ పరిధిలోని 50 పడకల సామర్థ్యం గల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను 100 బెడ్ల ఏరియా దవాఖానాగా అప్‌గ్రేడ్ చేశారు. ఏరియా దవాఖానా అభివృద్ధి కోసం రూ.21.30 కోట్లు మంజూరు చేసేందుకు అనుమతులు ఇచ్చినట్టు వెల్లడించారు.

ముహూర్తం



సూర్యోదయం: 6.51 గంటలకు



సూర్యాస్తమయం: 5.51 గంటలకు

హేవళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత రుతువు, పుష్యమాసం, కృష్ణపక్షం, తదియ రాత్రి 9.34 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: పుష్యమి ఉదయం 6.08 వరకు తదుపరి ఆశ్లేష, అమృత ఘడియలు: రాత్రి 12.27 నుంచి తె. 2.03 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 1.44 నుంచి 3.06 వరకు, దుర్ముహూర్తం: మధ్యాహ్నం 2.55 నుంచి సాయంత్రం 4.23 వరకు, వర్జ్యం: సాయంత్రం 5.45 నుంచి రాత్రి 7.21 వరకు.

లోకం పోకడ



ఇదేం పాడుపని అని అడిగితే దేహమే దేవాలయం అంటున్నాడు!

త్వరలో బుద్వేల్‌లో ఐటీక్లస్టర్

- యూనిట్ల స్థాపనకు 30 కంపెనీలు రెడీ
- 1.25 లక్షల మందికి ఉద్యోగాల కల్పన
- బుద్వేల్, రాజేంద్రనగర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటన
- ఐటీ క్లస్టర్ ఏర్పాటుకు ప్రయత్నాలు ముమ్మరం

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: హైదరాబాద్‌లో మరో ఐటీ క్లస్టర్‌ను ఏర్పాటు చేసే ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్టు ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు తెలిపారు. క్లస్టర్ ఏర్పాటుచేయనున్న స్థలం గురించి రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ బుధవారం పర్యటించారు. ఈ క్లస్టర్‌లో కంపెనీలను స్థాపించేందుకు ఇప్పటికే 30కి పైగా సంస్థలు ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నాయని తెలిపారు. ఐటీ పరిశ్రమలో పేరున్న దేశీయ కంపెనీలతో పాటుగా అంతర్జాతీయస్థాయి మల్టీ నేషనల్ కంపెనీలు కూడా ఉన్నాయని చెప్పారు. కంపెనీల విజ్ఞప్తిమేరకు వాటి వివరాలను ఇప్పుడే పూర్తిగా చెప్పడంలేదని తెలిపారు. త్వరలోనే ఆయా కంపెనీలతో పరిశ్రమల స్థాపనకు లాంఛనంగా ఒప్పందాలు చేసుకోనున్నట్టు చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఐటీ పరిశ్రమలను నగరంలోని నలుమూలలకు విస్తరించాలన్న దీర్ఘకాలిక లక్ష్యంతో ముందుకు పోతున్నదని వివరించారు. కొత్త క్లస్టర్‌లో అన్ని మౌలిక సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని టీఎస్ఐఐసీ అధికారులను ఆదేశించారు. ఇందుకు సంబంధించి అత్యుత్తమ మాస్టర్‌ప్లాన్‌ను తయారుచేయాలని కోరారు. ఈ కంపెనీలు పూర్తిస్థాయిలో ఏర్పడ్డాక సుమారు 1.25 లక్షల ఉద్యోగాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి కేటీఆర్ వివరించారు. రాబోయే ఐదేండ్లలోపే ఈ కంపెనీలు పూర్తిస్థాయిలో కార్యకలాపాలను ప్రారంభిస్తాయని వెల్లడించారు. ప్రస్తుతం రాజేంద్రనగర్‌లో ఉన్న ఎలాంటి కార్యకలాపాలులేని ప్రభుత్వసంస్థలు.. తమ భూములను పరిశ్రమలకు ఇచ్చేందుకు ముందుకు వచ్చాయని, వాటి భూ యాజమాన్య మార్పులను త్వరలోనే పూర్తి చేస్తామని తెలిపారు. ఈ క్లస్టర్ పనులను వేగతవంతం చేసేందుకు ఐటీ, రెవెన్యూశాఖ, రంగారెడ్డి జిల్లా కలెక్టర్, టీఎస్ఐఐసీలతో కలిసి ప్రభుత్వ ప్రధానకార్యదర్శి సమావేశాన్ని నిర్వహించనున్నారని మంత్రి తెలిపారు. ఈ పర్యటనలో మంత్రి కేటీఆర్ వెంట ఐటీ, పరిశ్రమలశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్‌తో పాటుగా రెవెన్యూ, టీఎస్ఐఐసీ అధికారులున్నారు.



బుద్వేల్‌లో ఐటీ క్లస్టర్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో బుధవారం దానికి సంబంధించిన మ్యాపును పరిశీలిస్తున్న మంత్రి కే తారకరామారావు. చిత్రంలో ఐటీ, పరిశ్రమలశాఖ కార్యదర్శి జయేశ్‌రంజన్ తదితరులు కూడా ఉన్నారు.

ఏడేండ్లలో విశ్వనగరి

- 426 కోట్లతో వీఎస్టీ నుంచి ఇందిరాపార్క్ వరకు స్టీల్ బ్రిడ్జి
- శిల్పారామం మార్గంలో సైబర్ టవర్ వద్ద రూ.2227 కోట్లతో స్కైవే
- వెయ్యి కోట్లతో ఉప్పల్-నారపల్లి ఎక్స్‌ప్రెస్‌వేకు త్వరలో శంకుస్థాపన
- ఎన్‌హెచ్‌ఏఐ సమన్వయంతో పీవీఎన్‌ఆర్ ఎక్స్‌ప్రెస్‌వే విస్తరణ



బుధవారం మాదాపూర్‌లోని అయ్యప్పసొసైటీ జంక్షన్‌లో అండర్‌పాస్ రహదారిని ప్రారంభించిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రులు నాయిని నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, కమిషనర్ జనార్దన్‌రెడ్డి కూడా ఉన్నారు.

మొదటిపేజీ తరువాయి...

వెల్లడించారు. మొత్తమ్మీద వచ్చే ఆరేడేండ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరం స్థాయికి చేర్చుతామని ఉద్ఘాటించారు. ఇవాంకా ట్రంప్ పర్యటన కోసమే హైదరాబాద్‌లో రోడ్లను బాగు చేస్తున్నారని ఇటీవల వచ్చిన ఆరోపణల్లో నిజం లేదని కేటీఆర్ అన్నారు. నగరంలో రోడ్ల సుందరీకరణ పనులను అంతకు ముందే చేపట్టామని గుర్తుచేశారు. హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి బాటలో నడిపేందుకు తెలంగాణ ప్రభుత్వం అహర్నిశలు శ్రమిస్తున్నదని కేటీఆర్ అన్నారు. నగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు పెద్దఎత్తున మౌలిక సదుపాయాలను అభివృద్ధిచేస్తున్నామన్నారు. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా ఎస్సార్డీపీని చేపట్టినట్టు చెప్పారు. రూ.23వేల కోట్లతో నాలుగు దశల్లో దీన్ని పూర్తిచేయాలని ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు.

మూడు వేల కోట్ల పనులకు టెండర్లు..

రూ.2900 కోట్లతో కొత్త మార్గాలను ప్రతిపాదించామని మంత్రి కేటీఆర్ తెలిపారు. ఇందులో భాగంగా ఆర్టీసీ చౌరస్తా వద్ద 426 కోట్లతో వీఎస్టీ నుంచి ఇందిరాపార్క్ వరకు స్టీల్ బ్రిడ్జి ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. శిల్పారామం మార్గంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలిగించేందుకు సైబర్ టవర్ వద్ద రూ.2227 కోట్లతో స్కైవే నిర్మించాలని ప్రతిపాదించినట్టు చెప్పారు. రైతిబౌలి నుంచి నానల్‌నగర్ వరకు రూ.175కోట్లతో చేపట్టిన ఫ్లై ఓవర్ డిసెంబర్ 2019కల్లా, అంబర్‌పేట ఛే నంబర్ చౌరస్తావద్ద రూ.270కోట్లతో ఫ్లైఓవర్‌ను సెప్టెంబర్ 2019కల్లా పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. అన్నీ కలిపి కొత్తగా సుమారు రూ.3వేల కోట్ల విలువైన పనులకు త్వరలో టెండర్ల ప్రక్రియ చేపడుతామన్నారు. జూబ్లీ బస్టాండ్-రాజీవ్ రహదారి వయా అల్వాల్, తిరుమలగిరితోపాటు.. ప్యాట్నీ-బోయిన్‌పల్లి మార్గాల్లో ఎక్స్‌ప్రెస్‌వేల నిర్మాణానికి ప్రాజెక్టు నివేదికలు, నిధులు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. వీటికి రక్షణశాఖనుంచి స్థలాలు సేకరించాల్సి ఉందని, దీని కోసం అవసరమైన నష్టపరిహారం చెల్లించేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రస్తుతం కేంద్రంతో ఉత్తరప్రత్యుత్తరాల ప్రక్రియ కొనసాగుతున్నదని, అక్కడినుంచి అనుమతులు వచ్చిన వెంటనే పనులు చేపడుతామని కేటీఆర్ చెప్పారు. వీటి నిర్మాణంతో ఆ ప్రాంతంలోని ప్రధాన రహదారులపై ట్రాఫిక్ గణనీయంగా తగ్గుతుందన్నారు. వీటితోపాటు ఉప్పల్-నారపల్లి ఎక్స్‌ప్రెస్‌వేను రూ.1000కోట్లతో జాతీయ రహదారుల శాఖ (ఎన్‌హెచ్‌ఏఐ)తో సంయుక్తంగా చేపడుతున్నట్టు తెలిపారు. త్వరలోనే దీనికి శంకుస్థాపన చేస్తామన్నారు. పీవీఎన్ఆర్ ఎక్స్‌ప్రెస్‌వేను కూడా ఎన్‌హెచ్‌ఏఐ సమన్వయంతో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

బెస్ట్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సిటీగా నగరం...

హైదరాబాద్‌లోని రోడ్లను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మెరుగుపరుస్తామని మంత్రి కేటీఆర్ హామీఇచ్చారు. ఇందులో భాగంగా రూ.950 కోట్లతో రెండుదశల్లో పనులు జరుగుతాయన్నారు. మరమ్మతులతోపాటు పునరుద్ధరణ పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. నగరంలోని పేదలకోసం లక్ష డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు నిర్మిస్తున్న విషయాన్ని మంత్రి గుర్తుచేశారు. నిధులకోసం మున్సిపల్ బాండ్లను జారీచేస్తామని తెలిపారు. 'తెలంగాణ వస్తే కరెంటు ఉండదన్నారు. ఇప్పుడు దేశంలో ఎక్కడా లేని విధంగా వ్యవసాయానికి సైతం 24గంటల నిరంతర విద్యుత్ అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా ఎదిగాం. ఇదీ ముఖ్యమంత్రి కార్యదక్షతకు నిదర్శనం' అని కేటీఆర్ చెప్పారు. వచ్చే ఆరేడేండ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తంచేశారు. భౌగోళిక, చారిత్రక, సాంస్కృతిక అనుకూలతలు మన నగర సొంతమన్నారు. ఫలితంగా మూడేండ్లుగా నగరానికి బెస్ట్ క్వాలిటీ ఆఫ్ లివింగ్ సిటీగా ఖ్యాతి లభిస్తున్నదన్నారు. ముంబై తరువాత హైదరాబాద్ నగరాన్ని బహిరంగ మలమూత్ర విసర్జనరహిత నగరంగా స్వచ్ఛభారత్ మిషన్ గుర్తించడంపై కేటీఆర్ హర్షం వ్యక్తంచేశారు. ఈ స్ఫూర్తితో ఇంకా ఉధృతంగా, ఉత్సాహంగా ముందుకు సాగాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. హోంమంత్రి నాయిని నర్సింహారెడ్డి, రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి, నగర మేయర్ బొంతు రామ్మోహన్, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ, జీహెచ్‌ఎంసీ కమిషనర్ బీ జనార్దన్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు పనులు నిర్వహిస్తున్న ఇంజినీరింగ్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు, పెయింటింగ్ వేసిన కళాకారులను హోం మంత్రి శాలువాలతో సన్మానించారు.

పసందైన రుచులతో పతంగుల పండుగ

- పాల్గొననున్న 25 రాష్ట్రాలు, 15కు పైగా దేశాల ఆటగాళ్లు
- ఈ నెల 13, 14, 15 తేదీల్లో స్వీట్, కల్చరల్ ఫెస్టివల్స్ కూడా
- మంత్రి అజ్మీరా చందూలాల్, బుర్రా వెంకటేశం వెల్లడి



బుధవారం సచివాలయంలో పతంగులను ఆవిష్కరించి మాట్లాడుతున్న మంత్రి చందూలాల్. చిత్రంలో టూరిజం సెక్రటరీ వెంకటేశం, మామిడి హరికృష్ణ, మాళవత్ పూర్ణ ఉన్నారు.

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఈ ఏడాది పతంగుల పండుగను పసందైన వంటకాల రుచులను ఆస్వాదిస్తూ వీక్షించే అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తున్నది.అంతేకాదు ప్రజలు ఆట, పాటలను కూడా చూసి ఆనందించే విధంగా రకరకాల సాంస్కృతిక కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నది. పర్యాటక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్, పర్యాటక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం బుధవారం సెక్రటేరియట్‌లో విలేకరులకు ఈ వివరాలు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఈనెల 13,14, 15 తేదీలలో హైదరాబాద్‌లోని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ పతంగుల పండుగ(టీఐకేఎఫ్)తోపాటు, మిఠాయిల పండుగ కూడా నిర్వహిస్తామని మంత్రి చందూలాల్ పేర్కొన్నారు. పతంగుల ఉత్సవంలో మన దేశంలోని 25రాష్ట్రాలు,15కు పైగా దేశాల నుంచి పతంగుల ఆట నిపుణులు పాల్గొంటారని చెప్పారు. సంక్రాంతి పండుగ రాగానే హైదరాబాద్‌తోపాటు, తెలంగాణ అంతటా కొన్ని దశాబ్దాలుగా పతంగుల పండుగను జరుపడం ఆనవాయితీగా వస్తున్నదని ఆయన తెలిపారు. తెలంగాణ వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం ఈ ఉత్సవాలను అంతర్జాతీయస్థాయిలో ఘనంగా నిర్వహిస్తున్నదని చెప్పారు. రాష్ట్రం ఏర్పడిన తరువాత ఈ ఉత్సవాలు జరుపడం వరుసగా ఇది మూడోసారి అని పేర్కొన్నారు. ఇదివరలో ఆగాఖాన్ మైదానంలో ఈ ఉత్సవాలు నిర్వహించేవారమని, అయితే సందర్శకులు లక్ష మందికి పైగా వచ్చే అవకాశం ఉన్నందున వారి సౌకర్యార్థం కార్యక్రమ నిర్వహణా స్థలాన్ని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌కు మార్చామని చెప్పారు. ఈ మూడు రోజుల్లో పరేడ్ గ్రౌండ్స్‌లో వేయి రకాల మిఠాయిలతో స్వీట్ ఫెస్టివల్ కూడా ఉంటుందని టూరిజం సెక్రటరీ బుర్రా వెంకటేశం తెలిపారు. హైదరాబాద్‌లో స్థిరపడిన వివిధ రాష్ట్రాలకు చెందిన కుటుంబాల వారు తమ ఇండ్లల్లో సంప్రదాయంగా చేసుకునే వివిధ రకాల స్వీట్లను ఇక్కడ ప్రదర్శిస్తారని చెప్పారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ప్రతీరోజూ సాంస్కృతిక కార్యక్రమాలు కూడానిర్వహిస్తామన్నారు.



బుధవారం ఢిల్లీలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్‌వర్మ నుంచి అవార్డును స్వీకరిస్తున్న ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ ప్రభాకర్‌రావు

ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీకి

సీబీఐపీ అవార్డు

- దేశంలోనే ట్రాన్స్‌కోను అగ్రగామిగా నిలిపిన డీ ప్రభాకర్‌రావు
- పలువురు కేంద్ర మంత్రుల సమక్షంలో అవార్డు స్వీకరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కేంద్ర ప్రభుత్వం ప్రతిఏటా ఇచ్చే ప్రతిష్ఠాత్మకమైన సీబీఐపీ అవార్డు ఈయేడాది తెలంగాణ ట్రాన్స్‌కో, జెన్‌కో సీఎండీ దేవులపల్లి ప్రభాకర్‌రావుకు దక్కింది. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇరిగేషన్ అండ్ పవర్ (సీబీఐపీ) జ్యూరీ.. విద్యుత్ సరఫరా రంగంలో విశేష కృషిచేసి దేశంలోనే తెలంగాణ ట్రాన్స్‌కోను అగ్రగామిగా నిలిపినందుకు ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావును ఈ అవార్డుకు ఎంపికచేసినట్టు ప్రకటించింది. బుధవారం ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో పలువురు కేంద్రమంత్రుల సమక్షంలో సీబీఐపీ అధ్యక్షుడు రవీంద్రకుమార్‌వర్మ ఈ అవార్డును ప్రభాకర్‌రావుకు ప్రదానంచేశారు. కార్యక్రమంలో కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ సహాయమంత్రి సత్యపాల్‌సింగ్, కేంద్ర జలవనరులశాఖ సహాయమంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, విద్యుత్‌శాఖ సహ యమంత్రి రాజ్‌కుమార్‌సింగ్, సీబీఐపీ ఉపాధ్యక్షుడు మసూద్ హుస్సేన్, కార్యదర్శి కన్జిల్లా, కేంద్ర జలవనరుల శాఖ కార్యదర్శి యూపీ సింగ్, సంప్రదాయేతర ఇంధన వనరులశాఖ కార్యదర్శి ఆనంద్‌కుమార్, కేంద్ర విద్యుత్‌శాఖ కార్యదర్శి అజయ్‌కుమార్ భల్లా పాల్గొన్నారు.

అవార్డుకు ట్రాన్స్‌కో సీఎండీని ఎంపిక చేసేందుకు పరిగణనలోకి తీసుకున్న అంశాలు

- గడిచిన మూడున్నరేండ్లలో తెలంగాణలో కొత్తగా 514 సబ్ స్టేషన్లు, 1724 పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 19,154 కి.మీ. కొత్తలైన్లు నిర్మించి విద్యుత్ సరఫరాను మెరుగుపరిచారు. తెలంగాణ ఏర్పడక ముందున్న విద్యుత్ సరఫరా వ్యవస్థకు 40 శాతం అదనపు వ్యవస్థను జత చేశారు.
- తెలంగాణలో ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను వినియోగదారులకు చేర్చటంలో టీఎస్‌ట్రాన్స్‌కో 99 శాతం అవైలెబులిటీని సాధించి దేశ సగటును మించింది.
- టీఎస్‌ట్రాన్స్‌కోలో సరఫరా నష్టాలు 3.37 శాతానికి తగ్గాయి. ఇది దేశ సగటుకన్నా తక్కువ.
- ఉత్తర, దక్షిణ గ్రిడ్‌ల మధ్య కొత్త లైన్లు నిర్మించడంతో తెలంగాణ ట్రాన్స్‌కో విశేషమైన చొరవను ప్రదర్శించింది.
- 2017 సెప్టెంబర్‌లో 9500 మెగావాట్ల గరిష్ఠ డిమాండ్ ఏర్పడినా.. ఒక్క క్షణం కూడా విద్యుత్‌కోతలేకుండా రికార్డ్‌స్థాయిలో 197 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను వినియోగదారులకు తెలంగాణ ట్రాన్స్‌కో అందించగలిగింది.
- వ్యవసాయంతోపాటు అన్ని రంగాలకూ 24 గంటల విద్యుత్ అందించడానికి 11 వేల మెగావాట్ల డిమాండ్‌ను ఎదుర్కోవడానికి తెలంగాణ ట్రాన్స్‌కో సరఫరా వ్యవస్థను తీర్చిదిద్దింది.
- తెలంగాణలో తలసరి విద్యుత్ వినియోగం జాతీయ సగటును మించినప్పటికీ.. ఎక్కడా అవాంతరాలు లేకుండా సరఫరా వ్యవస్థను చక్కదిద్దారు.

8, 9 తేదీల్లో విప్‌ల జాతీయ సదస్సు

రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో నిర్వహణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పార్లమెంట్, రాష్ట్రాల అసెంబ్లీ, శాసనమండలి విప్‌ల జాతీయ సదస్సు ఈ నెల 8, 9 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో జరుగనున్నది. కేంద్ర పార్లమెంటరీ మంత్రిత్వశాఖ ఈ సదస్సును నిర్వహిస్తున్నది. పార్లమెంట్‌తోపాటు దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్రాల శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రులు, అసెంబ్లీ కార్యదర్శులు, అసెంబ్లీ, శాసనసమండలిలో ప్రభుత్వ చీఫ్ విప్‌లు, విప్‌లు, గుర్తింపుపొందిన రాజకీయ పార్టీల విప్‌లను ఈ సదస్సుకు ఆహ్వానించారు. రాష్ట్రం నుంచి ప్రభుత్వ చీఫ్ విప్ కొప్పుల ఈశ్వర్, గొంగిడి సునీత, గంప గోవర్ధన్, నల్లాల ఓదేలు, మండలిలో ప్రభుత్వ చీఫ్ విప్ పాతూరి సుధాకర్‌రెడ్డి, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, బీ వెంకటేశ్వర్లు, అసెంబ్లీలో కాంగ్రెస్ విప్ సంపత్‌కుమార్, బీజేపీ విప్ ఎన్వీఎస్ ప్రభాకర్, మండలిలో కాంగ్రెస్ విప్ ఆకుల లలితకు ఆహ్వానం అందింది.



మైనార్టీ కమిషన్ సభ్యులు గుస్తినోరియా, రాజారపు ప్రతాప్

మైనార్టీ కమిషన్ ఏర్పాటు

మొదటిపేజీ తరువాయి...

కట్టయ్య, సురేందర్‌సింగ్‌లను నియమించారు. కమిషన్ మూడేండ్ల పాటు కొనసాగనున్నది.

సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు

రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా తనను నియమించిన ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు కమరుద్దీన్ కృతజ్ఞతలు తెలియజేశారు. తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను నెరవేరుస్తానన్నారు. మైనార్టీ కమిషన్ చైర్మన్‌గా నియమితులైన కమరుద్దీన్.. వికారాబాద్ జిల్లాలోని ధరూర్ మండల కేంద్రంలో 1956లో రైతు కుటుంబంలో జన్మించారు. ప్రాథమిక విద్యాభ్యాసాన్ని ధరూర్‌లోనే పూర్తిచేశారు. హైదరాబాద్‌లో ఉన్నత విద్య కొనసాగింది. ఇంజినీరింగ్ చదివిన ఆయన పంచాయతీరాజ్‌శాఖలో అసిస్టెంట్ ఇంజినీర్‌గా ఉద్యోగంలో చేరారు. తర్వాత అంచెలంచెలుగా ఎదిగి ఇంజినీరింగ్ విభాగంలో అత్యున్నత పదవి అయిన ఇంజినీర్ ఇన్ చీఫ్ అయ్యారు. సాంఘిక సంక్షేమ, మైనార్టీ సంక్షేమశాఖల్లో పదేండ్లు బాధ్యతలు నిర్వర్తించి 2011లో పదవీ విరమణ చేశారు. అప్పటినుంచి తెలంగాణ ఉద్యమంలో భాగస్వాములయ్యారు. ఉద్యమ నాయకుడైన సీఎం కేసీఆర్ వెంట మొదటి నుంచి ఉన్నారు. మైనార్టీ వర్గాలకు చెందిన ఉద్యోగులకు ఆప్తుడిగా ఉన్న ఆయన.. రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు వ్యవస్థాపక చైర్మన్‌గా ఉన్నారు.

మా అమ్మ ఐశ్వర్యరాయ్!

- ఏపీ యువకుడి విచిత్ర వాదన



ఏపీకి చెందిన సంగీత్‌కుమార్ (ఇన్‌సెట్) ఐశ్వర్యరాయ్

ముంబై: మాజీ ప్రపంచ సుందరి, బాలీవుడ్ హీరోయిన్ ఐశ్వర్యరాయ్ తన తల్లి అని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ 29 ఏండ్ల యువకుడు చెప్తున్నాడు. 1988లో కృత్రిమ గర్భధారణ (ఐవీఎఫ్) ద్వారా ఐశ్వర్య తనకు జన్మనిచ్చినట్టు పేర్కొంటున్నాడు. అతడి పేరు సంగీత్‌కుమార్ కాగా, తన పేరు మధ్యలో రాయ్ అని ఐశ్వర్య ఇంటి పేరు కూడా పెట్టుకున్నాడు. 'లండన్‌లో 1988లో ఐవీఎఫ్ ద్వారా నేను ఐశ్వర్యకు జన్మించాను. రెండేండ్ల వయసు వరకు ఐశ్వర్య తల్లిదండ్రులు బృంద, కృష్ణరాజ్‌రాయ్‌ల దగ్గరే పెరిగాను. మూడేండ్ల వయసులో నన్ను విశాఖపట్నం తీసుకొచ్చారు. మా తాత కృష్ణరాజ్ రాయ్ గత ఏడాది మరణించారు. మా అంకుల్ పేరు ఆదిత్యరాయ్' అని తెలిపాడు. ఐశ్వర్య స్వస్థలమైన కర్ణాటకలోని మంగళూరులో సంగీత్ విలేకరులతో మాట్లాడాడు. 27 ఏండ్లుగా తాను తల్లికి దూరంగా ఉన్నానని, ఇప్పుడైనా ఆమె మంగళూరుకు వచ్చి తనతో ఉండాలని వేడుకుంటున్నాడు. అయితే, ఐశ్వర్య తన తల్లి అని నిరూపించడానికి అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లేవు. విశాఖలో ఉండగా తన బంధువులు ఆధారాలు లేకుండా చేశారని, దాంతో తాను ఐశ్వర్య దగ్గరికి వెళ్లలేకపోయానని సంగీత్ చెప్పాడు.

అరుణాచల్‌ప్రదేశ్ ఉనికినే మేం గుర్తించం!

అలాంటప్పుడు మా సైన్యానిది చొరబాటు ఎలా అవుతుంది? • చైనా విదేశాంగ ప్రతినిధి దురుసు వ్యాఖ్యలు • మరో వివాదానికి తెరతీసిన డ్రాగన్



ఈటానగర్/బీజింగ్, జనవరి 3: అరుణాచల్‌ప్రదేశ్ తమ భూభాగం కిందకే వస్తుందంటూ ఇప్పటివరకు వాదిస్తూ వచ్చిన చైనా.. ఇప్పుడు ఏకంగా ఆ రాష్ట్రం ఉనికిని తాము ఏనాడూ గుర్తించలేదని వ్యాఖ్యానించింది. చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి గెంగ్‌షువాంగ్ ఈ వ్యాఖ్యలతో తాజా వివాదానికి తెరతీశారు. అరుణాచల్‌లోని ఎగువ సియాంగ్ సమీపంలో వాస్తవాధీనరేఖ నుంచి 200 మీటర్ల దూరం వరకు చైనా బలగాలు చొచ్చుకెళ్లాయని మీడియాలో కథనాలు వెలువడ్డాయి. భారత భూభాగంలోకి ఎందుకు చైనా సైనికులు ప్రవేశించారంటూ మీడియా ప్రశ్నించినప్పుడు గెంగ్‌షువాంగ్ ఇలా నోటిదురుసు వ్యాఖ్యలు చేశారు. 'సరిహద్దు వివాదం విషయంలో మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. ఇక ముందు కూడా ఇదే వైఖరి కొనసాగుతుంది. అరుణాచల్‌ప్రదేశ్ అని పిలిచే ప్రాంతం ఉనికిని మేం గుర్తించడం లేదు. అక్కడి ఉద్రిక్తతల గురించి నాకు తెలియదు' అని ఆయన నిర్లక్ష్యంగా సమాధానమిచ్చారు. తాము అరుణాచల్‌ప్రదేశ్‌ను ఏనాడూ గుర్తించలేదని, అలాంటప్పుడు తాము ప్రవేశించిన భూభాగం భారత్‌దే అవుతుందని ఎలా చెబుతారని ఆయన వితండవాదానికి దిగారు. 'సరిహద్దు సమస్యలపై చర్చించేందుకు భారత్-చైనా మధ్య ఉత్తమమైన పద్ధతులున్నాయి. వాటిద్వారా సామరస్యంగా వివాదాలను పరిష్కరించుకుంటాం' అని గెంగ్‌షువాంగ్ చెప్పారు. ఇరుదేశాల మధ్య డోక్లాంలాంటి మరో వివాదం ఏదైనా ఏర్పడనుందా? అన్న ప్రశ్నకు ఆయన స్పష్టమైన సమాధానమివ్వలేదు. నిరుడు డోక్లాంలో ఏర్పడిన ప్రతిష్టంభనను భారత్-చైనా ద్వైపాక్షికంగా పరిష్కరించుకున్నాయన్నారు. భారత్ ఆధీనంలోని అరుణాచల్‌ప్రదేశ్ భూభాగం దక్షిణ టిబెట్‌లో భాగమని చైనా చాలాఏండ్లుగా వాదిస్తున్నది. భారత్-చైనా మధ్య వాస్తవాధీనరేఖ వెంబడి ఉన్న 3,488 కిలోమీటర్ల పొడవైన సరిహద్దుపై దశాబ్దాలుగా వివాదం నెలకొన్నది. గత ఏడాది జూన్16న సరిహద్దు దాటి రోడ్డు నిర్మాణానికి ప్రయత్నించిన చైనా సైనికులను డోక్లాం వద్ద భారతసేనలు అడ్డుకున్న విషయం తెలిసిందే. యథాతథస్థితిని కొనసాగించాలన్న ఒప్పందం మేరకు డోక్లాం ప్రతిష్టంభన ఆగస్టు 28న ముగిసింది. అప్పటినుంచి ఇరుదేశాల మధ్య సరిహద్దు సమస్యలపై వరుసగా సమావేశాలు జరుగుతున్నాయి. డిసెంబర్ 22న న్యూఢిల్లీలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా భద్రతాసలహాదారు యాంగ్జీచితో భేటీ అయ్యారు. ఈ సమావేశం జరుగుతున్న సమయంలోనే అరుణాచల్ భూభాగంలోకి చైనా బలగాలు చొచ్చుకెళ్లాయి.



నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటుచేయాలని ఢిల్లీలో కేంద్రమంత్రి అశోక్‌గజపతి రాజుకు వినతిపత్రం సమర్పించిన ఎంపీ కే కవిత

స్పైస్‌పార్క్‌కు కేంద్ర సాయం

- రూ.20 కోట్లు ఇచ్చేందుకు సన్నద్ధం
- ఫిబ్రవరిలో పసుపు సెల్ ప్రారంభం
- కేంద్రమంత్రి సురేశ్‌ప్రభుతో ఎంపీ కవిత భేటీ
- జక్రాన్‌పల్లిలో ఎయిర్‌పోర్ట్ ఏర్పాటుచేయాలని కేంద్రమంత్రి అశోక్‌గజపతిరాజుకు విజ్ఞప్తి


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని స్పైస్ పార్కుకు రూ.20 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర వాణిజ్యశాఖ మంత్రి సురేశ్‌ప్రభు సంసిద్ధత వ్యక్తంచేశారు. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటుకు ప్రయత్నిస్తున్న ఆమె స్పైస్ పార్కుకు సాయంతోపాటు తెలంగాణకు ప్రత్యేక టర్మరిక్ సెల్‌ను సాధించారు. బుధవారం ఢిల్లీలో సురేశ్ ప్రభును ఎంపీ కవిత కలిశారు. బాల్కొండ నియోజకవర్గంలో స్పైస్ పార్క్ కోసం రాష్ట్రప్రభుత్వం 42 ఎకరాల భూమిని కేటాయించిందని, రూ.30 కోట్ల నిధులను మంజూరు కూడా చేసిందని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. డీపీఆర్‌ను స్పైస్‌బోర్డు ప్రిపేర్ చేసిందని, పనులు వేగంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులకు తోడు మ్యాచింగ్‌గ్రాంట్‌గా రూ.20 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర మంత్రి సంసిద్ధత వ్యక్తంచేశారు. పసుపు రైతులను ఆదుకొనేందుకు ఎంపీ కవిత చేస్తున్న ప్రయత్నాలను సురేశ్‌ప్రభు అభినందించారు. కేంద్రమంత్రి సూచన మేరకు ఫిబ్రవరి 3న స్పైస్ బోర్డు చైర్మన్, వాణిజ్య మంత్రిత్వశాఖ అధికారులు హైదరాబాద్‌కు రానున్నారు. అదేరోజు హైదరాబాద్‌లో వర్క్‌షాపును నిర్వహిస్తారు. పసుపు రైతులు, పసుపును ఎగుమతి చేసే వ్యాపారులు, పసుపుపంటతో అనుబంధం ఉండే అన్ని వర్గాలవారు వర్క్‌షాప్‌లో పాల్గొంటారు.

ఫిబ్రవరిలో టర్మరిక్ సెల్ ఏర్పాటు

తెలంగాణలో పసుపు రైతులను ఆదుకొనేందుకు స్పెషల్ టర్మరిక్ సెల్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఫిబ్రవరిలో కేంద్ర వాణిజ్య పన్నుల శాఖ మంత్రి సురేశ్ ప్రభు ఈ సెల్‌ను ప్రారంభిస్తారు. ఈ సెల్ ద్వారా రైతులకు నాణ్యమైన పసుపు వంగడాలు లభిస్తాయి. పంట చేతికి వచ్చిన తరువాత ప్రాసెస్ చేసేందుకు రైతులకు బాయిలర్‌లను అందచేసేందుకు నాబార్డ్‌ను కోరుతామని మంత్రి సురేశ్‌ప్రభు చెప్పారు. పసుపు రైతులకు మేలు చేసేందుకు.. పంటకు మంచి ధర వచ్చేలా కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖతో సంప్రదించి సంయుక్తంగా కార్యాచరణ రూపొందిస్తామని ఎంపీ కవితకు కేంద్రమంత్రి హామీ ఇచ్చారు. పసుపు రైతులను ఆదుకొనేందుకు ముందుకు వచ్చిన మంత్రి సురేశ్ ప్రభుకు ఎంపీ కవిత కృతజ్ఞతలు తెలిపారు. నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటు చేయాలని కోరుతూ కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి అశోక్‌గజపతి రాజును ఎంపీ కవిత కోరారు. బుధవారం ఢిల్లీలో కేంద్ర మంత్రిని కలిసిన కవిత.. మరోసారి వినతిపత్రం సమర్పించారు. విమానాశ్రయ సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్ర కమిటీని పంపించాలని ఆమె కేంద్రమంత్రిని కోరారు. ఎంపీ కవిత వినతిపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు. జక్రాన్‌పల్లిలో విమానాశ్రయం ఏర్పాటుకు సానుకూల అంశాలు ఉన్నాయని ఆమె మంత్రికి వివరించారు.

విద్యుదుత్పత్తికి బొగ్గు సరఫరాను పెంచండి

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా
- లోక్‌సభలో టీఆర్‌ఎస్ పక్ష నేత జితేందర్‌రెడ్డి
- బొగ్గును సరఫరా చేస్తాం: కేంద్రమంత్రి పీయూష్ గోయల్



బుధవారం లోక్‌సభలో మాట్లాడుతున్న టీఆర్‌ఎస్‌పక్ష నేత జితేందర్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: దేశంలోనే మొదటిసారిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నదని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత ఏపీ జితేందర్‌రెడ్డి చెప్పారు. దీనికి కేంద్రం ప్రభుత్వం సహకరించాలని ఆయన కోరారు. విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన బొగ్గును సింగరేణి నుంచి మరింత అధికంగా సరఫరా చేయాలని విజ్ఞప్తిచేశారు. బుధవారం లోక్‌సభలో జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడానికి, రైతుల కష్టాలు తీర్చేందుకు దేశంలోనే తొలిసారిగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు నాయకత్వంలో జనవరి 1 నుంచి వ్యవసాయానికి నిరంతరాయంగా ఉచిత కరెంటు సరఫరా చేస్తున్నామని చెప్పారు. ఇందుకు సభలో సీఎం కేసీఆర్‌ను ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించి ప్రోత్సహించాలని ఆయన కోరారు. తెలంగాణ రాష్ట్రానికి బొగ్గు సరఫరాను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి పీయూష్ గోయల్ చెప్పారు. 2016-17, 2017-18 మధ్యకాలంలో రాష్ట్రానికి 23 శాతం అధికంగా బొగ్గు సరఫరా చేశామని ఆయన తెలిపారు. ఒకవేళ ఇంకా ఎక్కువ బొగ్గు అవసరమైతే సరఫరా చేయడానికి కేంద్రం సిద్ధంగా ఉన్నదని పేర్కొన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ సరఫరా చేసేందుకు రాష్ట్రాలకు విచక్షణ అధికారం ఉన్నదని మంత్రి చెప్పారు.

8 నుంచి సౌత్ ఇండియా సైన్స్‌ఫెయిర్


హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ, విశ్వేశ్వరయ్య ఇండస్ట్రియల్ అండ్ టెక్నలాజికల్ మ్యూజియం (వీఐటీఎం), బెంగుళూరు సంయుక్త ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని సెయింట్ ప్యాట్రిక్ ఉన్నత పాఠశాలలో సౌత్ ఇండియా సైన్స్ ఫెయిర్ (ఎస్ఐఎస్ఐ)ను ఈ నెల 8 నుంచి 12 వరకు నిర్వహించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లను పాఠశాల విద్యాశాఖ, రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎస్సీఈఆర్టీ) అధికారులు సిద్ధంచేశారు. ఇందులో తెలంగాణ, ఏపీ, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిసహా మొత్తం ఆరు రాష్ట్రాలు పాల్గొంటున్నాయి. ముఖ్యంగా సైన్స్, గణితం, పర్యావరణ విద్యలో ప్రసిద్ధిపొందిన ప్రదర్శనలు సైన్స్‌ఫెయిర్‌లో ఉండనున్నాయి. ఐదురోజులపాటు జరిగే ఫెయిర్‌లో అన్ని రాష్ట్రాల నుంచి 300 ప్రదర్శనలు ఉంటాయని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ జీ కిషన్ తెలిపారు.

భారతీయులకు హెచ్-1బీ దెబ్బ

వీసా పొడిగింపును అడ్డుకునే దిశగా ట్రంప్ సర్కారు • 15 లక్షలకుపైగా దేశీయ ఉద్యోగులపై ప్రభావం

వాషింగ్టన్, జనవరి 3:

అగ్రరాజ్య రక్షణాత్మక ధోరణులకు ప్రపంచ ఐటీ రంగం.. ముఖ్యంగా భారతీయ ఐటీ ఉద్యోగులు బలికావాల్సి వస్తున్నది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు పెద్దన్నగా వ్యవహరించే అమెరికానే.. ప్రపంచీకరణకు తిలోదకాలిస్తున్నది మరి. అమెరికన్లనే ఉద్యోగాల్లో నియమించుకోవాలన్న అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పిలుపు.. అక్కడ పనిచేస్తున్న విదేశీ ఉద్యోగులకు శరాఘాతమవుతున్నది. ట్రంప్ వైఖరితో హెచ్-1బీ వీసాల పొడిగింపునకు అడ్డంకులు ఏర్పడుతుండగా, కాలపరిమితి పెరుగకుండా కొత్త నిబంధనలను పరిశీలిస్తున్నది అమెరికా సర్కారు. సదరు నిబంధనల సవరణ బిల్లు వాస్తవరూపం దాల్చితే అది నేరుగానే వేలాదిమంది విదేశీ ఉద్యోగులను అమెరికాలోకి రాకుండా అడ్డుకోనున్నాయి. అంతేగాక గ్రీన్ కార్డును సొంతం చేసుకోవాలనుకుంటున్న వారి ఆశలు అడియాసలు కానున్నాయి. నూతన నియమాలతో ప్రస్తుత వీసా విధానం మరింత కఠినతరం కానుండగా, హెచ్-1బీ వీసాలు దూరమవడమేగాక, గ్రీన్ కార్డు దరఖాస్తులూ పెండింగ్‌లో పడుతాయని అమెరికాకు చెందిన న్యూస్ ఏజెన్సీ మెక్‌క్లాచీ డీసీ బ్యూరో పేర్కొన్నది. ఈ పెండింగ్ కాలంలో వీసా పునరుద్ధరణను అడ్డుకోవాలన్నదే బిల్లు ప్రధాన లక్ష్యమన్నది. హెచ్-1బీ వీసాల దుర్వినియోగాన్ని అరికట్టడంతోపాటు ఇప్పటికే గ్రీన్ కార్డులున్నవారి భవిష్యత్తునూ ప్రశ్నార్థకం చేసే నిర్ణయాలను ప్రభుత్వం తీసుకుంటున్నదని ఓ నివేదికలో బ్యూరో వెల్లడించింది. ఇప్పటికే హౌజ్ జ్యుడీషియరీ కమిటీ బిల్లుకు ఆమోదం



తెలుపగా, ఇది అమెరికా సెనెట్ వద్ద ఉన్నది. ఇక్కడ కూడా ఆమోదం పొందితే భారతీయ టెక్నాలజీ ఇంజినీర్లకు ఇక ఇబ్బందులే అన్న కోణంలో హోంలాండ్ సెక్యూరిటీ అధికారులు కూడా మాట్లాడుతుండటం మరింత ఆందోళన కలిగిస్తున్నది. తమ చర్యలు అమెరికన్ల ఉద్యోగావకాశాలను తప్పక పెంచుతాయన్న విశ్వాసం వారి మాటల్లో కనిపిస్తున్నది. వీసా విధానంలో కీలక మార్పులను చేసే యోచనలో ఉన్నామని అమెరికా పౌరసత్వ, వలస సేవల (యూఎస్‌సీఐఎస్) మీడియా రిలేషన్స్ చీఫ్ జోనాథన్ విథింగ్టన్ కూడా తెలిపారు. బిల్లు అమల్లోకి వస్తే 15 లక్షలకుపైగా భారతీయ ఉద్యోగులను ప్రభావితం చేయనుండగా, భారత్‌తోపాటు చైనా ఉద్యోగులకూ ఇది ప్రతికూలమేనన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఎందుకింత కఠిన వైఖరి

హెచ్-1బీ వీసాలను అమెరికాలో స్వల్పకాలిక ఉద్యోగ అనుమతికిగాను జారీ చేస్తున్నారు. ఈ వీసాలను అత్యధికంగా పొందుతున్న దేశాల్లో భారత్ కూడా ఉండగా, దేశీయ ఐటీ కంపెనీల ఔట్‌సోర్సింగ్ ప్రాజెక్టులకు ఇదే ఆధారం. దేశీయ ఐటీ రంగ ఆదాయంలో అధిక వాటా విదేశాల నుంచే వస్తుండగా, అందులో అమెరికా నుంచే ఎక్కువగా లభిస్తున్న విషయం తెలిసిందే. ఈ వీసాపై అమెరికాలో మూడేండ్లు పనిచేయవచ్చు. అవసరాలనుబట్టి మరో మూడేండ్లు పొడిగించుకోవచ్చు. అంతకుమించి ఈ వీసా చెల్లుబాటు కాదు. అయితే తాము అధికారంలోకి వస్తే అమెరికన్ల నిరుద్యోగాన్ని దూరం చేస్తామంటూ ఎన్నికల్లో పెద్ద ఎత్తున ప్రచారం చేసిన ట్రంప్.. ఇప్పుడు ఆ హామీని నిలబెట్టుకునే దిశగా ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే గతేడాది ఏప్రిల్‌లో 'బై అమెరికన్-హైర్ అమెరికన్' నినాదం ఇచ్చారు. తరువాత హెచ్-1బీ వీసా నిబంధనల కఠినతరంపై దృష్టిపెట్టారు. ఈ వీసాలు పొందాలంటే నిపుణులై ఉండాలని, తాము నిర్ణయించిన వేతనాలివ్వాలని మెలిక పెట్టడంతో, వీటి భారం మోయలేనంతగా తయారైంది. ఫలితంగా ఇప్పటికే భారతీయ ఐటీ సంస్థలు అమెరికా ప్రాజెక్టుల కోసం ఇక్కడి నుంచి ఉద్యోగులను పంపించడం తగ్గించి, అమెరికన్లనే నియమించుకుంటున్నాయి. అమెరికా ప్రభుత్వం ఈ విజయాన్ని ఆసరాగా తీసుకునే ఇప్పుడు వీసా పొడిగింపునూ రద్దు చేయాలని చూస్తున్నది. కాగా, స్టడీ, ఇతరత్రా వీసాలపై వెళ్లినవారూ సంపాదనే ధ్యేయంగా ఉద్యోగాలు చేసుకుంటూ ఉండటం కూడా అమెరికన్ల నిరుద్యోగానికి కారణమవుతున్నదని భావిస్తున్న ట్రంప్.. మొత్తం అమెరికా వీసా విధానాన్నే సమూలంగా మార్చేందుకు నడుం బిగించారు. దాన్ని హెచ్-1బీ వీసాలతోనే మొదలుపెట్టారు. గడువు ముగిసినా అమెరికాలోనే ఉండిపోవడం కూడా కఠిన నిర్ణయాలకు దారితీస్తున్నది.

ఇరు దేశాలకూ హానికరమే: నాస్కామ్



వీసా నిబంధనల మార్పులు భారత్‌తోపాటు అమెరికాకూ హానికరమేనని దేశీయ ఐటీ రంగ సంస్థల సంఘం నాస్కామ్ అధ్యక్షుడు ఆర్ చంద్రశేఖర్ అన్నారు. హెచ్-1బీ వీసా పొడిగింపును నిరోధించేలా కొత్త నిబంధనలను తీసుకొస్తే.. అగ్రరాజ్యానికీ ఇబ్బందేనని పీటీఐతో మాట్లాడుతూ చెప్పారు. ద్వైపాక్షిక వాణిజ్యానికి ట్రంప్ సర్కారు తూట్లు పొడుస్తున్నదని, ఈ తరహా రక్షణాత్మక ధోరణులు మంచివి కావని హితవు పలికారు. నిజానికి గత రెండేండ్లలో భారతీ ఐటీ సంస్థల హెచ్-1బీ వీసాల వినియోగం 50 శాతం పడిపోయిందన్న ఆయన ఇప్పుడు 10 వేల దిగువనే ఉన్నదన్నారు.

మనదేశంలో పనిచేద్దాం రండి: ఆనంద్ మహీంద్రా



హెచ్-1బీ వర్కింగ్ వీసా నిబంధనలు కఠినతరమైతే ఆందోళన అక్కర్లేదని, అక్కడి నుంచి వచ్చే వేలాది మంది నిపుణులతో భారత్ మరింతగా వెలిగిపోతుందని మహీంద్రా గ్రూప్ సంస్థల అధిపతి ఆనంద్ మహీంద్రా అన్నారు. 'అదే జరిగితే స్వాగతం. స్వదేశానికి రండి. మీ రాక భారత్ వృద్ధికి దోహదపడుతుంది' అన్నారు. అయితే భారతీయ ఐటీ కంపెనీలపై భారం పడుతుందని గ్రేహౌండ్ రిసెర్చ్ ప్రధాన విశ్లేషకుడు, వ్యవస్థాపక సీఈవో సంచిత్ వర్‌గోగియా ఆందోళన వ్యక్తం చేశారు.

పట్టుదలతో పనిచేయాలి

- ఈ ఎనిమిది నెలలు ఎంతో కీలకం
- కాళేశ్వరం పనుల్లో వేగం ప్రజల్లో నమ్మకాన్ని పెంచింది
- ఈ ఏడాది 312 ఏఈఈల నియామకం
- నీటిపారుదలశాఖ క్యాలెండర్ ఆవిష్కరణలో మంత్రి హరీశ్‌రావు



బుధవారం జలసౌధలో తెలంగాణ నీటిపారుదలశాఖ-2018 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: సాగునీటి రంగానికి రాబోయే ఎనిమిది నెలల కాలం అత్యంత కీలకమని నీటిపారుదలశాఖ మంత్రి టీ హరీశ్‌రావు చెప్పారు. ప్రతిగంట విలువైనదని, అనుకున్న గడువులోగా నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఇంజినీర్లను కోరారు. తెలంగాణ నీటిపారుదలశాఖ-2018 క్యాలెండర్‌ను బుధవారం జలసౌధలో మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. 16 నెలల్లో చేయాల్సిన పనులను ఎనిమిది నెలల్లోనే చేయడానికి నీటిపారుదల శాఖ అధికార యంత్రాంగం నడుం బిగించాలని పిలుపునిచ్చారు. గడిచిన మూడున్నరేండ్లుగా అంకితభావంతో పనిచేస్తున్న ఇంజినీర్లు ఈ ఏడాది ఇంకా పట్టుదలతో పనిచేయాలన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే సాగు నీళ్లొస్తాయని, ప్రాజెక్టులు పూర్తవుతాయని ప్రజలు ఎన్నో ఆశలు పెట్టుకొన్నారని, ఆ ఆశలను అడియాసలు చేయొద్దని తెలిపారు. సీఎం కేసీఆర్‌పై ప్రజలు..రైతులు పెట్టుకొన్న నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి ఇంజినీర్‌కూ ఉన్నదని మంత్రి గుర్తుచేశారు. లక్షల రైతుల జీవితాల్లో వెలుగు నింపే జలసంకల్పంలో భాగస్వాములైనందుకు ఇంజినీర్లంతా గర్వపడాలని అభిప్రాయపడ్డారు. ఒక ఉద్యోగం లెక్క కాకుండా సామాజిక బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. ఈ ఎనిమిది నెలలపాటు వీలైనంత మేరకు సెలవులు, పండుగ దినాల్లోనూ పనిచేసి జిల్లాలవారీగా, ప్రాజెక్టులవారీగా లక్ష్యాలను పూర్తి చేయాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలో పర్యటించిన తర్వాత నీటిపారుదల శాఖపై ప్రజల్లో విశ్వాసం కనిపిస్తుందని చెప్పారు. నిరుడు 382మంది ఏఈఈలను నీటిపారుదల శాఖలో నియమించామని, ఈ సంవత్సరం మరో 312మందిని నియమిస్తామని మంత్రి హరీశ్‌రావు ప్రకటించారు.

సమన్వయంతోనే భూసేకరణ..

నీటిపారుదల, రెవెన్యూ, అటవీశాఖల అధికారులు సమిష్టిగా, సమన్వయంతో పనిచేయడం వల్ల కాళేశ్వరం ప్రాజెక్టులో భూసేకరణ ప్రక్రియ పూర్తయిందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. అటవీ సంబంధిత సమస్యలు పరిష్కారమైనట్టు చెప్పారు. సీడీవో సిబ్బంది రేయింబవళ్లు డిజైన్ల రూపకల్పనలో పనిచేశారని మంత్రి ప్రశంసించారు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి ఒక్కోసారి టైపిస్టు, సెక్షన్ క్లర్కు అవతారమెత్తి పని చేసుకుపోతున్నారని, ప్రతిఒక్కరూ ఆయనను స్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఈఎన్సీలు మురళీధర్‌రావు, నాగేందర్‌రావు, అనిల్, లిఫ్టు పథకాల సలహాదారు పెంటారెడ్డి, సీఈలు, ఎస్ఈలు పాల్గొన్నారు. తొలుత ఇంజినీర్స్ జేఏసీ చైర్మన్ వెంకటేశం, హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, ప్రధానకార్యదర్శి చక్రధర్, ఓఎస్డీ శ్రీధర్‌రావు దేశ్‌పాండే తదితరులు మంత్రికి న్యూ ఇయర్ శుభాకాంక్షలు తెలిపారు.

రెండు రోజుల్లో ఆర్డీఎస్‌కు నీటి విడుదల!

ఏపీ మంత్రితో ఫోన్‌లో మాట్లాడిన మంత్రి హరీశ్‌రావు

పూర్వ మహబూబ్‌నగర్ జిల్లాలోని ఆర్డీఎస్ ఆయకట్టు రైతులకు శుభవార్త. ఉభయ తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా తుంగభద్ర బోర్డుకు ఇండెంట్ పెట్టడంతో ఒకటిరెండు రోజుల్లో ఆర్డీఎస్ రైతులకు సాగునీరు విడుదల కానున్నది. బుధవారం ఈ మేరకు రాష్ట్ర మంత్రి టీ హరీశ్‌రావు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుతో ఫోన్‌లో చర్చలు జరిపారు. ఉమ్మడి ఇండెంట్ పెట్టేందుకు ఇద్దరు మంత్రులు అంగీకరించడంతో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, ఏపీ నీటిపారుదలశాఖ కార్యదర్శి శశిభూషణ్‌రావుతో మాట్లాడారు. తుంగభద్ర నుంచి ఏపీకి 5.2 టీఎంసీలు, తెలంగాణకు 3.5 టీఎంసీల నీటి వాటా రావాల్సి ఉన్నది. ఈ మేరకు ఏపీ అంగీకరించడంతో ఒకటి రెండు రోజుల్లో నీరు విడుదలయ్యే అవకాశం ఉన్నది.

కాళేశ్వరం ప్రాజెక్టుపై హరిత ట్రిబ్యునల్ విచారణ వాయిదా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని సవాల్ చేస్తూ దాఖలైన ఫిర్యాదుపై విచారణను ఢిల్లీలోని నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఫిబ్రవరి 16వ తేదీకి వాయిదా వేసింది. జస్టిస్ యూడీ సాల్వే నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణను కొనసాగించింది. చెన్నైలోని గ్రీన్ ట్రిబ్యునల్ బెంచ్ ప్రస్తుతం అందుబాటులో లేనందున ఢిల్లీలోని జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్‌కు విచారించే అధికారం ఉన్నదని అభిప్రాయపడింది. పిటిషనర్ దాఖలుచేసిన దరఖాస్తు విచారణకు అర్హత ఉందా? అనే విషయం తేల్చిన తరువాత పరిధిని నిర్ణయిస్తామని తెలిపింది. ఈ సందర్భంగా తెలంగాణ అడ్వకేట్ జనరల్ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించారు. ఇదే సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టు మహారాష్ట్ర పరిధిలోకి కూడా వస్తుందని పుణె బెంచ్ ఎదుట విచారణ చేపట్టే అంశాన్ని పరిశీలించాలని ధర్మాసనానికి ఆయన విజ్ఞప్తిచేశారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు. చిత్రంలో రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్‌పర్సన్ గుండు సుధారాణి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీసీ కమిషన్ సభ్యుడు వీ కృష్ణమోహన్

చిక్కడపల్లి: మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తున్నదని పలువురు వక్తలు పేర్కొన్నారు. మహిళా సంక్షేమం, అభివృద్ధి, భద్రత కోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అనేక పథకాలు, కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. సావిత్రిబాయి పూలే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే 186వ జయంతి ఉత్సవాలను బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవాలను జాతీయస్థాయిలో నిర్వహించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం బాలికల కోసం ప్రత్యేకంగా 119 గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మహిళలు, బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్ కల్పించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షురాలు బెల్ల మాధవి, రాష్ట్ర మహిళా కార్పొరేషన్ చైర్మన్ గుండు సుధారాణి, ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, కరీంనగర్ జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్ పాల్గొన్నారు.



మహారాష్ట్రలో భీమా-కోరేగావ్ హింస, దళితులపై దాడి వెనుక బీజేపీ, ఆర్ఎస్సెస్ శక్తుల కుట్ర ఉన్నది. వారు ఈ సమాజాన్ని కుల, మత ప్రాతిపదిక న విభజింపజూస్తున్నారు. ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌన మునిలా నోరు మెదుపకపోవటం వారి విభజన రాజకీయాలకు సంకేతమే.

మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

రాజ్యసభ కోసం ఆప్ ప్రకటించిన పేర్లలో తన పేరు లేకపోవటం పట్ల నాకు నోటిమాట రావటంలేదు. నేను వాస్తవాలు మాట్లాడినందుకే నన్ను దూరంపెట్టారు. కేజ్రీవాల్ నన్ను రాజకీయంగా హత్యచేశారు. శవంపై కూడా వివక్ష చూపటం కేజ్రీకే చెల్లింది.

కుమార్ బిశ్వాస్, ఆప్ అసమ్మతి నేత



చరిత్రలో నేడు




1754

కింగ్స్ కాలేజీ పేరుతో కొలంబియా యూనివర్సిటీ ప్రారంభం.

1847



'రివాల్వర్'ను తయారుచేసి అమెరికా ప్రభుత్వానికి అమ్మిన శామ్యూల్ కోల్ట్.



1932

గాంధీ, నెహ్రూలను అరెస్టు చేయించిన వైస్రాయ్ విల్లింగ్టన్.

అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కొత్త సంవత్సరం ప్రారంభంలో టెర్రరిజానికి పాక్ ఇస్తున్న మద్దతుపై తీవ్రంగా స్పందించారు. ఉగ్రమూకలకు పాక్ స్వర్గసీమగా మారడం పట్ల ఆగ్రహించారు. ఈ నేపథ్యంలో ఇంతకాలం కొనసాగిస్తున్న ఆర్థిక సాయాన్ని నిలిపివేయనున్నట్టు ప్రకటించి ఆసియాలో తమ వ్యూహాత్మక విధానానికి కొత్తరూపం ఇచ్చారు. ఈ నేపథ్యంలో భారత్ కూడా అమెరికా విధానాలకు మద్దతుగా నిలువాలి. అదే క్రమంలో బ్యాంకాక్‌లో జరిగిన భారత్-పాకిస్థాన్ జాతీయ భద్రతా సలహాదారుల సమావేశ ఫలితాలను శాంతికి పునాదులు వేసే దిశగా విధి విధానాలను రూపొందించాలి.

ది టైమ్స్ ఆఫ్ ఇండియా

నేషనల్ మెడికల్ కమిషన్ బిల్లును స్టాండింగ్ కమిటీకి పంపాలన్న లోక్‌సభ నిర్ణయం ఆహ్వానించదగినది. ఇది గత 2016లోనే అనుకున్నప్పటికీ ఆచరణ రూపానికి నోచుకోలేదు. మొదటగా నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ)లో పేరుకుపోయిన అవినీతి పక్షపాతాలను రూపుమాపాలి. అలాగే ఎన్ఎంసీకి ఉన్న గుత్తాధిపత్యాన్ని తొలిగించి అధికార వికేంద్రీకరణ జరుపాలి. అలాగే దేశ ప్రజావసరాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ వైద్య విధానాలను ప్రోత్సహించాలి. గ్రామీణ ప్రాంత వైద్య అవసరాలు తీర్చే దిశగా విధాన రూపకల్పన జరుగాలి.

ది హిందూ

భీమా కోరేగావ్ హెచ్చరిక

భీమా కోరేగావ్ హింసాకాండ నేపథ్యంలో మహారాష్ట్రలో దళిత సంఘాలు ఇచ్చిన బంద్ ప్రశాంతంగా సాగడం ఊరట కలిగిస్తున్నది. బుధవారం సాయంత్రానికి బంద్‌ను ఇక విరమించుకుంటున్నట్టు కూడా దళిత సంఘాలు ప్రకటించాయి. దళిత సంఘాలు సంయమనం చూపిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం భీమా కోరేగావ్‌లో హింస చెలరేగడంపై విచారణ జరిపించి, దోషులను శిక్షించాలె. భీమా కోరేగావ్ గ్రామంలో దళితులపై జరిగిన దాడి జరుగడం పట్ల తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. దళితులు రాష్ట్రవ్యాప్తంగా రవాణాను స్తంభింపజేశారు. ముంబయిలో కూడా రాకపోకలు నిలిచిపోయాయి. ముంబై, పూణె, నాషిక్, ఔరంగాబాద్‌తో సహా మహారాష్ట్ర అంతటా నిరసనలు వ్యాపించి జనజీవనం స్తంభించిపోయింది. రెండు వందల కిం దటి యుద్ధంలో మహర్ వీరుల సాహసాన్ని స్మరించుకొని స్ఫూర్తిని పొందడానికి భీమా కోరేగావ్‌కు దళితులు లక్షలాదిగా తరలివస్తారనేది ముందే తెలిసిన విషయం. భీమా కోరేగావ్ యుద్ధాన్ని స్మరించుకొంటూ విజయోత్సవం జరుపుకోవడాన్ని కొన్నిశక్తులు వ్యతిరేకిస్తాయనేది కూడా తెలిసిందే. అయినా రాష్ట్ర ప్రభుత్వం హింస చెలరేగకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమైంది. ఈ ఘటన రాష్ట్రవ్యాప్తంగా ఉద్రిక్తతకు దారితీసింది.

రెండు వందల ఏండ్ల కిందట– 1818 జనవరి ఒకటవ తేదీన పీష్వా సైన్యాలకు బ్రిటిష్ సైన్యానికి మధ్య యుద్ధం జరిగింది. ఈ యుద్ధం ఆ తరువాత పీష్వా పాలన అంతరించడానికి దారి తీసింది. ఈ యుద్ధంలో బ్రిటిష్ సైన్యంలో మహర్లు సాహసోపేత పాత్ర పోషించారు. పీష్వాల నిరంకుశ పాలన నుంచి తమ కులస్తులు విముక్తి పొందడానికి ఈ యుద్ధంలో మహర్లు ప్రాణత్యాగం చేశారని వివరించిన అంబేద్కర్, భీమా కోరేగావ్ దగ్గర బ్రిటిష్ వారు నిర్మించిన విజయ స్తూపాన్ని 1927 జనవరి ఒకటిన సందర్శించారు. ఆ తరువాత కూడా పలుసార్లు అక్కడికి వెళ్ళారు. అదే సంప్రదాయాన్ని మహర్లు కొనసాగిస్తున్నారు. ఈ యుద్ధంలో ప్రాణాలు కోల్పోయిన మహర్ల నుంచి వారు స్ఫూర్తిని పొందడానికి, స్వాభిమానాన్ని చాటుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. భీమా కోరేగావ్ యుద్ధం జరిగిన రెండువందల ఏండ్లు అయిన సందర్భంగా గత సోమవారం కూడా అక్కడ సభ జరిగింది. దీనికి లక్షలాదిమంది దళితులు హాజరయ్యారు. అయితే దళితులు మహర్ల పోరాటం నుంచి స్ఫూర్తి పొందదలిచారే తప్ప వారిలో దేశానికి వ్యతిరేకంగా ద్రోహచింతన లేదు, బ్రిటిష్ పాలన అనుకూల సిద్ధాంతాలు లేవు. ఈ సభలు జరుపడాన్ని ప్రాతిపదికగా తీసుకొని మహర్ల దేశభక్తిని శంకించే విపరీతార్థాలు తీయకూడదు.

> **తాజా ఉద్రిక్తతలకు భీమా కోరేగావ్ ఉదంతం మూల కారణంగా కనిపిస్తున్నది. కానీ అంతకుమించిన సామాజిక విభేదాలు, రాజకీయ వ్యక్తీకరణలు, విధేయతలు ఈ ఉద్రిక్తతల్లో నిబిడీకృతమై ఉన్నాయి. మహారాష్ట్రలో దళిత ఉద్యమాలు మొదటినుంచి బలంగానే ఉన్నాయి. వీటికితోడు బీజేపీ అనుకూల వ్యతిరేక వర్గాలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభం మూలంగా గత మూడేండ్లుగా మరాఠాలు ప్రదర్శనలు జరుపుతున్నారు. ఒక మరాఠా మహిళపై జరిగిన అత్యాచారఘటన వారిలో ఆగ్రహం కలిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. ఈ ఉదంతం మరాఠాలకు, దళితులకు మధ్య ఉద్రిక్తతను కొంతకాలం రగిలించింది. ఇప్పుడు ఫడ్నవీస్ మనువాద ఎజెండాను అమలు చేస్తున్నాడంటూ దళితులు ఆగ్రహిస్తున్నారు.**

తాజా ఉద్రిక్తతలకు భీమా కోరేగావ్ ఉదంతం మూల కారణంగా కనిపిస్తున్నది. కానీ అంతకుమించిన సామాజిక విభేదాలు, రాజకీయ వ్యక్తీకరణలు, విధేయతలు ఈ ఉద్రిక్తతల్లో నిబిడీకృతమై ఉన్నాయి. మహారాష్ట్రలో దళిత ఉద్యమాలు మొదటినుంచి బలంగానే ఉన్నాయి. వీటికితోడు బీజేపీ అనుకూల వ్యతిరేక వర్గాలు ఉన్నాయి. వ్యవసాయరంగంలో నెలకొన్న సంక్షోభం మూలంగా గత మూడేండ్లుగా మరాఠాలు ప్రదర్శనలు జరుపుతున్నారు. ఒక మరాఠా మహిళపై జరిగిన అత్యాచారఘటన వారిలో ఆగ్రహం కలిగింది. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపట్టారు. ఈ ఉదంతం మరాఠాలకు, దళితులకు మధ్య ఉద్రిక్తతను కొంతకాలం రగిలించింది. ఇప్పుడు ఫడ్నవీస్ మనువాద ఎజెండాను అమలు చేస్తున్నాడంటూ దళితులు ఆగ్రహిస్తున్నారు. మరాఠాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న శరద్‌పవార్ నేతృత్వంలోని ఎన్సీపీ కూడా బీజేపీ పాలనకు వ్యతిరేకంగా ప్రచారం సాగిస్తున్నది. మహారాష్ట్ర సమాజంలోని భిన్న సామాజిక వర్గాలు తమ స్వాభిమానం కోసం, అస్తిత్వం కోసం, రాజకీయ భూమిక కోసం తపనపడుతున్న దశలో పలు పరిణామాలు, ఘటనలు ఉద్రిక్తతలకు దారితీస్తున్నాయి. రాజకీయ పార్టీలు ఈ ఉద్రిక్తతలను పెంచుతూ, పరస్పరం బురద చల్లుకుంటున్నాయి. మహారాష్ట్రలో ఉద్రిక్తతలకు బీజేపీయే కారణమని కాంగ్రెస్ పార్టీ విమర్శిస్తున్నది. ఆరెస్సెస్ సమాజాన్ని కుల ప్రాతిపదికగా విభజిస్తున్నదని, ఇదే హింసాకాండకు దారితీసిందని లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష నేత మల్లికార్జున్ ఖర్గే ఆరోపిస్తున్నారు. రాహుల్‌గాంధీ కూడా బీజేపీ– ఆరెస్సెస్ ఫాసిస్టు సిద్ధాంతమే భీమా కోరేగావ్ ఘటనలో దళితులపై దాడులకు కారణమని తప్పు పట్టారు. బీజేపీ మాత్రం కాంగ్రెస్ అగ్నికి ఆజ్యం పోస్తున్నదని దుయ్యబట్టింది. వచ్చే ఏడాది లోక్‌సభతో పాటు మహారాష్ట్ర శాసనసభకు ఎన్నికలు జరుగబోతున్నయి. దీంతో ఆయా కులాల ఓట్ల కోసం రాజకీయ పార్టీలు ఎత్తులు, పై ఎత్తులకు దిగితే ఉద్రిక్తతలు మరింత పెరిగే అవకాశం ఉన్నది. అందువల్ల అన్ని పార్టీలు సంయమనం పాటించాలె. సంకుచిత రాజకీయాలకు అతీతంగా, తక్షణం సామాజిక ఉద్రిక్తతలు సడలడానికి, దీర్ఘకాలికంగా సామాజిక పరివర్తనకు కృషిచేయడం అన్నిపక్షాల బాధ్యత. రాజకీయపక్షాలు బాధ్యతాయుతంగా లేకపోతే, సామాజిక అనిశ్చితి తలెత్తుతుందనడానికి భీమా కోరేగావ్ ఉదంతం తాజా హెచ్చరిక.

జనగళం

అబద్ధాలు పటాపంచలు

రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను ప్రారంభిస్తూ దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నారు. ఇదివరకే 'మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ' పథకాలు దేశవ్యాప్తంగా ఎంత ఆదరణకు నోచుకున్నాయో తెలిసిన విషయమే. సీఎం కేసీఆర్ మరో బృహత్తర ఆలోచననే వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా చేయడం. ఉమ్మడి పాలనలో ఆంధ్రప్రదేశ్ విడిపోతే తెలంగాణ ప్రాంతం అంధకారమైపోతుందన్న అబద్ధాలను పటాపంచాలు చేస్తూ తానేంటో మరోసారి నిరూపించుకున్నారు. ప్రతిపక్షాలు ఇకనైనా నిజాలు తెలుసుకొని ప్రభుత్వానికి సహకరించాలి.

-సుదర్శన్ రెడ్డి, భూపాలపల్లి

యుద్ధవాతావరణం

ఇటీవల 'అణు బటన్ నా టేబుల్‌పైనే ఉన్నది' అంటూ ఉత్తరకొరియా అధ్యక్షుడు కిమ్‌జోంగ్ చేసిన వ్యాఖ్యలకు సమాధానమిస్తూ 'నా అణు బటన్ కిమ్ కంటే శక్తివంతమైనదే కాదు, పనిచేస్తుంది కూడా' అంటూ అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ బదులివ్వడం యావత్ ప్రపంచాన్ని నివ్వెరపరిచింది. ఇలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలను చూస్తుంటే భవిష్యత్తులో ఇరుదేశాల మధ్య యుద్ధం తప్పదేమోననిపిస్తున్నది.

- పుల్కం సంపత్, రాములపల్లె, పెగడపల్లి, జగిత్యాల జిల్లా

ప్రభుత్వం దృష్టిసారించాలి

ప్రజలతో పోలీసులు సన్నిహితంగా మెలగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పడిన వెంటనే 'ఫ్రెండ్లీ పోలీస్' విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇదిలా ఉంటే మండల పరిధుల్లోని పోలీస్ స్టేషన్లలో 'ఫ్రెండ్లీ పోలీసింగ్' కనిపించడం లేదు. ప్రజలతో పోలీసులు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. ప్రభుత్వం దీనిపై దృష్టిపెట్టి ప్రజలకు మద్దతుగా నిలువాలి.

- పెద్ది భూపాల్, వరంగల్

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@namasthetelangaana.com Fax-040-23291118

ఆలోకన



టంకశాల అశోక్

ఈ చర్యలకు అర్థమేమిటి?

త్రిపుర సీపీఎం ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ ఉన్నట్లుండి ఒక మత కార్యక్రమానికి వెళ్లి అందరినీ ఆశ్చర్యపరుస్తారు. బెంగాల్ సీఎం మమత అటువంటి సందర్శనాలే చేస్తారు. ఆమె పార్టీ జిల్లా అధ్యక్షుడొకరు వేలాదిమంది హిందూ పూజారులతో ర్యాలీ తలపెడుతారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ అకస్మాత్తుగా దేవాలయాల దారి వెతుకుతారు. ఇదంతా ఓట్ల కోసమని అందరూ అంటున్నమాట. అది నిజమే. అదే సమయంలో, అంతకుమించిన లోతైన అర్థమేదైనా ఈ చర్యలలో ఉందా?

గత నెల చివరివారంలో త్రిపుర రాజధాని అగర్తలాలో ఉండిన ఈ రచయితకు, ఒక విషయం గురించి అందరూ ముమ్మరంగా చర్చిస్తుండటం దృష్టికి వచ్చింది. ఒక వైష్ణవ సంప్రదాయానికి చెందిన ఠాకూర్ అనుకూల్ చంద్ర మనుమడు బాబాయ్ దాదా, నగరంలోని వివేకానంద మైదానంలో మత కార్యక్రమం ఒకటి డిసెంబర్ 24న నిర్వహించారు. అక్కడికి వేర్వేరు సమయాల్లో రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బిప్లవ్ కుమార్‌దేవ్, ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ వెళ్లారు. సీఎం సందర్శన వార్తతో పాటు, ఆయన, బాబాయ్ దాదా పరస్పరం నమస్కరించుకున్న ఫొటో మరునాడు పత్రికలలో మొదటిపేజీలో వెలువడ్డాయి. దానితో హోరాహోరీ చర్చ కట్టలు తెంచుకుంది. బాబాయ్ దాదాకు శిష్యునిగా మారాలంటూ బీజేపీ అధ్యక్షుడు ముఖ్యమంత్రిని బహిరంగంగా ఆహ్వానించారు. అందుకాయన ఏమీ స్పందించకుండా మౌనం వహించారు. దానితో, మౌనం ఎందుకున్నది చర్చలో మరొక ప్రశ్నగా మారింది. కమ్యూనిస్టులు మత కార్యక్రమాలకు వెళ్లారు గదా, ఇట్లా ఎందుకు జరిగిందని ఒక టూరిస్ట్ ఆపరేటర్‌ను అడిగాను నేను. ఎన్నికలున్నాయి ఫిబ్రవరిలో అన్నాడు. త్రిపురలో వామపక్ష కూటమికి తిరుగులేనంత బలం ఉండినపుడు కనుచూపు మేరలో అయినా లేని బీజేపీ అంటే భయపడటం ఎందుకు, హిందువుల ఓట్లను ఆకర్షించాలనుకోవటం ఎందుకన్నాను. పరిస్థితులు మారాయన్నది ఆయన జవాబు.

వాస్తవానికి ఎన్నికల రికార్డులను గమనిస్తే, మాణిక్ సర్కార్ భయపడవలసింది ఎంతమాత్రం లేదు. 2013 నాటి గత అసెంబ్లీ ఎన్నికలలో వామపక్ష కూటమి 60 స్థానాలలో 50 గెలిచింది. కూటమి ఓట్ల శాతం 49.68 కాంగ్రెస్ ఓట్లు 36.53 శాతం కాగా బీజేపీవి 1.54 శాతం మాత్రమే. తర్వాత 2014 లోక్‌సభ ఎన్నికల నాటికి నరేంద్ర మోదీ ప్రభంజనం వీచిందన్నారు. అపుడు కూడా సీపీఎం త్రిపుర (పశ్చిమ స్థానాన్ని 62.61 శాతం ఓట్లతో, తూర్పుస్థానాన్ని 65.47 శాతం ఓట్లతో గెలిచింది. మోదీ ప్రభంజనం వల్ల బీజేపీ ఓట్లు పెరిగాయి గాని అవి పశ్చిమలో 5.10 శాతం, తూర్పులో 6.36 శాతం. కాంగ్రెస్ ఓట్లు అసెంబ్లీ కన్న సగానికి తగ్గాయి. తృణమూల్‌కు 10.97 శాతం, 8.08 శాతం లభించాయి. 2014 తర్వాత బీజేపీ ఓట్లు సీపీఎంను భయపెట్టేంత స్థాయికి పెరిగి ఉంటాయని ఊహించటం కష్టం.

అయినప్పటికీ ఇటువంటి చర్చ జరుగటానికి పలు కారణాలు వినిపిస్తున్నాయి. 2014 తర్వాత మోదీ పట్ల ప్రజాదరణ తక్కిన దేశంలో ఎట్లున్నా త్రిపురలో మరింత పెరిగిందన్నది వాటిలో ఒకటి. కాంగ్రెస్, తృణమూల్ నాయకులు, కార్యకర్తలు వరుసగా బీజేపీలో చేరుతున్నారనే వాస్తవం మరొకటి. 2014 నుంచి ఈశాన్య భారతమంతటా బీజేపీ రకరకాల పద్ధతులలో బలపడుతుండటం ఇంకొకటి. బీజేపీ తన అధికారాన్ని, ఆర్థిక వనరులను త్రిపురలో భారీ ఎత్తున ఉపయోగిస్తుండటం అనేదొకటి మనకు వినిపించే మాటలు. సర్కార్ పరిపాలన పట్ల యాంటీ–ఇన్‌కంబెన్సీ బాగానే ఉన్నట్లు మధ్య తరగతి, దిగువ మధ్య తరగతి వారిని పలువురిని కదిలించినప్పుడు ఈ రచయితకు కూడా అర్థమైంది. ఇది నగరం మాట. అగర్తలా బయట గ్రామాల పరిస్థితి ఏమిటో తెలియదు. బీజేపీ ప్రచారాపు ఆర్భాటం లెఫ్ట్‌కు తీసిపోకుండా ఉంది. కాంగ్రెస్, తృణమూల్ జాడ ఇంచుమించు ఎక్కడా కన్పించలేదు. ఇందుకు కారణం పోలరైజేషన్ ఎక్కువ కావటమన్నది ఒకరి విశ్లేషణ. అది నిజమైతే కాంగ్రెస్, తృణమూల్ సహా వామపక్షేతర ఓట్లు అత్యధిక భాగం బీజేపీ వైపు మళ్లి, లెఫ్ట్ ఓట్లు 2013 కన్నా తగినంతస్థాయిలో తగ్గి, అపుడు పోటీని తీవ్రతరం చేయాలి. అటువంటిది జరుగనున్నదని బీజేపీ మద్దతుదారుల అంచనా కాగా, పోలరైజేషన్ అయితే కనిపిస్తున్నది గాని, అది లెఫ్ట్ ప్రభుత్వాన్ని నిజంగా భయపెట్టే స్థాయిలో ఉండదన్నది ఫ్రంట్ శ్రేణుల వాదన. అయినప్పటికీ మాణిక్ సర్కార్ ఒక వైష్ణవ కార్యక్రమానికి ఎందుకు వెళ్లినట్లు? దానిపై ఆయన స్వయంగా వ్యాఖ్యానిస్తూ, 'రాజకీయాల నుంచి మతం వైపు స్వల్పమైన కదలిక' (స్లయిట్ రిమూవ్ ఫ్రం పొలిటికల్ టు రిలిజియన్) అన్నారు. దీనిపై ఒక స్థానిక ఇంగ్లీష్ పత్రిక 'ఆకస్మిక భక్తి' (యాక్సిడెంటల్ డివోషన్) అనే శీర్షికతో సంపాదకీయం రాస్తూ, అందువల్ల రాజకీయంగా కాని, మతపరంగా కాని ఒరిగేదేమీ ఉండదని అభిప్రాయపడింది. ఏమైనా జరుగగలదని మాణిక్ సర్కార్ ఆశించి ఉంటారా? అంతకన్నా ముఖ్యంగా, అట్లా ఒరిగేట్లు చేసుకోవలసిన పరిస్థితి ఏర్పడిందని భావిస్తున్నారా? లెఫ్ట్ ఫ్రంట్ అధికారాన్ని కోల్పోకపోయినా, గత రెండున్నర దశాబ్దాలకుపైగా ఉండి ధీమా సడలే విధంగా అసెంబ్లీ ఫలితాలు రాబోతున్నాయా? పశ్చిమ బెంగాల్ లెఫ్ట్ ఫ్రంట్ వంటి క్షీణదశ త్రిపురలో మొదలుకావచ్చునా?

పశ్చిమ బెంగాల్‌లోని బీర్‌భూమ్ జిల్లా తృణమూల్ అధ్యక్షుడు అనుబ్రత మండల్ సరిగా ఇవే రోజులలో, తాము అయిదువేల మంది హిందూ పూజారులతో జనవరి ఎనిమిదిన ర్యాలీ జరుపనున్నట్లు ప్రకటించారు. బీర్‌భూమ్‌లో బీజేపీ క్రమంగా పుంజుకుంటున్నది. ఆ దృష్ట్యా ఆయన ఇప్పటికే సుప్రసిద్ధ కామాఖ్య దేవాలయ (అస్సాం) పూజారులు పదకొండు మందితో స్థానిక కంకాళీతాలా దేవాలయంలో యజ్ఞం జరిపించారు. తమవద్ద హిందూత్వకు స్థానం లేదని, తమ కార్యక్రమాలను చూసి ఇపుడు బీజేపీ 'వణికి' పోతున్నదని ధీమాగా అన్నారు. తృణమూల్ అధ్యక్షురాలైన ముఖ్యమంత్రి మమత ఇప్పటికే హిందూ ఆశ్రమాల చుట్టూ తిరుగటం మొదలుపెట్టారు. ఇక గుజరాత్‌లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆలయ సందర్శనల విషయం తెలిసిందే. తనకు యజ్ఞోపవీతం ఉందని కూడా ప్రకటించారాయన. రానున్న కాలంలో ఇంకా ఎవరెవరు ఏమేమీ చేయగలరో వేచిచూడవలసి ఉంటుంది.

దీనంతటిలో ఎటువంటి దాపరికం లేకుండా కన్పిస్తున్న ఓట్లు, సీట్లు, అధికారం విషయాన్ని అట్లుంచితే అంతకుమించిన లోతైన అర్థమేదైనా ఈ చర్యలలో ఉందా అనే అసలు ప్రశ్నకు వద్దాము. ఒక్కమాటలో చెప్పాలంటే, మతం అనే అంశంతో ఎట్ల వ్యవహరించాలో, ప్రజా జీవితంలో దాని స్థానం ఏమిటో, పరిపాలనాక్రమంలో గాని, అభివృద్ధి క్రమంలో గాని మతం అనేది ఎప్పుడు ముందుకువస్తుందో, దానికి రాజకీయాలతో సంబంధం ఎందుకు ఏర్పడుతుందో భారత రాజకీయ నాయకులకు బోధపడినట్లు లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి మన రాజకీయాలు స్వాతంత్ర్యానికన్నా ముందటి ఆదర్శాలు, లక్ష్యాలు, సిద్ధాంతాల మూసలో నడుస్తూ వచ్చాయి. కాని పరిపాలన అందుకు తగినట్లు సాగక దారుణంగా విఫలం కావటంతో ఆ మూస బీటలువారటం మొదలైంది. మతం పాత్ర గురించి పైన వేసిన ప్రశ్నలను బోధపరుచుకోవలసిన అవసరం ఇంతవరకు కలుగకపోగా, ఇంతకాలపు మూస ఇపుడు బీటలువారుతుండటంతో ఇక బోధపరుచుకోకతప్పని అగత్యం ఏర్పడింది. ఇందులోనూ ఒక విషాదం ఉంది. వారు అట్లా బోధపరుచుకోవటం అవసరమనే జ్ఞానంతో ఇదంతా చేయటం లేదు. పాత మూస బీటలువారి ఏర్పడుతున్న క్లిష్ట స్థితి నుంచి గండం గడిచి బయటపడటం వరకు మాత్రమే వారి ఆలోచన. కనుక నిజమైన అర్థంలో, దీర్ఘకాలంలో వారు గట్టెక్కలేరు.

> ఒక్కమాటలో చెప్పాలంటే, మతం అనే అంశంతో ఎట్ల వ్యవహరించాలో, ప్రజా జీవితంలో దాని స్థానం ఏమిటో, పరిపాలనాక్రమంలో గాని, అభివృద్ధి క్రమంలో గాని మతం అనేది ఎప్పుడు ముందుకువస్తుందో, దానికి రాజకీయాలతో సంబంధం ఎందుకు ఏర్పడుతుందో భారత రాజకీయ నాయకులకు బోధపడినట్లు లేదు. స్వాతంత్ర్యం వచ్చినప్పటినుంచి మన రాజకీయాలు స్వాతంత్ర్యానికన్నా ముందటి ఆదర్శాలు, లక్ష్యాలు, సిద్ధాంతాల మూసలో నడుస్తూ వచ్చాయి.

వారి వైఫల్యాల పాత మూస బీటలువారటం ఇప్పటికే రెండు విధాలుగా జరిగింది. అభివృద్ధి లేమివల్ల ఏర్పడిన అసంతృప్తితో బీటలువారటం 1960ల నుంచే మొదలుకాగా, కులాలు–అస్తిత్వ ఉద్యమాలు–ప్రాంతీయతల ధోరణులు పెరుగుతూ 1980ల నుంచి మరిన్ని బీటలు ఏర్పడ్డాయి. కాని నాయకులు ఆ రెండు దశలలోనూ ఏదో ఒక విధంగా గట్టెక్కచూశారు తప్ప ఆ పరిణామాలను తెలివిగా, నిజాయితీతో బోధపరచుకోలేదు. ఆ ప్రకారం వ్యవహరించలేదు. మూడవ దశగా 1990ల నుంచి మతం రంగప్రవేశం చేసి కొత్త సవాలును విసిరింది. మొదటి దశలో అభివృద్ధి లేమి వల్ల కలిగిన అసంతృప్తితో, రెండవ దశలో కులం–అస్తిత్వవాదం–ప్రాంతీయవాదంతో ఎట్లా వ్యవహరించాలో తెలియని నాయకులు, ఇప్పుడు మూడవ దశలో మతం విషయంలోనూ తడబడిపోయి, తమకు తోచిన స్థూలమైన ఉపాయాలను అనుసరిస్తున్నారు. దేవాలయాల సందర్శనలు, పూజారుల ర్యాలీలు, వివిధ మతకార్యక్రమాలు ఇటువంటివే. తమను పీడించే వ్యాధి ఏమిటో మాత్రం వారికి అర్థం కావటం లేదు.

విశ్వవిద్యాలయాలు మారాలె

విశ్లేషణ

ప్రొఫెసర్ కనకదుర్గ దంటు

'విద్యలేనివాడు వింత పశువు' అన్న సామెత అనాదిగా వస్తున్నది. ఈ కాలంలో విద్య నేరుస్తున్న వింత పశువులను చూడాల్సి వస్తున్నది. విశ్వవిద్యాలయాల్లో జరుగుతున్న సంఘటనలు చాలా ఆందోళనకరంగా ఉన్నాయి. అసలు ఈ 'విద్య' అన్న పదాన్ని, దాని పరమార్థాన్ని వీరు అర్థం చేసుకుంటున్నారా అన్న సందేహం కలుగుతున్నది. విద్య అంటే పట్టాలు తీసుకోవడం కాదు, విద్యలో ఉపాధి సంపాదించే చదువు ఒక భాగం మాత్రమే! నిజమైన విద్యను ఒక మేధావి ఇలా వర్ణిస్తాడు 'నువ్వు చదువుకున్నదంతా మర్చిపోతే, నీలో ఏం మిగిలిందో అదే విద్య' అంటే చదివిన పాఠాలు, పాసయిన పరీక్షలు కాదు విద్య; వాటివల్ల మనలో సంస్కారం, నైపుణ్యాలు ఎంత పెరిగాయో, మనుషులుగా ఎంత ఎదిగామో అదీ విద్య. స్వామి వివేకానంద ఎప్పుడో చెప్పారు మనకు 'మనుషిని తయారుచేసే విద్యా వ్యవస్థ ఉండాలి' అని.

ఎవరి సిద్ధాంతాలు వారు నమ్మినా ఒకస్థాయిలో సంస్కారవంతులుగా తయారుచేయడమే విద్యావ్యవస్థ ముఖ్యోద్దేశం. అంతేకాదు, ఈ సిద్ధాంతాలు మేధోపరంగా ఏర్పరుచుకున్నవి కావాలి. కానీ, వ్యక్తిగత ఈర్ష్యలతో, కక్షలతో పెంచుకున్నవి కాకూడదు. ఒక ఉదాహరణ చూద్దాం. ప్రతిష్ఠాకరమైన సైన్స్ కాంగ్రెస్ సభలు నిర్వహించటానికి దేశంలోనే పురాతనమైన విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఉస్మానియా విశ్వవిద్యాలయానికి అవకాశం వచ్చింది. ఇప్పుడు అది చేజారింది. ఏడు చేపల కథలోలాగా దీని డొంక లాగుతూ ఇది ఎందుకు జరిగిందని ప్రశ్నలు వేసుకుంటే దాని కారకులు బయటపడుతారు. యూనివర్సిటీలో కొన్ని రోజుల కిందట జరిగిన ఆందోళన వల్ల ఆ సభలను నిర్వహించలేమని విశవిద్యాలయ కులపతి సభా నిర్వహకులకు చెప్పారు. అలా ఎందుకు చెప్పవలసి వచ్చింది? ఒక విద్యార్థి ఆత్మహత్యచేసుకున్న సందర్భంలో జరిపిన ఆందోళన వల్ల ఆ సభలలో ఏమైనా అవాంఛనీయమైన సంఘటనలు జరుగుతాయోమో, అలా జరిగితే విశ్వవిద్యాలయ ప్రతిష్టకు భంగం అని తలచిన వైస్ ఛాన్స్‌లర్ గారు అలా చెప్పారు. ఆ విద్యార్థి ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడు? అతని సూసైడ్ నోట్‌లో 'ఎమ్మెస్సీ ఫిజిక్స్‌లో చేరినా ఆ స్థాయి చదువు తనకు చేతకావటంలేదని, అందుకే ఆత్మహత్య చేసుకుంటున్నాని' అతను స్పష్టంగా రాశాడు. మరి అంత ఆందోళన క్యాంపస్‌లో ఎందుకు జరిగింది? వ్యక్తిగత కారణాలతో ఒక విద్యార్థి చనిపోతే దానిని రాజకీయం చేసిందెవరు? ఈ ప్రశ్నలకు సమాధానం అందరికీ తెలుసు.

ఆత్మహత్య వార్త వినగానే విద్యార్థులు కలత చెందడం, ఆందోళన చేయాలనుకోవడం చాలా సహజం. కానీ పూర్వపరాలు తెలుసుకోకుండా, ఆ విద్యార్థులను అడ్డం పెట్టుకొని, జరిగిన విషాదాన్ని తనకు అనుకూలంగా మలుచుకొని రాజకీయం చేయాలనుకోవడం దారుణం. అదీ, ఒక మేధావిననుకునే విశ్రాంత ఆచార్యుడు చేయడం విచారకరం. మురళి అనే ఆ అబ్బాయి ఆత్మహత్యకు ప్రభుత్వం, విశ్వవిద్యాలయం (తనకు పింఛన్ అందించే సంస్థ) బాధ్యులని ప్రొఫెసర్ కోదండరాం అప్పుడు ఆందోళన చేయకపోతే ఈ రోజున సైన్స్ కాంగ్రెస్ అంగరంగ వైభవం ఉస్మానియా విశ్వవిద్యాలయంలో జరిగి, అందులోని ఆచార్యులకు, విద్యార్థులకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ఉండేది. నిజానికి ఈ అవకాశం చేజారినందువల్ల ప్రభుత్వానికి కానీ, ముఖ్యమంత్రికి కానీ ఏమీ నష్టం లేదు. ఎందుకంటే ఒక విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ దానికి సంబంధించిన వారికే ఉపయోగం, ప్రభుత్వానికి కాదు. విశ్వవిద్యాలయాలు స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థలు. వాటికి ప్రభుత్వం ఇచ్చే గ్రాంటు తప్ప ఇక ఏ విషయాలలో పరస్పరం ఆధారపడే సమస్య ఉండదు. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్ ఉన్నందువల్ల బ్రిటన్ గొప్పదేశం అవదు. హార్వర్డ్, స్టాన్‌ఫర్డ్ వల్ల అమెరికా ప్రభుత్వం గొప్పదని ఎవరూ అనుకోరు. అలాగే ఉస్మానియా ప్రతిష్ట పెరుగడం అక్కడ చదువుతున్న విద్యార్థులకు, ఆచార్యులకు (విశ్రాంత ఆచార్యులకు కూడా) గర్వకారణం అవుతుంది. అందుకే రాష్ట్ర గవర్నర్‌ను చాన్స్‌లర్ అని రాజ్యాంగం చెప్పింది కానీ ముఖ్యమంత్రికి, విశ్వవిద్యాలయానికి ఏమీ సంబంధం చెప్పలేదు. అర్థంపర్థంలేని ఈగోలతో, ఈర్ష్యలతో ప్రభుత్వాన్ని అప్రతిష్ఠపాలు చేయాలని విశ్వవిద్యాలయాలను వాడుకోచూడటం తెలివి తక్కువతనం, మేధావితనం కాదు. ఈ విషయాలు అర్థం చేసుకొని సిద్ధాంతాలతో ప్రభుత్వాన్ని అస్థిరపరుచాలని చూసే ఆచార్యులకు కులాల, మతాల ప్రాతిపదిక మీద సమాజాన్ని విడదీసే ఆచార్యుల ను విద్యార్థులు దూరం పెట్టాలి. తమ స్వయం మేధస్సుతో ఆలోచించాలి గానీ ఇతరుల వల్ల బ్రెయిన్ వాష్ అవకూడదు.

విద్యార్థులు అలా ఆలోచించగలిగినపుడు, నిన్న మొన్న శాతవాహన విశ్వవిద్యాలయంలో జరిగినటువంటి సంఘటనలు జరుగవు. విచిత్రమేమంటే–మనుస్మృతిని తగులబెట్టే వారికీ అందులో ఏముందో తెలియదు. దానిని ఉద్గ్రంథంగా భావించేవారికి దాని పరమార్థం ఏముందో తెలియదు, కమ్యూనిస్టు భావజాలంతో భగవద్గీతను, మనుస్మృతిని విమర్శించేవారూ, హిందుత్వ భావజాలంతో వాటిని నెత్తిమీద పెట్టుకొని పూజించేవారూ ఇద్దరూ మూఢులే, మూర్ఖులే! ఆ విద్యార్థులలో నిజంగా మేధావు కాగలిగిన వారెవరైనా, స్వతంత్రంగా ఆలోచించగలిగినవారెవరైనా ఉంటే, ఆ గ్రంథాల్ని చదివి వాటిని తులనాత్మకంగా విమర్శించి, సామాన్యులను చైతన్యవంతులను చేయాలి. వాటిలో ఆధునిక జీవనానికీ, మారిన కాలానికీ ఏ విషయాలూ సరిపోవో వివరించి మనుష్యుల మనసులు మార్చాలి. గోవుల హిందువులకు పూజనీయం కాబట్టి వాటి మాంసం తిన్నవారిని చంపుతామన్న అసమంజసవాదం పక్కనబెట్టి, గోవుల వల్ల నిజంగా ఏదైనా లాభం ఉంటే విశదీకరించాలి.

బృందాకారత్‌నీ నమ్మద్దు; చాగంటివారి ప్రవచనాలూ నమ్మద్దు, నిజానిజాలు స్వయంగా తెలుసుకోవాలనుకునేవాడూ, ధైర్యంగా వాటిని ఒప్పుకొని నలుగురికి చెప్పగలిగినవాడే మేధావి. దేనినైనా గంపగుత్తగా తృణీకరించేవాళ్ళు కుహనా మేధావులు. వారి పట్ల విద్యార్థులు–ముఖ్యంగా ఉన్నత విద్యావంతులైన, విశ్వవిద్యాలయంలో చదువుతున్నవారు–చాలా అప్రమత్తంగా ఉండాలి. 'ఛీల్ ఉడీ' అంటే 'భైంస్ ఉడీ' అని వారిని అనుసరించకూడదు. ఈ రకంగా స్వతంత్ర ఆలోచనలను, విచక్షణ, విశ్లేషణ కలిగిన విద్యార్థులను తయారుచేయడమే విశ్వవిద్యాలయాల బాధ్యత. ఆ విశ్వవిద్యాలయ ప్రతిష్ఠ తమ మీద, తమ ప్రవర్తనా వ్యక్తిత్వాల మీద ఆధారపడి ఉందని గ్రహించి, నాగరికంగా ఎదుగడం, మానవీయంగా ప్రవర్తించడం విద్యార్థుల బాధ్యత.

> నిజానిజాలు స్వయంగా తెలుసుకోవాలనుకునేవాడూ, ధైర్యంగా వాటిని ఒప్పుకొని నలుగురికి చెప్పగలిగినవాడే మేధావి. దేనినైనా గంపగుత్తగా తృణీకరించేవాళ్ళు కుహనా మేధావులు. వారి పట్ల విద్యార్థులు-ముఖ్యంగా ఉన్నత విద్యావంతులైన, విశ్వవిద్యాలయంలో చదువుతున్నవారు-చాలా అప్రమత్తంగా ఉండాలి. 'ఛీల్ ఉడీ' అంటే 'భైంస్ ఉడీ' అని వారిని అనుసరించకూడదు. ఈ రకంగా స్వతంత్ర ఆలోచనలను, విచక్షణ, విశ్లేషణ కలిగిన విద్యార్థులనుతయారుచేయడమే విశ్వవిద్యాలయాల బాధ్యత.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.437, Near Velama Kalyana Mandapam, Devara Yamjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078, Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.



రాజ్యసభలో తలాక్ బిల్లును వ్యతిరేకిస్తున్న ప్రతిపక్ష సభ్యులు

తలాక్ బిల్లుకు అవాంతరం

- రాజ్యసభలో ఏకమై అడ్డుకున్న విపక్షాలు
- బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టు

న్యూఢిల్లీ, జనవరి 3: ట్రిపుల్ తలాక్ బిల్లుకు పెద్దల సభలో తొలిరోజు అవాంతరం ఏర్పడింది. ప్రతిపక్ష పార్టీల నిరసనల కారణంగా అధికారపక్షం బిల్లును ముందుకు తీసుకెళ్లలేకపోయింది. దీంతో రాజ్యసభను వాయిదా వేసిన చైర్మన్ గురువారం బిల్లుపై తిరిగి చర్చను కొనసాగించనున్నట్టు ప్రకటించారు. ముస్లిం మహిళల (వివాహ హక్కుల పరిరక్షణ) బిల్లు -2017 పేరిట ట్రిపుల్ తలాక్ బిల్లు గత నెల 28న లోక్‌సభలో ఆమోదం పొందిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ బిల్లును రాజ్యసభలో ప్రవేశపెట్టారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌తోపాటు పలు పార్టీలు బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపాలని పట్టుబట్టాయి. డిప్యూటీ చైర్మన్ కురియన్ జోక్యం చేసుకుంటూ రవిశంకర్ ప్రసాద్‌ను సభలో మాట్లాడనివ్వాలని కోరారు. అందుకు సభ్యులు నిరాకరించడంతో సభను కొంతసేపు వాయిదావేశారు. మళ్లీ సభ్యులు వాయిదా పడిన సభ మధ్యాహ్నం మూడుగంటలకు తిరిగి సమావేశమైంది. ముస్లిం సంస్థలతో, విపక్షాలతో చర్చించకుండా ప్రభుత్వం ఏకపక్షంగా ట్రిపుల్ తలాక్ బిల్లును రూపొందించిందని, ఆ బిల్లులో అనేక లోపాలున్నాయని కాంగ్రెస్ ఉపనేత ఆనంద్‌శర్మ తెలిపారు. బిల్లును సెలెక్ట్ కమిటీ సమీక్షకు పంపాలని ఆయన రాజ్యసభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. 14 రాజకీయపక్షాల ప్రతినిధులతోపాటు రాజ్యసభ సభ్యుడు, సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది కేటీఎస్ తులసి సెలెక్ట్ కమిటీ సభ్యులుగా ఉండాలని ఆనంద్‌శర్మ ప్రతిపాదించారు. అయితే ఆర్థిక మంత్రి అరుణ్‌జైట్లీ వివరణ ఇస్తూ.. సెలెక్ట్ కమిటీకి బిల్లు పంపితే సమయం వృథా అవుతుందని, ఆరునెలలపాటు బిల్లుకు జాప్యం ఏర్పడుతుందని చెప్పారు. కాంగ్రెస్ ఉద్దేశపూర్వకంగానే బిల్లును అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్నదని, దానివల్ల అనేక మంది ముస్లింమహిళలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. బిల్లును సెలెక్ట్ కమిటీకి పంపడం సాధ్యం కాదన్నారు.

లోక్‌సభలో ఓబీసీ సవరణ బిల్లు

వెనుకబడిన తరగతుల వారికి మరింత సాధికారత కల్పించే లక్ష్యంతో రూపొందించిన ఓబీసీ చట్ట(సవరణ)బిల్లును కేంద్రం బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టింది. ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ హోదా కల్పించడంతోపాటు గత సమావేశాల్లో రాజ్యసభ ప్రతిపాదించిన పలు సవరణల కారణంగా ప్రభుత్వం ఈ బిల్లును తిరిగి లోక్‌సభ పరిశీలనకు ప్రవేశపెట్టింది. సామాజిక న్యాయశాఖ మంత్రి తావర్‌చంద్ గెహ్లాట్ ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టారు.

శశిథరూర్-సుష్మ మాటల యుద్ధం

లోక్‌సభలో ప్రశ్నోత్తరాల సందర్భంగా కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్, విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్ మధ్య మాటల యుద్ధం జరిగింది. సుష్మాస్వరాజ్ మాట్లాడుతూ.. ఐక్యరాజ్యసమితి అధికార భాషల్లో ఒకటిగా హిందీని గుర్తించేదిశగా ప్రభుత్వం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. ఐక్యరాజ్యసమితిలో పనిచేసిన అనుభవమున్న శశిథరూర్ దీనిపై స్పందించారు. 'ప్రధానమంత్రి, విదేశాంగ మంత్రి హిందీలో మాట్లాడుతారు కాబట్టి హిందీ అధికార భాషగా మార్చాలనుకుంటున్నారు. మరి రేపు కేరళ వ్యక్తో, బెంగాల్‌వాసినో ప్రధాని అయితే అప్పుడెలా? హిందీని మన దేశంలో తప్ప ఎక్కడా మాట్లాడరు. దుబాసీలను పెట్టుకొని ప్రయత్నించినా, అంతర్జాతీయ వేదికలపై ఆ భాషలో ఇతర దేశాలప్రతినిధులకు అర్థమయ్యేలా వివరించడం కష్టం' అని థరూర్ అన్నారు. దీనిపై సుష్మ ఘాటుగా జవాబిచ్చారు. 'నేపాల్, ఫిజి, సురినామ్ వంటి పలు దేశాల్లో హిందీని వాడుతారు. ఆ భాష ఒక్క భారత్‌కే పరిమితమనుకుంటే అది మీ అజ్ఞానాన్ని బయటపెట్టుకున్నట్లే' అని అన్నారు. హిందీభాషకు అధికార గుర్తింపు కోసం 129దేశాల మద్దతును కూడగట్టినట్లు సుష్మ వెల్లడించారు.

మహారాష్ట్ర బంద్ హింసాత్మకం

- ముంబై, పుణెలో బస్సుల విధ్వంసం
- గంటలపాటు నిలిచిపోయిన లోకల్ రైళ్లు
- స్తంభించిన సాధారణ జనజీవనం
- పార్లమెంట్‌ను కుదిపేసిన 'కోరెగావ్'
- హింసపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలి: కాంగ్రెస్
- ప్రధాని ప్రకటన చేయాలని సభ్యుల పట్టు



పుణెలో ఆర్పీఐ, దళిత సంఘాల ప్రదర్శన

ముంబై/న్యూఢిల్లీ, జనవరి 3: భీమాకోరెగావ్ యుద్ధం ద్విశతవార్షికోత్సవాల సందర్భంగా జరిగిన హింసను నిరసిస్తూ బుధవారం నిర్వహించిన మహారాష్ట్ర బంద్ హింసాత్మకంగా మారింది. ముంబైలో సాధారణ జనజీవనం స్తంభించిపోయింది. ఆందోళనకారులు రాష్ట్రంలోని పలు పట్టణాలు, నగరాల్లో బస్సులు, రైళ్లపై దాడులకు పాల్పడ్డారు. సబర్బన్ లోకల్ రైళ్లను అడ్డుకున్నారు. అనేకచోట్ల రోడ్లపై బైఠాయించారు. భీమా కోరెగావ్ అల్లర్ల అంశం బుధవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. దేశంలో దళితులను లక్ష్యంగా చేసుకొని దాడులకు పాల్పడుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. కోరెగావ్ హింసకు బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ శక్తులే కారణమని, హింసపై సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించాలని డిమాండ్ చేసింది.

భరీపా బహుజన్ మహాసంఘ్ నాయకుడు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ మనవడు ప్రకాశ్ అంబేద్కర్ ఇచ్చిన పిలుపు మేరకు మహారాష్ట్రలో బంద్ జరిగింది. దాదాపు 250 దళిత సంఘాలు ఈ బంద్‌లో పాల్గొన్నాయి. ముంబైలోని చెంబూర్, ఘాట్కోపర్, కామరాజ్‌నగర్, విక్రోలి, దిండోషి, కాండివలి, జోగేశ్వరి, కళానగర్, మహిమ్ తదితర ప్రాంతాలలో దళితులు ప్రదర్శనలు నిర్వహించారు. వందల సంఖ్యలో వచ్చిన ఆందోళనకారులు వెస్టర్న్ ఎక్స్‌ప్రెస్ జాతీయ రహదారిని మూసివేసేందుకు ప్రయత్నించారని పోలీసులు తెలిపారు. కుర్లా, మన్‌ఖుర్ద్, గోవండి స్టేషన్లలో ఆందోళనకారులు రైలు పట్టాలపై బైఠాయించారు. దీంతో కొన్ని గంటలపాటు రైళ్లు నిలిచిపోయాయి. ఠాణె, భాండుప్, కంజుర్‌మార్గ్, విక్రోలి, ఘాట్కోపర్ స్టేషన్లలో కూడా రైళ్లను అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో 13 బస్సులు ధ్వంసమయ్యాయని అధికారులు తెలిపారు. బంద్ నేపథ్యంలో 'డబ్బావాలాలు' తమ సేవలు ఉపసంహరించుకున్నారు. స్కూలు బస్సులు నడవలేదు. హింసాత్మక సంఘటనలు జరిగిన నేపథ్యంలో పోలీసులు ఆందోళనకారులపై తొమ్మిది కేసులు నమోదు చేశారు. మంగళవారం సాయంత్రం నుంచే వందమందికి పైగా ఆందోళనకారులను అరెస్టు చేశారు. పుణెలో రాళ్లు రువ్వే సంఘటనలు ఒకటి రెండు మినహా బంద్ ప్రశాంతంగా జరిగింది. మంగళ, బుధవారాల్లో నగరంలో 42 బస్సులు ధ్వంసమైనట్టు అధికారులు చెప్పారు. జనవరి ఒకటిన భీమా కోరెగావ్‌లో హింసను రెచ్చగొట్టిన హిందూ అగాడీ సంస్థ నాయకుడు మిలింద్ ఎక్‌బోటే ఇంటి వైపు ప్రదర్శన నిర్వహించేందుకు కొన్ని దళిత సంఘాలు చేసిన ప్రయత్నాలను పోలీసులు అడ్డుకున్నారు. సాయంత్రం నాలుగున్నర గంటల సమయంలో బంద్‌ను ఉపసంహరించుకుంటున్నట్టు ప్రకాశ్ అంబేద్కర్ ప్రకటించారు. తమ ఆందోళనకు 50 శాతం జనాభా మద్దతుగా నిలిచిందని, బంద్ ప్రశాంతంగా జరిగిందని ఆయన చెప్పారు.

జిగ్నేశ్ మేవాని, ఖాలిద్‌పై ఫిర్యాదులు

దళిత నాయకుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవాని, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) విద్యార్థి సంఘం నాయకుడు ఉమర్ ఖాలిద్‌లకు వ్యతిరేకంగా తమకు ఫిర్యాదులు అందాయని పుణె పోలీసులు చెప్పారు. డిసెంబర్ 31న జరిగిన ఒక కార్యక్రమంలో వారిద్దరు ప్రజలను రెచ్చగొట్టే విధంగా ప్రసంగించినట్టు ఆరోపణలున్నాయని పేర్కొన్నారు. భీమా కోరెగావ్ యుద్ధం ద్విశతవార్షికోత్సవాలను పురస్కరించుకొని పుణెలో ఎల్గార్ పరిషద్ నిర్వహించిన కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు.

'బ్రేకింగ్ ఇండియా బ్రిగేడ్' వల్లే హింస: ఆరెస్సెస్

మహారాష్ట్రలో జరిగిన కుల హింసకు 'బ్రేకింగ్ ఇండియా బ్రిగేడ్' కారణమని ఆరెస్సెస్ ఆరోపించింది. 2016లో జేఎన్‌యూలో ఆ సంస్థ కార్యకర్తలు జాతి వ్యతిరేక నినాదాలు చేశారని, ఇప్పుడు హిందూ సమాజాన్ని చీల్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరెస్సెస్ ప్రతినిధి మన్మోహన్ వైద్య పేర్కొన్నారు.

పార్లమెంట్‌ను కుదిపేసిన 'కోరెగావ్'

భీమా కోరెగావ్ అల్లర్ల అంశం బుధవారం పార్లమెంట్‌ను కుదిపేసింది. దేశంలో దళితులను లక్ష్యంగా చేసుకుని దాడులకు పాల్పడుతున్నారని లోక్‌సభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గే ఆరోపించారు. జీరోఅవర్‌లో కాంగ్రెస్ ఈ అంశాన్ని లేవనెత్తింది. ఈ సందర్భంగా ఖర్గే మాట్లాడుతూ.. మహారాష్ట్ర అల్లర్లు, రోహిత్ వేముల ఘటనలను ప్రస్తావించారు. ఆత్మగౌరవంతో బతుకాలని భావిస్తున్న దళితులపై కొందరు దాడిచేస్తున్నారని, భీమా కోరెగావ్‌లోనూ ఇదే జరిగిందని ఆరోపించారు. గతంలో ఎప్పుడూ జరుగని హింస ఈసారి సంస్మరణ వేడుకల్లో ఎందుకు జరిగింది? ఎవరు హింసను ప్రేరేపించారు? అని ఆయన ప్రశ్నించారు. హింసకు బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వ శక్తులే కారణమని ఆరోపించారు. కోరెగావ్ అల్లర్లపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. 'దళితుల అంశం రాగానే ప్రధాని మోదీ మౌనబాబాగా మారిపోతారు. దేశవ్యాప్తంగా ఇలాంటి ఘటనలెన్నో జరుగుతున్నా ఆయన తనకేమీ పట్టనట్లు ఉంటారు. మహారాష్ట్ర అల్లర్లపై ఆయన స్పందించాలి. సభలో ప్రకటన చేయాలి' అని ఖర్గే అన్నారు. ఈ సందర్భంగా పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి అనంత్‌కుమార్ జోక్యం చేసుకున్నారు. కోరెగావ్ ఘటనను ఖర్గే రాజకీయం చేస్తున్నారని ఆరోపించారు. తృణమూల్ పార్టీ ఎంపీ సౌగత్ రాయ్ కూడా భీమా కోరేగావ్ అల్లర్లను అదుపు చేయడంలో మహారాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. శివాజీ పాటిల్ (శివసేన) మాట్లాడుతూ కోరెగావ్ అల్లర్లను మరాఠా, దళితుల మధ్య యుద్ధంగా చిత్రీకరించడం తప్పని చెప్పారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని కప్పిపుచ్చేందుకే అల్లర్లను ప్రముఖంగా చూపుతున్నారని బీజేపీ ఎంపీ ధాన్వే తెలిపారు. రాజ్యసభలోనూ విపక్షాలు కోరెగావ్ అల్లర్ల అంశంపై ప్రభుత్వాన్ని ప్రశ్నించాయి. అల్లర్ల వెనుక కుట్ర దాగి ఉందని, పూర్తిస్థాయిలో విచారణ జరుపాలని బీఎస్పీ ఎంపీ సతీశ్‌చంద్ర మిశ్రా కోరారు.



ఠాణెలో లోకల్ రైలును అపుతున్న ఆందోళనకారులు

చనిపోయినవాడితో పెట్టుకోకు!

కేజ్రీవాల్‌కు కుమార్ విశ్వాస్ హెచ్చరిక

రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ఆప్‌లో ముసలం



న్యూఢిల్లీ, జనవరి 3: ఆమ్ ఆద్మీ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు మరోసారి బయటపడ్డాయి. ఆమ్ ఆద్మీపార్టీలో ఢిల్లీ రాజ్యసభ సీట్ల వ్యవహారంఒక్కసారిగా అగ్గిని రాజేసింది. మూడు రాజ్యసభ స్థానాలకు పార్టీ బుధవారం అభ్యర్థుల్ని ప్రకటించింది. ఆప్ వ్యవస్థాపక సభ్యుడు కుమార్ విశ్వాస్ కూడా రాజ్యసభ సీటును ఆశించినట్లు వార్తలు వచ్చాయి. అయితే అభ్యర్థుల జాబితాలో ఆయన పేరు లేదు. దీంతో కుమార్‌విశ్వాస్ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌పై బహిరంగంగానే తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పొసగకపోయినప్పటికీ పార్టీలో కలిసి ముందుకుసాగడం సాధ్యంకాదని విశ్వాస్ అన్నారు. వాస్తవాలు మాట్లాడినందుకే తనను శిక్షించారని, ఇలా చేస్తారని తనకు ముందే తెలుసని ఆయన పేర్కొన్నారు. కేజ్రీవాల్ మాట విననివారికి ఆమ్ ఆద్మీ పార్టీలో మనుగడ లేదని చెప్పారు. 'నిన్ను రాజకీయంగా అంతమొందిస్తాను కానీ అమరుడిని కానివ్వబోను అని ఏడాదిన్నర క్రితం పార్టీ కార్యవర్గ సమావేశం సందర్భంగా కేజ్రీవాల్ నాతో నవ్వుతూ అన్నారు. ఆయన అలాగే చేశారు. డియర్ అరవింద్!.. ఇప్పుడు నేను చనిపోయినవాడిని. నా బలిదానాన్ని స్వీకరిస్తున్నాను. నా శరీరంతో ఆటలాడి, దుర్వాసన వ్యాపింపజేయొద్దు' అని అన్నారు. కాగా, కుమార్ విశ్వాస్ మద్దతుదారులు పార్టీ ఆఫీసు ముందు పెద్దఎత్తున నిరసనకు దిగారు. తమ నేతను పార్లమెంటుకు పంపించాల్సిందేనంటూ డిమాండ్ చేశారు.

రాజ్యసభ అభ్యర్థులను ప్రకటించిన ఆప్

మూడు రాజ్యసభ స్థానాలకు ముగ్గురు అభ్యర్థులను ఆమ్ ఆద్మీ పార్టీ బుధవారం ప్రకటించింది. పార్టీ ఆవిర్భావం నుంచి సేవలందిస్తున్న ఆప్ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడు సంజయ్‌సింగ్‌తోపాటు, చార్టర్డ్ అకౌంటెంట్ నారాయణ్‌దాస్ గుప్తా, విద్యావేత్త సుశీల్‌గుప్తాలను రాజ్యసభ అభ్యర్థులుగా పార్టీ ఎంపిక చేసినట్లు ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా తెలిపారు. మూడు రాజ్యసభ స్థానాలకు జనవరి 16న ఎన్నికలు జరుగనున్నాయి. 70మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీలో పూర్తి మెజారిటీ ఉన్నందున ఆప్ అభ్యర్థులు సునాయాసంగా గెలువనున్నారు.

ఇక ఉపగ్రహాలతో రైలు ఇంజిన్లు అనుసంధానం

న్యూఢిల్లీ, జనవరి 3: ఈ ఏడాది డిసెంబర్ నాటికి దేశంలోని అన్ని రైలు ఇంజిన్లను ఇస్రోకు చెందిన ఉపగ్రహాలతో అనుసంధానం చేయాలని రైల్వేశాఖ ఆదేశించింది. రైలు ప్రమాదాలను నివారించడానికి ఈ ప్రక్రియ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపింది. రైల్వేకు 10,800 రైలు ఇంజిన్లు ఉన్నాయని, వీటన్నింటిని అనుసంధానించడం వల్ల డ్రైవర్లకు సమయానికి అవసరమైన సమాచారాన్ని చేరవేయవచ్చని సూచించింది. ఇప్పటికే 10 రైలు ఇంజిన్లను ఉపగ్రహాలతో అనుసంధానించామని, ట్రయల్ పరీక్షలను కూడా నిర్వహించామని పేర్కొంది. రైల్వే ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ రైలు ప్రమాదాలను నివారించడానికి, రైలు వేగాన్ని నియంత్రించడానికి ఇప్పటికే ఇస్రోతో కలిసి పనిచేస్తున్నామని తెలిపారు. రైలు ఇంజిన్‌కు ఓ చిప్‌ను అమర్చుతామని తద్వారా ఆ రైలు వేగాన్ని నియంత్రించటంతోపాటు ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు.

చిచ్చు వెనుక ఆ ఇద్దరు!



మిలింద్ ఎక్‌బోటే, శంభాజీ భిడే

ముంబై, జనవరి 3: మూడు రోజులుగా మహారాష్ట్ర అట్టుడుకుతున్నది. పుణెలోని కోరెగావ్ గ్రామంలో మొదలైన చిచ్చు రాష్ట్రమంతా వ్యాప్తి చెందింది. ఈ హింస ఒకరి మృతికి, కొన్ని వేల కోట్ల రూపాయల నష్టానికి దారి తీసింది. దళితులు కొన్ని మితవాద సంస్థల మధ్య మొదలైన ఈ హింసకు ప్రధాన కారణం ఇద్దరు హిందూత్వవాదులేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఓ పథకం ప్రకారం ఈ ఇద్దరు కుట్రకు పథకం రచించారని తెలుస్తున్నది. వీరిలో ఒకరు 85 ఏండ్ల శంభాజీ భిడే కాగా, మరొకరు 56 ఏండ్ల మిలింద్ ఎక్‌బోటే. జోధా అక్బర్ సినిమా విడుదలను అడ్డుకోవడానికి తన అనుచరుల ద్వారా సినిమా థియేటర్లను ధ్వంసం చేయడంతో 2008లో భిడే తొలిసారిగా వార్తల్లోకెక్కాడు. అల్లర్లు, నిషేధాజ్ఞలు ఉల్లంఘించడం, బెదిరింపులకు పాల్పడటం, కులాల మధ్య చిచ్చు పెట్టడం వంటి నేరాలలో ఎక్‌బోటేపై 12 కేసులు ఉన్నాయి. మాజీ కార్పొరేటరైన ఎక్‌బోటే ఐదు కేసుల్లో దోషిగా కూడా ఖరారయ్యారు. ఈసారి వీరిద్దరు హిందూత్వ శక్తులను దళితులపైకి ఉసిగొల్పడంలో సఫలీకృతులయ్యారు. డిసెంబర్ 29న వీరిద్దరు కోరెగావ్ గ్రామానికి సమీపంలోని వాధు గ్రామంలోగల గోవింద్ గైక్వాడ్ అనే దళిత ప్రముఖుడి సమాధిని ధ్వంసం చేయించారు. మరాఠాలు ఆరాధ్య దైవంగా భావించే శివాజీ మహరాజ్ కుమారుడు శంభాజీరాజే భోసలే అంత్యక్రియలను గోవింద్ గైక్వాడ్ నిర్వహించినట్టు చరిత్రలో నమోదైంది. మొఘల్ చక్రవర్తులకు భయపడి మృతదేహాన్ని చూడటానికి సైతం ఎవరూ ముందుకురాని సమయంలో గైక్వాడ్ ధైర్యంగా శంభాజీ అంత్యక్రియలు నిర్వహించారన్నది స్థానిక కుల కథనం. ఈ కథనంతో విభేదించే భిడే, ఎక్‌బోటేలు మరాఠాలే శంభాజీ అంత్యక్రియలు నిర్వహించారని, దీనిపై ప్రభుత్వం వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేస్తున్నారు. జనవరి ఒకటిన కోరెగావ్‌లో జరుగనున్న ద్విశతవార్షికోత్సవాలకు దళితులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని తెలిసే, ఉద్దేశపూర్వకంగానే గైక్వాడ్ సమాధిని ధ్వంసం చేసి వారిని రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలో ఇంతటి ఉద్రిక్తతలకు కారణమైన ఈ ఇద్దరిపై కేసులు నమోదు చేసిన పోలీసులు వారిని ఇంతవరకు అరెస్టు చేయలేదు. ఇందుకు వారిద్దరికీ ఆరెస్సెస్ అగ్రనాయకత్వంతో ఉన్న లోతైన సంబంధాలు కారణమని తెలుస్తున్నది. 2014 లోక్‌సభ ఎన్నికలకు ముందు నరేంద్రమోదీ సాంగ్లిలోని శంభాజీ భిడే ఇంటికి వెళ్లి ఆయనకు పాదాభివందనం చేసివచ్చారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో తాను 'భిడే గురూజీ ఆదేశాల మేరకే సాంగ్లి వచ్చాను' అని వెల్లడించారు. న్యూక్లియర్ ఫిజిక్స్‌లో ఎమ్మెస్సీ గోల్డ్ మెడలిస్ట్ అయిన భిడేకు భారీ సంఖ్యలో అనుచరగణం ఉంది. ఇక ఎక్‌బోటే కుటుంబం మొత్తానికి ఆరెస్సెస్‌తో సంబంధాలున్నాయి.

వారం ముందే ఫేస్‌బుక్‌లో ప్రచారం

పుణె ఘర్షణలకు వారం రోజుల ముందు నుంచే ఫేస్‌బుక్‌లో దళిత వ్యతిరేక ప్రచారం జరిగినట్టు వెల్లడైంది. 'ఇతిహాస పొల్‌ఖుడా' అనే మరాఠీ పేజీలో కొంతమంది దళితులను రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టారు. కోరెగావ్ యుద్ధంలో దళితులకు ఎటువంటి ఘనత లేదని, దానిని బ్రిటిషు వారు సాధించిన విజయంగానే పరిగణించాలని పేర్కొన్నారు.



కరుణానిధితో రజినీ భేటీ

చెన్నై, జనవరి 3: రాజకీయాల్లోకి వస్తున్నానంటూ ఇటీవల ప్రకటించిన తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ బుధవారం రాత్రి డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిని ఆయన నివాసంలో కలిశారు. కరుణానిధి ఆశీస్సులు తీసుకున్నారు. ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. కరుణను రజినీ కలిసినప్పుడు డీఎంకే కార్యనిర్వాహక అధ్యక్షుడు స్టాలిన్ అక్కడే ఉన్నారు. రజినీ రాజకీయ ప్రకటన చేసిన తర్వాత మొదట కలుసుకున్న రాజకీయనాయకుడు కరుణానిధి కావడం విశేషం. డీఎంకే అధికార వర్గాలు మాట్లాడుతూ మర్యాదపూర్వకంగానే ఈ భేటీ జరిగిందని తెలిపాయి.

ఐఏఎస్, ఐపీఎస్‌లపై 139 కేసులు

న్యూఢిల్లీ, జనవరి 3: గత మూడేండ్లలో పలువురు అఖిల భారత సివిల్ సర్వీసెస్ అధికారులపై 139 అవినీతి, క్రిమినల్ కేసులు నమోదైనట్టు కేంద్ర ప్రభుత్వం బుధవారం తెలిపింది. 2014 జనవరి నుంచి 2017 నవంబర్ వరకు ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్‌ఎస్, ఐఎఫ్‌ఎస్ అధికారులకు వ్యతిరేకంగా 139 అవినీతి, నేర కేసులను సీబీఐ నమోదు చేసిందని కేంద్ర సిబ్బంది వ్యవహారాలశాఖ సహాయ మంత్రి జితేంద్రసింగ్ లోక్‌సభకు లిఖితపూర్వకంగా తెలిపారు. ఈ కేసుల విచారణ వేగవంతానికి సీబీఐ 92 అదనపు స్పెషల్ కోర్టులను కూడా ఏర్పాటుచేసిందని పేర్కొన్నారు.

'బ్లూవేల్' కారణంగా ఎవరూ చనిపోలేదు

ఆన్‌లైన్ బ్లూవేల్ చాలెంజ్ గేమ్ కారణంగా ఎవరైనా ఆత్మహత్య చేసుకున్నారనడానికి ఎలాంటి ఆధారాలు లేవని ప్రభుత్వం లోక్‌సభకు స్పష్టంచేసింది. వివిధ రాష్ట్రాల్లో, కేంద్రపాలిత ప్రాంతాల్లో బ్లూవేల్ చాలెంజ్ గేమ్ కారణంగా పలువురు చిన్నారులు ఆత్మహత్యలకు పాల్పడ్డారనే ఆరోపణలు వచ్చాయని, కానీ, ఇందుకు ఆధారాలు లభించలేదని కేంద్రహోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ అహిర్ తెలిపారు.

రైల్ టికెట్ల ద్వారా రూ.2000 కోట్లు

అంతకుముందు ఏడాదితో పోలిస్తే 2016-17 ఆర్థికసంవత్సరంలో టికెట్ల విక్రయాల ద్వారా భారత రైల్వే అదనంగా రూ.2000 కోట్ల ఆదాయం సమకూర్చుకొన్నట్టు కేంద్రప్రభుత్వం బుధవారం పార్లమెంట్‌కు తెలిపింది. గత ఏడాది జూలై 22 నుంచి నవంబర్ 30వ తేదీ వరకు 11.48 లక్షల మంది వయోవృద్ధులు చార్జీల రాయితీని వదులుకున్నారు. ఈ మేరకు బుధవారం కేంద్ర రైల్వే సహాయమంత్రి రాజెన్ గోహెయిన్ లోక్‌సభకు రాతపూర్వక సమాధానం ఇచ్చారు.

అంబేద్కర్ జన్మభూమిలో దళితులపై దాడులు

ముంబై, జనవరి 3: దళిత నాయకుడు, రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ పుట్టిన భూమిలో దళితులపై దాడులు సర్వసాధారణమేనని చరిత్ర చెబుతున్నది. గత మూడేండ్లలోనే మహారాష్ట్రలో మరాఠాలు (అగ్రకులాలు), దళితుల మధ్య జరిగిన ఘర్షణలకు సంబంధించి 270 కేసులు నమోదయ్యాయి. ఈ ఘర్షణల్లో 32 మంది మరణించగా, 500 మందికి పైగా గాయపడ్డారు. 2006లో భండారా జిల్లాలోని ఖైర్లాంజి గ్రామంలో అగ్రకులానికి చెందిన 40 మంది భోత్‌మాంగే అనే ఓ దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య (45), కుమార్తె (17), ఇద్దరు కొడుకులను దారుణంగా హత్య చేశారు. భార్య, కూతురును హత్య చేయడానికి ముందు నగ్నంగా ఊరేగించి, వారిపై లైంగిక దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై ప్రభుత్వం ప్రత్యేకంగా జరిపించిన విచారణలో స్థానిక పోలీసులు, వైద్యులు, బీజేపీ శాసనసభ్యుడు మధుకర్ కుకాడేలు కేసును తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించినట్టు వెల్లడైంది. కానీ ఎవరికీ శిక్షలు పడలేదు. 2016 సెప్టెంబర్‌లో ఓ వ్యక్తి (40) బంజారా తెగకు చెందిన ఐదేండ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడటంతో నాసిక్‌లో ఉద్రిక్తతలు చెలరేగాయి. అదే ఏడాది డిసెంబర్‌లో సతారా జిల్లాలో ఓ జంట ప్రేమ వ్యవహారం దళితులు, అగ్రవర్ణాల మధ్య చిచ్చు రేపింది. ఆ ఘర్షణల్లో పలువురు దళితుల ఇండ్లు, వాహనాలు ధ్వంసమయ్యాయి.

యుద్ధ విమానంలో మంటలు

- పైకి ఎగిరే సమయంలో తలెత్తిన లోపం.. తప్పించుకున్న పైలట్



పనాజి, జనవరి 3: గోవాలో మిగ్29కే యుద్ధ విమానం పైకి ఎగిరే సమయంలో చిన్నపాటి మంటలు చెలరేగాయి. విమానాన్ని నడుపుతున్న పైలట్ ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డాడు. గోవాలోని ఐఎన్‌ఎస్ హన్స నౌకాదళ స్థావరంలో ఉన్న డాబోలిమ్ విమానాశ్రయంలో ఈ ప్రమాదం జరిగింది. నౌకాదళానికి చెందిన మిగ్29కే విమానాల్లో ప్రమాదం జరుగడం ఇదే తొలిసారని నౌకాదళ అధికారి తెలిపారు. దీనిపై విచారణ చేపడుతామని గోవా ప్రాంత కమాండింగ్ ఫ్లాగ్ అధికారి పునీత్ కే బాల్ తెలిపారు. లోపం కారణంగా విమానం పైకి ఎగిరలేదని, మళ్లీ ప్రయత్నించిన పైలట్.. రన్‌వే దాటి వేరే మార్గం చివరన ఆపేసి సురక్షితంగా బయపడ్డాడని పేర్కొన్నారు.

ఇది హిందుస్థాన్.. హిందువులుండే దేశం!

- యూపీ బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సయానీ వివాదాస్పద వ్యాఖ్యలు

ముజఫర్‌నగర్ (యూపీ), జనవరి 3: ఉత్తరప్రదేశ్‌లోని బీజేపీ ఎమ్మెల్యే విక్రమ్ సయానీ మరోసారి వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. మన దేశం హిందువులదేనని అన్నారు. మతపరంగా ఎంతో సున్నితమైన ముజఫర్‌నగర్‌లో మంగళవారం ఒక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. 'నేను హిందుత్వ భావనలో ప్రగాఢ విశ్వాసం ఉన్న వ్యక్తిని. మన దేశాన్ని హిందుస్థాన్ అని పిలుస్తారు. అంటే ఇది హిందువులు ఉండే దేశమని అర్థం' అని అన్నారు. 'ముస్లింలను బుజ్జగించడానికి గత ప్రభుత్వాలు వారికి ఎన్నో తాయిలాలు ఇచ్చేవి. ఇప్పుడు బీజేపీ అందరినీ సమానంగా చూస్తున్నది' అని చెప్పారు.

ఫేస్‌బుక్‌లో మోదీ, టెండూల్కర్ హవా

- అత్యుత్తమ పార్లమెంటేరియన్లుగా నమోదు

న్యూఢిల్లీ, జనవరి 3: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, క్రికెటర్ సచిన్ టెండూల్కర్ 2017లో సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్ వేదికపై అత్యుత్తమ పార్లమెంటు సభ్యులుగా నిలిచారు. లోక్‌సభ సభ్యుడిగా మోదీ ఎక్కువగా మాట్లాడినట్టు, రాజ్యసభలో సచిన్ అత్యంత ప్రజాదరణ పొందిన సభ్యుడిగా ఫేస్‌బుక్‌లో నిలిచారని ఓ ప్రకటనలో తెలిపారు. 2017లో ఫేస్‌బుక్‌లో మొత్తం స్పందనలు, ప్రతిస్పందనలు, ఇతరులకు పంపడం (షేర్), వ్యాఖ్యానాల (కామెంట్ల) ఆధారంగా ర్యాంకులను ఇచ్చారు. ర్యాంకుల్లో మోదీ, సచిన్ తర్వాత స్థానాల్లో బీజేపీ ఎంపీ ఆర్కే సిన్హా, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా, మజ్లిస్ పార్టీ అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ఆప్ ఎంపీ భగ్వంత్ మన్ ఉన్నారు. అధికారిక సంస్థల్లో భారత ప్రధానమంత్రి కార్యాలయం ఫేస్‌బుక్‌లో అత్యంత ప్రజాదరణ పొందగా, ఆ తర్వాత రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ కార్యాలయం నిలిచింది. మంత్రిత్వశాఖల్లో విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మొదటిస్థానంలో నిలిచింది. రాష్ట్ర ప్రభుత్వాలను పరిశీలిస్తే.. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అత్యంత ప్రజాదరణ పొందగా, ఆ తర్వాత రాజస్థాన్ సీఎం వసుంధరారాజే నిలిచారు. రాజకీయ పార్టీల్లో బీజేపీ మొదటిస్థానంలో నిలువగా, ఆమ్‌ఆద్మీపార్టీ, కాంగ్రెస్ ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.



ప్రధాని మోదీతో సచిన్ (ఫైల్)

పులుల్ని చంపితింటున్న గ్రామస్థులు

మహారాష్ట్రలోని పందార్‌క్వడలో విచిత్రం



మహారాష్ట్ర, జనవరి 3: సాధారణంగా పులులు మనుషులను తింటాయి. కానీ, మహారాష్ట్రలోని పందార్‌క్వడ గ్రామస్థులు మాత్రం పులులనే ఆహారంగా తీసుకుంటున్నారు. పందార్‌క్వడతోపాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు కూడా పులిమాంసాన్ని తింటున్నారు. పులుల సంఖ్య గణనీయంగా తగ్గడంపై ఆందోళన చెందిన అటవీశాఖ అధికారులు వ్యాఘ్రాలను సంరక్షించే చర్యలు చేపట్టారు. కొంతకాలం క్రితం పందార్‌క్వడ గ్రామం పక్కన ఉన్న అడవిలో నుంచి పులులు వచ్చి గ్రామస్థుల మీద దాడి చేసేవి. రాత్రిపూట పొలాలకు కాపలా వెళ్లేవారు, పశువుల కాపరులు అడవికి వెళ్తే తిరిగి వచ్చేవారు కాదు. దీంతో గ్రామస్థులందరూ కలిసి పులులపై తామే దాడిచేసి వాటిని చంపి తినాలని నిర్ణయించుకున్నారు. నాటి నుంచి అడవిలో పులుల సంఖ్య తగ్గిపోతుండటంతో అనుమానం వచ్చిన అధికారులు అడవిలో రహస్యంగా కెమెరాలు అమర్చారు. దీంతో గ్రామస్థుల నిర్వాకం వెలుగులోకి వచ్చింది. ఇకపై పులులను చంపితే కఠిన చర్యలు తీసుకుంటామని గ్రామస్థులను అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.

'రాఫెల్' క్షిపణులు మాకొద్దు!

- ఇజ్రాయెల్‌తో భారత్ ఒప్పందం రద్దు
- ఒప్పందం విలువ రూ.3173 కోట్లు
- నెతన్యాహు భారత పర్యటన ముందు ఘటన



జెరూసలేం, జనవరి 3: ఇజ్రాయెల్‌తో 50 కోట్ల డాలర్ల (రూ.3,173 కోట్ల) విలువైన రక్షణ ఒప్పందాన్ని భారత్ రద్దు చేసుకున్నది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్‌కు చెందిన రాఫెల్ అడ్వాన్స్‌డ్ డిఫెన్స్ సిస్టమ్స్ కంపెనీ ధ్రువీకరించింది. కొద్ది రోజుల్లో ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహు భారత్‌లో తొలిసారిగా పర్యటించనున్న నేపథ్యంలో ఒప్పందం రద్దు కావడంపై సదరు కంపెనీ విచారం వ్యక్తంచేసింది. ఈ రక్షణ ఒప్పందం ప్రకారం రాఫెల్ కంపెనీ భారత్‌కు స్పైక్ క్షిపణులను (యుద్ధ ట్యాంకులపైకి చేతితో ప్రయోగించే క్షిపణులను) సరఫరా చేయాల్సి ఉన్నది. ఒప్పందం రద్దు గురించి భారత రక్షణశాఖ నుంచి తమకు అధికారిక నోటీసు అందినట్టు రాఫెల్ కంపెనీ ప్రతినిధి పేర్కొన్నారు. స్పైక్ క్షిపణులను 26 దేశాలు ఉపయోగిస్తున్నాయని.. రక్షణశాఖకు సంబంధించిన అన్ని నిబంధనలు పాటించడంతోపాటు సుదీర్ఘమైన, కఠినమైన ప్రక్రియ తర్వాత భారత్ వీటిని ఎంపిక చేసిందని పేర్కొన్నారు. అన్ని డిమాండ్లకు కట్టుబడి ఉన్నప్పటికీ.. సంతకాలు కావాల్సిన దశలో ఒప్పందం రద్దయిందని తెలిపారు. ఇది బాధాకరమే అయినా భారత్‌తో కలిసి నడుస్తామని.. భారత్‌లో పనిచేయాలన్న తమ విధానాన్ని కొనసాగిస్తామని ఉద్ఘాటించారు. కాగా ఒప్పందం ఎందుకు రద్దయిందనే విషయాన్ని రాఫెల్ సంస్థ వెల్లడించలేదు. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు ఈ నెల 14న భారత్‌కు రానున్న నేపథ్యంలో ఈ అంశం చర్చకు వచ్చే అవకాశం ఉన్నది.

ఈ ఏడాది చివరికి కమాండ్ సెంటర్

- సమాంతరంగా టెక్నాలజీ అభివృద్ధి
- రాష్ట్రవ్యాప్తంగా ఒకేరకమైన సేవలు
- శాంతిభద్రతలకు నిలయంగా తెలంగాణ
- హైదరాబాద్‌లో టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్ల ప్రారంభోత్సవంలో డీజీపీ మహేందర్‌రెడ్డి



హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్లను పరిశీలిస్తున్న డీజీపీ మహేందర్‌రెడ్డి

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా హైదరాబాద్ బంజారాహిల్స్‌లో చేపట్టిన 20 అంతస్తుల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ) భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఈ ఏడాది చివరినాటికి అందుబాటులోకి వస్తుందని డీజీపీ మహేందర్ రెడ్డి వెల్లడించారు. కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో శాంతి భద్రత పరిరక్షణ, నేర నివారణతోపాటు అన్ని శాఖలకు ఉపయోగపడేలా టెక్నాలజీని అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఇందులో భాగంగానే సమాంతరంగా ఇప్పుడు టెక్నాలజీని అభివృద్ధి చేసి, భవన ప్రారంభోత్సవం నాటి నుంచే టెక్నాలజీ వ్యవస్థ పనిచేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ భవనంలో అత్యాధునిక టెక్నాలజీతో ఏర్పాటు చేసిన కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌తో కూడిన టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్లను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లా, కమిషనరేట్ పరిధిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లను బంజారాహిల్స్‌లో నిర్మిస్తున్న కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయనున్నామన్నారు. రాబోయే సీసీసీలో ఉపయోగించే టెక్నాలజీపై హైదరాబాద్‌లో ప్రయోగాత్మకంగా ఉపయోగిస్తూ దీనిని ఒక పైలట్ ప్రాజెక్టుగా కొనసాగిస్తున్నామన్నారు. జిల్లాలు, కమిషనరేట్ల సిబ్బందికి టెక్నాలజీపై హైదరాబాద్ కమిషనరేట్‌లో శిక్షణ ఇస్తున్నామన్నారు. ప్రతి జిల్లాలో నాణ్యమైన పోలీస్ సేవలను ప్రజలకు అందించేందుకు రాష్ట్రమంతా ఒకే రకమైన టెక్నాలజీని ఉపయోగిస్తామన్నారు. హైదరాబాద్‌లోని టెక్నాలజీ ఫ్యూజన్ సెంటర్లలో బిగ్ డేటా అనాలటిక్స్, వీడియో అనాలటిక్స్, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, క్షేత్రస్థాయి పోలీస్ అధికారులకు సమాచారం, పెట్రోలింగ్ సిబ్బందికి సమాచారం, క్రైం అండ్ క్రిమినల్ డేటాకు సంబంధించిన సమాచారం, డయల్ 100, హాక్ ఐ, రోడ్డు ప్రమాదాలు, నగరవ్యాప్తంగా ఉన్న సీసీ కెమెరాల నిఘా, పెట్రోలింగ్ వాహనాల ట్రాకింగ్ డేటా, దర్యాప్తునకు సంబంధించిన విశ్లేషణ, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డేటా, సోషల్‌మీడియా ప్లాట్ ఫాం, వీడియో సర్వైలెన్స్ సెక్యూరిటీ కమాండ్ సెంటర్, ట్రాఫిక్ కమాండ్ సెంటర్, ఎమర్జెన్సీ రెస్పాన్స్ యూనిట్, ఫేషియల్ రికగ్నైజేషన్ అనాలటిక్స్, వీడియో ఎన్‌యాన్స్‌మెంట్ యూనిట్, సోషల్ మానిటరింగ్ యూనిట్, ట్రాఫిక్ సిగ్నల్ మేనేజ్‌మెంట్ యూనిట్, ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ యూనిట్ ఉంటాయన్నారు.

టెక్నాలజీకి మారు పేరు మన పోలీస్

ఎక్కడైతే శాంతిభద్రతలకు విఘాతం కలుగకుండా నిరంతరం ప్రశాంత వాతావరణం ఉంటుందో అప్పుడు అక్కడ అభివృద్ధి సాధ్యమవుతుందని సీఎం కేసీఆర్ చెప్తుంటారని, అందులో భాగంగానే టెక్నాలజీతో కూడిన పోలీసింగ్‌ను రాష్ట్రంలో అమలు చేసేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తున్నదని డీజీపీ మహేందర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో టెక్నాలజీతో సత్ఫలితాలు సాధిస్తున్నామని, దీనిని మిగతా జిల్లాల్లో కూడా అమలు చేసి నేరరహిత రాష్ట్రంగా మార్చేందుకు అవకాశముంటుందన్నారు. 20 అంతస్తుల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ భవనం పూర్తయ్యేలోగా రాష్ట్రవ్యాప్తంగా టెక్నాలజీ పరమైన నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసి దానికి అనుసంధానం చేస్తున్నామన్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీస్ కమిషనరేట్లతో కలుపుకొని మొత్తం జిల్లాల్లో 10 లక్షల సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. ఈ ఏడాది చివరినాటికి అన్ని పోలీస్ యూనిట్లలో కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్లు ఏర్పాటు చేసి, సిబ్బందికి శిక్షణ పూర్తి చేస్తామన్నారు. దీంతో రాష్ట్రం శాంతిభద్రతలకు నిలయంగా మారుతుందన్నారు. అప్పుడు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో వివిధ దేశాల నుంచి పెట్టుబడులు వస్తాయని, తద్వారా రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందన్నారు. అప్పుడు టెక్నాలజీకి మారుపేరుగా హైదరాబాద్, టీఎస్ పోలీస్ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో హైదరాబాద్ సీపీ శ్రీనివాసరావు, అదనపు కమిషనర్లు స్వాతి లక్రా, శివప్రసాద్, మురళీకృష్ణ, జాయింట్ సీపీ డాక్టర్ వీ రవీందర్, డీసీపీలు అవినాష్ మహంతి, జోయెల్ డేవీస్, ప్రకాశ్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ, రంగనాథ్, చౌవాన్, సుమతి, శశిధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పొందడం ఇక సులభం

- నిబంధనలు సడలించిన విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: పాస్‌పోర్టు పొందడాన్ని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ మరింత సులభతరం చేసింది. మున్సిపల్ కార్పొరేషన్ అందజేసే బర్త్ సర్టిఫికెట్‌తోపాటు మరిన్ని పత్రాలను డేట్ ఆఫ్ బర్త్ ప్రూఫ్‌గా వాడుకోవచ్చని పేర్కొన్నది. గుర్తింపు పొందిన బోర్డు జారీచేసిన మెట్రిక్యులేషన్ సర్టిఫికెట్, బదిలీ సర్టిఫికెట్, పాన్‌కార్డు, ఆధార్, ప్రభుత్వ ఉద్యోగులకు సంబంధించిన అటెస్టెడ్ చేయబడిన సర్వీస్ రికార్డు, పెన్షన్ ఆర్డర్ కాపీ, డ్రైవింగ్ లైసెన్స్, ఓటర్ కార్డు, పబ్లిక్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ జారీ చేసిన పాలసీ బాండ్లను డేట్ ఆఫ్ బర్త్, అడ్రస్ ప్రూఫ్‌గా వాడుకోవచ్చన్నది. లీగల్ గార్డియన్ లేదా తల్లిదండ్రుల్లో ఒకరి పేరును మాత్రమే దరఖాస్తులో పేర్కొనేలా అవకాశమిచ్చారు. నోటరీ బదులు తెల్లకాగితంపై సెల్ఫ్ డిక్లరేషన్ ఇస్తే సరిపోతుంది. మ్యారేజ్ సర్టిఫికెట్‌ను కూడా తొలిగించారు. ఒక వేల విడాకులు తీసుకున్న వ్యక్తి దరఖాస్తులో తన పేరు మాత్రమే రాసుకుంటే సరిపోతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు ఎన్‌వోసీ తీసుకురావాలనే నిబంధనను తొలిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

ఇక బీఆర్‌ఎస్ వంతు!

- హెచ్‌ఎండీఏలో తుది దశలో ఎల్‌ఆర్‌ఎస్
- 1.7 5లక్షల దరఖాస్తుల్లో అనుమతి పొందినవి 84,705
- రూ.507 కోట్ల ఆదాయం.. మరో రూ.700 కోట్లు వచ్చే అవకాశం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: ఎల్‌ఆర్‌ఎస్ (లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీం)ను చివరి దశకు చేర్చిన హెచ్‌ఎండీఏ అధికారులు బీఆర్‌ఎస్(బిల్డింగ్ రెగ్యులైజేషన్ స్కీం) దరఖాస్తులపై దృష్టి సారించారు. 37 వేల దరఖాస్తుల పరిశీలనకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపారు. కోర్టు ఆదేశాల మేరకు కేవలం దరఖాస్తుల పరిశీలనలో భాగంగా టైటిల్ వెరిఫికేషన్ జరుగుతున్నది. అర్హులను మాత్రమే గుర్తించి మంజూరు పత్రాలను పెండింగ్‌లో ఉంచనున్నారు. అనర్హుల దరఖాస్తులను తిరస్కరించే వీలుండటంతో పరిశీలన ప్రక్రియను ముమ్మరం చేశారు. కమిషనర్ చిరంజీవులు, ప్లానింగ్ డైరెక్టర్ పురుషోత్తంరెడ్డి, సీపీవోలు నరేంద్ర, శ్రీనివాస్, పీవో, ఏపీవో, జేపీవో పర్యవేక్షణలో ఎల్‌ఆర్‌ఎస్ పథకాన్ని సమర్థవంతంగా నిర్వహించారు. ఉమ్మడి రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులతోపాటు కొత్తగా వచ్చినవి కలిపి 1.75 లక్షల ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులను స్వీకరించిన అధికారులు నిర్ణీత వ్యవధిలో సమర్థవంతంగా పరిశీలన ప్రక్రియను పూర్తిచేశారు. 84,705 దరఖాస్తులు అనుమతి పొందగా, 69,675 దరఖాస్తులను తిరస్కరించినట్టు కమిషనర్ చిరంజీవులు తెలిపారు. వివిధ కారణాలతో షార్ట్‌ఫాల్‌కు సమాచారం ఇచ్చిన దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయని, ఇందులో చాలా వరకు తిరస్కరణకు గురయ్యే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని వివరించారు. భూ రికార్డుల పరిశీలన పూర్తయిన నేపథ్యంలో మరో పది వేల వరకు అనుమతులు పొందవచ్చని అంచనా వేస్తున్నామన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పేరిట సంస్థ ఖజానాలోకి ఇప్పటి వరకు రూ.507 కోట్లు రాగా, అదనంగా మరో రూ.400 కోట్ల మేర రావొచ్చని అధికారులు అంచనా వేశారు. బీఆర్‌ఎస్‌తో మరో రూ.300 కోట్లు వచ్చే అవకాశాలున్నాయని చెప్తున్నారు. క్రమబద్ధీకరణ పథకంతో సంస్థ ఖజానాను బలోపేతం చేయడంతోపాటు సంస్థ పరిధిలో ఈ నిధులను అభివృద్ధి పనులకు వెచ్చిస్తూ ప్రగతి పరుగులు పెట్టిస్తుండటం గమనార్హం.

69,675 దరఖాస్తుల తిరస్కరణ

దరఖాస్తు సమయంలో ప్రైవేట్ వ్యక్తులు, ఇంటర్నెట్, అర్కిటెక్టులు, బ్రోకర్ల ప్రమేయంతో ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న వారే అధికంగా ఉన్నట్టు గుర్తించిన అధికారులు అనర్హులే ఎక్కువగా ఉన్నట్టు తేల్చారు. ఈ క్రమంలోనే ప్రభుత్వ భూములు, ఖాళీ స్థలాలు, శిఖం భూములు, ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్న ప్లాట్ల దరఖాస్తులను తిరస్కరిస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు అధికారికంగా 69,675 దరఖాస్తులు తిరస్కరించారు.



రోషన్‌దౌలా కాలనీకి పునరావాసం కల్పించాలని రక్షణ శాఖమంత్రి నిర్మలా సీతారామన్‌కు నివేదిక అందజేస్తున్న ఎంపీ చామకూర మల్లారెడ్డి

రోషన్‌దౌలావాసులకు 67 కోట్ల పరిహారం

- మల్కాజిగిరి ఎంపీ చామకూర మల్లారెడ్డి

హస్తినాపురం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య నలుగుతున్న రోషన్‌దౌలా కాలనీ తరలింపు పరిహారం రూ.67.5 కోట్లు 15 రోజుల్లో అందించడానికి కృషిచేస్తానని కేంద్ర రక్షణశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ హామీ ఇచ్చినట్టు మల్కాజిగిరి ఎంపీ చామకూర మల్లారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఢిల్లీలో రోషన్‌దౌలా కాలనీవాసులతో కలిసి రక్షణశాఖ మంత్రిని కలిసి పునరావాస నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ హైదరాబాద్ నగరంలోని ఎల్‌బీ నగర్ నియోజకవర్గం పరిధిలో గల రోషన్‌దౌలాకాలనీ డీఆర్డీఎల్ సమీపంలో ఉన్నందున స్థానికులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు కాలనీ తరలింపునకు పదేండ్ల కిందటే రూ.14.5 కోట్లు రాష్ట్ర ప్రభుత్వఖాతాలో జమచేసిందని, అనుకోని కారణాలతో తరలింపు జరుగలేదన్నారు. ప్రస్తుతం తరలించడానికి అధిక వ్యయం అవుతుందని, ఈ ప్రకారం ప్రతి కుటుంబానికి డబుల్ బెడ్‌రూం తరహాలో అవాసం కల్పించడానికి మొత్తం రూ.84 కోట్లు అవసరం అవుతుందని వివరించారు. ఇప్పటికే కొన్ని నిధులు ఉన్నందున మిగతా రూ.67.5 కోట్లు అత్యవసరంగా మంజూరు చేయల్సిందిగా కోరామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలనీని అభివృద్ధిచేయకపోవడంతో స్థానికులు మౌలిక సదుపాయాలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్పందించిన రక్షణ మంత్రి 15 రోజుల్లో పునరావాస ప్యాకేజీని అందిస్తామని హామీ ఇచ్చారన్నారు.

మొబైల్ యాప్‌లో నేరస్తుడి చిట్టా

జిల్లాలవారీగా నేరస్తుల డేటా సేకరిస్తున్న పోలీసులు

హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్లలో పూర్తి.. 10,800 మంది నేరగాళ్లు ఉన్నట్టు గుర్తింపు

టీఎస్‌కాప్స్ మొబైల్ యాప్‌నకు అనుసంధానం.. నేరగాళ్లపై క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతర నిఘా

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న నేరస్తుల డేటా సేకరణలో పోలీసులు నిమగ్నమయ్యారు. ప్రతి నేరస్తుడి ఫొటో, చిరునామా, నేరాల వివరాలు, ప్రస్తుతం ఏమి చేస్తున్నారు, ఫోన్ నంబర్ తదితర అంశాలతో వివరాలు సేకరిస్తున్నారు. టెక్నాలజీ సహాయంతో వేగవంతమైన సేవలతోపాటు సిబ్బంది పనితీరులో మరింత పారదర్శకత, జవాబుదారీతనం పెంచుతూ రాష్ట్రాన్ని క్రైం ఫ్రీ స్టేట్‌గా తీర్చిదిద్దేందుకు డీజీపీ మహేందర్‌రెడ్డి కసరత్తు మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే పోలీసుశాఖలో సాంకేతికవిప్లవాన్ని తీసుకువచ్చేందుకు శ్రీకారం చుట్టారు. డీజీపీ ఆదేశాల మేరకు ముందుగా రాజధానిలోని మూడు కమిషనరేట్ల పరిధిలో నేరస్తుల సమాచార సేకరణను పూర్తిచేసిన పోలీసులు ఇతర జిల్లాలపై దృష్టి సారించారు. హైదరాబాద్‌లో 4,600, సైబరాబాద్‌లో 3,200, రాచకొండలో 3,000 మంది నేరస్తుల పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించారు. మూడు కమిషనరేట్ల పరిధిలో 10,800 మంది నేరగాళ్లు ఉన్నట్టు గుర్తించారు.

నేరస్తుల డేటాబేస్ ఉద్దేశమిదీ..

రాష్ట్రవ్యాప్తంగా నేరస్తుల సమాచారాన్ని సేకరించిన పోలీసులు దానిని కంప్యూటరీకరిస్తారు. అనంతరం డేటాబేస్‌లో ఫీడ్ చేస్తారు. ఆ తర్వాత పోలీస్ సిబ్బంది అంతర్గతంగా నిర్వహించుకునే టీఎస్ కాప్స్ మొబైల్ అప్లికేషన్‌ను అనుసంధానం చేయనున్నారు. ఈ సమాచారాన్ని పెట్రోలింగ్ సిబ్బంది, బీట్‌కానిస్టేబుల్స్, సెక్టార్ సిబ్బంది వద్ద ఉండే ట్యాబ్‌లకు జీపీఆర్‌ఎస్ ద్వారా లింక్ చేస్తారు. వారు తమవద్ద ఉన్న ట్యాబ్‌ల సహాయంతో నేరస్తులపై నిఘా పెడుతారు. పెట్రోలింగ్ సిబ్బంది నేరస్తుడి వద్దకు వెళ్లగానే అతడికి సంబంధించిన వివరాలు మొత్తం ట్యాబ్‌లో చూపిస్తుంది. నేరగాడు ఇంట్లోనే ఉన్నాడా? బయటకు వెళ్లాడా? ఏ సమయంలో వెళ్లాడు? అనే వివరాలను తాజాగా సేకరించి, తిరిగి నమోదు చేసుకుంటారు. ప్రతి విషయం అక్కడికక్కడే డేటాబేస్‌లో ఫీడ్ అవుతుంది. రాత్రి సమయంలో నేరస్తుల ఇంటికి వెళ్లి అతడు అక్కడ లేకుంటే ఫోన్‌లో మాట్లాడే ప్రయత్నం చేస్తారు. ఆ రోజు ఆ నేరస్తుడికి సంబంధించి సేకరించిన పూర్తి సమాచారాన్ని ట్యాబ్‌లో ఫీడ్ చేస్తారు. టెక్నాలజీ, టీఎస్‌కాప్స్ యాప్ విధానం అమల్లోకి రావడంతో నేరస్తులపై నిరంతరం నిఘా కొనసాగుతుంది. దీంతో నేరగాళ్లు బయటతిరుగేందుకు భయపడుతారని పోలీసు అధికారులు పేర్కొంటున్నారు. రాష్ట్రంలో ఎక్కడ నేరంచేసినా పోలీసులకు దొరికిపోతామన్న భయం నేరగాళ్లలో ఉన్నప్పుడే అవి తగ్గుముఖం పడతాయని చెప్తున్నారు.

హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లపై అనాసక్తి

- గుట్టలుగా పేరుకుపోతున్న నంబర్ ప్లేట్లు



హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: వాహనాలకు బిగించే హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు(హెచ్‌ఎస్‌ఆర్పీ) ఉద్దేశం నీరుగారిపోతున్నది. కొత్తగా కొనుగోలు చేసిన ప్రతి వాహనానికి హైసెక్యూరిటీ ప్లేట్ తప్పనిసరని సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలకు అనుగుణంగా వాహనాలకు హైసెక్యూరిటీ ప్లేట్లను బిగించాల్సి ఉన్నప్పటికీ చాలా వాహనాలు ఇవి లేకుండానే సంచరిస్తున్నాయి. దీంతో హైసెక్యూరిటీ ప్లేట్లు ఆర్టీఏ కార్యాలయాల్లో గుట్టలుగా పేరుకుపోతున్నాయి. రిజిస్ట్రేషన్ చేసుకుంటున్న వాహనాలన్నీ ఫ్యాన్సీ ప్లేట్లు బిగించుకుంటూ హెచ్‌ఎస్‌ఆర్పీ ప్లేట్లను నిర్లక్ష్యం చేస్తున్నాయి. దీనికి కారణాలను అన్వేషిస్తే హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు నాణ్యతగా లేకపోవడమేనని తెలుస్తున్నది. ఈ ప్లేట్‌లో పేర్కొన్న సెక్యూరిటీ ఫీచర్లు లేకపోవడం, బిగించుకున్న కొద్ది రోజులకే విరిగిపోతుండటం వంటి కారణాలతో వీటిపై నిర్లక్ష్యం చూపిస్తున్నారు. జూన్ 8, 2014 నుంచి రాష్ట్రంలో హైసెక్యూరిటీ ప్లేట్లు అందుబాటులోకిరాగా కొత్తలో వీటిని వాహనదారులు బిగించుకున్నారు. క్రమేపీ హెచ్‌ఎస్‌ఆర్పీ ప్లేట్లను బిగించుకుంటున్న వాహనదారుల సంఖ్య తగ్గుతూ వచ్చింది. ఇలా గ్రేటర్ పరిధిలోనే 55 వేల హైసెక్యూరిటీ ప్లేట్లు ఆర్టీఏ కార్యాలయాల్లోనే పేరుకుపోతున్నట్టు అధికారులు చెప్తున్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగనించిన జేటీసీ పాండురంగనాయక్ ఒక విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకొని అమలుచేస్తున్నారు. హైసెక్యూరిటీ ప్లేట్ బిగిస్తేనే రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్(ఆర్సీ) ఇవ్వాలని నిర్ణయించారు. విజయవంతంగా ఇది కొనసాగినప్పటికీ మధ్యలో కారణం లేకుండానే నిలిపివేశారు. దీనిపై కఠినంగా వ్యవహరించకపోవడంతో హైసెక్యూరిటీ ప్లేట్ల బిగించుకొనే వారి సంఖ్య తగ్గుతున్నది.

బిగించకపోతే ఏంటనేదానిపై స్పష్టత లేదు: పాండురంగనాయక్, జేటీసీ

హైటెక్‌సెక్యూరిటీ ప్లేట్ బిగించుకోకపోతే ఏమవుతుందనే అంశంపై ఎటువంటి స్పష్టత లేదు. మిగతా రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలోనే హెచ్‌ఎస్‌ఆర్పీ బిగింపు ప్రక్రియ విజయవంతంగా కొనసాగుతున్నది. నగరంలో హైసెక్యూరిటీ ప్లేట్ల బిగింపుపై కొంత అనాసక్తి ఉన్నప్పటికీ బిగించుకొనేవారి సంఖ్య కూడా భారీగానే ఉన్నది. నంబర్ ప్లేట్లు కార్యాలయాల్లో పేరుకుపోతున్న విషయం వాస్తవమే.

చిరుధాన్యాలతో మధ్యాహ్న భోజనం

15 రకాల ఆహార పదార్థాలతో అక్షయపాత్ర సరికొత్త ప్రాజెక్టు.. రాష్ట్రంలోని లక్ష మంది విద్యార్థులకు అందనున్న పౌష్టికాహారం

హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ: విద్యార్థుల్లో పోషకాల పెంపునకు అక్షయపాత్ర ఫౌండేషన్ తన వంతు ప్రయత్నం చేస్తున్నది. ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో గల 880 ప్రభుత్వ పాఠశాలల్లోని లక్ష మంది విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నది. ఈ భోజనంతోపాటు చిరుధాన్యాలతో కూడిన సరికొత్త పోషక ఆహారం అందించేందుకు అక్షయపాత్ర శ్రీకారం చుట్టింది. దీనిని గురువారం హైదరాబాద్ శివారు నార్సింగిలోని అక్షయపాత్ర వంటశాలలో అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈ చిరుధాన్యాల ఆహారం పదార్థాల ప్రారంభానికి డిప్యూటీ సీఎం కడియం శ్రీహరితోపాటు ఇక్రిశాట్, ఎన్‌ఐఎన్, యూనిసెఫ్ తదితర సంస్థల ప్రతినిధులు హాజరుకానున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సన్నకారు రైతులకు ఆదాయం..

అక్షయపాత్ర ప్రవేశపెట్టే చిరుధాన్యాల భోజనంతో సన్నకారు రైతులకు లబ్ధి చేకూరనున్నది. ఈ చిరుధాన్యాలను సన్నకారు రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తామని అక్షయపాత్ర నిర్వాహకులు పేర్కొంటున్నారు. దీంతో రైతుకు తగిన గిట్టుబాటు ధర లభిస్తుందని వివరించారు. మన పూర్వీకులకు చిరుధాన్యాలే నిజమైన ఆహారంగా ఉండేది. అందులో రాగి, జొన్న, సజ్జ, ఉలువలు తదితర పప్పు ధాన్యాలుండేవి. ప్రస్తుతం పట్టణీకరణలో గోధుమ, బియ్యం ప్రధానంగా మారాయన్నారు. వీటిలో తగిన స్థాయిలో పోషకాలు లేవని వైద్యులే స్పష్టం చేస్తున్నారు.



15 రకాల పదార్థాలు..

అక్షయపాత్ర ప్రారంభించే చిరుధాన్యాల భోజనంలో 15 రకాల పదార్థాలు ఉండనున్నట్టు నిర్వాహకులు స్పష్టంచేశారు. ఈ పదార్థాలను విద్యార్థులు ఆసక్తితో తినేలా తయారు చేయనున్నారు. వీటిలో స్వీట్స్, చిక్స్, బిస్కెట్స్, చుడ్వా, లడ్డు తదితర పదార్థాలు పెట్టనున్నట్టు వివరించారు.

ఆహారంలో పోషకాల వివరాలు..

పోషకాలు	గోధుమ	బియ్యం	చిరుధాన్యాలు
క్యాలరీలు	339	349	378
ప్రొటీన్ (గ్రా)	13.7	8.1	11.2
పిండిపదార్థాలు(గ్రా)	72.1	77.1	72.85
కొవ్వు (గ్రా)	1.87	0.6	4.2



లిటిల్ మిస్ ఇండియా!

మిస్ వరల్డ్ పోటీ అయిపోయింది. మిసెస్ ఇండియా కూడా పూర్తయింది. ఇప్పుడు లిటిల్ మిస్ ఇండియా-2017 పోటీలు కూడా ముగిశాయి.

అవెక్కడా అనుకుంటున్నారా? భువనేశ్వర్‌లో. కీట్ ఇంటర్నేషనల్ స్కూల్ ప్రతీయేటా నిర్వహించే ఈ అందాల పోటీల్లో మతి పోగొట్టే అందాలతో అమ్మాయిలు అలరించారు. 13-16 వయసున్న అమ్మాయిల కోసం జరిగిన ఈ పోటీల్లో హైదరాబాద్.. గౌహతి.. లక్నో.. కోల్‌కతా.. పాట్నా.. భువనేశ్వర్.. ముంబై.. బెంగళూరు.. శ్రీనగర్.. చెన్నైకి చెందిన అమ్మాయిలు పాల్గొన్నారు. రెండు రోజుల పాటు జరిగిన ఈ ఈవెంట్‌టో 30 మంది యువతులు పాల్గొన్నారు. కీట్ నన్షీపరి లిటిల్ మిస్ ఇండియా-2017 ఫైనల్ పోటీల్లో చెన్నైకి చెందిన జితా మోహపాత్ర ప్రథమ బహుమతి పొందగా.. పాట్నాకు చెందిన అనౌష్క సింగ్ ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నారు. ప్రథమ బహుమతి కింద రూ. 3 లక్షలు నగదు ప్రోత్సాహకం ఇవ్వగా.. ద్వితీయ బహుమతికి లక్షా యాభైవేల రూపాయల ప్రోత్సాహకం ఇచ్చారు.

34 రకాల పంటలు

ఈమె సేంద్రియ పద్ధతిలో 34 రకాల కూరగాయలు, ఇతర పంటలు పండిస్తున్నది. అదికూడా పొలంలో కాదు.. తన ఇంటి టెర్రాస్‌పై!!

వ్యవసాయం చేయడం, కూరగాయలు పండించడమంటే తలకు మించిన భారంగా కొందరు భావిస్తుంటే.. తనకు మాత్రం చాలా ఇష్టమంటున్నది జీవన. తమిళనాడులోని తిరుప్పూర్‌కు చెందిన జీవన మురళీధరన్ తన ఇంటి టెర్రాస్‌పై దాదాపు 34 రకాల కూరగాయలు, పండ్లు పండిస్తున్నది. ఈ కాలంలో కూరగాయలు పండించాలంటే.. చీడ పీడల నుంచి రక్షణ కల్పించేందుకు ఎన్నో పురుగుమందులు పిచికారీ చేయాలి. అవి తింటే మనకు అనారోగ్య సమస్యలు తప్పవు. అందుకే సేంద్రీయ పద్ధతిలో చాలామంది వ్యవసాయం చేస్తున్నారు. వారి బాటనే ఎంచుకున్నది 47 ఏళ్ల జీవన. ఈమె కుటుంబం రెండేళ్లుగా కేవలం సేంద్రీయ పద్ధతిలోనే పంటలు పండిస్తున్నారు. ఇంటి అవసరాలకు పోను.. డబ్బులు మిగులుతున్నాయని అంటున్నది జీవన. టెర్రాస్‌పైకి వస్తే మనసు చాలా ఆహ్లాదంగా ఉంటుందని కూడా చెబుతున్నది.



జిందగీ పేజీపై మీ అభిప్రాయాలు, సలహాలు తెలియజేయండి.
zindagi@ntdaily.news
www.ntzindagi.com
/nt.zindagi

కొత్త సంవత్సరంలో అంతా కొత్త కొత్తగా ఉంది కదూ.. రుచులు కూడా కొత్తవైతే ఇంకెంత బాగుంటుందో కదా! ఎప్పటిలాగే పాత చింతకాయ పచ్చళ్లను పక్కన పెట్టి.. ఇదిగో కొత్త రుచులతో ఆనందంగా ఉండండి.. ఈ సంవత్సరమంతా నిత్య నూతనంగా ఉండాలని కోరుకుంటూ.. కొత్త వంటలను పరిచయం చేస్తున్నాం..

కొత్త రుచులండీ!



బాదామీ కుస్ కీ టర్కీ మసాలా

కావాల్సినవి :

టర్కీ : 700 గ్రా. (బోన్‌లెస్), **కారం :** రెండు టీస్పూన్స్, **అల్లం, వెల్లుల్లి పేస్ట్ :** ఒక టీస్పూన్, **పెరుగు :** అర కేజీ, **బటర్ :** 175గ్రా., **బాదం :** 200 గ్రా. (ఉడికించినవి), **గసాల పేస్ట్ :** 100 గ్రా., **జీలకర్ర :** అర టీస్పూన్, **టమాటా ప్యూరీ :** అర కేజీ, **చక్కెర :** అర టీస్పూన్, **ఫ్రెష్ క్రీమ్ :** 100 గ్రా., **పచ్చిమిరపకాయలు :** ,4, **మెంతికూర :** చిన్న కట్ట, **ఉప్పు :** తగినంత



తయారీ :

టర్కీని చిన్న ముక్కలుగా కట్ చేసి కడిగి ఒక గిన్నెలో వేసుకోవాలి. మరొక గిన్నెలో కారం, అల్లం, వెల్లుల్లి పేస్ట్, ఉప్పు, పెరుగు వేసి బాగా కలుపాలి. దీంట్లో టర్కీ ముక్కలు వేసి రాత్రంతా ఫ్రిజ్‌లో పెట్టేయాలి. ఉదయం తీసి కాసేపు బయట ఉంచాలి. ఆ తర్వాత తందూర్‌లో కానీ ఓవెన్‌లో కానీ పది నిమిషాల పాటు కాల్చుకోవాలి. దాదాపు మూడు వంతులు కూర ఉడికి పోవాలన్న మాట. ఇలా అయిన టర్కీని పక్కన పెట్టుకోవాలి. మరొక గిన్నెని స్టౌ మీద పెట్టి బటర్ వేయాలి. ఇది కరిగాక జీలకర్ర, టమాటా ప్యూరీ, చక్కెర, కారం, ఉప్పు వేసి బాగా కలుపాలి. టమాటా నుంచి పచ్చి వాసన పోయేవరకు అలాగే కలుపుతుండాలి. ఆ తర్వాత టర్కీ ముక్కలను, ఫ్రెష్ క్రీమ్, పచ్చిమిర్చి, బాదం పేస్ట్, గసగసాల పేస్ట్, మెంతికూర వేసి మూత పెట్టేయాలి. పావు గంట పాటు సన్నని మంట మీద ఉంచి దించేయాలి. టేస్టీ కూర మీ ముందుంటుంది.

మొరకన్ చికెన్ తగిని



కావాల్సినవి :

చికెన్ లెగ్ పీస్‌లు : 6,
ఆలివ్ ఆయిల్ : 3 టేబుల్‌స్పూన్స్,
ఉల్లిపాయలు : 2, **వెల్లుల్లిపాయలు :** 3
అల్లం : చిన్న ముక్క,
కుంకుమపువ్వు : ఒక గ్రా.
మిరియాల పొడి : చిటికెడు ,
దాల్చిన చెక్క : చిన్న ముక్క,
జీలకర్రపొడి : 5 గ్రా.
నిమ్మరసం : అర టేబుల్‌స్పూన్
ఊరబెట్టిన నిమ్మకాయలు : 2
పార్స్లీ : 2 టేబుల్‌స్పూన్
కొత్తిమీర : చిన్న కట్ట
గ్రీన్ ఆలివ్స్ : 50 గ్రా.
చికెన్ స్టాక్ : 600 మి.లీ.
ఉప్పు : తగినంత

తయారీ :

ఒక లోతైన గిన్నెలో ఈ కూర చేయాల్సి ఉంటుంది. దీన్ని పొయ్యి మీద పెట్టి నూనె పోయాలి. ఉల్లిపాయ ముక్కలు, వెల్లుల్లిపాయలు, దాల్చిన చెక్క, కొద్దిగా ఉప్పు వేసి సన్నని మంట మీద కలుపుతుండాలి. దీంట్లో అల్లాన్ని చిన్న ముక్కలుగా కట్ చేసుకోవాలి. ఈలోపు నీళ్లలో కుంకుమ పువ్వు వేసి ఉంచాలి. ఈ మిశ్రమాన్ని కూరలో వేయాలి. ఇందులోనే దాల్చిన చెక్క, నిమ్మరసం, ఊరబెట్టిన నిమ్మకాయలు వేసి కలుపాలి. దీంట్లో పార్స్లీ, కొత్తిమీర వేయాలి. ఇవి కాస్త వేగాక చికెన్ ముక్కలు, ఆలివ్స్ వేసి కాసేపు కలుపాలి. ఆ తర్వాత చికెన్ స్టాక్, మిరియాల పొడి, ఉప్పు వేసి మూత పెట్టేయాలి. సన్నని మంట మీద 45 నిమిషాల పాటు ఉంచాలి. మిగిలిన కొత్తిమీరను పైన చల్లి దించేయాలి. వేడి వేడి కూర మీ నోరూరించక మానదు.

క్వినోవా పొంగల్



కావాల్సినవి :

క్వినోవా : అర కప్పు
ఆలివ్ ఆయిల్ : ఒక టేబుల్‌స్పూన్
పెసరపప్పు : అర కప్పు
జీలకర్ర : ఒక టీస్పూన్
అల్లం : చిన్న ముక్క
జీడిపప్పు : 10
కరివేపాకు : ఒక రెమ్మ
మిరియాల పొడి : ఒక టీస్పూన్
ఇంగువ : చిటికెడు
నెయ్యి : ఒక టీస్పూన్
ఉప్పు : తగినంత

తయారీ :

పెసరపప్పు, క్వినోవాని కడిగి పెట్టుకోవాలి. కుక్కర్‌లో ఆయిల్ పోసి అందులో పెసరపప్పు, క్వినోవా వేసి రెండు నిమిషాల పాటు వేయించాలి. ఆ తర్వాత మూడు కప్పుల నీళ్లు పోసి ఒకసారి కలిపి విజిల్ పెట్టేయాలి. ఐదు విజిల్స్ వచ్చే వరకు ఉడికించుకొని దించేయాలి. ఇప్పుడు కడాయిలో నెయ్యి వేసి జీలకర్ర, ఇంగువ, అల్లం, కరివేపాకు వేసి బాగా కలుపాలి. దీంట్లోనే జీడిపప్పులు, మిరియాల పొడి వేసి వేయించాలి. దీంట్లో ముందు ఉడికించిన క్వినోవా మిశ్రమం వేసి కలుపాలి. ఇందులో కొద్దిగా ఉప్పు వేసి మరో ఐదు నిమిషాలు ఉంచి దించేయాలి.

చికెన్ సౌవ్లాకి

కావాల్సినవి :

చికెన్ : 200 గ్రా., **ఆలివ్ ఆయిల్ :** 20 మి.లీ.
నిమ్మరసం : 5 మి.లీ., **కీరదోస :** 1 (చిన్నది)
టమాటా : 1, **ఉల్లిగడ్డ :** 1, **మిరియాల పొడి :** ఒక టీస్పూన్ , **పార్స్లీ :** 5 గ్రా., **పీతా బ్రెడ్ :** 2
సుమాక్ పౌడర్ : 5 గ్రా., **సీకులు :** 6



తయారీ :

ఒక గిన్నెలో చికెన్ ముక్కలు వేసి ఆలివ్ ఆయిల్, ఉప్పు, పార్స్లీ, మిరియాల పొడి, సుమాక్ పొడి వేసి బాగా కలుపాలి. కీరదోస, టమాటా, ఉల్లిగడ్డలను కలిపి మిక్సీ పట్టాలి. దీన్ని ముందు కలిపిన మిశ్రమంలో వేయాలి. వీటిలో చికెన్ ముక్కలు వేసి పక్కన పెట్టాలి. ఆ తర్వాత ఆ ముక్కలను సీకులకు గుచ్చి కడాయి మీద పెట్టి గ్రిల్ చేయాలి. దీంతో పీతా బ్రెడ్, సలాడ్, హుమ్మస్ మంచి కాంబినేషన్. కావాలనుకుంటే ఆ ముక్కలను అలాగే కూడా తినేయొచ్చు.



ఆనంద్ కుమార్
ఎగ్జిక్యూటివ్ చెఫ్
హయత్ హైదరాబాద్

బేక్డ్ యోగార్ట్



కావాల్సినవి :

పెరుగు : 100 మి.లీ., **ఫుల్ క్రీమ్ :** 100 మి.లీ.,**కండెన్స్‌డ్ మిల్క్ :** 100 మి.లీ. **చెర్రీ కాంపోట్ :** 10 గ్రా.

తయారీ :

ఒక గిన్నె తీసుకొని అందులో పెరుగు, క్రీమ్, కండెన్స్‌డ్ మిల్క్ పోసి బాగా కలుపాలి. ఎలాంటి బుడుగలు రాకుండా ఈ మిశ్రమాన్ని కలుపాల్సి ఉంటుంది. దీన్ని 120 డిగ్రీల సెల్సియస్ వద్ద 15 నిమిషాల పాటు ఓవెన్‌లో బేక్ చేయాలి. కలిపిన మిశ్రమం గడ్డలా మారితే పర్వాలేదు. ఒకవేళ అలా కాకపోతే మరో ఐదు నిమిషాల పాటు బేక్ చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఓవెన్‌లో నుంచి తీసి కాస్త చల్లారనివ్వాలి. ఇప్పుడు పై నుంచి చెర్రీ కాంపోట్ వేసి అందంగా గార్నిష్ చేసి సర్వ్ చేయాలి. రుచికరమైన బేక్డ్ యోగార్ట్ రెడీ!

సిరిముగ్గు

25 చుక్కలు సూటి 1 వచ్చే వరకు





వడ్ల మాధవి ప్రభు
హైదరాబాద్

మా చిరునామా:
సిరి ముగ్గు, నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9,
కృష్ణాపురం, బంజారాహిల్స్,
రోడ్ నెం - 10,
హైదరాబాద్ - 500034.
zindagi@ntdaily.news,
zindagi.nt@gmail.com

బిట్స్ కార్నర్

కండరాల్లో ఈ నొప్పి ఎందుకు?



అడుగండి చెబుతా

నా వయసు 34 సంవత్సరాలు. లెక్చరర్ ఉద్యోగం చేస్తున్నాను. బస్సులో రోజుకు రెండు, మూడు గంటల ప్రయాణం చేస్తుంటాను. గడిచిన నాలుగైదు వారాల నుంచి హఠాత్తుగా కాలి పిక్కల కండరాలు బిగుసుకు పోతున్నాయి. విపరీతమైన నొప్పి కూడా వస్తున్నది. ఒక్కోసారి క్లాసునలోనే ఇలా జరుగుతున్నది. విపరీతమైన ఇబ్బంది ఎదుర్కోవాల్సి వస్తున్నది. ఇలా జరుగడానికి కారణం ఏమిటి? దీనికి ఏదైనా మంచి పరిష్కారం సూచించగలరు.

నీలిమ, మంచిర్యాల

బస్‌లో గంటల తరబడి కూర్చోవడం, క్లాస్‌లో నిలబడి ఉండడం వల్ల మీ కాలి కండరాల మీద తీవ్రమైన ఒత్తిడి పడుతున్నది. నిద్ర, విశ్రాంతి వల్ల కండరాలు కోలుకొని సాధారణ స్థితికి చేరుకుంటాయి. అయితే సరిపడే నిద్ర ఆహారంలో పోషకాలు లోపించడం వల్ల ఈ ప్రక్రియ సరిగా జరుగదు. కండరాలు బాగా అలసిపోవడం వల్ల బిగుసుకుపోతాయి. తరుచుగా కండర సంకోచాలు ఏర్పడడం వల్ల దీని తాలూకు నొప్పి రోజువారీ కార్యకలాపాలకు ఆటంకం కలిగిస్తుంది. నిద్రలో కండరాలు బిగుసుకుపోతే ఆ నొప్పికి వెంటనే మేలుకొంటారు. లక్షణాలను బట్టి చూస్తే మీరు మజిల్ క్రాంప్స్ రుగ్మతతో బాధపడుతున్నట్లు తెలుస్తున్నది.

వృత్తి, వయసుతో ప్రమేయం లేకుండా ఉన్నట్టుండి కండరాలు సంకోచిస్తాయి. వృత్తి, వయసుతో సంబంధం లేకుండా ఎవరికైనా ఈ విధంగా జరుగవచ్చు. విపరీతమైన అలసట, డిహైడ్రేషన్, కొన్ని మందుల వాడకం వంటి కారణాల వల్ల మజిల్ క్రాంప్స్ రావచ్చు. మజిల్ క్రాంప్స్ రావడానికి ప్రత్యేక కారణం ఏమీ ఉండకపోవచ్చు. కండరాలు విపరీతంగా అలసిపోవడం, వ్యాయామానికి ముందు తగినంతగా స్ట్రెచ్ చేయకపోవడం రక్తంలో ఎలక్ట్రోలైట్స్ పరిమాణం తగ్గిపోవడం వల్ల ఇలా జరుగుతుంది.

పోషకాహారం తీసుకోవడం, తగినంత వ్యాయామం, విశ్రాంతి, వ్యాయామం ప్రారంభించడానికి ముందు స్ట్రెచ్చింగ్ వంటి జాగ్రత్తలు తీసుకుంటే మజిల్ క్రాంప్స్‌ను నివారించడానికి అవకాశం ఉంటుంది.

కండరాలు బిగుసుకుపోయినపుడు ఆ భాగంలో నెమ్మదిగా మర్ధనా చెయ్యాలి. ఎలక్ట్రోలైట్స్ కలిపిన మంచి నీళ్లు లేదా పళ్లరసాల్ని తీసుకోవాలి. తరుచుగా మజిల్ క్రాంప్స్ వస్తూ ప్రథమచికిత్సతో ఎలాంటి ఉపశమనం లభించకపోతే వెంటనే డాక్టర్‌ను సంప్రదించడం మంచిది. ఒక్కోసారి ఇంటర్మినెంట్ క్లాడకేషన్ అనే ప్రమాదకర స్థితి వల్ల కావచ్చు. ఇది కాళ్లలో రక్తప్రసరణ తగ్గిపోతుందనడానికి సూచన కావచ్చు.



డాక్టర్ దేవేందర్ సింగ్
సీనియర్ వాస్క్యులార్ అండ్ ఎండో వాస్క్యులార్ సర్జన్, యశోద హాస్పిటల్ సోమాజిగూడ, హైదరాబాద్.

యవ్వనంగా కనిపించాలా?



- ఒక గిన్నెలో రెండు టీస్పూన్ల చాక్లెట్ ద్రవం, ఒక ఎగ్ వైట్‌ను కలిపి ముఖానికి రాసుకోవాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా వారానికి ఒకసారి చేయాలి.
- ఒక టేబుల్ స్పూన్ ఆలివ్ ఆయిల్, టీ స్పూన్ చాక్లెట్ ద్రవాన్ని బాగా కలిపి ముఖానికి రాసుకోవాలి. 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఇలా నెలలో రెండుసార్లు చేయాలి.
- టీ స్పూన్ చాక్లెట్ ద్రవం, టీ స్పూన్ రోజ్‌వాటర్ కలిపి ముఖానికి సున్నితంగా రాయాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి.
- బాగా పండిన అరటిపండు గుజ్జు, రెండు స్పూన్ల చాక్లెట్ ద్రవాన్ని కలుపాలి. దీనిని ముఖంపై పలుచని పొరలా రాయాలి. 15 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో కడుగాలి. ఇలా వారానికి రెండుసార్లు చేయాలి.

నమస్తే తెలంగాణ
విందు
[హైదరాబాద్]
గురువారం 4 జనవరి 2018
[హైదరాబాద్]
బుధవారం 6 డిసెంబర్ 2017



అక్కినేని వారి ఇంటి వారసుడిగా వచ్చిన సుమంత్‌కి ఈ మధ్యే 'మళ్లీ రావా' అంటూ సక్సెస్ ట్రాక్‌నెక్కి ఫామ్‌లోకొచ్చాడు. తన నటనలో ఈజ్ ఏ మాత్రం తగ్గలేదని చెబుతున్న ఆ నటుడి ఆహారపు అలవాట్లేంటో తెలుసా?

టమాటా పప్పుతో బతికేస్తా!

నాకు డిఫరెంట్ సినిమాలు చేయడం సరదా. అలాగే కొత్త కొత్త వంటకాలను రుచి చూడడం కూడా సరదానే! ఇంకా చెప్పాలంటే నేను ఆహార ప్రియుడిని. కనిపించినవన్నీ లాగించేస్తా. మీకో అనుమానం రావొచ్చు. అలా తిన్నవాడిని ఇలా ఎలా ఉంటాననే కదా! దానికి తగ్గట్టు వ్యాయామాలు చేసేస్తుంటా లెండి. అది పక్కన పెట్టేద్దాం. ముందుగా నా ఫుడ్ గురించి మాట్లాడుకుందాం. 70 శాతం ఇంట్లో చేసిన వాటికే నా ఓటు. ఇక 30 శాతం బయట ఫుడ్‌కి. ఇంట్లో కొంచెం కారంగా చేసే టమాటా పప్పు అంటే చాలా ఇష్టం. అది తింటుంటే.. దాంతో ఇక జీవితకాలం బతికేస్తా అనిపిస్తుంటుంది. ఇక హైదరాబాద్‌లో తినడానికి మనకు చాలా ఆప్షన్స్ ఉన్నాయి. నాకు మాత్రం అజిజా బిర్యానీ అంటే చాలా ఇష్టం. ఓల్డ్ సిటీలో అజిజా అనే ఆవిడ చేసే బిర్యానీ చాలా ఫేమస్. కావాలనుకుంటే అది తెప్పించుకుంటా. ఫారిన్‌కి వెళితే మాత్రం డిఫరెంట్ నాన్‌వెజ్ ఐటమ్స్‌ని ట్రై చేస్తా. ఇక నాకు బతుకడానికి వంట చేయడం తెలుసు. యూఎస్‌లో ఉన్నప్పుడు నేనే చేసుకునేవాడిని. ఇప్పుడు ప్రాక్టీస్ తప్పిందనుకోండి. కాకపోతే అపద్ధర్మానికి అప్పుడప్పుడు ఏదో అలా కానిచ్చేస్తా.

పోపులపెట్టె


ధనాధన్ ధనియాలు..



ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు డాక్టర్ దగ్గరికి, మెడికల్ షాపునకు పరుగులు తీస్తాం. కానీ ఆ అవసరం లేకుండా ఓసారి వంటింట్లోకి వెళ్లి పోపుల పెట్టె తెరిస్తే ఎన్నో జబ్బులకు మందులు దొరుకుతాయి. మీ పోపులపెట్టెలో ధనియాలు ఉన్నాయా? వాటి వల్ల చాలా ఆరోగ్య లాభాలున్నాయి. వాటిలో కొన్ని ఈరోజు మీకోసం..

- ధనియాల కషాయం తరచూ తాగుతుంటే ఒంట్లోని వేడి తగ్గుతుంది.
- జలుబు, జ్వరం, దగ్గు, ఆయాసం, విరేచనాలకు ధనియాల కషాయం అద్భుతంగా పనిచేస్తుంది. కడుపులోని నట్టలను నివారిస్తుంది.
- మధుమేహానికి ధనియాలు మంచి ఔషధం. రోజుకు రెండుపూటల ధనియాల రసం తాగితే మార్పు కనిపిస్తుంది.
- కొలెస్ట్రాల్ నివారించడంలో ధనియాలు బాగా పనిచేస్తాయి. బాగా మరిగించిన నీటిలో ధనియాలపొడి కలిపి వడబోసి తాగాలి.
- నిద్రలేమితో బాధపడేవారికి ధనియాలు మంచి పరిష్కారం. వేడివేడి పాలల్లో చక్కెర, ధనియాల పొడి కలిపి తాగితే నిద్ర బాగా పడుతుంది.
- జుట్టురాలే సమస్యతో బాధపడుతున్నవారికి ధనియాలు మంచి ఔషధం. రెగ్యులర్‌గా ధనియాల కషాయం తాగితే జుట్టు రాలడం తగ్గుముఖం పడుతుంది.
- యాగ్జిమా, పొక్కులు, దురదలు, ఇతర చర్మ సమస్యలకు ధనియాల పొడి మందులా పనిచేస్తుంది. లేదంటే సమస్య తగ్గే వరకు ధనియాల కషాయం తీసుకున్నా గుణం కనిపిస్తుంది.
- ఆర్థరైటిస్‌తో బాధపడేవారు ఓ టీస్పూన్ ధనియాల పొడి, రెండు టీస్పూన్ల చక్కెరతో కలిపి ముద్దలా రోజుకు రెండుసార్లు తీసుకుంటే ఫలితం ఉంటుంది.

బుల్లెట్ బార్బీక్యూ!



రెస్టారెంట్ అంటే ఓ భవనం డైనింగ్ టేబుళ్లు, పదిమంది ఉద్యోగులు డెకరేషన్, పార్కింగ్ హడావిడి ఇలా అన్ని ఉండాలి. కానీ ఏ హంగులు, ఆర్భాటాలు లేని రెస్టారెంట్ ఇది. హైదరాబాద్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న బుల్లెట్ బార్బీక్యూ రివ్యూ.

బండి మీద పండ్లు, కూరగాయలు అమ్మడం చూసే ఉంటారు. బండిమీద ఇనుప సామాన్ల వ్యాపారం చేసే వారినీ చూసే ఉంటారు. బండి మీద ఓ రెస్టారెంట్ నడుపుతుంటే చూశారా?

మొన్నటివరకు ఫుడ్‌ట్రక్స్ అంటూ రోడ్ల మీద ఆటోల్లో, వ్యాన్‌లలో రెస్టారెంట్ చక్కర్లు కొట్టాయి. కాలం మారుతుంది. అవి కూడా పాతవయ్యాయి. ఇప్పుడు బైక్ మీద రెస్టారెంట్లు రయ్యిమంటూ దూసుకెళ్తున్నాయి.

హైదరాబాద్‌కు చెందిన అరుణ్ వర్మ, కృష్ణ వర్మలు బుల్లెట్‌పై బార్బీక్యూ సెటప్ చేసి బుల్లెట్ బార్బీక్యూ తయారు చేయించారు. ద్విచక్ర వాహనం మీద ఫుడ్ బిజినెస్ స్థాపించాలనే కొత్త ఐడియా చాలామందిని ఆకట్టుకుంటున్నది. దీనిపేరు 'బీబీక్యూ రైడ్'. బెంగళూరులో మొదట దీన్ని స్థాపించారు. కేవలం సాయంత్రం పూట మాత్రమే తెరుస్తారు. దీన్నే మొబైల్ బార్బీక్యూ అని కూడా అంటారు. దీన్ని తయారు చేయించడానికి మూడు నెలలు పట్టింది. బార్బీక్యూ మొత్తం బొగ్గుతో నిప్పులు వేసి వాటి మీద చికెన్ ముక్కలను కాలుస్తారు. పక్కన ఐదు కిలోల సిలిండర్ కూడా ఉంటుంది. రోజు వాడడానికి అయ్యే సామాన్లు వెయ్యడానికి స్టోరేజ్ కెపాసిటీ ఉంటుంది.
ముఖ్యంగా ఇక్కడ చికెన్ డ్రమ్‌స్టిక్స్, చికెన్ వింగ్స్ తప్పకుండా రుచి చూడాల్సిందే. ప్రతి ఒక్కరు ఒక్కసారైనా వచ్చి రుచి చూడాలంటున్నాడు. ధరలు కూడా వంద రూపాయలకు నాలుగు డ్రమ్ స్టిక్స్. ఐడియా అదిరింది. రుచి మంచిగున్నది. ఇంకేం వ్యాపారం మూడు వింగ్స్, ఆరు డ్రమ్‌స్టిక్స్‌లా నడుస్తున్నది. పదహారు వారాలు తిరుగక ముందే ఒకటి పోయి మూడు బుల్లెట్స్ అయ్యాయి. హైదరాబాద్ నుంచి బెంగళూరులో బీబీఎం చదువడానికి వెళ్లిన వీళ్లు సరదాగా ఈ స్టార్టప్ మొదలుపెట్టారు. ఇప్పుడు దేశ వ్యాప్తంగా మొత్తం 28 బీబీక్యూ రైడ్స్ ఉన్నాయి. ఈ ఏడాది చివరికల్లా వీటి సంఖ్య రెట్టింపు చేయాలనే ఆలోచనలో ఉన్నారు.
ఫుడ్ విషయానికొస్తే.. చికెన్‌తో పాటు వెజ్‌కూడా అందుబాటులో ఉంటుంది. గ్రిల్డ్ పైనాపిల్, గ్రిల్డ్ పన్నీర్ క్యాప్సికమ్ దొరుకుతాయి. ప్రస్తుతం నగరంలోని గచ్చిబౌలి, కూకట్‌పల్లిలో రెండు బీబీక్యూ రైడ్‌లున్నాయి. త్వరలో మరిన్ని బ్రాంచ్‌లు తెరువాలనుకుంటున్నారు. తక్కువ పెట్టుబడితో పాటు వ్యాపారం బాగా నడుస్తుండడంతో చాలామంది కన్ను ఈ వ్యాపారం మీద పడింది. అమెరికా, లండన్‌లలో కూడా ఇలాంటి వాటిని స్థాపించాలని వీళ్లకు ఆర్జిలు పెట్టుకుంటున్నారు. అంతేకాదు ఫ్రాంచైజీలు ఇవ్వాలని రిక్వెస్టులు పెడుతున్నారు. ఫ్రాంచైజీలు విషయం పక్కన పెడితే క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో కాంప్రమైజ్ అయ్యే ప్రసక్తే లేదంటున్నారు. ఇక్కడి చెఫ్‌లు.







గతేడాది వంటకాలు!

గతేడాది చూస్తే కొన్ని వంటకాలు వార్తల్లోకెక్కాయి. రికార్డులు సాధించాయి. ప్రపంచానికి భారతదేశ వంటకాల ఘనత తెలిసింది కూడా గడిచిన సంవత్సరమే! మరి అలా వార్తల్లో నిలిచిన వంటకాల మననం చేసుకుందాం. కొత్త సంవత్సరంలో మరిన్ని రుచులు ఇలా ప్రపంచ ప్రఖ్యాతి పొందాలని ఆశిద్దాం.

కిచిడీ రికార్డ్..



అన్నం, కొత్తిమీర, కొన్ని మసాలాలా మేళవింపులతో కిచిడీ అందరికీ ఫేవరెట్ అనడంలో అతిశయోక్తి లేదేమో! భారతదేశంలో నెలలో కనీసం ఒకరోజైనా ప్రతి ఒక్కరి ఇంట్లో ఇది దర్శనమిస్తుంది. ఆ వంటకం ఇప్పుడు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లోనూ స్థానం సంపాదించింది. సెలబ్రిటీ చెఫ్ సంజీవ్ కపూర్, 50మంది సహకారంతో 1000 లీటర్ల కడాయిలో 918 కిలోల కిచిడీని తయారు చేయించాడు. దాన్ని అక్షయ పాత్ర ఫౌండేషన్ గురుద్వారాలో 60వేల మందికి పంచి పెట్టారు. తిన్న వాళ్లంతా 'ఆహా.. ఓహో..' అంటూ వెయ్యినోళ్ల పొగిడారు. అయితే ఆ తర్వాత ఇది మన నేషనల్ ఫుడ్‌గా పరిగణించాలని ఎవరో పుకారు సృష్టించారు. సోషల్ మీడియాలో కూడా ఈ వంటకం బాగా నానిపోయింది.

బిర్యానీ గీతం..



ఇంట్లో వంట చేయలేదు. ఆకలిగా ఉంది. ముందుగా ఆర్డర్ చేసేది బిర్యానీనే! ఆ పేరు వింటుంటేనే అందరి నోళ్లలో నీళ్లు ఊరుతుంటాయి. గత సంవత్సరంలో స్విగ్గీ ద్వారా అధికంగా ఆర్డర్ చేసిన వంటకం బిర్యానీనంట. హైదరాబాద్ ట్రేడ్ మార్క్ వంటకమైన బిర్యానీ పోస్టల్ వాళ్లు స్టాంప్‌ని కూడా విడుదల చేసింది గతేడాదే! అలాగే ఈ బిర్యానీపై ఒక పాట కట్టి మరీ యూట్యూబ్‌లో సంచలనం సృష్టించారు హైదరాబాదీ ఫ్యాన్స్. అహ్మద్ షరీఫ్, ప్రవీణ్‌కుమార్, సంజయ్ అనే ముగ్గురు కలిసి 'బిర్యానీ ఆంథమ్' పేరిట ఒక వీడియోని రూపొందించారు. ఇది 'షేప్ ఆఫ్ యూ'కి పేరడీ సాంగ్. ఈ పాటని అప్‌లోడ్ చేసిన 24గంటల్లో 2మిలియన్ వ్యూస్ వచ్చాయంటే బిర్యానీకి ఉన్న పవర్ ఏంటో అర్థమైపోతున్నది కదూ!

ప్రపంచవ్యాప్తమయింది..



ఈ వంటకానికి చోలే బటూరీ అని పంజాబ్‌లో పేరు. బీహార్‌లో మాత్రం లిట్టీ చోకా అంటారు. ఈ బిహారీ వంటకం ఇప్పుడు వరల్డ్ ఫేమస్ అయింది. సినీనటుడు ఆమిర్ ఖాన్‌కి కూడా ఈ వంటకం ఫేవరెట్ అని చాలా సందర్భాల్లో చెప్పాడు కూడా. ఈ వంటకం గతేడాది మనీలాలో జరిగిన ఇంటర్నేషనల్ ఫుడ్ ఫెస్టివల్‌లో స్ట్రీట్ ఫుడ్ క్యాటగిరీలో ఇతర దేశాల వంటకాలకు గట్టి పోటీనిచ్చింది. ఈ వంటకం ఎలాంటి అవార్డులు గెలుచుకోక పోయినా చాలామంది నోళ్లను మాత్రం ఊరించిందనే చెప్పాలి. మరొక ఫుడ్ ఫెస్టివల్‌లో కూడా లిట్టీ చోకా ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

తీపి యుద్ధం..



కొన్ని వంటకాలు ఎప్పుడు, ఎలా పుట్టాయో ఎవ్వరమూ చెప్పలేం. అలా రసగుల్లా గురించి ఒక యుద్ధమే జరిగింది. పశ్చిమ బెంగాల్, ఒడిశా రెండు రాష్ట్రాలు తమ వంటకమని కొట్లాటకు దిగాయి. 1860లో కోల్‌కత్తాకి చెందిన నోబిన్ చంద్ర దాస్ అనే వ్యక్తి ఈ రసగుల్లాలు తయారు చేశాడని ఒక పిటీషన్ వేశారు. ఇక ఒడిశా ప్రభుత్వం 13వ శతాబ్దంలోనే పూరీలో రసగుల్లాలు చేసేవారని పేర్కొన్నారు. ఈ యుద్ధం అలా నవంబర్ 14, 2017లో ఈ యుద్ధానికి తెరపడింది. రసగుల్లాకి జియోగ్రాఫికల్ ఐడింటిఫికేషన్ (జీఐ)ప్రకటించారు.



కొవ్వు గురించి తెలుసా!

మన కాలేయం శరీరంలో ఏదో ఒక భాగం నుంచి రోజుకు 1-2 గ్రాముల కొవ్వు ఉత్పత్తి చేస్తుందని మీకు తెలుసా? అయితే ఈ ఉత్పత్తి అధికంగా కొవ్వు లభించే పదార్థాలు తిన్నప్పుడు కాలేయం కొవ్వు ఉత్పత్తి చేయడం ఆపేస్తుంది. కొవ్వు గురించి ఇంకా కొన్ని ముచ్చట్లు..

- కొవ్వులో హెచ్‌డీఎల్, ఎల్‌డీఎల్ అని రెండు రకాలుంటాయి. నిజానికి ఇవి కొవ్వు కణాలు కాదు. చుట్టుకుపోయిన ప్రొటీన్ కణాలు.
- హెచ్‌డీఎల్ కొవ్వు కణాల్లో ప్రొటీన్లు, కొవ్వు కలిసిపోయి ఉంటాయి. ఇది శరీరానికి మేలు చేసే మంచి కొవ్వు. శరీరంలో పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్‌ను కరిగిస్తుంది.
- ఎల్‌డీఎల్ అనబడే కొవ్వు చెడు కొవ్వు నిల్వల్లో ఉంటుంది. ఈ కొవ్వు కణాలు కాలేయం, ఇతర శరీర భాగాలకు కొవ్వు చేరవేస్తుంది.
- వీటితో పాటు ట్రైగ్లిజరైడ్స్ అనే కొవ్వు కణాలు కూడా శరీరంలో ఉంటాయి. ఇవి అందులో ఉండే కామన్ కొవ్వు కణాలు. ఈ కొవ్వు కణాలు శరీరానికి శక్తినిస్తాయి.
- అధికంగా ట్రైగ్లిజరైడ్స్ తక్కువ మోతాదులో హెచ్‌డీఎల్ కొవ్వు కణాలతో కలిసినా, అధిక ఎల్‌డీఎల్ కొవ్వుకణాలతో కలిసినా గుండెకు ప్రమాదం. కావున ఈ మూడు కొవ్వు కణాలు ఉండాల్సిన మోతాదులో ఉండేలా చూసుకోవాలి.
- తక్కువ కొవ్వు కణాలుండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. ఇది కూరగాయలు, పండ్లలో లభిస్తుంది.
- ప్రతిరోజూ కనీసం ఒక కప్పు అన్నీ ధాన్యాలతో వండిన ఆహారం తీసుకోవాలి. ఇలా చేస్తే 15 నుంచి 25 శాతం అధిక కొవ్వు కారణంగా చనిపోయే ప్రమాద తగ్గించవచ్చు.
- ప్రతిరోజూ పావుకప్పు నట్స్ తినండి. వీటిలో కొవ్వు కణాల కంటే ప్రొటీన్లు ఎక్కువగా ఉంటాయి.
- రోజుకు కనీసం గంటసేపైనా వ్యాయామం చేస్తే శరీరంలో పేరుకుపోయిన అధిక కొవ్వు కరిగిపోతుంది.
- ఆల్కహాల్, సిగరెట్ లాంటి వాటికి దూరంగా ఉండండి. మాంసం కూడా తగు మోతాదులో తింటే సరి. ఇలా చేస్తే కొవ్వు ద్వారా ఎదురయ్యే అనేక ఆరోగ్య సమస్యలకు చెక్ పెట్టవచ్చు.



డాక్టర్ మయూరి ఆవుల
న్యూట్రిషియనిస్ట్
mayuri.trudiet@gmail.com

సుడోకు

డైలీ సుడోకు 89 సమాధానం

3	2	7	8	9	4	5	1	6
4	5	1	2	6	7	8	9	3
6	8	9	3	5	1	4	7	2
9	1	2	7	4	6	3	5	8
7	4	8	1	3	5	2	6	9
5	3	6	9	8	2	7	4	1
2	7	4	6	1	8	9	3	5
8	6	3	5	7	9	1	2	4
1	9	5	4	2	3	6	8	7


డైలీ సుడోకు -90

6		5	1			8		
					7			
		9					6	1
7	5				3			
4		3				5		8
			4				1	2
3	9					7		
			9					
		4			8	9		5

1. నిలువుగా, అడ్డంగా ప్రతివరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.


సమాధానం రేపటి సంచికలో

ట్వీట్



కేప్‌టౌన్ ఒక అందమైన ప్రదేశం. ఆ అందమైన ప్రదేశంలో అత్యద్భుతమైన నా జీవిత సహచరితో...

విరాట్ కోహ్లీ
@imVkohli



కోహ్లీని ట్విట్టర్‌లో ఫాలో అవుతున్న వారి సంఖ్య

22,089,342

కామన్‌మ్యాన్ వాయిస్

కోదండరాం సార్ పరిణితి చెందిన నాయకుడు అనుకున్న. కానీ కరెంట్ విషయంలో ఆయన మాట్లాడిన మాటలు.. రేవంత్‌రెడ్డి కంటే హీనంగా దిగజారినవి!
–Saith Reddy

భూగర్భ జలాల మీద ప్రేమ ఉంటే నీ ఇంట్ల 24x7 నల్లా బందు పెట్టు. ఇంటి మీద ట్యాంకు తీసెయి. గోలెంల, ప్లాస్టిక్ డ్రమ్ముల నీళ్లు నింపి వాడుకో!
–Shailesh Reddy

మన కథలు పైన బ్రహ్మ రాశాడు అంటే నేను నమ్ముతాను. కాకపోతే.. మన అందరి కథలు ఒకేలా రాశాడు. పుట్టడం, చావడం. మధ్యలో మనల్నే రాసుకొమ్మని వదిలేసాడు. అందుకే శోధించి, సాధనచేసి సాధించాలి.
–Sanjay Karlapudi

వైరల్ వీడియో



షారుఖ్ ఖాన్ మరో ప్రయోగాత్మక సినిమాతో మళ్లీ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. 'జీరో' తో అలరించనున్నాడు. ఈ సినిమా టైటిల్ అనౌన్స్‌మెంట్ వీడియో యూట్యూబ్‌లో ట్రెండింగ్ అవుతున్నది.

Zero | Title Announcement | Shah Rukh Khan | Aanand L Rai | Anushka Sharma | Katrina Kaif | 21 Dec18

Total views : 7,843,823+

Published on Jan 1, 2018

నమస్తే తెలంగాణ
రైతుబడి
హైదరాబాద్
గురువారం జనవరి 2018

కలాంచే అందించే కలర్ పూలు

సూర్యరశ్మి పుష్కలంగా లభించే ఇండ్లలో అందాన్ని ఇనుమడింపజేసే మొక్క 'కలాంచే'. ఇందులో వందకు పైగా రకాలున్నాయి. అయితే కొన్ని రంగుల మొక్కలు మాత్రమే సాగులో ఉన్నాయి. ఉష్ణ ప్రాంతాల్లో ఇవి బాగా పెరుగుతాయి. ఆకుల ఆకారం, రంగు పూల కోసం ఎక్కువగా వీటిని పెంచుతారు. ఎరుపు, గులాబీ, పసుపు, తెలుపు రంగుల్లో మొక్కలు లభిస్తాయి. ఈ చలికాలంలో జాగ్రత్తలు తీసుకుంటే ఏడాదంతా మంచి పెరుగుదల ఉంటుంది.

పెంచే విధానం: కాంతి: సూర్యరశ్మి తీవ్రత ఎక్కువగా ఉండాలి. ఎండాకాలంలో బాగా పెరుగుతుంది. రక్షణగా కిటికీలలో చలికాలంలో పెంచితే సూర్యరశ్మి లభిస్తుంది.



నీరు: ఎండాకాలంలో ఒక మోతాదులో నీరు అవసరం ఉంటుంది. చలికాలంలో నీళ్లు తగ్గించాలి. సాధ్యమైనంత వరకు నీటిని అందించకుంటే ఒత్తిడితో కొత్త ఆకులు వస్తాయి.

ఉష్ణోగ్రత: వేడి వాతావరణం కావాలి. 22 డిగ్రీల సెల్సియస్ కంటే ఎక్కువే ఉష్ణోగ్రత అవసరం ఉంటుంది.

మృత్తిక: సాధారణంగా వాడే కుండీ మట్టి సరిపోతుంది. నెమ్మదిగా విడుదలయ్యే ద్రవ ఎరువులు లేదా ఎరువులను రెండు వారాలకు ఒకసారి అందించాలి.

ప్రవర్ధనం: ఆకుల చివర్ల నుంచి పలు కలాంచే మొక్కల పిలుకలు వస్తాయి. వాటిని విడిగా కుండీల్లో పెట్టి పెంచుకోవచ్చు. ఆకుల కత్తిరింపులు, ఆకుల చివర్లతో ప్రవర్ధనం చేపట్టవచ్చు.

కలాంచే మొక్కలు సులభంగానే ఇండ్లలో అలంకారం మొక్కగా పెంచుకోవచ్చు. ప్రధానంగా రంగుల పూల కోసం పెంచుతారు. పూలు వచ్చిన తర్వాత చాలమంది మొక్కలు తీసివేస్తారు. కానీ అది సరికాదు. పూకాండాన్ని తొలిగించి మొక్కకు విశ్రాంతినివ్వాలి. నీటిని తగ్గిస్తే సాధారనంగా బతుకుతుంది. నిజానికి ఎండాకలంలో ఈ మొక్క పూస్తుంది. అయితే శిక్షణతో ఏడాది అంతా పూసే రకాలు అందుబాటులోకి వచ్చాయి. వేలాడదీసే హ్యాగింగ్ బుట్టలలో కూడా ఆకర్షణీయంగా పెంచుకోవచ్చు.

సూరం సింధూజ
పరిశోధక విద్యార్థిని
ఉద్యాన విశ్వవిద్యాలయం, రాజేంద్రనగర్

దుంప కూరగాయలలో విత్తనోత్పత్తి



రాష్ట్రంలో, ఇతర రాష్ట్రాల్లో శీతాకాలంలో ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్న దుంప కూరగాయలు క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్. వీటిల్లో సూటిరకాలు ఎక్కువ విస్తీర్ణంలో సాగవుతున్నాయి. విత్తన సమస్య ఎక్కువే. అందుకే రైతులే స్వయంగా తమస్థాయిలో వీటిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. సులభం కూడా. వీటిలో క్యారెట్, ముల్లంగి, బీట్‌రూట్ మూడూ పరపరాగ సంపర్కం చెందే పంటలే. కల్తీల ఏరివేత, వేర్పాటుదూరంతో విత్తన నాణ్యత సాధ్యమవుతుంది.

రాష్ట్రంలో వాణిజ్యంగా ముల్లంగి, క్యారెట్‌లను రైతులు సాగుచేస్తున్నారు. వీటిలో వాతావరణ అవసరాలను బట్టి రెండు రకాలున్నాయి. మొదటిది శీతల రకాలు లేదా యూరోపియన్ రకాలు. రెండోది ఉష్ణరకాలు. లేదా ఆసియాటిక్ రకాలు. శీతల రకాల విత్తనోత్పత్తి కొండ ప్రాంతాల్లో, ఉష్ణరకాల విత్తనోత్పత్తి మైదాన ప్రాంతాల్లో చేపడితే విత్తన నాణ్యత పెరుగుతుంది.

విత్తనోత్పత్తికి అనుకూల రకాలు:

ముల్లంగి: ఆసియాటిక్ రకాలు: కాశి శ్వేత, కాశి హ్యాన్స్, పూసా చట్కి, పూసా రశ్మి, జపనీస్ వైట్, కళ్యాణ్‌పూర్ నెం.1, కో–1, అర్కనిశాన్, చైనీస్ పింక్.

యూరోపియన్ రకాలు: వైట్ ఐసికుల్, పూసా హిమాని,స్కార్‌లెట్ గ్లోబ్.

క్యారట్

ఆసియాటిక్ రకాలు: పూసా కేసర్, పూసా మేఘాలి,

ఐరోపా రకాలు: ఎర్లీ నాన్‌టెస్, బౌంటెనీ, జెనో, పూసా యమదగ్ని

టర్నిప్

ఆసియాటిక్ రకాలు: పూసా కాంచన్, పూసా శ్వేత, పంజాబ్ సఫేద్

ఐరోపా రకాలు: పూసా స్వర్ణిమ, పూసా చంద్రిమ,గోల్డెన్ బార్, స్నోబాల్

బీట్‌రూట్:

కేవలం ఐరోపా రకాలే ఉన్నాయి. డెట్రాయిట్ డార్క్‌రెడ్, క్రింసన్ గ్లోబ్, ఈజిప్షియన్, ఎర్లీ వండర్స్

విత్తే సమయం: (మైదాన ప్రాంతాలలో)

క్యారెట్: సెప్టెంబర్ చివరి నుంచి అక్టోబర్ రెండో వారం వరకు

ముల్లంగి: (ఆసియాటిక్ రకాలు)

విత్తన మోతాదు, విత్తే దూరం, ఎరువులు

ముల్లంగి: హెక్టారుకు 8–10 కిలోలు వాడాలి. వరుసల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 8 సెం.మీ దూరం పాటించాలి. హెక్టారుకు 100 కిలోల నత్రజని, 50 కిలోల భాస్వరం, 50 కిలోల పొటాష్ పోషకాలనిచ్చే ఎరువులు వాడాలి. అదనంగా హెక్టారుకు 10 కిలోల బోరాన్ వేయాలి.

క్యారట్: హెక్టారుకు 8–10 కిలోల విత్తనం వాడాలి. వరుసల మధ్య 50 సెం.మీ, వరుసలలోని మొక్కల మధ్య 10 సెం.మీ దూరం పాటించాలి. 80 కిలోల నత్రజని, 60 కిలోల భాస్వరం, 80 కిలోల పొటాష్‌లనిచ్చే ఎరువులు వాడాలి.

దుంప కూరలలో మైదాన ప్రాంతాలలో ఆసియా రకాల్లో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అదే ఐరోపా రకాలు, శీతల రకాల్లో విత్తనోత్పత్తి కొండ ప్రాంతాల్లో చేపట్టవచ్చు. విత్తనం నుంచి విత్తనం వరకు లేదా వేరు నుంచి విత్తనం పద్ధతిలో విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. అయితే భూమి నుంచి వేరును తీసి మళ్లా ప్రధాన పొలంలో నాటే విత్తనం తీసే పద్ధతిలో నాణ్యమైన విత్తనం అందుతుంది. ఎందుకంటే ప్రధాన పొలంలో నాటే సమయంలో జన్యు స్వచ్ఛత కల్గిన వేరు రకాలను ఎంచుకుని నాటుకుని విత్తనోత్పత్తి చేపట్టవచ్చు. పూర్తిగా మార్కెట్ పరిమాణానికి వచ్చిన దుంపలు ఎంచుకుని, వాటిని భూమిపై అలాగే కింద 2–3 ఇంచులు ఉంచి, మిగతాది కత్తిరించాలి. వాటిని భూమిలో నాటుకోవాలి.



ధృవీకరణకు ఉండాల్సిన విత్తన ప్రమాణాలు	క్యారెట్	ముల్లంగి	బీట్‌రూట్
మొలక శాతం	60	70	60
విత్తన స్వచ్ఛత	95	98	60
గరిష్ఠంగా ఇతర పంటల విత్తనాలు	10	10	10
తేమ శాతం			
సాధారణ సంచులలో	7	8	9
గాలి సోకని సంచులలో	7	7	8

కల్తీల ఏరివేత:

క్యారెట్: విత్తిన 20–30 రోజుల తర్వాత మొదటిసారి, భూమి నుంచి తీసిన తర్వాత రెండోసారి, పూత సమయంలో మూడోసారి, గింజలు ఏర్పడే దశలో కల్తీలు ఏరివేతకు నాలుగుసార్లు క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.

ముల్లంగి, టర్నిప్: విత్తిన 20–30 రోజులకు, వేర్ల ఎంపికప్పుడు, పూత సమయంలో మూడుసార్లు క్షేత్ర తనిఖీలు చేపట్టాలి.

కనీస వేర్పాటు దూరం (మీటర్లలో)	ఫౌండేషన్ విత్తనం	విత్తనం ధృవీకరణ
క్యారెట్	1000	800
ముల్లంగి,టర్నిప్	1600	1000



కోత, విత్తన సేకరణ: ముల్లంగిలో కాయలు పసుపు పచ్చ రంగులోకి మారినప్పుడు కోయాలి. తర్వాత ఎండబెట్టి, విత్తనాలు సేకరించాలి. హెక్టారుకు 600–1000 కిలోల విత్తన దిగుబడి వస్తుంది. క్యారెట్‌లో విత్తనాలు 'అంబెల్స్'లో ఏర్పడుతాయి. ప్రధానకాండంపై ఏర్పడే అంబెల్స్ పెద్దగా ఉంటాయి. వీటినే 'కింగ్ అంబెల్స్' అంటారు. కొమ్మల చివర్లలో ఏర్పడేవి ద్వితీయ అంబెల్స్. వీటిలో పై నుంచి కిందికి పూలు ఏర్పడుతాయి. రెండో అంబెల్ కాండం నుంచి తృతీయ అంబెల్స్ ఏర్పడుతాయి. ప్రాథమిక అంబెల్స్‌లోని విత్తనాలు బరువుగా, పరిణితి చెంది, అధిక నాణ్యతతో ఉంటాయి. అయితే అంబెల్స్‌లోని అన్ని గింజలు ఒకేసారి పక్వానికి రావు. అందుకే దఫాలుగా విత్తన సేకరణ చేయాలి. తృతీయ అంబెల్స్ పసుపు పచ్చ రంగులోకి మారిన తర్వాత వాటిని కోసి, నీడలో ఆరబెట్టి విత్తనం తీయాలి. హెక్టారుకు క్యారెట్ విత్తన పంట దిగుబడి 450–500 కిలోలు. టర్నిప్‌లో గోధుమ ఎరుపులోకి మారినప్పుడు కాయ కోత చేపట్టాలి. ఆ తర్వాత విత్తనాలు తీయాలి. విత్తన దిగుబడి హెక్టారుకు 500–600 కిలోలు.

విత్తనోత్పత్తికి అనుకూల వాతావరణం

క్యారెట్‌లో: క్యారెట్ శీతల కాలపు పంట. అయితే ఆసియాటిక్ రకాల్లో 7.2 నుంచి 23.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత విత్తనం మొలకెత్తడానికి ఉపయోగపడుతుంది. మైదానప్రాంతాలు, ఉష్ణమండల ప్రాం తాల్లో వీటి విత్తనోత్పత్తి సులభం. వేసవిలో తక్కువ వర్షపాతమున్న ప్రాంతాలు మేలైనవే. యూరోపియన్ రకాలకు 4.8–10 డిగ్రీల ఉష్ణోగ్రత 4–6 వారాల పాటు వేరు అభివృద్ధి సమయంలో, క్షేత్రంలో అవసరం. పూలగుత్తులు ఏర్పడటానికి 12–21 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అవసరం. 28 డిగ్రీల సెల్సియస్‌లో పూలు ఏర్పడవు. కేవలం కొండ ప్రాంతాల్లో, బాగా చలి ఉండే ప్రదేశాల్లో వీటి విత్తనోత్పత్తి చేపట్టాలి.

ముల్లంగిలో: శాఖీయ ఉత్పత్తికి వేరు అభివృద్ధికి చల్లని వాతావరణం అవసరం. ప్రధానంగా సాగులో ఉన్న రకాల్లో ఆసియా రకాలు ఎక్కువ వేడిని తట్టుకుంటాయి. అందుబాటులో ఉన్న మూడు రకాల్లో–జపనీస్ లేదా వింటర్ ముల్లంగి చల్లని కొండ ప్రాంతాల్లో మాత్రమే విత్తనాలను ఇస్తుంది. పూతకు చల్లని వాతావరణం అవసరం. రెండోది వైట్ అయిస్ కూల్. రాపిడ్ రెడ్ వైట్ రకాలు చల్లని వాతావరణంలో వస్తాయి. అయితే వేరు అభివృద్ధి చాలా ఎక్కువగా ఉంటుంది. మూడవ రకం–మైదాన ప్రాంతాల్లో విత్తనోత్పత్తి మేలుగా ఉంటుంది. కొండ ప్రాంతాల్లో సైతం విత్తనోత్పత్తి సాధ్యమే. తక్కువ ఉష్ణోగ్రత పూతకు అత్యంత కీలకం. జపనీస్ రకాల్లో పూల అభివృద్ధికి 25–30 రోజుల పాటు తక్కువ ఉష్ణోగ్రత ఉండాలి. గింజలు ఏర్పడే దశ త్వరగా ఉంటుంది. ఎక్కువ గింజల ఉత్పత్తి సాధ్యం. 32 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత కంటే ఎక్కువ ఉంటే పుప్పొడి రేణువులు మొలకెత్తవు. కీలాగ్రం ఎండిపోతుంది. కాబట్టి నాణ్యమైన విత్తనోత్పత్తికి ఎక్కువ గాలిలో తేమ, చల్లని వాతావరణం అవసరం.

డాక్టర్ పిడిగెం సైదయ్య
శాస్త్రవేత్త, రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం
7780509322



షెడ్‌లలో గొర్రెల పెంపకం



మానవుడు వేటాడే దశ నుంచి పశుపాలనకు రావడం గొప్ప చరిత్రాత్మక ముందడుగు. మానవజాతి మచ్చిక చేసుకున్న వివిధ జంతువులు, పక్షుల్లో గొర్రె ఒక ముఖ్యమైన జంతువు. మనిషికి గొర్రె వల్ల పాలు, మాంసం, ఉన్ని, తోళ్లు.. వ్యవసాయానికి కావాల్సిన ఎరువు లభిస్తున్నాయి. వ్యవసాయం పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందేవరకు మానవజాతి తన ఆహారానికి, దుస్తుల కోసం జంతువులపై ఆధారపడి మనుగడ సాగించింది.

నాగరికత పరిణామక్రమంలో చాలాకాలం పశుపాలన యుగంలోనే జీవనం సాగింది. మానవజాతి ఈ పశుపాలన దశలోనే మాతాలకు సంబంధించిన తత్వజ్ఞానాన్ని కూడా అభివృద్ధి చేసుకుంది. మత ప్రవక్తలైన శ్రీకృష్ణుడు, అబ్రహాం, మోజెస్, ఏసుక్రీస్తు, మహమద్ ప్రవక్తలు గురునానక్ అందరు పశుపాలకులే. నవీన కాలంలో పాశ్చాత్య దేశాలు ఏ విధంగా శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగమిస్తున్నాయో అది మన దేశంలో జరుగకపోవడం వల్ల గొర్రెలను షెడ్లలో పెట్టి మేపే విధానం ఇక్కడ అభివృద్ధి చెందలేదు. గొర్రెల పెంపకం వృత్తిని అనాదిగా వస్తున్న బయట మేపే పద్ధతిని అవలంబిస్తున్నారు. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ నిర్ణయంతో మొదటిసారిగా దేశంలో గొర్రెల పెంపకంపై దృష్టిపెట్టి గొల్ల, కుర్మలకు గొర్రెలు పంపిణీ చేయడం ఒక గొప్ప అభివృద్ధి కానుక. అదేవిధంగా ప్రభుత్వం గొర్రెలను సాంద్ర లేదా పాక్షిక సాంద్ర పద్ధతిలో పెంచడాన్ని ప్రోత్సహిస్తే యాదవుల అభివృద్ధి జరుగుతుంది.

దేశంలో దాదాపు 20 జాతుల గొర్రెలున్నాయి. ఇజ్రాయెల్ దేశానికి వ్యవసాయ అధికారుల బృందాన్ని పంపిస్తున్న ప్రస్తుత తరుణంలో అక్కడ గొర్రెల పెంపకాన్ని కూడా అధ్యయనం చేసి ఆ పద్ధతులను కూడా ఇక్కడ ప్రవేశపెడితే గొర్రెల పెంపకంలో గొప్ప విప్లవాత్మకమైన మార్పు వస్తుంది. ఇజ్రాయెల్‌లో బయట మేపడానికి పచ్చిక బయళ్లు లేవు. అది ఏడారి దేశం. కాని అక్కడ గొర్రెల పెంపకం ఒక పరిశ్రమగా అభివృద్ధి చెందింది. అక్కడ గొర్రె సగటు బరువు 70 కిలోలు, ఒక గొర్రె సంవత్సరానికి 550 లీటర్ల పాలను ఇస్తుంది. గొర్రె పాలు బర్రె పాల కంటే చిక్కగా ఉండి మంచి శక్తినిస్తాయి. ఆ దేశంలో గొర్రెలను 'సైలేజ్' మేతతో పోషిస్తారు. మన దేశంలో పచ్చిగడ్డి రకాలైన కోవన్, ఎపిబిఎన్ రకాలు ఏడాది పొడవునా అందుబాటులో ఉంటాయి. కాబట్టి పచ్చి మేతకు సమస్య ఉండదు. ఒక ఎకరా గడ్డితో దాదాపు 100 గొర్రెలను మేపవచ్చు. తెలంగాణలో అత్యధిక భూ బాగానికి సాగునీటి వసతి కల్పిస్తున్న ప్రస్తుత తరుణంలో గొర్రెలను మేపడం కష్టతరమవుతుంది. పాలిచ్చే బర్రెల లాగ షెడ్లలో పెట్టి మేపే విధానాన్ని ప్రభుత్వపరంగా ప్రోత్సహించడం అవసరం.

రాష్ట్ర మాంస అవసరాలకు సరిపడా గొర్రెల ఉత్పత్తి లేదు. పక్కరాష్ట్రాల నుంచి గొర్రెలు దిగుమతి అవుతున్నాయి. గొర్రెల వృత్తిని అభివృద్ధి చేయడం వల్ల వ్యవసాయానికి ఎరువును అందించవచ్చు. యువతకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి కల్పించవచ్చు. అనుబంధ పరిశ్రమగా గొర్రె తోళ్ళ శుద్ధి కర్మాగారాలు స్థాపించవచ్చు. గొర్రె చర్మం నుంచి చలికాలంలో ఉపయోగించే జాకెట్స్/ కోట్లు, చేతి తొడుగులు తయారుచేయవచ్చు.

షెడ్లలో గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించడంవల్ల ఈ వృత్తిని స్వీకరించడానికి యువకులు ముందుకువచ్చే అవకాశం ఉన్నది. ఈ వృత్తి కూడా వ్యవసాయం, కోళ్ళ పెంపకం మాదిరిగా స్థిరంగా ఒకచోట ఉండి గొర్రెల ఉత్పత్తి చేయటానికి దోహదపడుతుంది. రాష్ట్ర ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుంది. వర్షాధారిత వ్యవసాయాన్ని ఏవిధంగా నీటిపారుదల, మంచి వంగడాలు, యంత్రాలతో ఉత్పతిలో అభివృద్ధి సాధించబడిందో, గొర్రెల పెంపకంలో దురదృష్టవశాత్తు ఎలాంటి సాంకేతికత ప్రవేశపెట్టబడలేదు. ప్రభుత్వం ఈ దిశగా దృష్టిసారించాలి.

– పోర్ల లింగప్ప, శాస్త్రవేత్త
plingappa@gmail.com

'మిద్దెతోట' మనమూ చేద్దాం

'మిద్దెతోట' ఇంటిల్లిపాదికి సంవత్సరం పొడవునా తాజా కూరగాయలు, పండ్లు, పూలు ఇస్తుంది.ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది. యాంత్రిక జీవనంతో దూరమైన మానసిక ఉల్లాసాన్ని తిరిగి తెస్తుంది. అన్నిటికి మించి ప్రకృతితో స్నేహం నేర్పిస్తుంది. తద్వారా కోల్పోయిన జీవన మాధుర్యాన్ని అందిస్తుంది. సృజనాత్మకతను పెంచుతూ, మంచి ఆలోచనలు పురుడుపోసుకోవడానికి అనువైన వాతావరణం కల్పిస్తుంది మిద్దెతోట.

ఏమిటీ మిద్దెతోట, ఎందుకీ మిద్దెతోట, ఎవరికోసం ఈ మిద్దెతోట వంటి సవాలక్ష సమస్యలకు ఆచరణీయమైన సమాధానాలు తెలియజేసే పుస్తకం **'మిద్దెతోట'**. స్వతహాగా కథా రచయిత, సృజనశీలి అయిన తుమ్మేటి రఘోత్తమరెడ్డి దాదాపు 478 రోజుల పాటు నిర్వహించిన రోజువారీ పనులను అక్షరబద్ధం చేస్తే వచ్చిందే మిద్దెతోట. ఒక కాఫీ టేబుల్ బుక్ తరహాలో 'రైతునేస్తం పబ్లికేషన్' ఈ పుస్తకాన్ని ముద్రించింది.



ప్రతులకు:
రైతు నేస్తం పబ్లికేషన్స్,
6-2-959, దక్షిణ భారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్,
ఖైరతాబాద్,
హైదరాబాద్, 500004
040-23395979,
9676797777

మార్కెట్‌లో కూరగాయల కొరత, పురుగుల మందులు, రసాయనాలతో పండిస్తున్న కూరగాయలతో అందరి ఆరోగ్యం క్షీణిస్తున్నది. వీటికి పరిష్కారంగా మన ఇంట్లో మనమే పండించుకునే విధానమే మిద్దెతోట. తెలంగాణ ప్రభుత్వం **'మన ఇల్లు– మన కూరగాయలు'** పథకంతో పట్టణ ప్రాంతాల్లో కూరగాయల ఉత్పత్తిని ప్రోత్సహించడానికి నగరవాసులలో అవగాహన తీసుకొచ్చేందుకు కొంత కాలంగా కృషి చేస్తున్నది. ఇందులో కొంత వరకు విజయం సాధించింది. ఆసక్తి కలిగిన వారికి 600 రూపాయల కిట్‌ను 300 లకే ఇస్తూ నగర ప్రజల ఆరోగ్యం మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తుండటం అభినందనీయం. అయితే ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం మరింత విజయవంతం కావడానికి 'రైతు నేస్తం ఫౌండేషన్' వారు నగరంలోని వివిధ కాలనీల్లో ఉద్యానశాఖ సహకారంతో ఒకరోజు అవగాహన, శిక్షణా తరగతులు నిర్వహిస్తూ మిద్దెతోట ప్రాచుర్యాన్ని ప్రోత్సహించారు. **మిద్దెతోట** పుస్తకంలోని అంశాలన్నీ రచయిత తుమ్మేటి రఘోత్తమరెడ్డి సొంత అనుభవాలు. వారు స్వయంగా మిద్దెతోటను నిర్వహిస్తూ ఈ క్రమంలో వారికి ఎదురైన, అనుభవంలోకి వచ్చిన అంశాల సారం మాత్రమే. ఈ పుస్తకం చదివితే ఒక అనుభూతి కలుగుతుంది. ఎవరికి వారు తెలిసి కూడా ప్రకృతి, పర్యావరణ విధ్వంసానికి ఎట్లా కారణమవుతున్నారో తెలుపుతుంది. అనేక రుగ్మతలకు పరిష్కారం మిద్దెతోట ఎలా ఇవ్వగలదో సమాధానం దొరుకుతుంది.

ఇంటి ఆవరణలో, మిద్దెమీద, బాల్కనీలో కూరగాయలు, పండ్లు, పూలు ఎలా ఉత్పత్తి చేసుకోవచ్చో రచయిత చాలా సరళంగా చెప్పారు. ఈ క్రమంలో తనకు ఎదురైన సమస్యలు, వాటిని ఎలా అధిగమించారో తెలియజేశారు. శ్రమ, చేతులు ఉంటే మిద్దెతోటను చేయవచ్చని నిరూపించారు. మిద్దెతోట పుస్త కం అంతర్లీనంగా ప్రకృతితో సహజీవనం చేయడం, దాని ఆవశ్యకతను ప్రబోధించే ఒక తాత్విక ధోరణి నేర్పుతుంది. పలు మానసిక రుగ్మతలకు ప్రకృతిని సరైన రీతిలో అవగాహనచేసుకోవడం ద్వారా పరిష్కారం దొరుకుతుందని రచయిత ఈ పుస్తకం దారా తెలియజేశారు.

– వలేటి గోపీచంద్, 9441276770

పందుల బెడదకు పరిష్కారం

చేతికందిన పంటలను నాశనం చేస్తున్న అడవి పందుల ఆగడాలకు సంగారెడ్డికి చెందిన నాగరాజు కళ్లెం వేశాడు. పంట చేలల్లోకి పందులు రాకుండా ఉండేందుకు ఒక పరికరాన్ని కనిపెట్టాడు. కేవలం రెండు వేల రూపాయలతో ఈ పరికరాన్ని తయారు చేశాడు. పొలం వద్ద ఈ పరికరాన్ని అమర్చి అక్కడకు పందులు రాలేదని స్వయంగా పరిశీలించాడు.

ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికందే దశ లో పందులు నాశనం చేస్తున్నాయి. దీంతో రైతు లు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతుల ఇబ్బందు లకు పరిష్కారం చూపడానికే ఈ పరికరాన్ని తయారుచేశానని నాగరాజు అన్నాడు. ఒక ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న నాగరాజు ఆ పరికరం పని చేసే విధానం వివరించారు. ఆ వివరాలు..

తక్కువ ధరకు దొరికే వస్తువులతో ఈ పరికరాన్ని తయారుచేసుకోవచ్చు. ఈ పరికరం కాంతి విద్యుత్ ఫలితంపై ఆధారపడి పనిచేస్తుంది.

పనిచేయు విధానం..

ఎల్‌డీఆర్ (లైట్ డిటెక్టింగ్ రెసిస్టర్) ఒక అర్ధవాహక పదార్థంతో తయారు చేయబడింది. దానిపై కాంతి పడగానే విద్యుత్ ప్రవాహం జనిస్తుంది. కాంతి పడనప్పుడు అది నిరోధకంగా పనిచేస్తుంది. లేజర్ లైట్ ఎల్‌డీఆర్‌పై పతనమైప్పుడు ట్రాన్సిస్టర్ వినిమయ నియమం ద్వారా విద్యుత్ ప్రవాహాన్ని ట్రాన్సిస్టర్ అడ్డుకుని బజర్‌కి విద్యుత్ ప్రవాహం వెళ్ళదు. తద్వారా బజర్ మోగదు. లేజర్ లైట్ ఎల్‌డీఆర్‌పై పడకపోతే అది బజర్ యాక్టివేట్ చేసి బజర్‌ను మోగిస్తుంది.

- అడవి జంతువుల కనిష్ఠ ఎత్తు 55 సెంటీమీటర్లు
- అడవి జంతువుల గరిష్ఠ ఎత్తు 120 సెంటీమీటర్లు
- సరాసరి ఎత్తు 87.5 సెం.మీ
- పందుల కోసం నిర్దేశించబడిన ఎత్తు 88 సెంటీమీటర్లు

అమర్చే విధానం..

లైట్ డిటెక్టివ్ రెసిస్టర్ ఎల్‌డీఆర్, లైట్ ఎమిటింగ్ డయోడ్, ట్రాన్సిస్టర్, లేజర్ లైట్, బజర్, బ్యాటరీని ఉపయోగించి తయారు చేసిందే ఈ పరికరం. పంట నలుమూలల్లో మీటరు ఎత్తులో కర్రలను పాతి పైభాగంలో 5 సెంటీమీటర్ల సమతల దర్పణాలను 45 డిగ్రీల కోణంతో ఏర్పాటుచేయాలి. ఒక మూలలో కర్రపై ఉంచిన పరికరం నుంచి వెలువడే లేజర్ కిరణాలు మొత్తం ఏర్పాటుపై స్థిరీకరించేలా సర్దుబాటు చేసి చివరికాంతి ఎల్‌డీఆర్‌పై పడే లా చూసుకోవాలి. పొలంలోకి అడవిపంది వస్తే లేజర్ కిరణాలకు కచ్చితంగా చిక్కుతుంది. కిరణాలు అడవిపందిపై పడగానే పరిక రం పెద్ద శబ్దాన్ని చేస్తుంది. దీంతో శబ్దానికి భయపడిన అడవి పందులు వెన క్కి వెళ్లిపోతాయి. ఈ పరికరాన్ని జిల్లా కేంద్రంలో ఓ ప్రైవేట్ కంపెనీలో క్వాలిటీ కంట్రోలర్‌గా పనిచేస్తున్న బట్టు నాగరాజు పది రోజులు కష్టపడి ఈ పరికరాన్ని తయారు చేశారు.

– ముదిగొండ సంజయ్‌కుమార్,
8143811410

యంత్ర తయారీకి కావాల్సినవి

1. ఎల్ డీఆర్ - కాంతి గ్రాహక నిరోధం
2. రెసిస్టర్-2 - నిరోధకాలు
3. లేజర్ లైట్
4. ఎల్ ఈడీ బల్బు
5. బజర్
6. బ్యాటరీ
7. రాగి తీగలు
8. ట్రాన్సిస్టర్





ఉపయోగాలు

- ఈ పరికరం అడవిపందుల ద్వారా నష్టపోతున్న రైతులకు చాలా పయోగకరంగా ఉంటుంది.
- అడవిలో ఉండే పొలాలు అడవిపందుల ద్వారా 20 నుంచి 30 శాతం పాడు చేయబడుతున్నాయి. ఈ పరికరంతో ఆ నష్టాన్ని అరికట్టవచ్చు.
- ఈ పరికరంతో ఎలాంటి కాలుష్యం ఏర్పడదు.
- ఈ పరికరానికి అయ్యే ఖర్చు కూడా తక్కువే.

నమస్తే తెలంగాణ
చిత్రం
[హైదరాబాద్]
గురువారం 4 జనవరి 2018

ఇంటి పేరు మారలేదు!


శృతిహాసన్

ప్రేమ, పెళ్లి గురించి వస్తున్న వార్తలపై తొలిసారిగా స్పందించింది చెన్నై సొగసరి శృతిహాసన్. లండన్‌కు చెందిన థియేటర్ ఆర్టిస్ట్ మైఖేల్ కోర్సల్‌తో ఈ అమ్మడు గత కొంతకాలంగా ప్రేమలో వుంది. ముంబయిలో ఉల్లాసంగా విహరిస్తూ ఈ ప్రేమ జంట చాలాసార్లు మీడియా కంటపడింది. సోషల్‌మీడియాలో ఫొటోలు ప్రత్యక్షమవడంతో శృతిహాసన్ ప్రేమాయణం అందరి దృష్టిని ఆకట్టుకుంది. ఈ మధ్యన జరిగిన ఓ ప్రైవేట్ ఫంక్షన్‌లో తమిళ సంప్రదాయ దుస్తుల్లో కనిపించాడు మైఖేల్ కోర్సల్. ఈ వేడుకకు శృతిహాసన్ తండ్రి కమల్‌హాసన్ కూడా హాజరయ్యారు. దీంతో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతున్నారనే వార్తలు గుప్పుమన్నాయి. వీటిపై శృతిహాసన్ వివరణ ఇస్తూ 'నా ఇంటిపేరు మారితే తప్పకుండా మీకు తెలియజేస్తాను. మరో రెండేళ్ల వరకు పెళ్లి చేసుకునే ఉద్దేశ్యం లేదు. మైఖేల్ నాకు ప్రియమైన మిత్రుడు. ప్రస్తుతం ఆయనతో వున్న సంబంధం గురించి ఇంతకు మించి మాట్లాడలేను' అని చెప్పింది.


ప్రభాస్

అనుష్క మంచి స్నేహితురాలు!

'బాహుబలి' సినిమాతో ప్రభాస్ ఖండాంతర ఖ్యాతిని సొంతం చేసుకున్నారు. ప్రస్తుతం సుజిత్ దర్శకత్వంలో రూపొందుతున్న 'సాహో' చిత్రంలో ఆయన నటిస్తున్న విషయం తెలిసిందే. కాగా తనపై వస్తున్న పెళ్లి పుకార్లపై ప్రభాస్ ఓ జాతీయ మాస పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆసక్తికరమైన విషయాల్ని వెల్లడించారు. తన వివాహానికి సంబంధించి గత కొంత కాలంగా పలు పుకార్లు వినిపిస్తున్నాయని, అందులో ఎలాంటి వాస్తవం లేదని ఆయన తెలిపారు. ఓ హీరోయిన్‌తో కలిసి ఎక్కువ సినిమాల్లో నటిస్తే ఇద్దరి మధ్య ఏదో వుందని ప్రచారం జరగడం ఈ రోజుల్లో సాధారణమే. అందుకే అనుష్క, నేను ప్రేమలో వున్నామని, పెళ్లి చేసుకోబోతున్నామని వార్తలు రావడం మొదలైందని, అనుష్కను పెళ్లి చేసుకోవాలనే ఆలోచన తనకు లేదని, అనుష్క, తను మంచి స్నేహితులం మాత్రమేనని, ఈ ఏడాది వివాహం చేసుకునే ఉద్దేశం కూడా తనకు లేదని ప్రభాస్ వెల్లడించారు. అనుష్క ప్రస్తుతం ప్రభాస్ సన్నిహితులు నిర్మిస్తున్న 'భాగమతి' చిత్రంలో నటిస్తున్న విషయం తెలిసిందే.


అల్లాణి శ్రీధర్

'చారిత్రక కథాంశంతో తెరకెక్కిన భక్తిప్రధాన చిత్రమిది. తెలంగాణలో అత్యంత ప్రజాదరణ కలిగిన చిలుకూరి బాలాజీ ఆలయ విశిష్టతను, స్థలపురాణాన్ని ఆవిష్కరిస్తూ రూపొందించాం' అని అన్నారు అల్లాణి శ్రీధర్. కొమురం భీమ్, గౌతమబుద్ధ చిత్రాలతో విమర్శకుల ప్రశంసల్ని అందుకున్నారాయన. ఫిల్మీడియా ప్రొడక్షన్స్ పతాకంపై అల్లాణి శ్రీధర్ స్వీయ దర్శకత్వంలో రూపొందిన తాజా చిత్రం 'చిలుకూరి బాలాజీ'. ఈ నెల 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం అల్లాణి శ్రీధర్ 'నమస్తే తెలంగాణ'తో ప్రత్యేకంగా ముచ్చటించారు. ఆ విశేషాలివి.

సంకల్పం నెరవేరింది!

నాలుగు వందల ఏళ్ల క్రితం నాటి తెలంగాణ సామాజిక పరిస్థితులు, రైతుల జీవన విధానాన్ని వాస్తవిక కోణంలో ప్రతిబింబిస్తూ సినిమాను తెరకెక్కించాం. చిలుకూరి ఆలయాన్ని నిర్మించే క్రమంలో మాధవుడు అనే భక్తుడికి ఎలాంటి అవాంతరాలు ఎదురయ్యాయి? అతడు ఎదుర్కొన్న సంఘర్షణ నేపథ్యంలో ఆద్యంతం భావోద్వేగ ప్రధానంగా సాగుతుంది. చిలుకూరిని మొదటిసారి దర్శించినపుడు ఆలయ చరిత్రపై సినిమా తీయాలనే కోరిక నాలో బలంగా మొదలైంది. ఆ సంకల్పం నెరవేరడం ఆనందంగా ఉంది. చారిత్రక అంశాలు మిళితమైన పౌరాణిక కథ కావడంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. కొన్ని శాసనాలతో పాటు చిలుకూరి ప్రధాన అర్చకుల నుంచి సేకరించిన అంశాలతో సినిమాను తెరకెక్కించాను.

మాధవుడిగా సాయికుమార్..

చిలుకూరి బాలాజీ ఆలయాన్ని నిర్మించిన మాధవుడి పాత్రలో సాయికుమార్ అభినయం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. తిరుమల క్షేత్ర ఆస్థాన గాయకుడు తిరుమలదాస్ పాత్రలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం కనిపిస్తారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చే సన్నివేశాలు ఉత్కంఠను పంచుతాయి. తానీషా అనే ప్రభువుగా సుమన్ కనిపిస్తారు. సాయికుమార్ భార్యగా భానుశ్రీ మెహ్రా పాత్ర నవ్యరీతిలో సాగుతుంది. భక్తి ప్రధాన సినిమా కావడంలో ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేశారు.

తెలంగాణలో దిల్‌రాజు...

రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు రమణాచారి ద్వారా 'చిలుకూరి బాలాజీ' గురించి తెలుసుకున్న దిల్‌రాజు సినిమా వీక్షించారు. ఆయనకు నచ్చింది. దిల్‌రాజు సహకారంతో తెలంగాణలో సినిమాను విడుదలచేస్తున్నాం. ఆంధ్రాలో తుమ్మలపల్లిరామసత్యనారాయణ, సీడెడ్‌లో బీఎన్‌రెడ్డి విడుదలచేస్తున్నారు. బాలాజీ మహిమతో సినిమాకు మంచి థియేటర్లు దొరికాయి. అర్జున్ స్వరపరచిన ఏడు పాటలకు మంచి స్పందన లభిస్తున్నది. గీతాలను విడుదలచేసిన చినజీయర్‌స్వామి సినిమా తప్పకుండా ప్రజాదరణ పొందుతుందని ఆశీస్సులు అందజేశారు.

ఆ సెంటిమెంట్ కలిసివస్తుంది..

మూసధోరణికి భిన్నమైన కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా దర్శకుడిగా నాకు ఎనలేని సంతృప్తిని మిగిల్చింది. రెగ్యులర్ కమర్షియల్ సినిమాలతో పోలిస్తే ఇలాంటి భక్తిప్రధాన, చారిత్రక కథాంశాలతోనే దర్శకులు తమ ప్రతిభను నిరూపించుకునే అవకాశం ఎక్కువగా ఉంటుంది. సినిమా నిర్మాణంలో రమణాచారితో పాటు చిలుకూరి ఆలయ అర్చకులు రంగరాజన్, సౌందరరాజన్ చక్కటి సహకారాన్ని అందించారు. చిలుకూరి బాలాజీ ఆలయ ప్రాంగణంలో నిర్మించిన సినిమాలన్నీ హిట్టయ్యాయి. ఆ సెంటిమెంట్ మా సినిమాకు కలిసివస్తుందనే నమ్మకముంది. ఆలయ పరిసరాలతో పాటు అనంతగిరి అటవీప్రాంతం,రామోజీఫిల్మ్‌సిటీలో ప్రధాన ఘట్టాలను తెరకెక్కించాం.



కథానాయకుడు బెల్లంకొండ సాయి శ్రీనివాస్ జన్మదిన వేడుకలు బుధవారం సినీ ప్రముఖులు, అభిమానుల మధ్య వైభవంగా జరిగాయి. టీఆర్ఎస్ శాసనసభ్యుడు జీవన్‌రెడ్డి, ప్రముఖ దర్శకుడు వి.వి.వినాయక్, శ్రీవాస్, మెహర్‌రమేష్, నిర్మాతలు అభిషేక్‌నామా, బెక్కెం వేణుగోపాల్‌తో పాటు పలువురు సినీ ప్రముఖులు ఈ వేడుకలో పాల్గొని శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పవర్‌ఫుల్ పోలీస్‌స్టోరీ!


అనిత రాఘవ్

రేవంత్ జి.హెచ్, సమ్మోహిత్, అనిత రాఘవ్, తేజారెడ్డి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'సారథి'. అల్లం భువన్ స్వీయ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఈ నెల 5న విడుదలకానుంది. ఈ సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో దర్శకుడు మాట్లాడుతూ 'అర్జున్ నిజాయితీగల పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్. తన వృత్తి ధర్మానికి అడ్డుగా నిలిచిన సంఘ విద్రోహ శక్తుల్ని ఎలా అంతమొందించాడు? అనేదే ఈ చిత్ర ప్రధాన ఇతివృత్తం. దర్శకుడిగా ఇది నా తొలి సినిమా. అయినా ఏ విషయంలోనూ రాజీపడకుండా చిత్రాన్ని అనుకున్న స్థాయిలో రూపొందించాను. అన్ని కార్యక్రమాలు పూర్తయ్యాయి. చిత్రాన్ని ఈ నెల 5న విడుదల చేస్తున్నాం' అన్నారు. రేవంత్ మాట్లాడుతూ 'ఇప్పటి వరకు 24 లఘు చిత్రాల్లో నటించాను. హీరోగా ఇదే నా తొలి సినిమా. అన్ని వర్గాల వారిని ఆకట్టుకుంటుందనే నమ్మకముంది' అన్నారు. భాను చందర్, మల్లాది రాఘవ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఛాయాగ్రహణం: టి.కె.పరంధాం, సంగీతం: వి.కిరణ్ కుమార్, ఎడిటింగ్: నందమూరి హరి.

ఒకే ఒక్క పాత్రతో..


నిత్యామీనన్

దక్షిణాది కథానాయికల్లో నిత్యామీనన్ పంథా విభిన్నంగా ఉంటుంది. నంబర్‌గేమ్స్, పారితోషికాలు, ఇమేజ్‌లతో పట్టింపులు లేకుండా నవ్యమైన కథాంశాలు, అభినయానికి ఆస్కారమున్న పాత్రలకు ప్రాణప్రతిష్ట చేయడానికి తపిస్తుంటుంది. ఆ ఆలోచన విధానమే ఆమెకు తెలుగుతో పాటు తమిళ, మలయాళ భాషల్లో ప్రత్యేకమైన గుర్తింపును తెచ్చిపెట్టింది. తాజాగా నిత్యామీనన్ మరో ప్రయోగానికి సిద్ధమైంది. ఆమె కథానాయికగా తెరకెక్కుతున్న తాజా చిత్రం 'ప్రాణ'. తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ సినిమా ఒకే ఒక్క పాత్రతో తెరకెక్కుతుండటం గమనార్హం. సినిమా ఆద్యంతం తెరపై నిత్యామీనన్ పాత్ర మాత్రమే కనిపిస్తుందని తెలిసింది. మలయాళ దర్శకుడు వీకే ప్రకాష్ ప్రయోగాత్మకంగా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో సమాజంలో నెలకొన్న అసహనం, స్త్రీద్వేషంపై పోరాటం చేసే రచయిత్రిగా నిత్యామీనన్ కనిపిస్తున్నట్లు సమాచారం. సింక్రనైజ్ సరౌండ్‌సౌండ్ అనే అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందుతున్న తొలి భారతీయ చిత్రమిది. 'ద్విభాషా సినిమాలు చేయడమే కష్టం. అలాంటిది ఒకేసారి నాలుగు భాషలకు సంబంధించిన సన్నివేశాలు పూర్తిచేయడానికి చాలా శ్రమించాల్సివచ్చింది. భిన్న భాషలకు సంబంధించిన పదాలను పలికే తీరు కోసం కొన్నాళ్లు సంభాషణల రచయితలతో ప్రయాణాన్ని సాగించాను. కథా చర్చల్లో పాలుపంచుకున్నాను. అవి నా పాత్రను బాగా చేయడానికి ఉపయోగపడ్డాయి' అని తెలిపింది నిత్యామీనన్.

సమాజ శ్రేయస్సు కోసం..


లీలా

ప్రసాద్ లక్కన ప్రధాన పాత్రలో నటిస్తూ స్వీయ దర్శకత్వంలో రూపొందిస్తున్న చిత్రం 'అమ్మాయి గోల శ్రీకృష్ణలీల'. లీలా కథానాయిక. ఈ చిత్ర టీజర్‌ను ఇటీవల హైదరాబాద్‌లో తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణగౌడ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకనిర్మాత మాట్లాడుతూ 'ఆక్యుప్రెజర్ అనే వైద్య విధానం నేపథ్యంలో సాగే చిత్రమిది. వినోదంతో పాటు అంతర్లీనంగా చక్కటి సందేశం ఉంటుంది. ఆధునిక వైద్యంతో పోలిస్తే సంప్రదాయ వైద్య పద్ధతుల గొప్పతనాన్ని ఈ సినిమా ద్వారా చాటిచెప్పబోతున్నాం. వాణిజ్య హంగులు పుష్కలంగా ఉంటాయి' అని తెలిపారు. లాభాపేక్షను పక్కన పెట్టి సమాజ శ్రేయస్సును కాంక్షిస్తూ ప్రసాద్ లక్కన చేస్తున్న ఈ ప్రయత్నం విజయవంతమవ్వాలని ప్రతాని రామకృష్ణగౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పి. సత్యారెడ్డి, మోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


అర్జున్ యజత్, సౌమ్య

ప్రేమంటే ఏమిటంటే..

అర్జున్ యజత్, భరత్ బండారు, సౌమ్యవేణుగోపాల్, పావని ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'మూడు పువ్వులు ఆరు కాయలు'. రామస్వామి దర్శకత్వం వహిస్తున్నారు. వబ్బిన వెంకటరావు నిర్మాత. చిత్రీకరణ పూర్తయింది. నిర్మాత మాట్లాడుతూ 'ప్రేమ కంటే లక్ష్యం గొప్పదనే కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రమిది. ప్రేమంటే చంపడమో, చావడమో కాదని, ఆత్మీయులు తోడుగా కడవరకు కలిసి బ్రతకడమని నమ్మిన మూడు జంటల కథ ఇది. కుటుంబ విలువలకు వినోదం, భావోద్వేగాల్ని మేళవించి చిత్రాన్ని రూపొందిస్తున్నాం. దాదాపు నలభై సినిమాలకు సంభాషణల రచయితగా పనిచేసిన రామస్వామి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా జనరంజకంగా సినిమాను రూపొందిస్తున్నారు' అని తెలిపారు. ఇంటిల్లిపాదిని అలరించే అన్ని హంగులున్న చిత్రమిదని, ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాల్ని జరుపుతున్నామని నిర్మాత తెలిపారు. రామస్వామి, సీమాచౌదరి, తనికెళ్లభరణి, కృష్ణభగవాన్, పృధ్వీ, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సాహిత్యం: చంద్రబోస్, సంగీతం: కృష్ణసాయి.

ఎనిమిదేళ్ల తరువాత..!


షామిలి

బాల నటిగా తెలుగు, తమిళ భాషల్లో మంచి గుర్తింపును సొంతం చేసుకుంది షామిలి. అయితే కథానాయికగా మాత్రం ఆ స్థాయిలో ఆకట్టుకోలేకపోయింది. 2009లో వచ్చిన 'ఓయ్' సినిమాతో కథానాయికగా తెరంగేట్రం చేసినా ఆ సినిమా ఆశించిన విజయాన్ని అందించక పోవడమే కాకుండా బొద్దుగా వుందనే విమర్శల్ని సైతం ఎదుర్కొంది. దీంతో కొంత కాలం సినిమాలకు దూరమై స్లిమ్‌గా మారింది. ప్రస్తుతం తమిళ చిత్ర పరిశ్రమలో వరుస ఆఫర్లతో బిజీగా వున్న షామిలి దాదాపు ఎనిమిదేళ్ల విరామం అనంతరం మళ్లీ తెలుగులో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నది. తెలుగులో షామిలి నటిస్తున్న తాజా చిత్రం 'అమ్మమ్మగారిల్లు'. నాగశౌర్య హీరోగా నటిస్తున్న ఈ చిత్రం ద్వారా సుందర్ సూర్య దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ దశలో వున్న ఈ చిత్రం వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానున్నది.



బుధవారం మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్



బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలో మంత్రి కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్. చిత్రంలో ఎంపీ బాల్క సుమన్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు తదితరులు

ఒడిశా ప్రాజెక్టుతో
తెలంగాణ నీటిలభ్యతకు కోత

మిడిల్ కొలాబ్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఫిర్యాదు

ప్రాజెక్టుకు అభ్యంతరం తెలుపుతూ గోదావరి బోర్డుకు తెలంగాణ లేఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: ఒడిశా చేపట్టిన మిడిల్ కొలాబ్ ప్రాజెక్టు నిర్మాణం పూర్తయి, నీటి వినియోగం మొదలైతే ఇంద్రావతి దిగువన రాష్ట్రమైన తెలంగాణకు నీటి లభ్యత గణనీయంగా తగ్గిపోతుందని గోదావరి బోర్డుకు తెలంగాణ స్పష్టం చేసింది. బుధవారం ప్రాజెక్టుపై అభ్యంతరం చెబుతూ గోదావరి బోర్డుకు లేఖ రాసింది. గోదావరి నదికి ప్రధాన ఉపనదిగా ఉన్న ఇంద్రావతిని ఒడిసిపట్టేందుకు ఒడిశా మిడిల్ కొలాబ్ ప్రాజెక్టును చేపడుతున్నదని తెలంగాణ ఆరోపించింది. ఇంద్రావతికి నీటిలభ్యత తగ్గడం మొదలుపెడితే తెలంగాణ చేపట్టే బోడేఘాట్ జలవిద్యుత్ ప్రాజెక్టుకు నీటిలభ్యతపై తీవ్ర ప్రభావం చూపుతుందని లేఖలో తెలిపింది. మిడిల్ కొలాబ్ ప్రాజెక్టును ఒడిశా కొలాబ్ నదికి అడ్డంగా జోర్నాల వద్ద నిర్మాణం చేపడుతుందని, కొలాబ్ దగ్గర వరద నీటిని 4.19 టీఎంసీ సామర్థ్యంతో నిర్మించనున్న డ్యామ్‌కు తరలించేలా రూపకల్పన చేసిందని లేఖలో పేర్కొంది. డ్యామ్ వద్ద 300 మెగావాట్ల జల విద్యుత్తు ఉత్పత్తి చేసేట్లుగా పవర్‌హౌజ్‌ను ప్రతిపాదించారని, ఇక్కడ విద్యుదుత్పత్తికి వాడిన నీరు కొలాబ్‌నదికి చేరేలా 264 మీటర్ల ఎత్తుతో మరో బ్యారేజీ నిర్మాణం చేశారని పేర్కొంది. దీంతో 63,117 ఎకరాలకు ఈ బ్యారేజీ కింద సాగుకు నీరిచ్చే అవకాశం ఉందని తెలిపింది. జోర్నాల, ఇంద్రావతి కలిసే చోట బ్యారేజీ వంటి ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా, అధిక జలాలను మళ్లింపు చేసినట్టుగా భావిస్తున్నామని తెలంగాణ లేఖలో స్పష్టం చేసింది.

గజల్ శ్రీనివాస్‌కు
బెయిల్ వద్దు

- కోర్టులో వ్యతిరేకించిన పోలీసులు
- కస్టడీపై నేడు తీర్పు?
- పరారీలో నిందితుని 'పీఏ'
- సేవ్ టెంపుల్ బ్రాండ్ అంబాసిడర్ పదవి నుంచి గజల్ తొలగింపు

సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:



మహిళలపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌కు బెయిలు మంజూరు చేస్తే అతడు సాక్ష్యాలను తారుమారు చేసే అవకాశమున్నదని పోలీసులు కోర్టుకు తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాబట్టేందుకు పంజాగుట్ట పోలీసులు నిందితుడిని తమ కస్టడీకి ఇవ్వాలని అభ్యర్థించారు. పోలీసుల కస్టడీ పిటిషన్‌పై బుధవారం కోర్టులో వాదనలు జరిగాయి. లైంగిక వేధింపులకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని రాబట్టాల్సి ఉందని, పూర్తి సమాచారం లేకుండా బెయిల్ పొందితే అతడు సాక్షులను ప్రభావితం చేసే ప్రమాదమున్నదని పోలీసులు కోర్టుకు విన్నవించారు. ఈ కేసులో ఎలక్ట్రానిక్ సాక్ష్యాలు ఉన్నాయని, సాక్షులు కూడా అతడి కార్యాలయంలో పనిచేసేవారేనని, వాళ్లను విచారించి సమాచారం సేకరించాల్సి ఉందని వివరించారు. గజల్ శ్రీనివాస్ కార్యాలయ పరిసరాలతో పాటు కార్యాలయంలోని సీసీ టీవీ ఫుటేజీలను కూడా సేకరించాలని, దర్యాప్తు పూర్తికాకుండా బెయిల్ పొంది నిందితుడు బయటకు వెళ్తే సాక్ష్యాలను తారుమారు చేస్తాడని అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడిని 7 రోజులపాటు తమ కస్టడీకి ఇవ్వాలని పోలీసులు న్యాయస్థానాన్ని కోరారు. న్యాయస్థానం కస్టడీ తీర్పును గురువారానికి వాయిదా వేసింది.

రామరామ అలాంటి పనులా?

లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ శ్రీనివాస్‌ను గ్లోబల్ హిందూ హెరిటేజ్ ఫౌండేషన్ సేవ్ టెంపుల్ బ్రాండ్ అంబాసిడర్ పదవి నుంచి తొలగిస్తున్నట్టు ఆ సంస్థ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు ప్రకటించారు. 'మా సంస్థ కార్యాలయాలు దేవాలయాలే. మా సంస్థలో స్త్రీలను దేవతలుగా గౌరవిస్తాం. సంస్థ పేరు చెప్పుకొని ఎలాంటి అశ్లీల కార్యక్రమాలకు పాల్పడినా ఉపేక్షించేది లేదు' అని ప్రకాశ్‌రావు 'సేవ్‌టెంపుల్.ఓఆర్‌జీ' వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. ఆయన అమెరికా నుంచి ఈ ప్రకటన చేశారు. గజల్ శ్రీనివాస్ పీఏగా, అతని వ్యక్తిగత వ్యవహారాలు ఇతరత్రా పనులుచేస్తూ బాధితురాలిని శ్రీనివాస్ కోరిక తీర్చేలా ఒత్తిడి చేసిన పార్వతిని అరెస్ట్ చేసేందుకు పంజాగుట్ట పోలీసులు గాలింపు జరుపుతున్నారు. మంగళవారం సాయంత్రం వరకు బయటే ఉన్న ఆమె, శ్రీనివాస్ గలీజ్ లీలలకు సంబంధించిన వీడియోలు బహిర్గతం కావడంతో అజ్ఞాతంలోకి వెళ్లిపోయింది. 15 ఏండ్లుగా ఆమె గజల్ శ్రీనివాస్ వద్ద పనిచేస్తున్నది. ఆమె పేదరికాన్ని ఆసరాగా చేసుకుని శ్రీనివాస్ ఆమె జీవితంతో ఆడుకున్నట్టు ఆరోపణలు వినవచ్చాయి.

రెండో ప్రయత్నంలో సక్సెస్


బాధితురాలు రెండు నెలలుగా మానసిక క్షోభను అనుభవిస్తూ సీక్రెట్ కెమెరాతో గజల్ శ్రీనివాస్ లీలలను రికార్డు చేసింది. ఆమె మొదటి ప్రయత్నం కెమెరా సరిగా పనిచేయకపోవడంతో విఫలమైంది. మరోసారి ఆమె తన స్టింగ్ ఆపరేషన్‌ను కొనసాగించి గజల్ గలీజ్ లీలలను బాహ్య ప్రపంచానికి తెలిపింది. తనకు ధైర్యాన్ని చెప్పి, పారదర్శకంగా దర్యాప్తు చేపట్టినందుకు బాధితురాలు పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపింది. బాధితురాలు ఉద్యోగంలో చేరిన సమయంలో సేవ్ టెంపుల్ అధ్యక్షుడు వెలగపూడి ప్రకాశ్‌రావు ఇక్కడే ఉండేవారు. ఆయన అమెరికాకు వెళ్లిపోయిన తరువాత శ్రీనివాస్ కార్యాలయంలోనే ఎక్కువసేపు గడుపడం మొదలుపెట్టాడు. కార్యాలయం మొత్తానికి బాస్‌గా వ్యవహరించడంతో అతడు ఏమిచేసినా నడిచేది. బాధితురాలిపై కన్నేసిన శ్రీనివాస్ ఆమెను వేధించడం మొదలుపెట్టాడు. కార్యాలయంలో మసాజ్‌ల కిస్సా మొదలుపెట్టి ఒక గదిని పూర్తిగా తన సుఖాల కోసం పడకగదిగా మార్చేసుకున్నాడని బాధితురాలు ఆరోపించింది. అతని వ్యవహారాలు తెలిసినా సిబ్బంది మాత్రం ఉద్యోగాలు ఎక్కడ పోతాయోననే భయంతో బయటకు చెప్పేవారు కాదు. ఇదిలాఉండగా తరుచూ అతని కార్యాలయానికి మహిళలు వచ్చిపోయే వారని, కొన్నిసార్లు జూనియర్ ఆర్టిస్టులు కూడా వచ్చేవారని బాధితురాలు వెల్లడించింది. ఆయన కార్యాలయంలోకి మహిళలు వెళ్లగానే తలుపులకు బోల్ట్ పెట్టేసేవాడని పోలీసుల విచారణలో అక్కడ పనిచేస్తున్న కొందరు వెల్లడించారు.

పెరుగుతున్న రియల్ ఆదాయం

తగ్గుతున్న నల్లధనం

- పుంజుకున్న రియల్ ఎస్టేట్ వ్యాపారం
- ఈసారి వెయ్యి కోట్ల వరకు అదనపు రాబడి
- తెల్లధనం వల్ల పెరిగిన రూ500కోట్ల రాబడి

ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:



తెలంగాణలోని స్థిరాస్తి రంగంలో నల్లధన ప్రవాహం క్రమంగా తగ్గుముఖం పట్టింది. పెద్దనోట్ల రద్దు తర్వాత కఠినమైన నిబంధనలు అమలులోకి రావడంతో నల్లధనం కాస్త తగ్గిందని చెప్పవచ్చు. చాలా డాక్యుమెంట్‌లలో మార్కెట్ విలువ కంటే ఎక్కువ ధరను పేర్కొనడం వల్ల రాష్ట్ర ఖజానాకు ఆదాయం కూడా పెరుగుతున్నది. వాస్తవానికి రియల్ మార్కెట్‌లో ప్రభుత్వం నిర్ణయించిన బుక్‌వాల్యూ ప్రకారం ఒక ధర ఉంటే బహిరంగ మార్కెట్ ధర మరో విధంగా ఉంటుంది. చాలా ప్రాంతాలలో ప్రభుత్వం నిర్ణయించిన భూముల విలువ కంటే మార్కెట్ విలువ రెండు నుంచి నాలుగు రెట్లు అధికంగా ఉంటుంది. ప్రజలపై భారం పడకూడదన్న భావనతో తెలంగాణ ప్రభుత్వం గత మూడేండ్లుగా భూముల విలువను పెంచడం లేదు. ఉదాహరణకు మియాపూర్‌లో బహిరంగ మార్కెట్ విలువ చదరపు గజానికి 40వేల రూపాయలుంటే బుక్‌వాల్యూలో దాని రేట్ గజానికి 10 వేల రూపాయలు మాత్రమే ఉంటుంది. దానిపైనే కొనుగోలుదారులు 6 శాతం వరకు స్టాంప్, రిజిస్ట్రేషన్ రుసుములను చెల్లిస్తారు. మార్కెట్ విలువకు, బుక్ వాల్యూకు చాలా తేడా ఉంటుంది. బుక్‌వాల్యూను తెల్లధనంగా మిగిలిన మార్కెట్ విలువను నల్లధనంగా పరిగణిస్తారు. నల్లధనం మొత్తం నగదు రూపంలో చేతులు మారుతుంటుంది. కానీ పెద్దనోట్ల రద్దు తర్వాత పరిస్థితిలో కొంత మార్పు వచ్చింది. రెండు లక్షల రూపాయల కంటే ఎక్కువ మొత్తంలో నగదు ఇవ్వడానికి వీలులేదనే ఆదాయపు పన్ను శాఖ నిబంధన స్థిరాస్తి రంగంలో రియల్ ధనం పెరుగడానికి దోహదపడింది. చాలామంది బ్లాక్‌మనీని కొంత తగ్గించుకుని బుక్‌వాల్యూను పెంచి ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకొంటున్నారు.

పెద్దనోట్ల రద్దు తర్వాత జనవరి-2016 నుంచి 2017డిసెంబర్ వరకు స్థిరాస్తి రంగంలో భూముల, ప్లాట్ల క్రయ విక్రయాల్లో స్పష్టంగా మార్పు కనిపిస్తున్నది. 2016 లో వ్యవసాయ భూముల క్రయ విక్రయాలలో మొత్తం డాక్యుమెంట్‌ల మార్కెట్ విలువ 7,235 కోట్లు కాగా వాస్తవ ధర ప్రకారం 9,921 కోట్ల వరకు డాక్యుమెంట్‌లలో విలువను పెంచి చూపినట్లు అధికారులు వెల్లడించారు. ఇక వ్యవసాయేతర భూముల క్రయవిక్రయాల ద్వారా 3,240కోట్ల రూపాయల మార్కెట్ విలువ కాగా డాక్యుమెంట్లలో దాదాపు 3,861 కోట్ల వరకు పెంచి చూపారు. 2017లో వ్యవసాయ భూముల క్రయ విక్రయాల ద్వారా మొత్తం మార్కెట్ విలువ 7, 067 కోట్లు కాగా డాక్యుమెంట్‌లలో 9,909 కోట్ల వరకు చూపారు. వ్యవసాయేతర భూముల ద్వారా క్రయ విక్రయాల మొత్తం మార్కెట్ విలువ 4,136 కోట్లు కాగా డాక్యుమెంట్‌లలో 5,324కోట్ల రూపాయలకు పెంచి చూపారు. మొత్తంగా గడచిన సంవత్సరం నుంచి అన్ని రకాల స్థిరాస్తుల క్రయ విక్రయాలు.. ప్రభుత్వ బుక్ విలువ కంటే సుమారు 7వేల కోట్ల వరకు పెంచి చూపినట్టు అధికారులు చెప్తున్నారు. దీని వల్ల ప్రభుత్వానికి దాదాపు 500 కోట్ల రూపాయల అదనపు ఆదాయం చేకూరింది.

రియల్‌రంగంలో నయాజోష్

పెద్దనోట్ల రద్దు తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో కొంతకాలం పాటు స్తబ్దత చోటుచేసుకున్నా ఆ తర్వాత మూడు నెలల్లోనే బాగా పుంజుకుంది. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు దశలో స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు చాలావరకు తగ్గాయి. మొదటి నాలుగు నెలలు దాదాపు 30శాతం వరకు లావాదేవీలు తగ్గాయి. అంతకుముందు సుమారు నెలకు లక్ష డాక్యుమెంట్లు రిజిష్టర్ కాగా కొత్త జిల్లాల ఏర్పాటు సమయంలో ఆ సంఖ్య 70 వేలకు చేరుకొన్నది. ఈ ఏడాది చివరి మూడు నెలల్లో అమ్మకాలు, కొనుగోళ్లు పెరిగాయి. నిరుటి కంటే, ఈ ఏడాది రూ. 670కోట్ల వరకు రాబడి పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మార్చి నెలాఖరుకు రూ. వెయ్యి కోట్లకు పైగా రాబడి పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. నిరుడు 3,374 కోట్ల వరకు రాబడి రాగా ఈ ఏడాది ఇప్పటికే 4,437 కోట్లకు చేరింది. మార్చి వరకు రాబడి రూ.5వేల కోట్లను దాటుతుందని అధికారులు అంచనా వేశారు.ప్రత్యేకించి హైదరాబాద్ దాని చుట్టూ జిల్లాలలో గత మూడునెలల నుంచి మరింత జోరుపుంజుకుంది ఈ ఏడాది జనవరి వరకు దాదాపు 9లక్షల 37వేల డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ రుసుముల ద్వారా రాష్ట్ర ఖజానాకు సుమారు రూ. 4, 044కోట్ల రాబడి సమకూరింది. పెద్దనోట్ల రద్దు తర్వాత ఇతర రాష్ట్రాలతో పోలిస్తే తెలంగాణలో 10 నుంచి 15 శాతం వృద్ధి ఉన్నట్టు అధికారులు వెల్లడించారు.

2017లో స్థిరాస్తుల క్రయ, విక్రయాల తీరు.. రాబడి

నెల	రిజిస్ట్రేషన్ అయిన డాక్యుమెంట్‌లు	వచ్చిన రాబడి (రూ.కోట్లలో)
జనవరి	60, 084	192.11
ఫిబ్రవరి	68,209	263.34
మార్చి	89,571	296.33
ఏప్రిల్	79,498	329.72
మే	84,921	328.01
జూన్	74,636	343.92
జూలై	96,803	414.91
ఆగస్టు	89,729	337.12
సెప్టెంబర్	85,887	316.77
అక్టోబర్	90,867	336.91
నవంబర్	97,358	397.20
డిసెంబర్	1,19,256	487.98
మొత్తం	9,36,819	4, 044.32

ఛత్తీస్‌గఢ్‌లో 8 మంది మావోయిస్టుల అరెస్టు

కొత్తగూడెం క్రైం, జనవరి 3: ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా పోలీసులు ఎనిమిది మంది మావోయిస్టులను బుధవారం అదుపులోకి తీసుకున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నారాయణ్‌పూర్ జిల్లా సోన్‌పూర్, బ్రాహ్‌బెడా అటవీ ప్రాంతాల్లో కూంబింగ్ నిర్వహించిన పోలీసులకు జన్‌మిలీషియా దళానికి చెందిన ఎనిమిది మంది మావోయిస్టు దళ సభ్యులు పట్టుబడ్డారు. పోలీసులు వీరిని అదుపులోకి తీసుకొని వీరి వద్ద నుంచి ఏడు మారణాయుధాలను స్వాధీన పర్చుకొని అరెస్టు చేసినట్టు నారాయణ్‌పూర్ జిల్లా ఎస్పీ సంతోష్ సింగ్ స్పష్టం చేశారు.

గర్భస్థ శిశువు పరీక్షలపై వైద్యులకు శిక్షణ

శిక్షణ విధివిధానాల రూపకల్పనకు హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీ ఏర్పాటు

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ నియంత్రణకు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా రాష్ట్రంలోని వైద్యులకు ఆరునెలల ప్రత్యేక శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. గర్భం దాల్చిన సమయంలో, ప్రసవానికి ముందు గర్భంలో ఉండే శిశువు ఆరోగ్య స్థితిపై అంచనా వేసేందుకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇదే సమయంలో గర్భస్థ శిశువు లింగనిర్ధారణపై దృష్టి పెట్టకుండా ఉండేలా వారికి సూచనలు చేయనున్నారు. శిక్షణ విధి విధానాలను రూపొందించేందుకు హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీని ఏర్పాటుచేస్తూ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ తివారీ బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ హైపవర్ ఎక్స్‌పర్ట్ కమిటీ (గవర్నింగ్) కౌన్సిల్‌కు వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ/ప్రిన్సిపల్ సెక్రటరీ/ సెక్రటరీ చైర్మన్‌గా వ్యవహరిస్తారు. మెంబర్ సెక్రటరీలుగా డీఎంఈ, ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ ఉంటారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ వీసీ, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ చైర్మన్/కార్యదర్శి, ప్రజారోగ్య, కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్, ఉస్మానియా మెడికల్ కళాశాల రేడియాలజీ విభాగాధిపతి, పేట్లబురుజు మెటర్నిటీ దవాఖాన గైనకాలజీ, ఓబీఎస్ విభాగాధిపతి, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కమిటీకి సభ్యులుగా ఉంటారు.

శ్యాంప్రసాద్‌రెడ్డి 117 కోట్ల ఆస్తులు జప్తు

హైదరాబాద్, నమస్తేతెలంగాణ: వైఎస్సార్‌సీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తులకు సంబంధించిన వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు బుధవారం శ్యాంప్రసాద్‌రెడ్డికి చెందిన మరో రూ. 117.74 కోట్ల విలువచేసే ఆస్తులను అటాచ్ చేశారు. జగన్ అక్రమాస్తులకు సంబంధించి మనీల్యాండరింగ్‌కు పాల్పడిన వ్యవహారంలో ఇందూప్రాజెక్ట్, ఎంబసీ ప్రాపర్టీ డెవలప్‌మెంట్, వసంత ప్రాజెక్టులకు చెందిన ఆస్తులను అటాచ్ చేసినట్టు ఈడీ అధికారులు పేర్కొన్నారు. జగన్మోహన్‌రెడ్డిపై సీబీఐ నమోదు చేసిన అక్రమాస్తుల కేసులో శ్యాంప్రసాద్‌రెడ్డి పాత్ర ఉన్నట్టు గుర్తించారు. జగన్ కేసులో సీబీఐ నమోదు చేసిన చార్జిషీట్ల ఆధారంగా ఈడీ కూడా రంగంలోకి దిగి ప్రివెన్షన్ ఆఫ్ మనీ లాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్‌ఏ) కింద కేసు నమోదు చేసింది.

చలి వణుకు

జిల్లా	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	29.4	7.0
నిర్మల్	29.4	7.0
మంచిర్యాల	29.4	7.0
కుమ్రంభీం ఆసిఫాబాద్	29.4	7.0
జగిత్యాల	29.5	10.0
జనగామ	30.0	11.0
పెద్దపల్లి	29.8	12.5
వరంగల్ రూరల్	31.0	13.0
కరీంనగర్	33.2	13.0
వికారాబాద్	29.3	13.8
యాదాద్రి భువనగిరి	28.0	14.0
ఖమ్మం	31.0	14.0
మెదక్	30.3	14.2
సంగారెడ్డి	30.3	14.2
సిద్దిపేట	30.3	14.2
నిజామాబాద్	30.9	14.9
కామారెడ్డి	30.9	14.9
సూర్యాపేట	29.0	15.0
రాజన్న సిరిసిల్ల	29.0	15.0
నల్లగొండ	29.4	15.0
జయశంకర్ భూపాలపల్లి	30.0	15.0
మహబూబాబాద్	30.0	15.0
భద్రాద్రి కొత్తగూడెం	31.0	15.0
హైదరాబాద్	28.0	16.0
రంగారెడ్డి	28.0	16.0
మేడ్చల్	28.0	16.0
వరంగల్ అర్బన్	29.0	16.0
నాగర్‌కర్నూల్	30.0	16.0
వనపర్తి	30.8	17.7
మహబూబ్‌నగర్	31.7	18.9
జోగుళాంబ గద్వాల	31.0	20.0

ఆదిలాబాద్‌లో కొనసాగుతున్న చలి

- 7.0 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు
- హైదరాబాద్‌లో సాధారణస్థాయికి చేరిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్ సిటీబ్యూరో/ఆదిలాబాద్ నమస్తే తెలంగాణ ప్రతినిధి: ఆదిలాబాద్ జిల్లాలో బుధవారం 7 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదయింది. మంగళవారం 7.5 డిగ్రీలు రికార్డు కాగా బుధవారం కొంత మేర తగ్గింది. జిల్లా వ్యాప్తంగా కొన్ని రోజులుగా చలితీవ్రత కొనసాగుతున్నది. జిల్లావ్యాప్తంగా చలితీవ్రత మరిన్ని రోజులు కొనసాగే అవకాశం ఉన్నదని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. మరోవైపు హైదరాబాద్‌లో గరిష్ఠ, కనిష్ఠ ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతూ సాధారణస్థాయికి చేరుకున్నాయి. ఫలితంగా చలి ప్రభావం పెద్దగా కనిపించడం లేదు. మంగళవారం ఉదయం 9 గంటల నుంచి బుధవారం ఉదయం 8.30 గంటల వరకు గరిష్ఠ ఉష్ణోగ్రత 30.0, కనిష్ఠ ఉష్ణోగ్రత 17.0 డిగ్రీలుగా నమోదయినట్టు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. బుధవారం ఉదయం 8.30 గంటల నుంచి గురువారం ఉదయం వరకు 28 డిగ్రీలు గరిష్ఠ, 16 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వెల్లడించారు. ఉష్ణోగ్రతల హెచ్చుతగ్గులు సాధారణమేనని, వాతావరణంలో కలిగే మార్పులపై అవి ఆధారపడి ఉంటాయని వివరించారు.



ఉదయం 6 గంటలకు ఆదిలాబాద్‌లోని ఓ రోడ్డుపై పొగమంచు కురుస్తున్న దృశ్యం

జడ్జీల కసరత్తు

మొదటిపేజీ తరువాయి...

సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని తీర్మానించారని విశ్వసనీయంగా తెలిసింది. దానితోపాటే ఉద్యోగుల విభజనపై కూడా మరో సబ్ కమిటీని ఏర్పాటు చేయనున్నారని సమాచారం. ఈ కమిటీల ఎంపిక బాధ్యతను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్‌కు ఫుల్‌కోర్టు సమావేశం అప్పగించినట్టు తెలుస్తున్నది. భవనాలను పరిశీలించిన తర్వాత మరోసారి సమావేశంకావాలని నిర్ణయించారని విశ్వసనీయ వర్గాలు పేర్కొన్నాయి. కమిటీల ఏర్పాటు నిర్ణయం నేపథ్యంలో ఏపీకి హైకోర్టు విషయంలో కసరత్తు మరింత వేగం పుంజుకున్నట్టేనన్న భావన సర్వత్రా వ్యక్తమవుతున్నది.

ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఆసక్తికర చర్చ!

సుమారు గంటపావుపాటు సాగిన సమావేశంలో ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఆసక్తికర చర్చ జరిగిందని తెలిసింది. తాత్కాలిక భవనాల్లో ఏపీ హైకోర్టు ఏర్పాటుపై ఏపీ ప్రాంతానికి చెందిన, ఏపీ హైకోర్టుకు కేటాయించిన కొందరు న్యాయమూర్తులు అభ్యంతరాలు వ్యక్తంచేశారని సమాచారం. మౌలిక సదుపాయాలు, వసతులపై సందేహాలు లేవనెత్తుతూ ఒకింత ఆందోళన వ్యక్తంచేశారని తెలుస్తున్నది. ఆందోళన వ్యక్తంచేసిన పలువురు న్యాయమూర్తులు.. తమ వాదనలకు మద్దతుగా హైకోర్టు విభజనపై ఉమ్మడి హైకోర్టులో 2015లో దాఖలైన వ్యాజ్యంలో అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కళ్యాణ్ జ్యోతిసేన్‌గుప్తా నేతృత్వంలోని ధర్మాసనం జారీచేసిన ఉత్తర్వులను ప్రస్తావించారని, అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన తర్వాతే హైకోర్టును తరలించాలని కోరారని తెలిసింది. శాశ్వత భవనం నిర్మించిన తర్వాతే హైకోర్టును తరలిస్తే బాగుంటుందనే అభిప్రాయాలు సైతం వ్యక్తమయ్యాయని చెప్తున్నారు. తాత్కాలిక భవనంలోకి హైకోర్టును తరలిస్తే తమకు అమరావతిలో వసతి సౌకర్యాల మాటేమిటంటూ పలువురు న్యాయమూర్తులు గళమెత్తగా.. ఈ విషయాలపై తరువాత చర్చించవచ్చని తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి సూచించారని సమాచారం. న్యాయమూర్తుల మధ్య భిన్నాభిప్రాయాలు తలెత్తిన నేపథ్యంలో ఏసీజే ఓటింగ్‌ను నిర్వహించారని తెలిసింది. ఈ ఓటింగ్‌లో మెజార్టీ న్యాయమూర్తులు ముందుగా.. ఏపీ సర్కార్ ఎంపిక చేసిన భవనాలను పరిశీలించడానికి అంగీకరించారని సమాచారం. పరిశీలన నిమిత్తం ఐదుగురు న్యాయమూర్తులతో కూడిన సబ్‌కమిటీని ఏర్పాటుచేయాలని, దానితోపాటే హైకోర్టు ఉద్యోగుల విభజనకోసం సబ్‌కమిటీని తక్షణం ఏర్పాటు చేయాలని నిర్ణయించారని తెలుస్తున్నది. హైకోర్టు రికార్డుల డిజిటలైజేషన్‌కోసం మరో కమిటీనికూడా ఏర్పాటుచేయాలని ఫుల్‌కోర్టు నిర్ణయం తీసుకుందని సమాచారం. సబ్ కమిటీలను ఏర్పాటు చేసే బాధ్యతను ఏసీజేకు ఫుల్‌కోర్టు అప్పగించినట్టు తెలిసింది.

సౌకర్యాలపై రాజీ పడే ప్రసక్తే లేదు...

అమరావతిలో జస్టిస్ సిటీ ఇంకా పూర్తికాని నేపథ్యంలో ఏపీ హైకోర్టును తాత్కాలిక భవనాల్లో కొనసాగిస్తే ఇబ్బందులు ఎదురవుతాయని సమావేశంలో కొంతమంది న్యాయమూర్తులు ప్రస్తావించారని చెప్తున్నారు. జూన్‌నాటికి హైకోర్టు నిర్వహణకు కావాల్సిన సౌకర్యాలు పూర్తిస్థాయిలో ఏర్పాటుచేయడం సాధ్యం కాదనే అభిప్రాయాలను వ్యక్తం చేసినట్టు సమాచారం. హడావిడిగా హైకోర్టును ఏర్పాటుచేస్తే నిర్వహణ సమయంలో ఇబ్బందులు తలెత్తే ఆవకాశముందని పేర్కొన్నారని తెలిసింది. మరో రెండేండ్లలో శాశ్వత భవనాలు పూర్తయ్యే ఆవకాశముందని ఏపీ సర్కార్ చెప్తున్న విషయాన్ని కొంతమంది న్యాయమూర్తులు ప్రస్తావించారని, తమకు నివాస సముదాయాలు, సిబ్బందికి క్వార్టర్లు తప్పకుండా ఏర్పాటుచేయాల్సిన అవసరముందని పేర్కొన్నారని సమాచారం. ఈ విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని న్యాయమూర్తులు అన్నట్టు తెలుస్తున్నది. దీనితోపాటు ఉద్యోగులకు భత్యాలను పెంచే విషయాన్ని ప్రభుత్వానికి కచ్చితంగా చెప్పాలని మరికొందరు అభిప్రాయపడ్డట్టు తెలిసింది.

న్యాయవాదులను భాగస్వాములను చేయొద్దు!

సమావేశంలో భాగంగా హైకోర్టు విభజనలో న్యాయవాదులను భాగస్వాములనుచేసే అంశం చర్చకు వచ్చినట్లు తెలిసింది. న్యాయవాదులను భాగస్వాములనుచేస్తే మరిన్ని ఇబ్బందులు తలెత్తుతాయని, అయితే న్యాయవాదుల ప్రాక్టీస్‌కు ఇబ్బందులు లేకుండా.. చాంబర్లువంటి విషయాలపై వారి అభిప్రాయాలు తీసుకుంటే బాగుంటుందని న్యాయమూర్తులు సూచించినట్టు సమాచారం. ఉద్యోగుల విభజనపై సబ్ కమిటీని ఏర్పాటుచేసి, విధివిధాలను సైతం రూపొందించాలని నిర్ణయించారని తెలిసింది. తీవ్ర వాదోపవాదాల అనంతరం తాత్కాలిక భవనాల పరిశీలనకోసం కమిటీని ఏర్పాటుచేసే బాధ్యతను ఏసీజేకు అప్పచెప్పారని సమాచారం. త్వరలోనే సబ్‌కమిటీని ఏర్పాటు చేసే ఆవకాశముందని విశ్వసనీయవర్గాలు పేర్కొంటున్నాయి.



హైదరాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో ప్రసంగిస్తున్న టీఎస్‌ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్‌మాదిగ

ఇంకెంతమంది ప్రాణాలు అర్పించాలి?

- ఎస్సీ వర్గీకరణ ఎప్పుడు చేస్తారు?
- కేంద్ర ప్రభుత్వానికి వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రశ్న

అబిడ్స్/ ముషీరాబాద్, నమస్తే తెలంగాణ: ఇంకా ఎంతమంది మాదిగలు ప్రాణాలర్పిస్తే ఎస్సీ వర్గీవరణ చేస్తారని కేంద్ర ప్రభుత్వాన్ని టీఎస్‌ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ మాదిగ ప్రశ్నించారు. బుధవారం నాంపల్లిలోని హైదరాబాద్ జిల్లా కలెక్టరేట్ ఎదురుగా నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ మాదిగల ప్రధాన డిమాండ్ అని, వర్గీకరణ లేకపోవడం వల్ల మాదిగ, మాదిగ ఉపకులాలు తీవ్రంగా నష్టపోతున్నాయని వాపోయారు. గత 23 ఏండ్లుగా తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ కోసం ఉద్యమం నడుస్తుంటే కేంద్ర ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తూ మాదిగ కార్యకర్తలను పొట్టన పెట్టుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. వంద రోజుల్లో వర్గీకరణ చేస్తామన్న బీజేపీ ప్రభుత్వం.. వెయ్యి రోజులైనా ఆ అంశాన్ని పట్టించుకోవడం లేదని విమర్శించారు. కార్యక్రమంలో టీఎస్‌ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దండు సురేందర్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు జన్ను కనకరాజుమాదిగ, రాష్ట్ర కార్యదర్శి ఎద్దుల రవీందర్ మాదిగ, గడ్డం అంజయ్య, సాప కృష్ణ, ప్రవీణ్‌కుమార్, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ కమిషన్ నియామకంపై హర్షం

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు చైర్మన్, సభ్యులను నియమించడంపై టీఎస్‌ఎమ్మార్పీఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ వంగపల్లి శ్రీనివాస్ హర్షం వ్యక్తంచేశారు. బుధవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. చైర్మన్‌గా మాదిగ సామాజిక వర్గానికి చెందిన ఎర్రోళ్ల శ్రీనివాస్‌ను, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు సుంకపాక దేవయ్యను సభ్యునిగా నియమించినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

ఐటీఐహెచ్ టెక్నాలజీతో అక్రమాలకు చెక్!

రిజిస్ట్రేషన్ పన్నుల కింద 45 రోజుల్లో 5.97 కోట్లు వసూలు చేసిన రవాణాశాఖ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర రవాణాశాఖ నూతన టెక్నాలజీని వినియోగించుకుంటూ ఒక పక్క వాహన రిజిస్ట్రేషన్ల అవకతవకలకు చెక్ పెడుతూనే మరో పక్క తన ఆదాయాన్ని పెంచుకుంటున్నది. గతంలో రెండో వాహన రిజిస్ట్రేషన్ల వ్యవహారంలో అక్రమాలు జరిగేవన్న ఆరోపణలుండేవి. దీనికి సంబంధించి రవాణాశాఖలో పలువురు అధికారులను సస్పెండ్ కూడా చేశారు. ఈ నేపథ్యంలో రవాణాశాఖ గత కొంతకాలంగా ఇంటిగ్రేటెడ్ ట్రాఫిక్ ఇన్ఫర్మేషన్ హబ్ (ఐటీఐహెచ్) సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకుంటూ రెండో వాహన రిజిస్ట్రేషన్లలో అక్రమాలకు తావు లేకుండా చేస్తున్నది. రిజిస్ట్రేషన్లు పారదర్శకంగా జరిగేవిధంగా కృషి చేస్తున్నది. రెండో వాహన రిజిస్ట్రేషన్లను గుర్తించడంలో ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధిగమించేందుకు రవాణాశాఖ ఐటీఐహెచ్ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకుందని జేటీసీ రమేశ్ తెలిపారు. ఈ కొత్త టెక్నాలజీ 2017 నవంబర్ 13 నుంచి రవాణాశాఖలో అందుబాటులోకి వచ్చిందన్నారు. కేవలం 45 రోజుల్లోనే 11,993 రెండో వాహనాలను గుర్తించి, సంబంధిత వాహనదారుల నుంచి రిజిస్ట్రేషన్ పన్నుల కింద రూ.5.97 కోట్లు వసూలు చేశామని చెప్పారు. ఈ ఆధునిక టెక్నాలజీ వల్ల గతంలో కంటే ఇప్పుడు ఆదాయం పెరుగుతున్నది. ఐటీఐహెచ్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీని జీహెచ్‌ఎంసీ, పౌరసరఫరాలశాఖలు కూడా వినియోగిస్తున్నాయి.



బుధవారం ఎర్రమంజిల్ జలసౌధలో కాళేశ్వరం ప్రాజెక్టు పనులను ప్రత్యక్ష ప్రసారం ద్వారా సమీక్షిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు

పౌరసత్వం రద్దు ఉత్తర్వులను కొట్టివేయండి

హైకోర్టును ఆశ్రయించిన చెన్నమనేని రమేశ్



హైదరాబాద్, నమస్తే తెలంగాణ: తన పౌరసత్వం చెల్లుబాటు కాదంటూ గత ఏడాది డిసెంబర్ 13న కేంద్ర హోంశాఖ జారీచేసిన రివ్యూ ఉత్తర్వులను కొట్టివేయాలంటూ వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ హైకోర్టును ఆశ్రయించారు. రివ్యూ ఉత్తర్వులతో పాటు గత ఏడాది ఆగస్టు 31న పౌరసత్వం రద్దుచేస్తూ కేంద్ర హోంశాఖ జారీచేసిన ప్రధాన ఉత్తర్వులను సైతం రద్దు చేయాలంటూ ఆయన వ్యాజ్యం దాఖలుచేశారు. పౌరసత్వం కోసం పెట్టుకున్న దరఖాస్తుల్లోతప్పుడు సమాచారమిచ్చారనే ఒకే ఒక్క కారణంతో తన పౌరసత్వం రద్దు చేస్తున్నట్టు కేంద్ర హోంశాఖ ఉత్తర్వులు జారీచేయడం తగదని పేర్కొన్నారు. భారత పౌరసత్వ చట్టంలోని సెక్షన్ 10(3) ప్రకారం దేశానికి హానికరమైన పని చేసిన పక్షంలోనే పౌరసత్వం రద్దుచేసే అధికారం కేంద్ర ప్రభుత్వానికి ఉంటుందని తెలిపారు. ఇప్పటికే తాను జర్మనీ పౌరసత్వాన్ని వదిలేసుకున్నానని, ప్రస్తుతం భారత దేశ పౌరసత్వం కూడా రద్దు చేస్తే తాను ఏ దేశంలోనూ పౌరసత్వంలేని వ్యక్తిగా ఉండాల్సి వస్తుందని తన పిటిషన్‌లో రమేశ్ పేర్కొన్నారు. జర్మనీ పౌరుడిగా ఉన్న సమయంలో భారత దేశంలో వచ్చి సొంతఊరిలో నివాసం ఏర్పాటు చేసుకున్నట్టు తెలియజేశారు. భారత పౌరసత్వానికి అవసరమైన గడువు మేరకు ఇండియాలో నివసించిన తర్వాతే పౌరసత్వం కోసం దరఖాస్తు చేసుకున్నట్టు వివరించారు. దరఖాస్తుల్లో తప్పుడు సమాచారమిచ్చినట్టు పేర్కొనడం సరికాదని విన్నవించారు. కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌ను ప్రతివాదులుగా పేర్కొన్నారు.



బుధవారం హైదరాబాద్‌లో అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు, గోరటి వెంకన్న

వ్యవసాయానికి ప్రత్యేక బడ్జెట్

- అగ్రి డాక్టర్స్ డైరీ ఆవిష్కరణలో మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: వ్యవసాయరంగానికి ప్రత్యేక బడ్జెట్ ప్రవేశపెట్టనున్నట్టు వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు. ఈ ఏడాది రూ.10వేల కోట్ల బడ్జెట్‌ను వ్యవసాయానికి కేటాయించనున్నట్టు పేర్కొన్నారు. బుధవారం అగ్రికల్చర్ కమిషనర్ కార్యాలయంలో తెలంగాణ అగ్రి డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాతా సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను నిర్వహించారు. దీనికి అగ్రి డాక్టర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు కే రాములు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అగ్రి డాక్టర్స్ 2018 డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి పోచారం మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌కు అన్నిశాఖల కంటే వ్యవసాయశాఖ అత్యంత ప్రియమైనదని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గువ్వల బాలరాజు, అంజయ్యయాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ పిడమర్తి, మార్క్‌ఫెడ్ చైర్మన్ లోకబాపురెడ్డి, ఉద్యోగుల సంఘం నాయకుడు మేడి రమేశ్ పాల్గొన్నారు.



సచివాలయంలోఎక్సైజ్ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న మంత్రిపద్మారావుగౌడ్, బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాద్, ఉన్నతాధికారులు

ఎక్సైజ్ పోలీసులకు సొంత వాహనాలు

- డైరీ ఆవిష్కరణలో ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావుగౌడ్ హామీ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్రంలో ఎక్సైజ్ పోలీసులకు కూడా రాష్ట్ర ప్రభుత్వం సొంత వాహనాలు సమకూర్చుతుందని రాష్ట్ర ఎక్సైజ్‌శాఖ మంత్రి పద్మారావు గౌడ్ హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలోని తన చాంబర్‌లో తెలంగాణ ఎక్సైజ్ గెజిటెడ్ ఆఫీసర్ల అసోసియేషన్ అధ్యక్షుడు వివేకానందరెడ్డి, ప్రధాన కార్యదర్శి హరికిషన్ ఆధ్వర్యంలో రూపొందించిన కొత్త సంవత్సరం డైరీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదాయ సముపార్జనలో ముందున్న ఎక్సైజ్‌శాఖ ఉద్యోగులకు విధి నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఆలోచన చేస్తున్నదని చెప్పారు. కొత్త వాహనాల కొనుగోలుకు ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు సానుకూలంగా ఉన్నారని, త్వరలో వాటిని ఎక్సైజ్‌శాఖకు అందిస్తామని మంత్రి అధికారులకు భరోసా ఇచ్చారు. కుగ్రామలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం లేక కొన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని త్వరలోనే అధిగమిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎక్సైజ్‌శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్, టీఎస్‌బీసీఎల్ చైర్మన్ దేవీప్రసాద్, ఎక్సైజ్ అడిషనల్ కమిషనర్ రాజశేఖర్‌రావు, జాయింట్ కమిషనర్ అజయ్‌రావు, ఓఎస్డీ రాజేశ్వర్‌రావు, అసోసియేషన్ కోశాధికారి గణేశ్‌గౌడ్, గౌరవ అధ్యక్షుడు ఖురేషీ, గౌరవ జనరల్ సెక్రటరీ జీవన్‌సింగ్, ప్రెసిడెంట్లు వెంకటేశ్‌నేత, శీలం శ్రీనివాసరావు, అంజన్‌రావు పాల్గొన్నారు.



బుధవారం సచివాలయంలో పశుసంవర్ధకశాఖ అధికారుల క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, అధికారులు

పశుసంవర్ధకశాఖను బలోపేతం చేస్తాం

- డైరీ ఆవిష్కరణలో మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: పశుసంవర్ధకశాఖను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో చర్యలు తీసుకుంటున్నదని మంత్రి తలసాని శ్రీనివాసయాదవ్ పేర్కొన్నారు. నూతనంగా సిబ్బందిని నియమించడంతో పాటు పదోన్నతులు కల్పించామని తెలిపారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో రూ.5 వేల కోట్లతో చేపట్టిన సబ్సిడీ గొర్రెలపంపిణీ విజయవంతంగా కొనసాగుతున్నదని తలసాని పేర్కొన్నారు. బుధవారం సచివాలయంలో పశుసంవర్ధకశాఖ అధికారుల డైరీ, 2018 క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఇటీవల బదిలీ అయిన పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి సురేశ్‌చందా పశుసంవర్ధకశాఖను బలోపేతం చేసేందుకు ఎంతో కృషిచేశారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, అదనపు కార్యదర్శి రేణుకాదేవి, టీఎస్‌ఎల్డీఏ సీఈవో మంజువాణి, పశుసంవర్ధకశాఖ అధికారుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ బేరిబాబు, వీఏఎస్‌ల అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెంటయ్య, డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

నేడు టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ డైరీ ఆవిష్కరణ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ డైరీ ఆవిష్కరణ సభ గురువారం రవీంద్రభారతిలో జరుగనున్నది. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని టీఎన్జీవో సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనమండలి చైర్మన్ కే స్వామిగౌడ్, తెలంగాణ బేవరేజెస్ కార్పొరేషన్ చైర్మన్ జీ దేవీప్రసాద్, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ నందిని సిధారెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయం ఓఎస్డీ దేశపతి శ్రీనివాస్ అతిథులుగా పాల్గొంటారని తెలిపారు. ఈ సభకు కారం రవీందర్‌రెడ్డి సభాధ్యక్షత వహిస్తుండగా, ప్రధాన కార్యదర్శి ఎం రాజేందర్, అసోసియేట్ ప్రెసిడెంట్ మండడి ఉపేందర్‌రెడ్డి, టీఎన్జీవో మహిళా చైర్‌పర్సన్ బండారు రేచల్ తదితరులు పాల్గొననున్నారు.



బుధవారం టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సంస్థ గెజిటెడ్ అధికారులు క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న టీఎస్‌పీఎస్సీ చైర్మన్ ఘంటా చక్రపాణి తదితరులు

నిధులు త్వరగా విడుదల చేయండి

- కేంద్రాన్ని కోరిన మంత్రి జోగురామన్న బృందం
- పలువురు కేంద్రమంత్రులతో భేటీ
- రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని వినతి

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న బుధవారం ఢిల్లీలో బిజీబిజీగా గడిపారు. పలువురు కేంద్ర మంత్రులను కలిసి రాష్ట్ర అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పలు అభివృద్ధి, సంక్షేమ పథకాల కింద రాష్ట్రానికి రావాల్సిన నిధులను త్వరగా విడుదల చేయాలని కోరారు. ఆయన వెంట ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీలు జీ నగేశ్, సీతారాంనాయక్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు. అనంతరం ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఉన్న గురజాడ సమావేశ మందిరంలో నిర్వహించిన మీట్‌ది ప్రెస్‌లో మంత్రి జోగురామన్న మాట్లాడారు. కేంద్ర మంత్రి మహేశ్‌శర్మను కలిసి ఆదిలాబాద్‌లో లైవ్‌స్టాక్ హెరిటేజ్ ఫామ్, కరీంనగర్‌లో సైన్స్ సెంటర్ ఏర్పాటుపై చర్చించినట్టు తెలిపారు. రూ.185కోట్ల వ్యయంతో లైవ్‌స్టాక్ హెరిటేజ్ ఫామ్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిందని, కేంద్రం వాటా రూ.125కోట్లను విడుదలచేయాలని కేంద్రమంత్రిని కోరానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తన వాటా కింద రూ.45కోట్లు సమకూర్చి, అంకుశ్ స్వచ్ఛంద సంస్థ ఇచ్చే రూ.20 కోట్లతో ప్రాజెక్టును పూర్తిచేస్తుందని జోగురామన్న వివరించారు. గత ఫిబ్రవరి 6న హైదరాబాద్‌కు వచ్చినపుడు ఈ అంశాలను పరిష్కరిస్తానని కేంద్రమంత్రి హామీ ఇచ్చినట్టు గుర్తుచేశారు. సామాజిక, న్యాయశాఖ మంత్రి థావర్ చంద్ గెహ్లాట్‌ను కలిసి బీసీలు, స్కాలర్‌షిప్ సమస్యలపై చర్చించినట్టు మంత్రి పేర్కొన్నారు. కేంద్రానికి ప్రతిపాదించిన 15 కొత్త బీసీ హాస్టళ్ల నిర్మాణానికి అనుమతులను, పోస్ట్‌మెట్రిక్, ప్రీమెట్రిక్ స్కాలర్‌షిప్‌లను త్వరగా మంజూరుచేయాలని కోరామన్నారు. తెలంగాణలో 113 బీసీ కులాలున్నా ఇందులో 85 కులాలనే కేంద్రం ఓబీసీలుగా గుర్తించిందని చెప్పారు. మిగిలిన కులాలను ఓబీసీలుగా గుర్తించకపోవడంతో వారికి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో అన్యాయం జరుగుతున్నదని కేంద్రమంత్రికి తెలిపానన్నారు. ఓబీసీ కమిషన్ ఏర్పాటుతో సమస్య పరిష్కారమవుతుందని, త్వరలోనే ఓబీసీ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామని కేంద్ర మంత్రి గెహ్లాట్ హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధిపై కేంద్ర పర్యాటకశాఖ మంత్రి అల్ఫాన్స్‌తో చర్చించినట్టు మంత్రి పేర్కొన్నారు. జాతీయ, అంతర్జాతీయ సందర్శకులను ఆకర్షించేలా పర్యాటక ప్రాంతాలను తీర్చిదిద్దాలని ప్రభుత్వం కీలక నిర్ణయాలు తీసుకుంటున్నదని రామన్న చెప్పారు. కుంతాల, పొచ్చెర జలపాతాలను జాతీయ ప్రాజెక్టులుగా గుర్తించి అభివృద్ధికి రూ.141 కోట్లతో కేంద్రానికి ప్రతిపాదనలు పంపినట్టు చెప్పారు. భారీ పరిశ్రమల అభివృద్ధిపై కేంద్రమంత్రి అనంత్‌గీతేతో చర్చించానని, రామగుండం ఎరువుల కర్మాగారం అభివృద్ధి, సీసీఐ ఏర్పాటు అంశాలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని జోగురామన్న వివరించారు.



ఢిల్లీలో కేంద్రమంత్రులు మహేశ్ శర్మ, అనంత్‌గీతేను వేర్వేరుగా కలిసి వినతిపత్రాలు అందజేస్తున్న రాష్ట్ర అటవీ, బీసీ సంక్షేమశాఖ మంత్రి జోగురామన్న. చిత్రంలో ఢిల్లీలో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి, ఎంపీ జీ నగేశ్ ఉన్నారు.

సిట్ చేతికి ఫోరెన్సిక్ నివేదికలు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ:

రాష్ట్రంలో సంచలనం సృష్టించిన డ్రగ్స్‌కేసులో చార్జిషీట్లు దాఖలు చేయడానికి ఎక్సైజ్ సిట్‌బృందం రంగం సిద్ధం చేస్తున్నది. పక్కరాష్ట్రాలతోపాటు, విదేశాల నుంచి గుట్టుచప్పుడు కాకుండా ప్రమాదకరమైన మత్తుపదార్థాలను నగరానికి సరఫరాచేస్తున్న డ్రగ్స్ రాకెట్ ముఠాగుట్టును ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ రట్టుచేసింది. హైదరాబాద్‌లో డ్రగ్స్ సరఫరాకు సంబంధించి మొత్తం 12 కేసులు నమోదుచేసింది. వీటిలో 5 కేసులకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదికలు ఎక్సైజ్ సిట్ బృందానికి అందాయి. ఈ నెల 8న మూడు కేసులు, 12వ తేదీన రెండు కేసులపై సిట్ బృందం కోర్టులో చార్జిషీట్లు దాఖలు చేయనున్నట్టు తెలిసింది. దాడుల్లో ఎల్‌ఎస్డీ, ఎండీఎంఏ, కొకైన్ తదితర మత్తు కలిగించే మాదకద్రవ్యాల కేసులు నమోదుకాగా, కొకైన్‌కు సంబంధించిన ఫోరెన్సిక్ నివేదికలు వచ్చాయని అధికారులు వెల్లడించారు.

డ్రగ్స్ కేసులో దర్యాప్తు వేగవంతం
5 కొకైన్ కేసులకు సంబంధించి అందిన నివేదికలు
8,12 తేదీల్లో రెండుదఫాలుగా చార్జిషీట్లు!

24 మంది నమూనాల సేకరణ

డ్రగ్స్‌కేసుల విచారణలో భాగంగా ఎక్సైజ్ సిట్ బృందం 22 మందిని అరెస్టుచేసింది. వారి కాల్ డేటా ఆధారంగా సినీరంగానికి చెందిన 12 మందికి నోటీసులు జారీచేసింది. వారందరినీ విచారించిన సిట్ బృందం ఇద్దరి నుంచి నమూనాలను సేకరించింది. దర్శకుడు పూరి జగన్నాథ్, నటుడు తరుణ్ నుంచి గోళ్లు, వెంట్రుకలు, రక్తనమూనాలను సేకరించారు. మిగిలిన 10 మందికి సాధారణ మెడికల్ ఎగ్జామిన్ చేశారు. ముందుగా అరెస్టుచేసిన 22 మంది, సినీరంగానికి చెందిన ఇద్దరు కలిపి 24 మంది నుంచి సేకరించిన నమూనాలను సిట్ బృందం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించింది. అప్పటి నుంచి దీనిపై పరీక్షలు జరిపిన ఫోరెన్సిక్ అధికారులు తాజాగా 5 కేసుల రిపోర్టులను కోర్టుకు అందించింది. కోర్టు నుంచి నివేదికలు పొందిన ఎక్సైజ్ సిట్ బృందం చార్జిషీట్లు నమోదుచేసే పనిలో నిమగ్నమైంది.

సాక్ష్యాధారాల సేకరణ పూర్తి: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్



డ్రగ్స్ కేసులో దొరికిన లింకుల ఆధారంగా సాక్ష్యాలను సేకరించి నిందితులకు శిక్షపడేలా ప్రణాళికతో ముందుకుసాగుతున్నట్టు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ అకున్ సబర్వాల్ తెలిపారు. బుధవారం ఆయన 'నమస్తే తెలంగాణ ప్రతినిధి'తో మాట్లాడుతూ కేసులో నిందితులు కెల్విన్, మైక్ కమింగ, నిఖిల్‌శెట్టి, బెర్నార్డ్ బెన్, పీయూష్ అలీ, అలెక్స్ విక్టర్, డూండు అనిష్‌ల కాల్‌డేటా ఆధారంగా సినీరంగానికి చెందిన పలువురిని విచారించి ఆధారాలను సేకరించామని చెప్పారు. నిందితులిచ్చిన వాంగ్మూలాలు, సిట్ అధికారుల వద్ద ఉన్న సాక్ష్యాలను క్రోడీకరించి కేసు దర్యాప్తు చేసినట్టు వివరించారు.

నేటి నుంచి డీఎన్‌ఏ బార్‌కోడింగ్‌పై సదస్సు

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: విశ్వంలో ఏ రకం ప్రాణి జన్యువు ఏమిటి? వాటి మూలమెక్కడ! వాటి రక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే విషయాలను సమగ్రంగా కనుక్కోవడానికి డీఎన్‌ఏ బార్‌కోడింగ్ విధానాన్ని అవలంబిస్తున్నారు. దేశంలో కొత్తరకాల ప్రాణులను కనుక్కొని వాటి మనగడకు అవసరమైన పరిశోధనలు చేస్తున్న జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్‌ఐ) డీఎన్‌ఏ బార్‌కోడింగ్ అంశంపై రాజేంద్రనగర్ అత్తాపూర్‌లోని జీఎస్‌ఐ ఫ్రెష్ వాటర్ బయోలజీ రీజినల్ సెంటర్‌లో ఈ నెల 4 నుంచి రెండురోజుల సదస్సు నిర్వహిస్తున్నదని జీఎస్‌ఐ ఫ్రెష్ వాటర్ బయోలజీ రీజినల్ సెంటర్ ఆఫీస్ ఇంచార్జి దీపా జైస్వాల్ వెల్లడించారు.

త్రిపుల్ తలాక్‌కు మేము వ్యతిరేకం: సీపీఐ

హైదరాబాద్, నమస్తే తెలంగాణ: 'త్రిపుల్ తలాక్'కు సీపీఐ ఎప్పుడూ వ్యతిరేకమేనని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. ఈ విషయంలో ముస్లింలో అంతర్గతంగా మార్పు రావాలని సీపీఐ మొదటినుంచి కోరుతున్నదని తెలిపారు. మరింత పటిష్ఠంగా త్రిపుల్ తలాక్ బిల్లును రూపొందించాలంటే మొదట దాన్ని సెలక్ట్ కమిటీ లేదా పార్లమెంట్ స్టాండింగ్ కమిటీకి నివేదించాలని డిమాండ్‌చేశారు. బుధవారం మఖ్దూంభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. త్రిపుల్ తలాక్ చట్టం మంచిదే అయినా, ప్రమాదకర నిబంధనలతో చట్టం ఉద్దేశం నెరవేరదని సురవరం అభిప్రాయపడ్డారు.

ముగ్గురు ఐఏఎస్‌లకు పదోన్నతులు

మొదటిపేజీ తరువాయి...

అధికారి కే నిర్మల డిప్యూటేషన్‌ను ఈ ఏడాది అక్టోబర్ 30 వరకు పొడిగించారు. కాగా రెండో విడుత ఐఏఎస్‌ల బదిలీలు నేడో.. రేపో ఉండే అవకాశం ఉన్నట్టు సమాచారం. రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి ఎన్నడూ జరుగనంత భారీస్థాయిలో మంగళవారం ఐఏఎస్ అధికారుల బదిలీలు జరిగిన విషయం తెలిసిందే. ప్రభుత్వ పథకాల అమలు, ప్రాధాన్యాలు, అధికారుల పనితీరు తదితర అంశాలే కొలమానంగా రాష్ట్ర ప్రభుత్వం బదిలీలు చేపట్టినట్టు తెలుస్తున్నది. పథకాల అమలు, పనితీరు ఆధారంగానే బదిలీలు జరిగినట్టు అధికారవర్గాల్లో సైతం చర్చ జరుగుతున్నది. రెండో విడుత బదిలీల్లో 8 జిల్లాల కలెక్టర్ల మార్పు ఉండనున్నట్టు సమాచారం. దీంతోపాటు కొందరు స్పెషల్ చీఫ్ సెక్రటరీలు, ప్రిన్సిపల్ సెక్రటరీలు, సెక్రటరీల శాఖలు మారే అవకాశం ఉన్నదని తెలుస్తున్నది. రెండో విడుత బదిలీల్లో కొందరికి పదోన్నతులు కల్పించి కొత్త బాధ్యతలను అప్పగించే అవకాశం కూడా ఉన్నది. బుధవారం ముగ్గురు ఐఏఎస్‌లకు కార్యదర్శి హోదాను కల్పించడం గమనార్హం. 1988 బ్యాచ్‌కు చెందిన ఆరుగురు ఐఏఎస్‌లకు ముఖ్య కార్యదర్శులుగా పదోన్నతి లభించనున్నట్టు సమాచారం. రెండో విడుతలో భాగంగా పూర్తి అదనపు బాధ్యతలు (ఎఫ్‌ఏసీ) ఉన్న శాఖలకు సొంతంగా అధికారులను నియమించడంపై ప్రభుత్వం కసరత్తు చేస్తున్నది. అలాగే కొందరు కలెక్టర్లకు పక్క జిల్లాల బాధ్యతలు అప్పగించారు. అలాంటి చోట కొత్తగా పోస్టింగులు ఇచ్చి, అదనపు బాధ్యతల భారాన్ని తగ్గించే అవకాశం ఉన్నది. కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉన్న కన్ఫర్డ్ ఐఏఎస్‌లపై.. అక్కడి నుంచి వచ్చే ఆదేశాల ఆధారంగా అధికారులకు జిల్లాల బాధ్యతలను అప్పగించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

కనకదుర్గ గుడిలో క్షుద్రపూజలపై

ఏపీ ప్రభుత్వం సీరియస్

- ఈవో సూర్యకుమారిపై వేటు

హైదరాబాద్/ అమరావతి, నమస్తేతెలంగాణ: ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై ఉన్న కనకదుర్గమ్మ గుడిలో కలకలంరేపిన క్షుద్రపూజల ఘటనపై ఆ రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా స్పందించింది. ఆలయ ఈవో సూర్యకుమారిని పదవి నుంచి తొలిగిస్తూ, సింహాచలం ఈవో రామచంద్రమోహన్‌కు తాత్కాలిక ఈవో బాధ్యతలను అప్పగిస్తూ దేవాదాయశాఖ జీవో విడుదలచేసింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఏపీ సీఎం చంద్రబాబు బుధవారం విజయవాడ నగర పోలీస్‌కమిషనర్ గౌతమ్ సవాంగ్‌ను ఆదేశించారు. ఘటనపై వెంకటేశ్వరరావును విచారణాధికారిగా నియమించారు. డిసెంబరు 26న అర్ధరాత్రి దుర్గగుడిలో క్షుద్రపూజలు నిర్వహించారనే విషయం వెలుగులోకి వచ్చింది. అమ్మవారికి భైరవీ పూజలు నిర్వహించినట్టు తెలుస్తున్నది. ఆలయంతో సంబంధంలేని వ్యక్తి పూజలు నిర్వహించగా, ఆలయ ప్రధాన అర్చకులు బద్రీనాథ్ తన కుటుంబసభ్యులతో పాల్గొన్నట్టు ప్రచారం జరిగింది. దుర్గగుడిలో తాంత్రిక పూజలు జరుగలేదని ఈవో సూర్యకుమారి బుధవారం మీడియాకు తెలిపారు. అర్ధరాత్రి పూజలు నిర్వహించింది నిజమేనని, తనతోపాటు మరోపూజారి పాల్గొన్నారని పూజారి రాజా పోలీసులకు వెల్లడించినట్టు తెలిసింది. టీడీపీలో కీలక యువనేతకు ఉన్నతమైన పదవి కోసమే క్షుద్రపూజలు నిర్వహించారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానంద స్వామి ఆగ్రహం వ్యక్తంచేశారు.



విజయవాడ పుస్తక ప్రదర్శనలో

ఉద్రిక్తత

సైబాబా పుస్తకావిష్కరణకు అడ్డు

హైదరాబాద్: విజయవాడలో నిర్వహిస్తున్న పుస్తక మహోత్సవంలో స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకుంది. సైబాబా రచించిన మొఖామి పుస్తకాన్ని విజయవాడ పుస్తక ప్రదర్శన సందర్భంగా ప్రముఖ కవి ఖాదర్ మొహియుద్దీన్‌తో ఆవిష్కరింపజేసే విషయంలో ఘర్షణ జరిగింది. తెలంగాణ ఉద్యమంలో ఆంధ్ర ప్రజలను కించపర్చేలా సైబాబా మాట్లాడారని, అలాంటి వ్యక్తి పుస్తకాన్ని ఇక్కడ ఎలా ఆవిష్కరిస్తారని పలువురు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది వివాదానికి దారితీయడంతో పోలీసులు జోక్యం చేసుకుని పరిస్థితిని సద్దుమణిగేలా చేశారు.

చివరి భూములకు చిక్కు

మొదటిపేజీ తరువాయి...

చివరి భూముల రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతున్నది. ఇప్పుడు కరెంటు పుష్కలంగా ఉండటంతో బోర్లు, బావుల కింద ముందుగానే నాట్లు వేసుకున్న రైతులు నిర్ణీత షెడ్యూల్‌కు ముందుగానే సాగునీటిని అడుగుతున్నారని మూసీ కుడి కాల్వపై పాములపహాడ్ వద్ద బుధవారం మధ్యాహ్నం సరఫరాను పర్యవేక్షిస్తున్న ఏఈ ఎన్ రమేశ్ 'నమస్తే తెలంగాణ'కు తెలిపారు. కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం.. అన్నట్లుగా ఒకవైపు చివరి భూముల రైతులు, ప్రజాప్రతినిధుల ఒత్తిడి.. మరోవైపు నీటిపారుదల శాఖ అధికారులపై ఒత్తిడి తీవ్రంగా తయారైంది. రెవెన్యూ, వ్యవసాయ శాఖలతో నీటిపారుదలశాఖ సమన్వయం చేసుకుని, రైతుల్లో చైతన్యం తీసుకురావడమే పరిష్కారమని నిపుణులు సూచిస్తున్నారు. రైతులు 4-5 గంటల పాటు మోటర్లు నడిపి, ఆపేస్తే సమస్య ఉండదు.. కానీ 24 గంటల పాటు నడపడమే అసలు సమస్య అని ఎస్సారెస్పీ సీఈ శంకర్ అభిప్రాయపడ్డారు. దీనిపై రైతుల్లో అవగాహన పెంచేందుకు రెవిన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో చర్యలు చేపడుతామన్నారు.

కాకతీయ కాల్వపై మూడు వేల మోటర్లు

ఎస్సారెస్పీ కింద ఈ యాసంగికి 5.60లక్షల ఎకరాలకు సాగునీరివ్వాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. ఎల్‌ఎండీ ఎగువన 4.07 లక్షల ఎకరాలకు 33.50 టీఎంసీలు, ఎల్‌ఎండీ దిగువన 1.52 లక్షల ఎకరాలకు 12 టీఎంసీల నీటి విడుదలకు ప్రణాళిక సిద్ధమైంది. ఎల్‌ఎండీ ఎగువ ఆయకట్టు కోసం గత నెల 25న ఎస్సారెస్పీ నుంచి కాకతీయ కాల్వకు నీటిని విడుదలచేశారు. షెడ్యూల్ ప్రకారం తడి సమయం ముగియడంతో ఈ నెల 2న నీటి విడుదల నిలిపివేశారు. సాధారణంగా కాల్వలోకి ఐదు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాల్సి ఉంది. ఎలాగూ 116 కిలోమీటర్ల పరిధిలో రైతులు మోటర్లతో తోడుకుంటారనే అనుభవంతో అధికారులు మరో 500 క్యూసెక్కులు కలిపి.. 5500 క్యూసెక్కులు వదిలారు. ఈ నెల ఒకటో తేదీ అర్ధరాత్రి నుంచి 24 గంటల విద్యుత్ సరఫరా మొదలైంది. దీంతో రైతులు నిరంతరాయంగా మోటర్ల ద్వారా నీటిని మళ్లిస్తున్నారు. కాకతీయ కాల్వపై ఎల్‌ఎండీ వరకు 116 కిలోమీటర్ల పరిధిలోనే ఏకంగా మూడు వేల మోటర్లతో నీటిని తోడుతున్నట్టు అధికారులు ప్రాథమిక సర్వేలో గుర్తించారు. ఇందులో ఐదు హెచ్‌పీ నుంచి 10 హెచ్‌పీ మోటర్లు కూడా ఉన్నాయంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతుంది. ఈ క్రమంలోనే సుల్తానాబాద్ మండల పరిధిలోకి వచ్చేసరికి కాల్వలో కనీసంగా రెండు వేల క్యూసెక్కుల ప్రవాహం కనిపించాల్సిన చోట.. 1100 క్యూసెక్కులే ఉందని ఎస్సారెస్పీ చీఫ్ ఇంజినీర్ శంకర్ తెలిపారు. కాగా ఎల్‌ఎండీ దిగువన 1.60 లక్షల ఎకరాలకు యాసంగి కింద సాగునీరు ఇచ్చేందుకు నిర్ణయించిన దరిమిలా బుధవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్ నీటిని విడుదలచేశారు. 2200 క్యూసెక్కులు వదులగా.. డీబీఎం-24 వరకు నీళ్లియ్యాలనేది అధికారుల ప్రణాళిక. కానీ తాజా అనుభవం దృష్ట్యా చివరి భూముల దగ్గరికిపోయే సరికి పరిస్థితి ఎలా ఉంటుందనే ఆందోళన అధికారుల్లోనూ వ్యక్తమవుతున్నది. ఈ సమస్య ఎమ్మెల్యేలు, మంత్రులదాకా వెళ్లడంతో పరిస్థితిని చక్కదిద్దేందుకు అధికారులు రంగంలోకి దిగారు.

పలుచోట్లా ఇదే సమస్య..

మూసీ కుడి కాల్వ చివరి భూముల రైతులు కూడా ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ కాల్వ ఎగువన ఉన్న పలు గ్రామాల రైతులు వందల మోటర్లతో నీటిని తోడుతుండుతుండటంతో దిగువ ఆయకట్టుకు సాగునీరు అందడంలేదనే ఆందోళన వ్యక్తమవుతున్నది. ఈసారి మూసీ కింద 4.343 టీఎంసీలతో 30వేల ఎకరాలకు సాగునీరు అందించాలని నిర్ణయించారు. కానీ.. 30 కిలోమీటర్ల పొడవున ఉన్న కుడి కాల్వ పరిధిలో ఎగువన మోటర్లతో తోడుతుండటంతో దిగువన ఉన్న కేతెపల్లి, పెన్‌పహాడ్ మండలాల పరిధిలోని చివరి భూముల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎగువన కొందరు ఇష్టారాజ్యంగా తూములు తెరువడం, కాల్వ కూడా సరిగాలేకపోవడంతో తమకు నీరందడం లేదని అనంతారం గ్రామానికి చెందిన గజ్జల ధర్మారెడ్డి, మల్గిరెడ్డి అనంతరెడ్డి తెలిపారు. ఎలిమినేటి మాధవరెడ్డి ప్రాజెక్టుతోపాటు నాగార్జునసాగర్ ఎడమ కాల్వ కింద ఉన్న డిస్ట్రిబ్యూటరీల్లోనూ ఇదే పరిస్థితి. చివరి భూముల సమస్య (టెయిల్‌ఎండ్) ఆది నుంచి ఉన్నదే. టీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రత్యేకంగా నీటిపారుదల శాఖ ఈ సమస్యను అధిగమించేందుకు అనేక మార్గాలు అన్వేషించింది. మధ్యప్రదేశ్‌లో విజయవంతమైన టెయిల్ టు హెడ్ విధానాన్ని అమలుచేయగా.. గతేడాది చాలా ప్రాజెక్టుల కింద మంచి ఫలితాలు వచ్చాయి. ఆన్‌అండ్‌ఆఫ్ పద్ధతిన సాగునీటి విడుదల కూడా నీటి ఆదాకు దోహదపడుతుందని అధికారులు చెప్తున్నారు.

సమస్య ఇలా..

- ఆరుతడి పంటలకు మొగ్గుచూపాలని పదేపదే సూచిస్తున్నా.. రైతులందరూ భారీ ఎత్తున వరి సాగుచేస్తున్నారు. దీంతో నీటిని మొదట్లో భూములు ఉన్న రైతులు పెద్ద ఎత్తున వినియోగించడంతో సమస్య ఉత్పన్నమవుతున్నది.
- గతంలో కరెంటుపై నమ్మకం లేక, ఆయకట్టేతర రైతులు కాల్వ నీటిపై ఆశలు పెట్టుకునే వారు కాదు. ఇప్పుడు కరెంటు మంచిగా ఉండటంతో ఒకట్రెండు లక్షలు ఖర్చు చేసైనా 2, 3 కిలోమీటర్ల పైపులైన్లు వేసుకొని మోటర్లతో తోడుకుంటున్నారు.
- నిరంతర, ఉచిత 24 గంటల కరెంటు సరఫరా మొదలుకావడంతో కాల్వలపై పెట్టిన మోటర్లు విరామం లేకుండా నడుస్తున్నాయి.

పరిష్కారం ఇలా..

ఇతర శాఖల సమన్వయంతో నీటిపారుదల శాఖ అధికారులు పకడ్బందీ పర్యవేక్షణ చేపట్టడంతో పాటు ప్రధానంగా రైతుల్లో అవగాహన పెరిగి.. చైతన్యం ప్రదర్శించాలి. 24 గంటల కరెంటు సరఫరా దరిమిలా అధికార యంత్రాంగం మరింత అప్రమత్తం కావాల్సిన అవసరముంది.

హెటిరో నుంచి బయోసిమిలర్ ఔషధం

హైదరాబాద్, జనవరి 3: ఔషధ తయారీ సంస్థ హెటిరో..దేశీయ మార్కెట్లోకి బయోసిమిలర్ అడాలిముమాబ్‌ను 'మబురా' బ్రాండ్‌తో విడుదల చేసింది. శరీరంలో పెరిగిన కణితిని నిర్వీర్యం చేయడానికి ఈ మబురా ఔషధం ఉపయోగపడనున్నదని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ బయోసిమిలర్ ఔషధాన్ని భారత్‌లో మార్కెటింగ్, డిస్ట్రిబ్యూషన్‌ను హెటిరో నిర్వహించనున్నది. పూర్తిగా మానవ మోనోక్లోనిక్ యాంటీబాడి అయిన అడాలిముమాబ్‌కు 2002లో మొదటిసారిగా అమెరికా నియంత్రణ మండలి ఎఫ్‌డీఏ అనుమతినిచ్చింది. ఈ ఔషధాన్ని హైదరాబాద్‌లో ఉన్న ప్లాంట్లోనే తయారు చేస్తున్నట్లు కంపెనీ బీఎస్‌ఈకి సమాచారం అందించింది. మబురాను రుమటాయిడ్ ఆర్థరైటీస్, ఆటో ఇమ్యూన్ వ్యాధులైనటువంటి సోరియాటిక్ ఆర్థరైటీస్, యాంకీలోజింగ్ స్పాండిలైటిస్, కోన్స్ డీసీజీ, అల్సరేటివ్ కోలైటీస్ మొదలైన వ్యాధులను నియంత్రించడానికి ఉపయోగించనున్నారు. 40 ఎంజీ కలిగిన ఈ ఔషధం సిరంజి రూపంలో లభించనున్నది.

భారత్ బయోటెక్ 'టైఫాయిడ్' వ్యాక్సిన్‌కు డబ్ల్యూహెచ్‌వో అనుమతి

హైదరాబాద్, జనవరి 3: రాష్ట్రానికి చెందిన ప్రముఖ ఔషధాల తయారీ సంస్థ భారత్ బయోటెక్..టైఫాయిడ్ జ్వరాన్ని నియంత్రించేందుకు తయారు చేసిన వ్యాక్సిన్‌కు వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్(డబ్ల్యూహెచ్‌వో) ముందస్తు అనుమతినిచ్చింది. ఈ వ్యాక్సిన్‌ను తయారు చేయడంతో యూనిసెఫ్‌కు, పాన్-అమెరికా హెల్త్ ఆర్గనైజేషన్(పీఏహెచ్‌వో), గేవి అనుబంధ దేశాలకు సరఫరా చేయాల్సి ఉంటుందని కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. ఆరు నెలల వయస్సు కలిగిన చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు దీర్ఘకాలికంగా టైఫాయిడ్ జ్వరం రాకుండా ఈ వ్యాక్సిన్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని కంపెనీ సీఎండీ కృష్ణ ఎల్లా తెలిపారు. 2001 నుంచి భారత్ బయోటెక్..ఈ టైప్‌బార్ టీసీవీ రూపొందించడానికి అంకితమైనదని, ఈ ఔషధానికి సంబంధించిన కీలక చర్యలు, ముఖ్యంగా క్లినికల్ ట్రయల్స్‌ను నిర్వహించిన తర్వాతనే మార్కెట్లోకి విడుదల చేశామని చెప్పారు. 25 గ్రాముల లేదా ఒక డోస్ కలిగిన ఈ వ్యాక్సిన్‌ను తీసుకున్నవారి రక్తం కనీసం ఐదేండ్ల పాటు ఎలాంటి రోగాల బారిన పడకుండా ఉంటుంది. అంతర్జాతీయ హెల్త్ మెట్రిక్స్ అండ్ ఎవాల్యుయేషన్(ఐహెచ్ఎంఇ) అంచనా ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 2016లో 1.2 కోట్ల కేసులు నమోదవగా, వీరిలో 1.30 లక్షల మంది మరణించారు. సాల్మోనెల్లా టైఫీ(ఎస్.టైఫీ) బ్యాక్టీరియా ద్వారా ఈ టైఫాయిడ్ జ్వరం వస్తున్నది. కలుషిత ఆహార పానీయాలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధి బారిన పడే అవకాశాలున్నాయి. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఆండ్ర్యూ పొలార్డ్ మాట్లాడుతూ..అంతర్జాతీయ ఔషధ మార్కెట్లో మరో మైలు రాయి నమోదు చేసుకున్నదని, ముఖ్యంగా టైప్‌బార్ టీసీవీ ఔషధానికి వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ ముందస్తు అనుమతులు మంజూరు చేయడం విశేషమన్నారు. దీంతో ప్రజల జీవన ప్రమాణాలు మరింత పెరిగే అవకాశం ఉంటుందన్నారు. ఈ నేపథ్యంలో టైఫాయిడ్ వ్యాధితో బాధపడుతున్న వారి సంఖ్య క్రమంగా తగ్గుముఖం పట్టేందుకు ఆస్కారం ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా భారత్ బయోటెక్ 50 వేల డోస్‌లను యూనిసెఫ్‌కు ఉచితంగా అందచేయనున్నది.

ఐఐఎఫ్‌టీ విద్యార్థులకు బంపర్ ఆఫర్

■ రూ.95 లక్షల వార్షిక వేతన ప్యాకేజీనిచ్చిన దిగ్గజ సంస్థలు

న్యూఢిల్లీ, జనవరి 3: విదేశీ వాణిజ్య భారతీయ ఇనిస్టిట్యూట్ (ఐఐఎఫ్‌టీ) విద్యార్థులు బంపర్ ఆఫర్‌ను కొట్టేశారు. అగ్రశ్రేణి సంస్థల నుంచి ఏకంగా రూ.95 లక్షలకుపైగా వార్షిక వేతన ప్యాకేజీలను అందుకున్నారు మరి. ఐఐఎఫ్‌టీలో జరిగిన ప్రాంగణ నియామకాల్లో పాల్గొన్న దిగ్గజ కంపెనీలు.. నలుగురు విద్యార్థులకు ఏటా 1,50,000 డాలర్ల (రూ.95 లక్షలకుపైగా) జీతం ఇస్తామంటూ ముందుకొచ్చాయి. కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఈ ఇనిస్టిట్యూట్ నడుస్తుండగా, మరో ఏడుగురు విద్యార్థులు యేటా 80,000 డాలర్ల సాలరీ ఆఫర్లను అందుకున్నట్లు ఐఐఎఫ్‌టీ వర్గాలు తెలిపాయి. 'మా విద్యార్థులకు అంతర్జాతీయ నియామకాల్లో మంచి ఆదరణ లభిస్తున్నది. బహుళజాతి సంస్థలు పెద్ద ఎత్తున ఉద్యోగాల్లోకి తీసుకుంటున్నాయి' అని బుధవారం ఓ ప్రకటనలో ఐఐఎఫ్‌టీ ఆనందం వ్యక్తం చేసింది. దక్షిణ అమెరికా, థాయిలాండ్, ఆఫ్రికా, ఆగ్నేయాసియా దేశాల్లో మొత్తం 31 మంది ఐఐఎఫ్‌టీ విద్యార్థులు వివిధ కీలక హోదాల్లో పనిచేస్తున్నారని తెలిపింది. బ్రిటీష్ టెలికం, డీబీఎస్, గోద్రెజ్, హీరో మోటోకార్ప్, మదర్ డెయిరీ, షాపూర్జీ పల్లోంజీ, టెట్రా పార్క్, టీవీఎస్ మోటార్స్ కంపెనీలు తమ విదేశీ వ్యాపార విభాగాల్లో వీరిని నియమించుకున్నట్లు వివరించింది. దేశీయ సగటు వార్షిక వేతనం రూ.18.27 లక్షలుగా ఉంటే, వీరు మాత్రం రూ.19.23 లక్షలు పొందుతున్నట్లు స్పష్టం చేసింది.

ఫ్యూచర్ గ్రూపు చేతికి స్నాప్‌డీల్ లాజిస్టిక్ సంస్థ!

న్యూఢిల్లీ, జనవరి 3: కిశోర్ బియానీ నాయకత్వం వహిస్తున్న ఫ్యూచర్ గ్రూపు.. స్నాప్‌డీల్‌కు చెందిన లాజిస్టిక్ సంస్థయైన 'ఉల్కాన్ ఎక్స్‌ప్రెస్'ను కొనుగోలు చేయబోతున్నట్లు సమాచారం. ఒప్పందం విలువ రూ.50 కోట్లు స్థాయిలో ఉంటుందని అంచనా. సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలనే ఉద్దేశంతో ఫ్యూచర్ గ్రూపు ఈ కొనుగోలుకు సిద్ధమైనట్లు ఆ వర్గాలు వెల్లడించాయి. వచ్చే కొన్ని వారాల్లో ఈ ఒప్పందం పూర్తికానున్నట్లు తెలుస్తున్నది. దీంతో ఉల్కాన్‌కు చెందిన ఉద్యోగులు ఫ్యూచర్ గ్రూపు కిందకు రానున్నారు. ఈ విషయంపై ఇరు సంస్థల ప్రతినిధులు స్పందించడానికి నిరాకరించారు. ప్రస్తుతం ఉల్కాన్ ఎక్స్‌ప్రెస్ 100 నగరాల్లో డిస్ట్రిబ్యూషన్ సేవలు కలిగివున్నది.

పోస్టల్ పేమెంట్ బ్యాంక్ విస్తరణ

■ ఏప్రిల్ నాటికి 650 శాఖలు

న్యూఢిల్లీ, జనవరి 3: ఏడాదిక్రితం పేమెంట్ బ్యాంక్ సేవలను ఆరంభించిన ప్రభుత్వరంగ సంస్థ తపాలశాఖ విస్తరణ బాట పట్టింది. ప్రస్తుత సంవత్సరం ఏప్రిల్ చివరినాటికి దేశవ్యాప్తంగా 650 శాఖలను ప్రారంభించాలనుకుంటున్నట్లు లోక్‌సభకు కేంద్ర కమ్యూనికేషన్ శాఖ మంత్రి మనోజ్ సిన్హా లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. పైలెట్ ప్రాజెక్టు కింద జనవరి 30, 2017లో రాయ్‌పూర్(ఛత్తీస్‌గఢ్), రాంచి(జార్ఖండ్)లలో శాఖలను ఆరంభించింది. అయినప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి శాఖలను ప్రారంభించలేదని ఆయన వెల్లడించారు. పేమెంట్ బ్యాంక్ సేవలు అందించడానికి గతేడాది జనవరి 20న సంస్థకు రిజర్వు బ్యాంక్ లైసెన్స్‌ను జారీ చేసింది.

సెప్టెంబర్‌లో డాటా వినిమయం 1.6 జీబీ

భారత్‌లో డాటా వినిమయం శరవేగంగా పుంజుకుంటున్నది. సెప్టెంబర్ 2017లో దేశవ్యాప్తంగా డాటా వినియోగం సరాసరిగా 1.6 జీబీలుగా ఉందని పార్లమెంట్‌కు కేంద్రం తెలిపింది. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 70 ఎంబీలు మాత్రమే. డిజిటల్ పేమెంట్స్, ఎలక్ట్రానిక్ డెలివరీ సేవల పరిధిలోకి వచ్చేవారి సంఖ్య గణనీయంగా పెరుగడం ఇందుకు కారణమని కేంద్ర ఐటీ మంత్రి రవి శంకర్ ప్రసాద్ లోక్‌సభకు తెలిపారు. టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ రూపొందించిన నివేదిక ప్రకారం జూన్ 2014లో సరాసరి డాటా వినిమయం 70.10 ఎంబీలు మాత్రమేనన్నారు. అలాగే ఇంటర్నెట్ వినియోగదారుల సంఖ్య 25 కోట్ల నుంచి 42 కోట్లకు చేరుకున్నారు.

ఆ ఇద్దరిని బోర్డు నుంచి తప్పించండి

■ ఇన్ఫోసిస్‌కు సూచించిన బాల

హైదరాబాద్, జనవరి 3: దేశంలో రెండో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ ఇన్ఫోసిస్ సీఈవోగా పదవీ బాధ్యతలు స్వీకరించిన సలీల్ పరేఖ్ వెంటనే బోర్డును పునర్వ్యవస్థీకరించాలని మాజీలు విజ్ఞప్తి చేస్తున్నారు. మాజీ కో-చైర్మన్ రవి వెంకటేసన్, మాజీ ఆడిట్ కమిటీ చైర్మన్ రూపా కుద్వేలను వెంటనే బోర్డు నుంచి తప్పించాలని కంపెనీ మాజీ సీఎఫ్‌వో వీ బాలకృష్ణన్ సూచించారు. నందన్ నీలేకని నాయకత్వంలో నడుస్తున్న సంస్థ బోర్డును వెంటనే పునరుద్ధరించాల్సిన అవసరం ఉన్నదని, కో-చైర్మన్, ఆడిట్ కమిటీ చైర్మన్ స్థానంలో నూతన వ్యక్తులను నియమించాలన్నారు. కంపెనీ మాజీ సీఎఫ్‌వో రాజీవ్ బన్సల్ కూడా గత నెలలో ఇదే విషయాన్ని ప్రస్తావించారు. సీఈవోగా నియమితులైన పరేఖ్‌కు అవకాశాలతోపాటు ఒత్తిడి కూడా ఎదుర్కొక తప్పదని వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ కన్సల్టింగ్ సంస్థకు పరేఖ్ నాయకత్వం వహించడం ఆ అనుభవం ఇక్కడ ఉపయోగపడనున్నదని బాల పేర్కొన్నారు.

అమ్మో.. ప్రభావిత అంశాలెన్నెన్నో

ఈసారి స్టాక్ మార్కెట్లను శాసించనున్న అనేక పరిణామాలు

బడ్జెట్, ఆర్థిక ఫలితాలు, వర్షాలు, ముడి చమురు ధరలు.. ఇలా మరెన్నో

మదుపరులు ఆచితూచి అడుగులేయొచ్చన్న నిపుణులు



న్యూఢిల్లీ, జనవరి 3:

కేంద్ర బడ్జెట్, త్రైమాసిక ఫలితాలు, అసెంబ్లీ ఎన్నికలు, వర్ష సమాచారం, ముడి చమురు ధరలు ఈ ఏడాది స్టాక్ మార్కెట్లను ప్రభావితం చేస్తాయని నిపుణులు అంచనా వేస్తున్నారు. గతేడాది సరికొత్త రికార్డులను సృష్టించిన సూచీలపై ఈ ఫిబ్రవరిలో ప్రకటించే వార్షిక బడ్జెట్ ప్రభావం ఎక్కువగా ఉండొచ్చని, అంతకంటే ముందు అక్టోబర్-డిసెంబర్‌కుగాను ప్రభుత్వ, ప్రైవేట్ రంగ సంస్థలు వెల్లడించే త్రైమాసిక ఆర్థిక ఫలితాల ప్రభావం కనిపించవచ్చని అరిహంత్ క్యాపిటల్ మార్కెట్స్ హోల్‌టైమ్ డైరెక్టర్ అనితా గాంధీ అన్నారు. ఎనిమిది రాష్ర్టాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికలు, వర్షాలు, అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరల ఆధారంగా కూడా ట్రేడ్ అవుతాయని అంచనా వేశారు. సెన్సెక్స్ నిరుడు 7,430.37 పాయింట్లు ఎగబాకగా, డిసెంబర్ 27న 34,137.97 పాయింట్ల గరిష్ఠ స్థాయిని తాకిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో 'ఈ మార్చి-ఏప్రిల్‌లో కర్నాటక ఎన్నికలతోపాటు మరో మూడు ఉత్తరాది రాష్ర్టాల్లో ఎన్నికలు జరుగనున్నాయి. ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. వీటన్నిటి ఫలితాలు మదుపరుల పెట్టుబడులపై ప్రభావం చూపనున్నాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ రిటైల్ రిసెర్చ్ అధిపతి దీపక్ జసానీ అన్నారు. 'సెన్సెక్స్ 34,500 స్థాయికి, నిఫ్టీ 10,800 పాయింట్లకు చేరవచ్చని మేము భావిస్తున్నాం. ప్రభుత్వ సంస్కరణలు, చౌక గృహాల నిర్మాణం వంటివి దిశా-నిర్దేశం చేయవచ్చు' అని సెంట్రమ్ బ్రోకింగ్ లిమిటెడ్, వెల్త్ రిసెర్చ్ విశ్లేషకుడు పాయల్ పాండ్యా అన్నారు. ద్రవ్యోల్బణం, పారిశ్రామిక ప్రగతి రేటు, జీడీపీ గణాంకాలు, ఆటో అమ్మకాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ తదితర అంశాలూ మార్కెట్ తీరుతెన్నులను ప్రభావితం చేస్తాయన్నారు.

రెండోరోజూ నిరాశే..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ మిశ్రమంగా ముగిశాయి. బుధవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 18.88 పాయింట్లు కోల్పోయి 33,793.38 వద్ద ముగియగా, నిఫ్టీ కేవలం ఒక్క పాయింట్ పెరిగి 10,443.20 వద్ద నిలిచింది. మంగళవారం సెన్సెక్స్ స్థిరంగా ఉంటే, నిఫ్టీ 7 పాయింట్లు లాభపడిన విషయం తెలిసిందే. కాగా, ఆటో, ఐటీ, గ్యాస్, టెక్నాలజీ, హెల్త్‌కేర్ రంగాల షేర్లు లాభాల స్వీకరణకు లోనయ్యాయి.

కార్పొరేట్ బాండ్లపై అమితాసక్తి

విదేశీ మదుపరుల (ఎఫ్‌పీఐ) నుంచి కార్పొరేట్ బాండ్లకు అమితాసక్తి కనిపించింది. బుధవారం సాధారణ ట్రేడింగ్ అనంతరం మధ్యాహ్నం 3:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు రెండు గంటలపాటు బీఎస్‌ఈలో జరిగిన వేలంలో రూ.13,756 కోట్ల (2.16 బిలియన్ డాలర్లు) కుగాను రూ.15,961 కోట్ల (2.5 బిలియన్ డాలర్లు) విలువైన బిడ్లు దాఖలయ్యాయి. గత నెలలో జరిగిన వేలంలో రూ.7,374 కోట్లకు రూ.7,370 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి.

తొలిసారి 7 వేల మార్కుకు నాస్‌డాక్

అమెరికా స్టాక్ మార్కెట్ కొత్త సంవత్సరంలో పరుగులు పెడుతున్నది. నాస్‌డాక్ తొలిసారిగా 7,000 మార్కును అధిగమించింది. టెక్నాలజీ షేర్లకు మదుపరులు బ్రహ్మరథం పట్టడంతో సూచీ రికార్డు స్థాయికి చేరింది. ఈ క్రమంలోనే 7,006.90 వద్ద నిలిచింది. కాగా, గడిచిన ఎనిమిది నెలల్లోనే సూచీ 1,000 పాయింట్లను అందుకుందని వాల్‌స్ట్రీట్ జర్నల్ తెలిపింది.

ఐటీ దిగ్గజాల ఆదాయం అంతంతే

■ అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంపై అంచనా

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2017-18) మూడో త్రైమాసికానికి (అక్టోబర్-డిసెంబర్)గాను భారతీయ ఐటీ రంగ దిగ్గజ కంపెనీలు ప్రకటించే ఆర్థిక ఫలితాలు నిరాశపరుచవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. మధ్యశ్రేణి కంపెనీల ఆదాయం మెరుగ్గా ఉండొచ్చని అంటున్నారు. అమెరికా వీసా నిబంధనల్లో మార్పులు, డిమాండ్ పరిస్థితుల దృష్ట్యా టాప్ కంపెనీల రెవిన్యూ వృద్ధి ఈసారి తక్కువగానే ఉండొచ్చని కొటక్ ఇనిస్టిట్యూషనల్ ఈక్విటీస్ నివేదిక చెబుతున్నది. బ్యాంకింగ్ ఫైనాన్షియల్ సేవల్లో స్తబ్ధత, ఉత్తర అమెరికా మార్కెట్‌లో మందగమనం బడా ఐటీ కంపెనీల ఆదాయాన్ని దెబ్బతీసే వీలుందని పేర్కొన్నది.

సిమెంట్ లాభాలపై ఇంధన పిడుగు

■ ఇక్రా అంచనా



న్యూఢిల్లీ, జనవరి 3: ఈ ఏడాది సిమెంట్ రంగ సంస్థలకు నిరాశే ఎదురుకానున్నది. ఒకవైపు ఇంధన ధరలు భగ్గుమంటుండటం, మరోవైపు సరుకు రవాణా ఖర్చులు అధికమవుతుండటంతో సిమెంట్ కంపెనీల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నదని సర్వేలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి అర్ధభాగంలో పెట్ కోక్, బొగ్గు, డీజిల్ ధరలు పెరుగడంతో వచ్చే త్రైమాసికాల్లో ఆయా సంస్థల లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నదని దేశీయ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా తెలిపింది. ధరల విషయానికి వస్తే పెట్ కోక్ 32 శాతం ప్రియమవగా, అలాగే బొగ్గు 44 శాతం, వీటికి తోడు విద్యుత్, ఇంధన ధరలు కూడా ఎగువముఖం పట్టినట్లు ఇక్రా రేటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ సబ్యసాచి ముజుందార్ తెలిపారు. ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ మధ్యకాలంలో డీజిల్ ధరలు ఏడు శాతం ఎగబాకడంతో సరుకు రవాణా కోసం పెట్టే ఖర్చు అమాంతం పెరిగిందని ఆయన వెల్లడించారు. ధరల పెంపు విషయానికి వస్తే..ఇప్పటికే పలు సంస్థలు పెంచాయని, భవిష్యత్తులో మరింత పెంచే అవకాశం కూడా ఉందన్నారు.

వచ్చే ఏడాదిపై గంపెడాశలు..

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇసుక కొరత తీవ్రమవడం, రియల్ ఎస్టేట్ రంగంలో నెలకొన్న మందగమన పరిస్థితులు మొత్తం సిమెంట్ పరిశ్రమ వృద్ధికి గండికొట్టనున్నాయని ఇక్రా తెలిపింది. కానీ వచ్చే ఆర్థిక సంవత్సరంలో సిమెంట్ పరిశ్రమ 5 శాతం వృద్ధిని సాధించే అవకాశాలున్నాయని పేర్కొంది. ప్రస్తుత డిమాండ్ చూస్తుంటే 2017-18లో 1-2 శాతం వృద్ధి పరిమితం కానున్నదని తెలిపిన ఇక్రా..చౌక ధర కలిగిన గృహాలకు డిమాండ్ నెలకొనడం, గ్రామీణ ప్రాంతాల్లోను, మౌలిక సదుపాయాలు, రోడ్లు, ఇరిగేషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు జోరందుకోవడం తదితర అంశాలు వచ్చే ఆర్థిక సంవత్సరం వృద్ధిలో కీలక పాత్ర పోషించనున్నాయని పేర్కొంది. ఒకవేళ సిమెంట్‌కు డిమాండ్ అధికంగా ఉంటే ఉత్పత్తి సంస్థలు తమ సామర్థ్యాన్ని పెంచుకోవడానికి అధిక ప్రాధాన్యతనివ్వనున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఆయా సంస్థలు 60 శాతం నుంచి 65 శాతం మేర వినియోగిస్తున్నాయి.

క్రూడాయిల్ కొత్తపుంతలు

సింగపూర్, జనవరి 3: ముడి చమురు ధరలు 2014 తర్వాత ఏటేటా తిరోగమనంలోనే పయనించగా.. మళ్లీ ఈ ఏడాదే పురోగమనాన్ని చూశాయి. ఇరాన్ రాజకీయ సంక్షోభం, రష్యా, ఒపెక్ దేశాలు చమురు ఉత్పత్తిని తగ్గించుకోవడం వంటివి అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ ముడి చమురు ధరను పరుగులు పెట్టిస్తున్నాయి. ఈ ఏడాది ట్రేడింగ్ ఆరంభ రోజైన మంగళవారం మరింత పెరిగాయి. అమెరికా డబ్ల్యూటీఐ క్రూడ్ ఫ్యూచర్స్‌లో 21 సెంట్లు ఎగిసి 60.63 డాలర్లు పలుకగా, బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్‌లోనూ 31 సెంట్లు ఎగబాకి 67.18 డాలర్లను తాకింది. 2014 జనవరి తర్వాత ఏ ఏడాది ప్రారంభంలోనూ ధర 60 డాలర్లపైకి చేరలేదు. ప్రస్తుతం బ్యారెల్ ధర 67.52 డాలర్ల వద్ద కొనసాగుతున్నది.

బిట్‌కాయిన్ నేలచూపులు

టోక్యో, జనవరి 3: ఆకాశమే హద్దుగా దూసుకెళ్లిన బిట్‌కాయిన్ విలువ నేలచూపులు చూస్తున్నది. 2015 నుంచి గమనిస్తే.. పతనమనేదే ఎరుగకుండా మదుపరులకు కాసుల వర్షం కురిపించిన ఈ క్రిప్టో కరెన్సీ తొలిసారిగా 2018కి మాత్రం నష్టాలతో స్వాగతం పలికింది. గతేడాది చివరి రెండు నెలల్లోనే వందల రెట్లు పెరిగిన దీని విలువ.. డిసెంబర్ 18న రికార్డు స్థాయిలో 19,511 డాలర్లను చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత క్షీణిస్తూపోగా, ఈ నెల 1న న్యూయార్క్ ట్రేడింగ్‌లో 500 డాలర్లకుపైగా దిగజారి 13,624.56 డాలర్లకు పడిపోయింది. హాంకాంగ్‌లో 1.9 శాతం క్షీణించింది. బుధవారం మాత్రం 14,951 డాలర్లకు పెరిగింది.

ఈ ఏడాది వృద్ధి 7 శాతం లోపే

న్యూఢిల్లీ, జనవరి 3: పెద్ద నోట్ల రద్దు, జీఎస్టీ వంటి కీలక నిర్ణయాలతో ఈ ఏడాది భారత వృద్ధి 7 శాతం కంటే దిగువకే పడిపోవచ్చునని విశ్లేషకులు అంచనావేస్తున్నారు. అంతక్రితం ఏడాది ఇది 7.1 శాతంగాను, 2015-17లో 8 శాతంగా నమోదైంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికిగాను దేశ వృద్ధి అంచనాను కేంద్ర గణాంకాల శాఖ శుక్రవారం విడుదల చేయనున్న నేపథ్యంలో విశ్లేషకులు తమ అభిప్రాయాలను వెల్లడిస్తున్నారు. తిరోగమన బాట పడుతున్న ప్రస్తుత తరుణంలో వృద్ధి 7 శాతం దాటే అవకాశాలు లేవని, కానీ మూడు, నాలుగో త్రైమాసికాల్లో మాత్రం కాస్త పుంజుకునే అవకాశం ఉన్నదని ఎస్‌బీఐ రీసర్చ్ చీఫ్ ఎకనామిస్ట్ సౌమ్య కాంతి ఘోష్ ఈ సందర్భంగా తెలిపారు. గతేడాది నమోదైన 6.5 శాతం వృద్ధి ఈ ఏడాదిలో కూడా ఇంతే స్థాయిలో నమోదయ్యే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రణాళిక సంఘం మాజీ డిప్యూటీ చైర్మన్ మాంటెక్ సింగ్ అహ్లువాలియా మాట్లాడుతూ..ఈ ఏడాది వృద్ధి 6.2 శాతం నుంచి 6.3 శాతం మధ్యలో నమోదుకానున్నదన్నారు. ఇప్పటి వరకైతే పన్ను వసూళ్లలో ఏ మాత్రం ఆశించిన స్థాయిలో వృద్ధిని నమోదు చేసుకోలేక పోయిందని, దీంతో వృద్ధి కూడా అంతేనని ఆయన పేర్కొన్నారు.

ఆడీ అమ్మకాల్లో నిస్తేజం



ముంబై, జనవరి 3: జర్మనీకి చెందిన విలాసవంతమైన కార్ల తయారీ సంస్థ ఆడీ అమ్మకాల్లో నిస్తేజం నెలకొన్నది. గడిచిన సంవత్సరంలో కంపెనీ విక్రయాలు ఏడాది ప్రాతిపదికన కేవలం రెండు శాతం మాత్రమే పెరిగి 7,876 యూనిట్లకు చేరుకున్నట్లు ప్రకటించింది. దేశీయ మార్కెట్లోకి పది కొత్త కార్లను ప్రవేశపెట్టినప్పటికీ వినియోగదారులను ఆకట్టుకోవడంలో సంస్థ విఫలమైనది. 2012 నుంచి 2014 మధ్యకాలంలో అగ్రస్థానంలో నిలిచిన సంస్థకు గడిచిన మూడేండ్లుగా బెంజ్ నుంచి తీవ్ర పోటీని ఎదుర్కొంటున్నది.

టాటా ట్రక్కులపై ఆరేండ్ల వ్యారెంటీ

ముంబై, జనవరి 3: ప్రముఖ వాహన సంస్థ టాటా మోటార్స్..అన్ని రకాల మధ్యస్థాయి, హెవీ ట్రక్కులపై ఆరేండ్ల వ్యారెంటీ సదుపాయం కల్పిస్తున్నట్లు ప్రకటించింది. ట్రాక్టర్-ట్రైలర్, మల్టీ-యాక్సెల్ ట్రక్క్ అండ్ టిప్పర్‌లకు కూడా ఈ సదుపాయం వర్తించనున్నది. దేశీయ ఆటోమొబైల్ చరిత్రలో ఇలా వ్యారెంటీ సదుపాయం కల్పించడం ఇదే తొలిసారని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. అలాగే ఇంజిన్, గేర్‌బాక్స్, రియర్ యాక్సెల్‌పై గతంలో ఉన్న రెండేండ్ల వ్యారెంటీని ఈసారి మూడేండ్లకు పెంచినట్లు కంపెనీ హెడ్ గిరిష్ వాగ్ తెలిపారు.

బీఎస్‌ఈలో తెలంగాణ షేర్లు

షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు, వాణిజ్య పరిణామం వరుసగా..

A P Paper 332.0(317.95)45147
Ace Software Exports 27.65(26.75)2653
Aci Infocom 9.85(9.8)101935
Aditya Ispat 7.3(6.96)6720
Aditya Spin 8.51(8.81)80
Agro Tech Foods 713.7(699.7)1269
Aishwarya Telcom 7.5(7.47)43050
Alphageo 910.5(906.4)3489
Alufluoride 135.9(135.45)14995
Amara Raja 846.1(829.5)48173
Andhra Bank 57.35(57.35)127354
Andhra Cements 13.75(13.67)85346
Andhra Petroch 58.3(60.95)132898
Andhra Sugars 522.8(523.15)2040
Anjani Portl 238.2(233.3)1778
Astra Micro 120.9(118.25)117676
Aurobindo Phar 666.5(671.85)129509
Avantel 484.85(467.45)19598
Avanti Feeds 2563.25(2587.5)7190
Avon Organics 16.48(15.7)9770
B N Rathi Securities 55.1(53.75)16415
B2b Software 15.26(14.55)600
Balaji Amines 623.6(622.55)8163
Bambino Agro 325.0(327.0)3225
Bartronics India 15.17(15.06)21400

Bgr Energy Systems 139.1(138.9)20693
Bhagiradha Chem 314.75(323.65)4243
Bhagyaind 51.15(51.25)46930
Bhagyanagar W. 30.25(29.45)2387
Bnr Udyog 30.05(28.65)701
Brilliant Securities 12.21(11.63)31809
Cambridge Tech Enter83.0(81.4)1615
Cat Tech 1.2(1.15)7559
Ccl Products 298.65(298.85)4176
Celestial Labs 21.7(21.9)87953
Cil Securities 37.3(36.7)8701
Coastal Trawlers 74.65(71.1)1
Color Chips 49.95(46.0)156630
Coromandel Fert 568.7(542.0)27798
Country Club 20.85(19.75)632212
Cubex Tubings 28.5(28.1)7747
Cybermate Inf. 3.49(3.5)121240
Danlaw Tech. 76.85(73.5)40397
Deccan Cements 564.6(560.0)495
Denisons Hyd 1249.5(1190.0)885
Dhan Roto Sp 42.85(41.3)6862
Diamond Power Infra23.75(22.4)1140712
Divi's Lab 1098.2(1079.2)56760
Divyashakti Gr 101.1(104.9)1133
Dolphin Med 2.0(1.91)48618

Dr Reddy`s Lab 2336.2(2407.7)76717
Empee Sugars 5.59(5.33)44381
Essen Supplements 22.1(21.05)100
Everest Org 136.5(137.0)75
Facor Alloys 3.96(3.78)1017437
Fenoplast 59.15(61.0)13
Firstobj 15.85(15.8)4899
Fortune Info 112.15(107.4)33389
Four Soft 93.0(93.3)9862
Galada Power 5.15(5.42)3580
Gati 135.4(133.25)255894
Gayatri 11.73(11.19)186264
Gayatri Projects 228.1(227.25)17021
Gennex 6.1(6.15)324241
Gmr Infra 21.8(21.65)4410096
Godavari Drugs 42.8(42.55)7075
Golden Carpets 5.16(5.43)538
Goldinfra 199.7(201.85)17069
Goldstone Tech 15.35(16.15)32048
Gowra Leasing & Finance 24.4(24.45)4031
Granules Ind 134.75(134.3)74832
Gss America Infotech 29.15(28.9)13133
Gulf Oil Corp 605.85(577.3)3793
Gvk Pwr 19.25(18.6)1031330
Hbl Power 73.05(73.05)180596

Heritage Food 803.35(803.1)1507
Hifco Marwel 33.8(32.2)100
Hindustan Bio Sciences 0.39(0.38)500
Hyderabad Ind 1504.4(1514.2)822
I V R Cons 6.85(7.33)1777422
I.c.s.a. 4.67(4.25)356039
Incap 120.65(114.95)8650
Incon Engineers 5.42(5.7)1579
Infotech Ent 576.65(573.25)3952
Intensive Air Systems 0.4(0.39)3000
Invinex Lab 91.05(89.3)484
Ivrcl Infrastruc 6.85(7.33)1777422
K C P 147.2(143.85)77579
Kabsons Ind 8.52(8.36)1300
Kakatiya Cement 395.6(396.3)11560
Kakatiya Texs 3.0(3.0)702
Kallam Spinning Mills 25.7(23.6)95544

Kaveri Seed Company 536.35(539.3)74727
Kernex Mic. 46.45(45.4)13114
Knr Const 312.95(308.85)7969
Krebsbio 161.4(153.75)4287
Lanco Ind 405.2(391.95)45153
Lanco Infratech 1.55(1.48)4167009
Livewell Home Fin 79.0(77.75)893
Lokesh Mach 77.65(71.95)171514
Madhucon Projects 35.7(35.8)63142
Maytas Infra 56.45(53.8)17979
Mhril 335.8(335.4)2600
Mic Electronics 9.47(9.42)78571
Moldtek 75.0(75.5)5232
Moschip Semi 39.7(39.35)95022
Msr India Ltd 34.95(34.7)2862
N C L Ind 265.7(251.3)20494
Nagarjuna Agri 62.2(59.65)214597

Nagarjuna Agri Tech 8.08(7.7)1600
Nagarjuna Con 130.0(130.45)526779
Natco Pharma 973.75(967.6)21616
National Min 149.2(148.6)774059
Nbventure 163.0(153.65)660401
Neha Inter 10.25(9.94)109263
Neha Inter10.25(9.94)109263
Neocure Thera 4.02(3.9)17834
Nettlinx 81.85(80.7)60077
Neuland Lab 875.05(886.35)2669
Niharinf 14.3(14.8)3541
Nile 910.05(895.65)4109
Oil Country 64.2(54.75)261243
P L Enterprise 3.19(3.25)10
Padmalaya Tel 5.83(5.76)34124
Pankaj Polymers 24.15(23.0)20100
Panyam Cem 62.3(60.7)26408

Pennar Ind 67.55(67.2)74772
Pflinfotc 8.4(8.4)5856
Phaarmasia 27.85(26.55)694
Pharmaids Pharma 2.55(2.55)180
Phyto Chem 74.4(75.8)24329
Pitti Lamin 104.95(102.0)33644
Pokarna 220.9(218.8)9844
Prajay Eng 15.97(15.21)48160
Premier Expl 431.8(430.25)2994
Prism Cement 115.4(115.5)22691
Rain 438.95(400.05)2421212
Raj Packaging 37.2(39.4)43020
Ram Informatics 41.45(43.0)2702
Ras Finance 24.7(24.7)125
Regency Ceramic 9.49(9.37)11682
Restile Ceramics 9.47(9.85)47446
Roopa Industries 13.48(13.49)5906
Rubra Medicaments 5.69(5.69)3415
S S Organics 6.65(7.0)200
Sagar Cements 1011.0(912.75)33360
Sai Wires India 2.45(2.5)26030
Samkrg Pistons 346.45(347.6)12526
Sampre Nutritions 90.4(95.15)51468
Sanghi Ind 139.6(135.5)125226
Sanjeevni Industries 27.0(27.0)11127
Sark Sys 70.4(71.4)100452

Sathavahana Ispat 34.2(33.85)23761
Saven Tech 24.5(25.3)10258
Sks Microfin 992.4(993.3)33540
Sms Pharma102.0(101.9)8430
Softpro Sys 5.26(5.01)80
Softsol India 46.0(46.0)50
Southern Mag & Chem37.15(35.5)800
Southern Online Bio Tech 3.44(3.37)12806
Sr Ray Alkalies 79.75(72.95)1097893
Sree Rayalaseema 217.7(216.4)2888
Srinivasa Shipp 85.1(84.9)6559
Steel Exchange India 48.65(46.35)195689
Sujana 0.9(0.88)110211
Sujana Towers 4.9(4.84)15861
Sujanametal 1.75(1.82)80140
Surana Telecom 6.24(6.27)35121
Suryaamba 72.85(70.85)3793
Suryachakra Power Cor1.36(1.3)25120
Suryalak Cott 95.95(95.1)10359
Suryalata Spin 169.65(161.2)7824
Suvarna Cem 170.5(171.45)2859
Suven 202.3(202.4)26937
Taj Gvk 178.2(178.3)4247
Tanla Solutions 40.7(38.55)268198
Tci 1080.0(1070.0)25
Tci Fin 27.55(27.5)24413
Transcorp Inter58.7(57.95)31102

Transgene Biotek 2.37(2.3)15767
Transport Co 290.4(287.2)2649
Trendy Knitwear 0.2(0.21)194665
Tyche 141.7(134.8)32936
Unisocks 3.3(3.38)53438
Usher 8.79(8.59)14938
V B C Ferro 45.85(44.05)585
V S T Ind 3201.95(3157.8)41
Vamshi Rubber 52.95(54.85)1140
Viceroy Hotels 20.45(18.3)832621
Vijay Textiles 43.9(43.75)5800
Vimta Labs 170.45(167.75)8515
Virat Crane 44.75(45.0)17975
Virnichiq 126.45(125.35)74006
Visaka Ind 662.05(647.75)7668
Vista Pharma 41.5(40.65)26659
Vivmed Labs 104.35(105.0)150411
Vivo Bio Tech 50.95(50.0)5285
Vmf Softech 102.3(104.25)11120
Waterbase 400.95(401.7)431319
Xl Energy Ltd 3.9(4.0)6642
Ybrant Digital 5.98(6.13)2587807
Yenkey Drug 4.09(4.01)202
Zen Tech Ltd 149.15(147.95)99678
Zenotech 47.0(47.0)13539



యాదాద్రిలో ముగిసిన అధ్యయనోత్సవాలు

యాదాద్రి భువనగిరి జిల్లా ప్రతినిధి, నమస్తేతెలంగాణ: యాదగిరిగుట్టలో ఆరు రోజుల పాటు జరిగిన అధ్యయనోత్సవాలు బుధవారం ముగిశాయి. శ్రీవారిని శ్రీలక్ష్మీనరసింహుడిగా అలంకరించి తిరువీధులలో ఊరేగించారు. ధనుర్మాసం సందర్భంగా ఒక వైపు పారాయణాలు..మరో వైపు రెండు పూటలా పాశురాల పఠనంతో యాదాద్రి భక్తి తన్మయత్వంలో పరవశించింది.

పల్లెల్లో ప్రగతిని చూసే వలసలు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో పల్లెల్లో జరుగుతున్న ప్రగతిని చూసే గులాబీ పార్టీలోకి వలసలు పెరుగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్, మిడ్జిల్‌లో బుధవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవానికి హాజరైన మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో దాదాపు 270 మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. బాలానగర్ మండలం గౌతాపూర్‌లో 70 మంది, రాజాపూర్ మండలం ఖానాపూర్, కుచ్చరకల్ గ్రామాలకు చెందిన 150 మంది, మిడ్జిల్ మండలం అయ్యవారిపల్లి నుంచి 20 మంది, వెలుగొమ్ముల గ్రామంలో 30 మంది టీడీపీ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయా మండల కేంద్రాల్లో గులాబీ పార్టీలో చేరారు. చేరిన వారికి కండువాలు కప్పి మంత్రి పార్టీలోకి ఆహ్వానించారు. మంచిర్యాల జిల్లా మందమర్రిలో రాజస్థాన్ కులస్తులు సుమారు 200 మంది ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు, ఎమ్మెల్సీ పురాణం సతీశ్‌కుమార్, టీఆర్ఎస్ జిల్లా ఇన్‌చార్జి, యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అరిగెల నాగేశ్వర్‌రావు సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం కర్విరాల, గానుగుబండ గ్రామాల నుంచి 200 మంది, నాగారం మండలం శాంతినగర్‌లో కాంగ్రెస్ ఎంపీటీసీ సుజాత రవీందర్‌తోపాటు 150 మంది ఎమ్మెల్యే కిశోర్ సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరారు.



వైద్య ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి సమక్షంలో టీఆర్ఎస్‌లో చేరుతున్న రాజాపూర్ మండలం గౌతాపూర్‌కు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు


కొడంగల్ సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం మహమూద్ అలీ. చిత్రంలో మంత్రి మహేందర్‌రెడ్డి తదితరులు.

మైనారిటీల అభ్యున్నతిపై సీఎం ప్రత్యేక దృష్టి

డిప్యూటీ సీఎం మహమూద్ అలీ

కొడంగల్, నమస్తే తెలంగాణ: ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి సీఎం కేసీఆర్ విశేషంగా కృషి చేస్తున్నారని డిప్యూటీ సీఎం మహమూద్ అలీ అన్నారు. బుధవారం వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో రవాణా శాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డితో కలిసి ఇమాం, మౌజంలకు గౌరవ వేతన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 సంవత్సరాలుగా పాలన చేపట్టిన టీడీపీ, కాంగ్రెస్ పార్టీలు ముస్లింలను ఓటు బ్యాంకుగా వినియోగించుకున్నాయని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుతో ఉర్దూ భాషకూ సైతం ప్రాధాన్యం లభిస్తున్నదన్నారు. మైనార్టీల కోసం సీఎం కేసీఆర్ 204 ప్రత్యేక గురుకులాలను మంజూరు చేశారన్నారు. మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయానికి 24 గంటల కరెంటు సరఫరా ప్రతిపక్షాలకు ఓ చెంపపెట్టులాంటి సమాధానమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ పట్నం నరేందర్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు చైర్మన్ సలీం, మాజీ ఎమ్మెల్యే గుర్నాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు స్విచ్ ఆన్ చేసి నీటిని విడుదల చేస్తున్న మంత్రి ఈటల, ఎంపీ వినోద్, జెడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్సీ నారదాసు, ఎమ్మెల్యే గంగుల

రైతు సంక్షేమమే ధ్యేయం

ఎల్ఎండీ దిగువ ఆయకట్టుకు నీటి విడుదల చేసిన మంత్రి ఈటల

తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ : రైతు సంక్షేమమే టీఆర్ఎస్ సర్కారు ధ్యేయమని ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలంలోని ఎల్ఎండీ(లోయర్ మానేర్ డ్యాం) కాలనీ హెడ్ రెగ్యులేటరీ వద్ద ఎంపీ వినోద్‌కుమార్, జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, గంగుల కమలాకర్, ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావుతో కలిసి, బుధవారం దిగువ ఆయకట్టుకు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఈటల మాట్లాడుతూ.. ఎస్సారెస్పీ నుంచి గత నెల 25న నీటిని విడుదల ప్రారంభించామన్నారు. కాకతీయ కాలువపై నీటి సరఫరా విషయంలో పకడ్బందీగా ఉండాలని, కలెక్టర్లు, పోలీసులు, ఎస్పారెస్పీ, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం కరీంనగర్ జిల్లా వీణవంక మండలంలోని వీణవంక, రామకృష్ణాపూర్, లస్మక్కపల్లిలో రూ. 3.20కోట్లతో నిర్మించిన చెక్‌డ్యాంలు, వీణవంక-రామకృష్ణాపూర్ బ్రిడ్జి, గంగారం, వీణవంక పంచాయతీ కార్యాలయాల ప్రారంభం, వల్భాపూర్‌లో డబుల్ బెడ్రూం ఇండ్లు, గంగారంలో రెడ్డి సంఘం భవన శంకుస్థాపన కార్యక్రమాల్లో ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు.


డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి

సొంతింటి కల సాకారం

50 'డబుల్' ఇండ్లకు శంకుస్థాపన చేసిన మంత్రి పోచారం

బాన్సువాడ రూరల్ : ప్రతి నిరుపేద కుటుంబం సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని వ్యవసాయశాఖ మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలోని ఎర్రమన్ను కుచ్చ కాలనీలో 50 డబుల్‌బెడ్‌రూం ఇండ్ల నిర్మాణానికి మంత్రి బుధవారం శంకుస్థాపన చేశారు. అనంతరం తాడ్కోల్‌లోని సహకారం సంఘం ఆవరణలో 24 గంటల నిరంతరం ఉచిత విద్యుత్తు అందిస్తున్నందుకు కేసీఆర్ చిత్ర పటానికి రైతులతో కలిసి క్షీరాభిషేకం చేశారు. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని నిరంతర ఉచిత విద్యుత్తు ఇస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. విద్యుత్తు ఉత్పత్తికి రూ.93 వేల కోట్లు ఖర్చు చేసి అంధకారంలో ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని వెలుగులోకి తీసుకొచ్చామని అన్నారు.



కొల్లాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

'తుమ్మిళ్ల' లిఫ్ట్‌కు 8న శంకుస్థాపన

మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్‌టౌన్: జోగుళాంబ గద్వాల జిల్లాలో తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకానికి ఈనెల 8వ తేదీన భారీ నీటిపారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు శంకుస్థాపన చేయనున్నారని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో తన క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి జూపల్లి మాట్లాడారు. తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం నిర్మాణం పూర్తయితే ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు కృష్ణాజలాలు అందుతాయన్నారు.

మేడారంలో ట్రైబల్ మ్యూజియం!

1.60 కోట్లతో పనులు

- ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పనులు
- సమ్మక్క,సారలమ్మ జీవిత చరిత్రపై 20నిమిషాల లఘుచిత్రం

జయశంకర్ జిల్లా ప్రతినిధి/నమస్తే తెలంగాణ :


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మేడారంలో నిర్మిస్తున్న ట్రైబల్ మ్యూజియం

తెలంగాణ కుంభమేళా జరిగే మేడారంలో ట్రైబల్ మ్యూజియం ముస్తాబవుతున్నది. ఆదివాసీల సంస్కృతీ, సంప్రదాయాలు ఉట్టిపడేలా గిరిజన సంక్షేమం, సాంస్కృతిక శాఖ ఈ మ్యూజియం నిర్మిస్తున్నది. ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, జీవనశైలికి అద్దంపట్టేలా ఇప్పటికే ప్రభుత్వం కుమ్రంభీం జిల్లా జోడేఘాట్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో ట్రైబల్ మ్యూజియాలు నిర్మించింది. ఈ నేపథ్యంలో రెండేండ్లకోసారి అత్యంత వైభవంగా సమ్మక్క సారలమ్మ మహాజాతర జరిగే జయశంకర్ భూపాలపల్లి జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోనూ ట్రైబల్ మ్యూజియం నిర్మించాలని టీఆర్ఎస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు జిల్లాలోని ఏటూరునాగారం ఐటీడీఏ ఇంజినీరింగ్ విభాగం అధికారులు ప్రతిపాదనలు పంపగా పరిశీలించిన సీఎం కేసీఆర్ రూ.1.60కోట్లు మంజూరు చేస్తూ నిర్మాణ ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేశారు. దీంతో టెండర్లు నిర్వహించి మ్యూజియం నిర్మాణ పనులను ఓ కాంట్రాక్టర్‌కు అప్పగించారు. కొద్ది నెలల క్రితం ప్రారంభమైన పనులు ప్రస్తుతం ఊపందుకున్నాయి. ఈ నెల 15వ తేదీలోగా మ్యూజియం నిర్మాణ పనులు పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌కు డెడ్‌లైన్ పెట్టారు. నిర్మాణ పనులు పూర్తికాగానే ఇప్పటికే సేకరించిన ఆదివాసీల సంస్కృతీ సంప్రదాయాలు, జీవనశైలికి సంబంధించిన వస్తువులను మ్యూజియంలో అమర్చి ఈనెల మూడోవారంలో సీఎం కేసీఆర్ చేతుల మీదుగా ప్రారంభింప చేయాలనే పట్టుదలతో గిరిజన సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేష్‌దత్ ఎక్కా ఉన్నారు. ఈ మేరకు ఏటూరునాగారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చక్రధర్‌రావు మేడారం ట్రైబల్ మ్యూజియం నిర్మాణ పనులను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఆదివాసీల ఆచార వ్యవహారాలతో పాటు సమ్మక్క సారలమ్మ జననం నుంచి మొదలుకుని వీరమరణం పొందే వరకు జీవిత చరిత్ర పూర్తిగా మ్యూజియంలోకి ప్రవేశించగానే సందర్శకులు తిలకించేలా ఏర్పాట్లు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు.

వస్తువుల సేకరణకు రూ. 30 లక్షలు

ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన శైలికి సంబంధించిన వస్తువులను సేకరించి మ్యూజియంలో అమర్చేందుకు తాజాగా ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరు చేసింది. ఈ నిధుల వినియోగానికి ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీకి చైర్మన్‌గా కలెక్టర్, వైస్ చైర్మన్‌గా ఏటూరునాగారం ఐటీడీఏ పీఓ వ్యవహరిస్తారు. గిరిజన సాంస్కృతిక వ్యవహారాల విభాగం క్యూరేటర్, గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన శైలి తెలిసిన ఆదివాసీ పెద్దలు కమిటీలో సభ్యులుగా ఉన్నారు. వస్తువుల సేకరణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.30లక్షల నుంచి జిల్లా కలెక్టర్ రూ.10లక్షలు క్యూరేటర్‌కు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆదివాసీల సంస్కృతి, సంప్రదాయాలు, జీవన శైలికి సంబంధించిన వస్తువులను సేకరించటం, కొనుగోలు చేయటం ఇప్పటికే మొదలైంది. కొద్దిరోజుల క్రితం మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని భోపాల్ నగరం నుంచి ఇద్దరు అధికారులు జిల్లాకు వచ్చారు. వీరితో పాటు ఏటూరునాగారం ఐటీడీఏకు చెందిన ఇద్దరు అధికారులు కూడా జిల్లాలో ఆదివాసీలు నివసిస్తున్న వివిధ ప్రాంతాలు సందర్శించారు. వారి సంస్కృతీ, సంప్రదాయాలకు సంబంధించి డోలు, సన్నాయి, బాణాలు, వేటకొడవళ్లు, గొడ్డళ్లు, గుమ్ములు, ఆదివాసీలు నివసించే గుడిసెలు, తదితర వస్తువులను వాజేడు, కన్నాయిగూడెం, ఏటూరునాగారం, మంగపేట, తాడ్వాయి మండలాల్లోని గ్రామాల్లో సేకరించారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా మ్యూజియంలో అమర్చటానికి పెద్ద సైజు ఫోటోలను కూడా అధికారులు సేకరిస్తున్నారు. కోయ సంస్కృతికి అద్దం పట్టేలా నిర్మించే పూరిగుడిసెలకు ముగ్గులను కూడా ఆదివాసీ మహిళలతోనే వేయించాలని అధికారులు నిర్ణయించారు. ఆదివాసీల జీవనశైలి, వీరవనితలైన సమ్మక్కసారలమ్మ జీవిత చరిత్రకు సంబంధించి 20నిమిషాల లఘుచిత్రాన్ని కూడా రూపొందిస్తున్నారు. మ్యూజియంలోని ఓ గ్యాలరీలో ప్రొజెక్టర్ ఏర్పాటు చేసి సందర్శకులు ఆడియో, వీడియో విజువల్స్ ద్వారా వినటం, చూడటం వంటి ఏర్పాట్లు చేయాలనే ఆలోచనలో ఉన్నారు. మేడారంలోని సమ్మక్క సారలమ్మ గద్దెల ప్రాంగణానికి సుమారు 200మీటర్ల దూరంలో దీనిని నిర్మిస్తుంది. జాతర ప్రారంభమయ్యే వరకు మ్యూజియం అందుబాటులోకి రానుంది.

విద్యారంగాన్ని పటిష్ఠం చేయడమే లక్ష్యం..

- తెలంగాణ గురుకుల వ్యవస్థ దేశానికే ఆదర్శం
- 15 రకాల వస్తువులతో ఆరోగ్య పరిశుభ్రత కిట్స్
- డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి


వరంగల్ రూరల్ పర్వతగిరి కేజీబీవీలో విద్యార్థినులకు ఆరోగ్య పరిశుభ్రత కిట్స్‌ను అందజేస్తున్న డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యే అరూరి రమేశ్, తదితరులు

సంగెం,(పర్వతగిరి) : విద్యారంగాన్ని పటిష్ఠం చేయడమే సీఎం కేసీఆర్ లక్ష్యమని డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ రూరల్ జిల్లా పర్వతగిరిలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల, మోడల్‌స్కూల్ విద్యార్థినులకు కేజీబీవీలో బుధవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేశ్‌తో కలిసి ఆరోగ్యపరిశుభ్రత కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, వసతి కల్పించి ఉన్నతులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్రంలో కొత్తగా 544 గురుకులాలను ఏర్పాటు చేశామన్నారు. దేశంలోనే తెలంగాణ గురుకుల వ్యవస్థను ఆదర్శంగా నిలిపామన్నారు. కేజీబీవీ, మోడల్‌స్కూల్స్‌లోని విద్యార్థినులు కోసం మూడునెలలకొక సారి 15 రకాల వస్తువులతో ఆరోగ్యపరిశుభ్రత కిట్స్‌ను అందజేస్తున్నట్టు తెలిపారు. వీటి కోసం ప్రభుత్వం ఏటా రూ. 15కోట్లు వెచ్చిస్తుందన్నారు. జనవరి 1 నుంచి కొత్త మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. వారానికి 4సార్లు చికెన్, రెండుసార్లు మటన్, గుడ్లు, రాగిమాల్ట్, నెయ్యి పిల్లలకు పెట్టాలని లేని పక్షంలో విద్యార్థులు డీఈవోకు ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ హరిత, ఆర్‌జేడీ రాజీవ్, డీఈవో నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌కు శాశ్వత సమాధి

- అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు
- భ్రమల్లో బతుకుతున్న ఉత్తమ్‌కుమార్‌రెడ్డి
- విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి


కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి. చిత్రంలో కలెక్టర్ సురేంద్రమోహన్

సూర్యాపేట, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ నార్కట్‌పల్లి / సూర్యాపేట, నమస్తే తెలంగాణ: వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి శాశ్వత సమాధి తప్పదని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జీ జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. రైతాంగానికి 24 గంటల ఉచిత విద్యుత్ సరఫరా చేస్తుంటే.. ఓర్వలేకే కాంగ్రెస్ నేతలు అర్థం లేని విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, నల్లగొండ జిల్లా చెర్వుగట్టు దేవాలయ పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమంలో, సూర్యాపేట కలెక్టరేట్‌లో నిర్వహించిన కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధికారం వస్తుందన్న భ్రమలో బతుకుతున్నారని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులు నిర్మిస్తే కేసులు వేసి అడ్డుకుంటారని.. విద్యుత్ సరఫరాపై అర్థం లేని ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఆలయాలకు భక్తులు అందించే డబ్బులను వాటి అభివృద్ధికే కేటాయించాలని పేర్కొన్నారు. చెర్వుగట్టు నూతన పాలకమండలి చైర్మన్, సభ్యుల చేత ఆయన ప్రమాణస్వీకారం చేయించారు. గత పాలకులు చెర్వుగట్టు దేవస్థాన అభివృద్ధిని విస్మరించారన్నారు. సూర్యాపేట నియోజకవర్గానికి చెందిన 196 మందికి కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ కింద మంజూరైన రూ. 1,35,89,284 చెక్కులను పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో సూర్యాపేట జిల్లా కలెక్టర్ సురేంద్రమోహన్, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, జేసీ సంజీవరెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ గండూరి ప్రవళికప్రకాష్, నల్లగొండ జేసీ నారాయణరెడ్డి, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సులోచన, పాల్గొన్నారు.

దేశానికే సిరిసిల్ల ఆదర్శం కావాలి

సిరిసిల్లటౌన్: స్వచ్ఛ సర్వేక్షన్‌లో సిరిసిల్ల దేశానికే ఆదర్శంగా నిలువాలని సినీ నటుడు సంపూర్ణేశ్‌బాబు, కలెక్టర్ కృష్ణభాస్కర్ పిలుపునిచ్చారు. వంద శాతం మరుగుదొడ్లతో గత ఏడాది జిల్లా ప్రగతిని సాధించిందని చెప్పారు. మంత్రి కేటీఆర్ ఆశయం మేరకు సిరిసిల్లను సుందరంగా తీర్చిదిద్దేందుకు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని కలెక్టర్ కృష్ణభాస్కర్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా సిరిసిల్ల-కామారెడ్డి, సిరిసిల్ల-సిద్దిపేట, కరీంనగర్‌కు వెళ్లు రహదారులను చెత్త రహిత రోడ్లుగా గుర్తిస్తూ సూచిక బోర్డులు ఏర్పాటు చేశారు. స్వచ్ఛ సర్వేక్షన్‌లో ర్యాంక్ సాధించడం వల్ల మున్సిపాలిటీతో పాటు సిరిసిల్ల ప్రజలందరికీ దేశవ్యాప్త గుర్తింపు వస్తుందని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ రమణాచారి విద్యార్థులతో 'స్వచ్ఛత' ప్రతిజ్ఞ చేయించారు.


స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న సినీనటుడు సంపూర్ణేష్‌బాబు

బినామీ పేర్లలో బ్యాంకుకు టోకరా

2.86 కోట్లు కాజేసిన నలుగురి అరెస్ట్


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీనివాస్

మిర్యాలగూడ, నమస్తేతెలంగాణ: బినామీ పేర్లతో రుణాలు పొంది రూ. 2.86 కోట్లు కాజేసిన కేసులో ముగ్గురు నిందితులను బుధవారం పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ డీఎస్పీ శ్రీనివాస్ కథనం ప్రకారం.. పట్టణంలోని సీతారాంపురం కాలనీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో ఫీల్డు ఆఫీసర్‌గా పని చేస్తున్న తాళ్ల సంతోష్‌కుమార్, మహిళా సమాఖ్య లీడర్ బత్తిని సోమీదేవి, మెప్మా ఉద్యోగులు జానకి, రేవతి సహకారంతో గతేడాది 60 మహిళా సంఘాల పేరుతో బ్యాంకులో బినామీ అకౌంట్లు తెరిచారు. ఆయా సంఘాల వారు రుణాలు తీసుకున్నట్టు ఫోర్జరీ సంతకాలతో బ్యాంకు నుంచి రూ. 2 కోట్ల 86 లక్షల 85 వేల 66 కాజేశారు. ఇటీవల జరిగిన ఆడిటింగ్‌లో ఈ విషయం బయటపడింది. బ్యాంకు మేనేజరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ నిర్వహించిన పోలీసులు నిందితులను అరెస్టుచేశారు.

భారీగా పత్తి విత్తన అక్రమ నిల్వలు

4,064 బస్తాలు..రూ. 6.73 కోట్ల విలువ

గద్వాల, నమస్తే తెలంగాణ: జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉన్న ప్రభుత్వ గోదాములో శ్రీరామ ఆగ్రిజెనెటిక్స్ లిమిటెడ్ వారు అక్రమంగా నిల్వ ఉంచిన 4,064 బస్తాల పత్తి విత్తనాలను జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు అశోకవర్ధన్‌రెడ్డి, ఏవో మల్లారెడ్డి గోదాముపై దాడి చేసి పట్టుకున్నారు. వీటికి సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలూ లేకపోవటంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు. స్వాధీనం చేసుకొన్న విత్తనాల విలువ దాదాపు రూ.6.73 కోట్ల ఉంటుందని అధికారులు చెప్పారు. ప్రభుత్వ గోదాములో ఎవరికీ అనుమానం రాకుండా దాచి ఉంచినట్టు అధికారులు భావిస్తున్నారు.

శిశువుకు జన్మనిచ్చిన ఇంటర్ విద్యార్థిని

పాడేరు: ఓ ఇంటర్ విద్యార్థిని శిశువుకు జన్మనిచ్చింది. ఈ ఘటన ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లా పాడేరు ప్రాంతీయ వైద్యశాలలో చోటుచేసుకున్నది. గత ఏడాది డిసెంబర్ 30న జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాడేరు మండలం లింగపుట్ట గ్రామానికి చెందిన ఓ యువతి హుకూంపేటలోని కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నది. ప్రేమ వ్యవహారంలో ప్రియుడితో శారీరకంగా దగ్గర కావటంతో గర్భం దాల్చింది. శిశువును తీసుకొని ఇంటికి వెళ్తే పరువు పోతుందని భావించిన విద్యార్థిని తల్లి కడుపునొప్పితో బాధపడుతున్నదని చెప్పి దవాఖానకు తీసుకొచ్చింది. ప్రసవానంతరం దవాఖాన పరిసరాల్లో నివాసం ఉంటున్న దంపతులకు బిడ్డను అప్పగించి వెళ్లిపోయారు. శిశువును సంరక్షణ కేంద్రంలో ఉంచారు. బరువు తక్కువగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలిస్తుండగా మృతి చెందింది.

మద్యం సేవించి కానిస్టేబుల్ వీరంగం

చితకబాదిన స్థానికులు.. సోషల్‌మీడియాలో వీడియో వైరల్



నాగర్‌కర్నూల్ క్రైం: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో బుధవారం ఓ కానిస్టేబుల్ మద్యంతాగి వీరంగం సృష్టించాడు. జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నారాయణ మద్యం సేవించి శ్రీపురం చౌరస్తాలో రోడ్డుపై వెళుతున్న వారిని బూతులు తిడుతుండటంతో ఆగ్రహానికి గురైన ప్రజలు దాడి చేశారు. ఈ దృశ్యాలను స్థానికులు మొబైల్‌లో చిత్రీకరించి సోషల్‌మీడియాలో పోస్టు చేయగా ఈ వీడియో వైరల్‌గా మారింది. విషయం తెలుసుకున్న పోలీసులు అతడిని స్టేషన్‌కు తరలించారు. డ్యూటీ ముగిసిన తర్వాత కానిస్టేబుల్ మద్యం సేవించి ఉండవచ్చని పోలీసులు చెప్పుకొచ్చారు.

మున్రో.. మెరిసెన్

టీ20ల్లో మూడు శతకాలతో ప్రపంచ రికార్డు

ఆఖరి మ్యాచ్‌లో విండీస్‌పై కివీస్ గెలుపు

మౌంట్ మౌన్‌గనుయి: వేగానికి, పవర్ హిట్టింగ్‌కు చిరునామాగా మారిపోయిన ధనాధన్ టీ20 క్రికెట్‌లో అంతే వేగంగా కొత్త రికార్డులు నమోదవుతున్నాయి. కేవలం 120 బంతులు.. ఔటయ్యే ప్రమాదాలే అతి ఎక్కువగా ఉండే ఈ ఫార్మాట్‌లో సెంచరీ చేయడమే గొప్ప అద్భుతం. అలాంటిది న్యూజిలాండ్ ఓపెనర్ కొలిన్ మున్రో (53 బంతుల్లో 104; 3 ఫోర్లు, 10 సిక్సర్లు) మాత్రం ఈ ఫార్మాట్‌లో మూడు శతకాలు బాది 'ప్రపంచ రికార్డు'ను సొంతం చేసుకున్నాడు. బుధవారం వెస్టిండీస్‌తో జరిగిన ఆఖరి టీ20 మ్యాచ్‌లోనూ మున్రో శతకంతో వీరవిహారం చేయడంతో న్యూజిలాండ్ 119 పరుగుల తేడాతో గెలిచింది. ఫలితంగా మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. ముందుగా కివీస్ 20 ఓవర్లలో 243/5 రికార్డు స్కోరు సాధించింది. గప్టిల్ (38 బంతుల్లో 63; 5 ఫోర్లు, 2 సిక్సర్లు) జోరు చూపెట్టాడు. తర్వాత విండీస్ 16.3 ఓవర్లలో 124 పరుగులకే కుప్పకూలింది. ఫ్లెచర్ (32 బంతుల్లో 46; 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మినహా మిగతా వారు విఫలమయ్యారు. సౌథీ (3/21), బౌల్ట్ (2/29), సోధీ (2/25) విండీస్ పతనంలో కీలకమయ్యారు. సెంచరీ హీరో మున్రోకు 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్'తో పాటు 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్' దక్కింది.



టీ20 సిరీస్ ట్రోఫీతో న్యూజిలాండ్ జట్టు



మున్రో (104)

3 అంతర్జాతీయ టీ20ల్లో మున్రోకు ఇది మూడో సెంచరీ. బ్రెండన్ మెకల్లమ్, రోహిత్‌శర్మ, గేల్, ఎవిన్ లూయిస్ రెండేసి సెంచరీలతో ఉన్నారు.

243 టీ20ల్లో కివీస్‌కు ఇదే అత్యుత్తమ స్కోరు.

ధవన్ కోలుకున్నాడు..


జడేజాకు వైరల్ జ్వరం




ధవన్

కేప్‌టౌన్: భారత ఓపెనర్ శిఖర్ ధవన్.. చీలమండ గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. ఈ మేరకు అతను పూర్తి ఫిట్‌నెస్ సాధించాడని మేనేజ్‌మెంట్ వెల్లడించింది. దీంతో తొలి టెస్టుకు మురళీ విజయ్‌తో కలిసి ఓపెనింగ్ చేసేందుకు గబ్బర్ రెడీ అవుతున్నాడు. అయితే లెఫ్టార్మ్ స్పిన్నర్ రవీంద్ర జడేజా గత రెండు రోజుల నుంచి వైరల్ జ్వరంతో బాధపడుతున్నాడు. ప్రస్తుతం బీసీసీఐ వైద్య బృందం అతని చికిత్సను పర్యవేక్షిస్తున్నది. స్థానిక వైద్యుల సలహాతో జడేజాను దవాఖానాలో చేర్పించి చికిత్స అందిస్తున్నారు. రాబోయే 48 గంటల్లో అతను పూర్తి స్థాయిలో కోలుకుంటాడని బోర్డు వర్గాలు తెలిపాయి. 'ధవన్ పూర్తిస్థాయి ఫిట్‌నెస్‌ను సంతరించుకున్నాడు. తొలి టెస్టుకు అందుబాటులో ఉంటాడు. అయితే జడేజా ఆడటంపై సందేహాలు నెలకొన్నాయి. ప్రస్తుతం అతనికి చికిత్స కొనసాగుతున్నది' అని బీసీసీఐ ప్రకటనలో పేర్కొంది. ఒకవేళ భారత్.. ముగ్గురు పేసర్లు, ఒక స్పిన్నర్ కాంబినేషన్‌కు మొగ్గితే అశ్విన్ తుది జట్టులోకి రానున్నాడు.

ఐసీసీ ప్యానెల్ అంపైర్లలో అనిల్, నందన్



అనిల్



నందన్

దుబాయ్: అండర్-19 ప్రపంచకప్ కోసం ఏర్పాటు చేసిన ఐసీసీ అంపైర్స్ ప్యానెల్‌లో ఇద్దరు భారత అంపైర్లు అనిల్ చౌదరి, సీకే నందన్‌కు చోటు దక్కింది. ఈ టోర్నీ కోసం మొత్తం 14 మందిని ఎంపిక చేశారు. న్యూజిలాండ్‌లో ఈ నెల 13 నుంచి ఈ మెగా ఈవెం ట్ జరుగనుంది. రాబర్ట్ బెయిలీ, జార్జి బ్రాత్‌వైట్, నీజెల్ డుగిడ్, షాన్ జార్జ్, షాన్ హైగ్, మార్క్ హవ్‌త్రోన్, మార్టినెస్, ఎహ్‌సాన్ రజా, షోయబ్ రజా, రాబిన్సన్, రుసెర్, పాల్ విల్సన్ ఈ జాబితాలో ఉన్నారు. డేవిడ్ ఒడియాంబో, బుద్ధి ప్రధాన్, ఇయాన్ రమాగేలకు కూడా అవకాశం ఇచ్చారు. జెఫ్ క్రో, దేవ్‌దాస్ గోవింద్‌జీ, డేవిడ్ జూక్స్‌లు మ్యాచ్ రిఫరీలుగా వ్యవహరించనున్నారు.

బెంగళూరుకు కోహ్లీ, చెన్నైకి ధోనీ

ఐపీఎల్‌లో ఆటగాళ్ల రిటెన్షన్ నేడు



ధోనీ

ముంబై: ఐపీఎల్‌లో ఆటగాళ్లను తమ తమ జట్లతో అట్టిపెట్టుకునేందుకు సమయం ఆసన్నమైంది. గురువారం ఆటగాళ్ల రిటెన్షన్ జరుగనుంది. ఇందులో ఆయా ఫ్రాంచైజీలు స్టార్ క్రికెటర్లను తమ జట్లతో కొనసాగించేందుకు పావులు కదుపుతున్నాయి. ఆది నుంచి రాయల్‌చాలెంజర్స్ బెంగళూరు తరపున ఆడుతున్న కోహ్లీ..చెన్నై జట్టు ధోనీని తిరిగి తీసుకునే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. మరోవైపు డిఫెండింగ్ చాంపియన్స్ ముంబై ఇండియన్స్ కూడా కెప్టెన్ రోహిత్‌శర్మతో పాటు హార్దిక్, కృనాల్ పాండ్యాను అట్టిపెట్టుకునేందుకు ఆసక్తి కనబరుస్తుండగా, రాజస్థాన్..స్మిత్ వైపు మొగ్గుచూపుతున్నది. ప్రతి జట్టు ఐదుగురు ఆటగాళ్లను రిటెన్షన్, రైట్ టు మ్యాచ్ ద్వారా తీసుకోవచ్చు. రానున్న సీజన్ కోసం ఒక్కో జట్టుకు రూ.80 కోట్లను సాలరీ క్యాప్‌గా నిర్ణయించారు. ఇది వచ్చే రెండు(2019, 2020) సీజన్లలో రూ.82, రూ.85 కోట్లకు పెరుగుతుంది.

సా. గం. 6.50 నుంచి స్టార్ స్పోర్ట్స్-2లో

నైపుణ్యం సమం
చరిత్ర అధమం

రేపటి నుంచి భారత్, దక్షిణాఫ్రికా 'ఫ్రీడమ్' సిరీస్ • తొలి సిరీస్ గెలుపు కోసం విరాట్‌సేన కసరత్తు



ఫ్రీడమ్ ట్రోఫీతో భారత్, దక్షిణాఫ్రికా కెప్టెన్లు కోహ్లీ, డుప్లెసిస్

26 ఏండ్ల చరిత్రలోక్రికెట్ ప్రపంచాన్ని శాసించిన స్టార్ బ్యాట్స్‌మెన్ ఎందరో వచ్చారు.. కానీ సఫారీ గడ్డపై భారత్‌కు సిరీస్ విజయం మాత్రం అందని ద్రాక్షనే. కాలం మారినా.. నైపుణ్యం పెరిగినా.. గణాంకాల్లో మాత్రం తేడా రాలేదు. ఆనాటి నుంచి ఈనాటి వరకు మనం సాధించింది కేవలం రెండు విజయాలు. చరిత్రలో ఒక దేశం ప్రత్యర్థులపై ఇంతలా ఆధిపత్యాన్ని చూపెట్టిన దాఖలాలు వెతికిన దొరుకవు. అయితే అప్పట్నించి, ఇప్పటివరకు ఇరుజట్ల నైపుణ్యాలు మాత్రం సమంగానే ఉన్నాయి. కానీ అక్కడి వాతావరణ పరిస్థితులే గెలుపోటములను శాసించాయి. ఇలాంటి చరిత్ర ఉన్న దక్షిణాఫ్రికాతో టెస్టు (ఫ్రీడమ్) సిరీస్‌కు టీమ్‌ఇండియా మరోసారి సిద్ధమైంది. ఇప్పుడు కూడా ఇరుజట్ల నైపుణ్యాలు సమంగా ఉన్నా.. చరిత్రే అధమంగా కనిపిస్తున్నది. మరి ఈసారైనా కోట్లాది భారతీయుల ఆశలను విరాట్‌సేన నెరవేరుస్తుందా..?

నమస్తే తెలంగాణ క్రీడా విభాగం

1992లో దక్షిణాఫ్రికా క్రికెట్‌లోకి పునరాగమనం చేసినప్పట్నించీ.. వాళ్ల గడ్డపై భారత్ 17 మ్యాచ్‌లు ఆడింది. కానీ ఇందులో గెలిచింది రెండే రెండు. ఎనిమిది మ్యాచ్‌ల్లో పరాజయాలు చవిచూసిన టీమ్‌ఇండియా.. ఏడింటిని మాత్రం డ్రాగా ముగించింది. ప్రపంచ మేటి జట్లను సైతం వణికించే భారత్.. ప్రొటీస్ గడ్డపై మాత్రం తొలి సిరీస్ విజయం కోసం దాదాపు 26 ఏండ్లుగా పోరాటం చేస్తూనే ఉన్నది. ప్రపంచ బౌలర్లను వణికించిన స్టార్ బ్యాట్స్‌మెన్‌తో బరిలోకి దిగినా.. గెలుపు మాత్రం అందని ద్రాక్షగానే మిగిలిపోతున్నది. ఒక్క ఆస్ట్రేలియా మినహా.. మిగతా జట్లేవీ సఫారీ గడ్డపై ఇంతవరకు ఆధిపత్యం చూపెట్టిన దాఖలాలు లేవంటే అతిశయోక్తి కాదు. కఠినమైన వాతావరణ పరిస్థితులు, నాణ్యమైన పేసర్లు, వేగవంతమైన బౌన్సీ పిచ్‌లు, పెట్టని గోడలా ఉండే ఫీల్డర్లు, అత్యద్భుతమైన బ్యాట్స్‌మెన్‌తో ఇప్పటికీ ప్రపంచ జట్లకు దక్షిణాఫ్రికా కొరకరాని కొయ్యగా మారింది. సఫారీ గడ్డపై ఎదురయ్యే సవాళ్లు ప్రపంచంలోనే అతిపెద్దవని 2010-11 సిరీస్‌లో ఆడిన వెటరన్ గౌతమ్ గంభీర్ వ్యాఖ్యానించడమే ఇందుకు నిదర్శనం. అప్పట్లో సిరీస్ విజయానికి దగ్గరగా వచ్చినా.. చివర్లో టీమ్‌ఇండియా చేతులెత్తేసిందన్నాడు.

బలాలు సమానం..

ప్రస్తుతం ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో భారత్, దక్షిణాఫ్రికా టాప్-2లో ఉన్నాయి. ఇక పేపరు మీద బలాబలాలను బేరీజు వేసినా.. ఇరుజట్లు సమానస్థాయిలో నిలుస్తాయి. దూకుడు, నాణ్యత, సాంకేతికత, బ్యాటింగ్, బౌలింగ్ ఇలా ప్రతి అంశంలోనూ రెండు జట్లు తూకం వేసినట్లే ఉంటాయి. ఐసీసీ బ్యాటింగ్ ర్యాంకింగ్స్ టాప్-20లో భారత్ నుంచి నలుగురు బ్యాట్స్‌మెన్ ఉంటే.. సఫారీ జట్టు నుంచి ఐదుగురు ఉండటమే ఇందుకు చక్కని ఉదాహరణ. ఇక టాప్-20లో బౌలింగ్‌లో చూసుకుంటే.. దక్షిణాఫ్రికా నుంచి ఐదుగురు, భారత్ తరపున ముగ్గురు మాత్రమే ఈ జాబితాలో చోటు దక్కించుకున్నారు. ఇందులో ఇద్దరు స్పిన్నర్లు అశ్విన్, జడేజా ఉన్నారు. కానీ రేపటి నుంచి మొదలయ్యే మూడు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో తుది జట్టులో ఈ ఇద్దరి చోటు దక్కడం అనుమానమే..! ఎందుకంటే అక్కడి వాతావరణ పరిస్థితులన్నీ ఆతిథ్య జట్టుకే అనుకూలంగా ఉన్నాయి. 'భారత్ ఐదుగురు బౌలర్ల వ్యూహంతో బరిలోకి దిగితే చాలా లాభం ఉంటుంది. ప్రత్యర్థులకు సవాలు విసురొచ్చు. డ్రాతో కాకుండా గెలుపుతో మ్యాచ్‌ను దక్కించుకోవచ్చు' అని గౌతీ స్పష్టం చేశాడు. గతంతో పోలిస్తే ఈసారి మన పేస్ బలం చాలా రెట్లు పెరిగింది. పిచ్‌లకు తగ్గట్టుగా జట్టులో భిన్నమైన బౌలర్లు ఉండటం లాభించే అంశం. 'మాకు చాలా ప్రత్యామ్నాయాలు ఉన్నాయి. ఎవరైనా గాయపడినా.. మాకు ఎలాంటి ఇబ్బంది లేదు. మిగతా వాళ్లపై కెప్టెన్, కోచ్, మేనేజ్‌మెంట్‌కు మంచి నమ్మకం ఉంది' అని వైస్ కెప్టెన్ రహానే చెప్పుకొచ్చాడు.

గెలిచి.. ఓడాం

2013-14లో భారత్ రెండు మ్యాచ్‌ల సిరీస్‌ను 0-1తో చేజార్చుకుంది. కానీ అప్పుడు జరిగిన రెండు మ్యాచ్‌ల్లోనూ ప్రత్యర్థులకు గట్టి సవాలు విసిరింది. అంతకుముందు జరిగిన రెండు పర్యటనల్లో చాలా అవకాశాలు జారవిడుచుకున్న టీమ్ ఇండియా ఈ సిరీస్‌లో మాత్రం తొలిసారి మెరుపులు మెరిపించింది. జొహాన్నెస్‌బర్గ్‌లో జహీర్ (4/88), డర్బన్‌లో జడేజా (6/138) బౌలింగ్ తడాఖా చూపెట్టారు. కానీ అంతకుముందు గతంలో నాలుగుసార్లు ఇక్కడ పర్యటించినా.. కనీసం ఒక్క మ్యాచ్ కూడా గెలువలేకపోయాం. ఆ సమయంలో సఫారీ బౌలర్ల దాడిని భారత బ్యాట్స్‌మెన్ నిలువరించలేకపోయారు. సచిన్, గంగూలీ, లక్ష్మణ్, ద్రవిడ్‌ల సగటు 50కి పైగానే ఉన్నా.. విజయం మాత్రం దక్కలేదు. కానీ ఇప్పుడు పరిస్థితులు మారాయి. ప్రపంచంలోనే అత్యంత పటిష్టమైన బ్యాటింగ్ లైనప్ టీమ్‌ఇండియా సొంతం. క్రితంసారి ఇక్కడ పర్యటించినప్పుడు పుజార (70), రహానే (69.66), కోహ్లీ (68) మెరుగైన సగటు నమోదు చేశారు. అయితే ఇప్పుడు వీళ్లు అలాగే రాణిస్తారా..? ప్రస్తుతం భారత్ జట్టు బలంపై మాజీలు మాత్రం పూర్తి నమ్మకంతో ఉన్నారు. ఏదో ఓ సంచలనం చేస్తారని ఆశిస్తున్నారు.

నం.1కు ప్రమాదం లేదు

దుబాయ్: దక్షిణాఫ్రికాతో మూడు టెస్ట్‌ల్లోనూ ఓడినా భారత్ నంబర్‌వన్ ర్యాంక్‌కు ఢోకా లేదు. ప్రస్తుతం టీమ్ ఇండియా (124), దక్షిణాఫ్రికా (111) వరుసగా ఒకటి, రెండు స్థానాల్లో ఉన్నాయి. ఈ రెండింటి మధ్య 13 పాయింట్ల తేడా ఉంది. ఒకవేళ సఫారీ జట్టు 3-0తో సిరీస్ గెలిచినా 118 పాయింట్లకు చేరుకుంటుంది. భారత్ కూడా సమాన పాయింట్లతో ఉంటుంది. అప్పుడు దశాంశమానం తేడాతో విరాట్‌సేన నంబర్‌వన్‌లోనే కొనసాగుతున్నది. కచ్చితమైన పాయింట్లకు వస్తే భారత్ 118.47, దక్షిణాఫ్రికా 117.53 పాయింట్లతో ఉంటాయి. భారత్ గనుక సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేస్తే 128 పాయింట్లకు చేరుకుంటుంది. కోహ్లీ మరో ఏడు పాయింట్లు సాధిస్తే 900 మార్క్ అందుకుంటాడు.

సవాల్‌కు సిద్ధమా..?



ఫిలాండర్

మా గడ్డపై సిరీస్ గెలిచే సత్తా విరాట్‌సేనకు ఉందా..? దక్షిణాఫ్రికా పేసర్ ఫిలాండర్ తాజా సవాలు ఇది. 'భారత్ ఎక్కువ మ్యాచ్‌లు ఆడింది వాళ్ల దేశంలోనే. కాబట్టి సఫారీ గడ్డపై టీమ్‌ఇండియా ఎలా రాణిస్తుందన్నదే ఆసక్తికరం. ఇక్కడ పూర్తి భిన్నమైన మ్యాచ్‌లు జరుగుతాయి. విరాట్‌సేన ఎలా ఆడుతుందో తొలి టెస్టుతో తేలిపోతుంది. న్యూలాండ్స్ పిచ్‌పై పచ్చిక, పేస్, బౌన్స్ ఉంటుంది. విశ్లేషణలు ఎలా ఉన్నా చివరకు ఆట ఎలా సాగుతుందన్నదే ముఖ్యం. ఈ పిచ్‌పై 20 వికెట్లు పడగొట్టొచ్చు. భారీగా పరుగులూ చేయొచ్చు' అని ఫిలాండర్ పేర్కొన్నాడు. ఇక విరాట్ కోహ్లీని లక్ష్యంగా చేసుకున్నారా.. అన్న ప్రశ్నకు ఫిలాండర్ తమకు అందరూ సమానమే అన్నాడు.

తొలి రోజే కీలకం

దక్షిణాఫ్రికా సిరీస్‌పై సచిన్



ముంబై: దక్షిణాఫ్రికా గడ్డపై ఎన్నో ఏండ్లుగా ఊరిస్తూ వస్తున్న టెస్ట్ సిరీస్ కలను నేరవేర్చుకునేందుకు భారత్‌కు సమయం ఆసన్నమైంది. గతంలో ఎన్నడూలేని రీతిలో పటిష్ఠమైన బలగంతో సఫారీ సవాల్‌కు టీమ్‌ఇండియా సిద్ధమైంది. సుదీర్ఘ ఫార్మాట్‌లో నంబర్ వన్ ర్యాంక్ హోదాకు తగ్గట్టు రాణించేందుకు కోహ్లీసేన కసరత్తులు చేస్తున్నది. ఇరు దేశాలకు స్వాతంత్ర్య ఫలాలు అందించడంలో కీలకంగా వ్యవహరించిన మహాత్మా గాంధీ, నెల్సన్ మండేలా జ్ఞాపకార్థం ఈనెల 5న కేప్‌టౌన్‌లో భారత్, దక్షిణాఫ్రికా మధ్య మూడు టెస్టుల ఫ్రీడమ్‌రేసు మొదలుకాబోతున్నది. టెస్ట్‌ల్లో టాప్‌లో కొనసాగుతున్న రెండు జట్ల మధ్య ఆసక్తికర సమరం జరుగనున్నది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ దిగ్గజం సచిన్..దక్షిణాఫ్రికా పర్యటనపై మీడియాతో ముచ్చటించాడు. ఇందులో టీమ్‌ఇండియాకు అనేక విలువైన సలహాలు, సూచనలు చేశాడు. ఇరు జట్ల బలబలాలు, కీలకమైన తొలి రోజు ఆటలో ఎలా నెగ్గుకురావాలి, స్లిప్ ఫీల్డింగ్‌తో పాటు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పాత్రపై సచిన్ మాట్లాడాడు. 'మొదటి సారి దక్షిణాఫ్రికా పర్యటనకు వెళ్లినప్పుడు అక్కడి ద్వితీయ శ్రేణి జట్ల ఆటతీరు చూసి అవాక్కయ్యాం. మా అంచనాలు తప్పని తర్వాత తెలిసింది. అంతర్జాతీయ జట్లకు దీటైన పోటీనిచ్చే విధంగా యువకులను మలిచిన తీరు ఆకట్టుకున్నది. ఆల్‌రౌండర్లు ఆ జట్టుకు అతి పెద్ద బలం. కలిస్, మెక్‌మిలాన్ లాంటి ఆటగాళ్లు ఏ జట్టులోనైనా ఒదిగిపోతారు. అటు బౌలింగ్‌తో పాటు బ్యాటింగ్‌లోనూ రాణిస్తూ జట్టు విజయాల్లో వీరిద్దరు కీలకంగా వ్యవహరించారు. కానీ ప్రస్తుత దక్షిణాఫ్రికా జట్టులో అలాంటి ఆల్‌రౌండర్లు లేరు. అలాగని ఆ జట్టును తక్కువ అంచనా వేయడం లేదు. సొంతగడ్డపై పరిస్థితులను అనుకూలంగా చేసుకుంటూ చెలరేగితే వారిని ఆపడం కష్టం. టెస్ట్ తొలి రోజు ఆటలో మొదటి స్పెల్ చాలా కీలకమైంది. కొత్త బంతిని ఎలా ఎదుర్కొవాలనే దానిపై అంతా ఆధారపడి ఉంటుంది. పరిస్థితులకు అనుగుణంగా బ్యాటింగ్ చేస్తే సమస్యలు ఉండవు. స్కోరుబోర్డుకు పరుగులు జతచేయడమనేది కీలకం' అని సచిన్ అన్నాడు.

హార్దిక్ అదనపు బలం



'జట్టుకు ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా అదనపు బలం. నా సుదీర్ఘ క్రికెట్ కెరీర్‌లో ఇప్పుడున్నంత పటిష్ఠంగా భారత జట్టు ఎప్పుడూ లేదు. బ్యాటింగ్, బౌలింగ్ పరంగానే గాకుండా అన్ని విభాగాల్లో మనోళ్లు చాలా మెరుగ్గా కనిపిస్తున్నారు. దక్షిణాఫ్రికా పిచ్‌లపై బంతులు బాగా బౌన్స్ అవుతాయి. అందుకనే స్లిప్ ఫీల్డింగ్ చాలా చురుగ్గా వ్యవహరించాలి. ఏ మాత్రం ఏమరపాటు ప్రదర్శించినా తిరిగి పుంజుకోవడం కష్టం. డుప్లెసిస్, అమ్లా, డివిలియర్స్ దక్షిణాఫ్రికా జట్టుకు ఆయువుపట్టు. వారిని తొందరగా ఔట్ చేస్తే మనకు బాగా లాభిస్తుంది' అని మాస్టర్ అన్నాడు.

సింధు ఓటమి.. చెన్నైకి షాక్



లక్నో: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో చెన్నై స్మాషర్స్‌కు మరో పరాజయం ఎదురైంది. బుధవారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో ఢిల్లీ డాషర్స్ 3-0తో చెన్నైపై గెలిచింది. మహిళల సింగిల్స్‌లో స్టార్ షట్లర్ పీవీ సింధు (చెన్నై) 15-11, 13-15, 14-15తో సంగ్ జి హున్ చేతిలో ఓడింది. అంతకుముందు జరిగిన పురుషుల సింగిల్స్‌లో తియాన్ హోవీ (ఢిల్లీ) 15-14, 15-10తో సెన్సోమ్‌బుమ్ సొనాక్‌పై నెగ్గగా, మరో మ్యాచ్‌లో విన్సెట్ (ఢిల్లీ) 15-10, 15-13తో లెవర్‌డెజ్‌ను ఓడించాడు. డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో సుమిత్-లీ యంగ్ (ఢిల్లీ) 15-13, 15-11తో ఇవాన్ సొజోనోవ్-ఇవనోవ్‌ను ఓడించి శుభారంభాన్నిచ్చారు. అయితే చివరిదైన మిక్స్‌డ్ డబుల్స్ ట్రంప్ మ్యాచ్‌లో స్కోరు 5-6 ఉన్న దశలో చెన్నై ప్లేయర్ గాబ్రియెల్ అడ్‌కాక్ గాయానికి గురయ్యాడు. చీలమండ తిరుగబడటంతో ఆడే అవకాశంలేకపోయింది. దీంతో ఢిల్లీకి పాయింట్ కేటాయించారు.

'టాప్' ఆటగాళ్లకు రూ.3.14 కోట్లు చెల్లించాం

న్యూఢిల్లీ: టాప్ (టార్గెట్ ఒలింపిక్ పోడియం)లో ఉన్న 175 మంది ఆటగాళ్లకు 2017 చివరి త్రైమాసికానికి.. జేబు భత్యం కింద రూ.3.14కోట్లు విడుదల చేశామని కేంద్ర క్రీడాశాఖ మంత్రి రాజ్యవర్ధన్‌సింగ్ రాథోడ్ తెలిపారు. బుధవారం ఇక్కడ రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు బదులిచ్చిన మంత్రి.. టాప్ ఆటగాళ్ల కోసం జాతీయ క్రీడల అభివృద్ధి నిధుల (ఎన్ఎస్‌డీఎఫ్) నుంచి డబ్బు విడుదలైందని, గతేడాది సెప్టెంబర్ నుంచి డిసెంబర్ వరకు ముగిసిన త్రైమాసికానికి చెల్లించామని లిఖిత పూర్వకంగా వివరించారు.

'ఆఖరి' విజయం ఎవరిదో..?

నేటి నుంచి ఇంగ్లండ్, ఆస్ట్రేలియా ఐదో టెస్టు • గెలుపుపై ఇరుజట్ల కెప్టెన్ల ధీమా



చారిటీ సంస్థకు మద్దతుగా గులాబీ టోపీలను ధరించిన ఇంగ్లండ్ ఆటగాళ్లు

ఉ. గం 5.00 నుంచి సోనీ సిక్స్‌లో

సిడ్నీ: ఓవైపు ఇప్పటికే 3-0తో సిరీస్‌ను గెలిచామన్న ధీమాతో ఆస్ట్రేలియా.. మరోవైపు ఎట్టకేలకు గాడిలో పడ్డామన్న ఆనందంలో ఇంగ్లండ్.. ఈ నేపథ్యంలో గురువారం నుంచి ఇరుజట్ల మధ్య ఆఖరిదైన యాషెస్ ఐదో టెస్టుకు రంగం సిద్ధమైంది. దీంతో కనీసం ఈ మ్యాచ్‌లోనైనా గెలిచి ఆసీస్ ఆధిక్యం తగ్గించడంతో పాటు ఇప్పటికే చేజారిన పరువును కొంతైనా కాపాడుకోవాలని ఇంగ్లీష్ ఆటగాళ్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. సీనియర్ ఆటగాడు కుక్ ఫామ్‌లోకి రావడం కలిసొచ్చే అంశం. అయితే పక్కటెముకల గాయంతో సీమర్ క్రిస్ వోక్స్ ఈ మ్యాచ్‌కు దూరంకావడం ప్రతికూలంగా మారింది. వోక్స్ స్థానంలో లెగ్ స్పిన్నర్ మాసన్ క్రేన్ ఐదు రోజుల ఫార్మాట్‌లో అరంగేట్రం చేయనున్నాడు. దీంతో ఆల్‌రౌండర్ మొయిన్ అలీపై వేటు పడే అవకాశాలు తగ్గాయి. కెప్టెన్ రూట్ ఫర్వాలేదనిపిస్తున్నా.. స్టోన్‌మన్, విన్సీ, మాలన్, బెయిర్‌స్టోలకు ఇది చివరి పరీక్షగా మారింది. ఇక బౌలింగ్‌లో బ్రాడ్ అంచనాలను అందుకుంటున్నా.. అండర్సన్ మాత్రం విఫలమవుతున్నాడు. కీలకమైన వన్డే సిరీస్‌కు ముందు అతను గాడిలో పడటం చాలా అత్యవసరం. కుర్రాన్, మాలన్ సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నారు. నాలుగో టెస్టును డ్రాతో ముగించడం ఇంగ్లండ్ జట్టు ఆత్మవిశ్వాసాన్ని అమాంతం పెంచేసింది.

స్టార్క్ వచ్చాడు..

ఆస్ట్రేలియా కూడా ఈ మ్యాచ్ విజయంపై భారీ ఆశలు పెట్టుకుంది. ఆధిక్యాన్ని 4-0కు పెంచుకోవాలని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ప్రధాన పేసర్ మిచెల్ స్టార్క్ గాయం నుంచి కోలుకోవడం కంగారూలకు శుభవార్త. అతను ఈ మ్యాచ్‌కు అందుబాటులో ఉంటాడని కెప్టెన్ స్మిత్ తెలిపాడు. దీంతో స్పిన్నర్ అగర్ రిజర్వ్ బెంచ్‌కు పరిమితంకానున్నాడు. స్మిత్ సూపర్ ఫామ్‌కు తోడు వార్నర్, మార్ష్ సోదరుల చెలరేగడం ఆసీస్‌కు కలిసొచ్చే అంశంగా మారింది. బౌలింగ్‌లో స్టార్క్‌కు తోడుగా కమిన్స్, హాజెల్‌వుడ్‌లను బరిలోకి దించాలని మేనేజ్‌మెంట్ భావిస్తున్నది. లియోన్ స్పిన్ బాధ్యతలు పంచుకోనున్నాడు.

మ్యాక్స్‌వెల్, వేడ్‌పై వేటు

సిడ్నీ: ఇంగ్లండ్‌తో ఐదు వన్డేల సిరీస్‌కు ఆసీస్ జట్టును బుధవారం ఎంపిక చేశారు. మ్యాక్స్‌వెల్, మాథ్యూ వేడ్‌లపై వేటు వేసి, టీ20 స్పెషలిస్ట్ క్రిస్‌లిన్, వికెట్ కీపర్ టిమ్ పైనీకి అవకాశం కల్పించారు. స్టార్క్, హాజెల్‌వుడ్, కమిన్స్‌ల పేస్ త్రయాన్ని కొనసాగించారు.
జట్టు వివరాలు: స్మిత్ (కెప్టెన్), వార్నర్, కమిన్స్, ఫించ్, హాజెల్‌వుడ్, హెడ్, క్రిస్‌లిన్, మిచెల్ మార్ష్, టిమ్ పైనీ, రిచర్డ్‌సన్, స్టార్క్, స్టోయినిస్, టై, జంపా.

తిరిగి జట్టులోకి శ్రీజేష్



బెంగళూరు: సీనియర్ గోల్‌కీపర్ పీఆర్ శ్రీజేష్ తిరిగి భారత హాకీ జట్టులోకి వచ్చాడు. గతేడాది అజ్లాన్‌షా టోర్నీ సందర్భంగా గాయపడ్డ శ్రీజేష్..దాదాపు ఏడాది తర్వాత జట్టుకు ఎంపికయ్యాడు. 2018 సీజన్ కోసం భారత హాకీ సమాఖ్య(హెచ్ఐ) బుధవారం 33 మందితో కూడిన జట్టును ప్రకటించింది. రానున్న బిజీ షెడ్యూల్‌ను దృష్టిలో పెట్టుకుని ఎంపిక చేసిన వీరందరూ 10 రోజుల శిక్షణ శిబిరంలో పాలుపంచుకోనున్నారు. ఇందులో కెప్టెన్ మన్‌ప్రీత్‌సింగ్‌తో పాటు చింగ్లేన్‌సనసింగ్, ఉతప్ప, సర్దార్ సింగ్, హర్మన్‌ప్రీత్‌సింగ్, రూపిందర్‌పాల్ లాంటి సీనియర్లతో పాటు జూనియర్లను ఎంపిక చేశారు. ఏప్రిల్‌లో కామన్వెల్త్ క్రీడలు, జూలైలో చాంపియన్స్ ట్రోఫీ, ఆగస్టులో ఆసియా క్రీడలు, అక్టోబర్‌లో ఆసియా చాంపియన్స్ ట్రోఫీ, నవంబర్‌లో హాకీ ప్రపంచకప్ లాంటి మెగా టోర్నీల్లో భారత్ ఆడబోతున్నది. న్యూజిలాండ్‌లో నాలుగు దేశాల టోర్నీతో భారత్..ఈ సీజన్‌ను ఆరంభించబోతున్నది.



అమెరికాలోని నయాగరా జలపాతం సగం వరకూ గడ్డకట్టుకుపోయింది. మంచుతుఫాన్ కారణంగా ఎగువ నుంచి ప్రవహిస్తున్న చల్లటి నీరు నేలను చేరేసరికి మంచుగా మారుతున్నది. మంగళ వారం కెనడావైపు నుంచి చూస్తే నయాగరా ఇలా గడ్డకట్టుకుపోయి కనిపించింది.

అమెరికాలో మంచుతుఫాన్

- 11మంది మృతి.. ప్రమాదకర స్థాయికి పడిపోయిన ఉష్ణోగ్రతలు

వాషింగ్టన్, జనవరి 3: అమెరికాను మంచుతుఫాన్ మళ్లీ ముంచెత్తింది. అలబామా నుంచి వర్జీనియా వరకు సుమారు 20 రాష్ట్రాల్లో మంచు తుఫాన్ పెను ప్రభావాన్ని చూపిస్తున్నది. దీనికారణంగా తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో 11మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. మంచు వర్షం తీవ్రంగా పెరుగడంతోపాటు శీతలగాలులు ఉక్కిరిబిక్కిరి చేస్తుండటంతో ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. వాషింగ్టన్‌లో గురువారం భారీగా కురిసిన హిమపాతంకారణంగా 11 అంగుళాల మేర మంచు రోడ్లపై పేరుకుపోయింది. విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడ్డాయి. గ్రిడ్ వైఫల్యం కారణంగా 8లక్షల ఇండ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో వాషింగ్టన్‌లో చాలా ప్రాంతాల్లో అంధకారం నెలకొంది. 'అల్పపీడనం కారణంగా ఉష్ణోగ్రతలు గణనీయంగా పడిపోతున్నాయి. ఇలాంటి స్థితిని 'బాంబ్ సైక్లోన్' అంటారు. ఈ మంచుతుఫాన్ గురువారం అమెరికాను తాకింది. దీని ఫలితంగా రానున్న 24గంటల్లో ఉష్ణోగ్రతలు భారీగా పతనమవుతాయి. నేలపై 12అంగుళాల వరకు మంచు పేరుకుపోతుంది. గంటకు 64 నుంచి 96 కిలోమీటర్ల వేగంతో చలిగాలులు ఊపిరాడనివ్వవు' అని జాతీయ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రజలెవరూ బయటకు రావద్దని హెచ్చరించింది. న్యూఇంగ్లండ్‌లో 18 అంగుళాల మేర మంచు కురిసింది. మంచుతుఫాన్ కారణంగా జార్జియా రాష్ట్రంలో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు.



నిక్కీహేలీ

పాకిస్థాన్ డబుల్ గేమ్

- అందుకే ఆర్థిక సాయం నిలిపివేశాం
- ఐరాసలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ వెల్లడి

వాషింగ్టన్/ఐరాస, జనవరి 3: పాకిస్థాన్‌పై అమెరికా తన మాటల దాడిని కొనసాగిస్తున్నది. ఉగ్రవాదాన్ని నిర్మూలించడంలో పాక్ డబుల్ గేమ్ ఆడుతున్నదని ధ్వజమెత్తింది. తమ దేశంలో విస్తరిస్తున్న ఉగ్రవాదాన్ని పాక్ అరికడితేనే ఆర్థిక సాయాన్ని అందజేస్తామని తెలిపింది. ఐక్యరాజ్యసమితిలో అమెరికా రాయబారి నిక్కీ హేలీ మంగళవారం న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయం వద్ద విలేకరులతో మాట్లాడారు. పాకిస్థాన్‌కు 25.5 కోట్ల డాలర్ల ఆర్థిక సాయాన్ని అమెరికా నిలిపివేయడాన్ని ఆమె సమర్థించారు. 'ఓ వైపు పాక్ మాతో కలిసి పనిచేస్తున్నది. మరోవైపు ఆఫ్ఘనిస్థాన్‌లో మా సైనికులపై దాడి చేస్తున్న ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తున్నది. ఈ డబుల్ గేమ్‌ను ఎట్టి పరిస్థితుల్లో సహించం. అందుకే ఆర్థిక సాయాన్ని నిలిపివేశాం' అని తెలిపారు.

పాక్ కాల్పులకు బీఎస్ఎఫ్ జవాన్ బలి

న్యూఢిల్లీ, జనవరి 3: సరిహద్దు వెంట పాకిస్థాన్ విచక్షణారహితంగా జరిపిన కాల్పుల్లో ఓ జవాన్ ప్రాణాలు కోల్పోయారు. పుట్టినరోజునాడే జవాన్ మరణించడంతో విషాదఛాయలు అలుముకున్నాయి. బుధవారం జమ్ముకశ్మీర్‌లోని సాంబా, హీరానగర్ సెక్టార్లపై పాక్ కాల్పులకు తెగబడింది. దీంతో పశ్చిమ బెంగాల్‌కు చెందిన బీఎస్ఎఫ్ జవాన్ ఆర్పీ హజ్రా మృతిచెందారు. పాక్ కాల్పులకు భారత బలగాలు కూడా దీటుగా సమాధానమిచ్చాయి.

నా వద్ద కూడా అణు బటన్ ఉంది

అది చాలా శక్తివంతమైనది.. ఉత్తర కొరియాకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హెచ్చరిక

వాషింగ్టన్, జనవరి 3: ఉత్తర కొరియా, అమెరికా మధ్య మాటల యుద్ధం కొనసాగుతూనే ఉన్నది. తన టేబుల్ పైనే అణుదాడి బటన్ ఉంటుందని ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్ ఇటీవల హెచ్చరించిన నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్పందించారు. తన వద్ద కూడా అణుదాడి బటన్ ఉంటుందని, అది ఉత్తర కొరియా బటన్‌కన్నా చాలా శక్తిమంతమైనదని, పెద్దదని ట్వీట్ చేశారు. అనంతరం వైట్‌హౌస్ మీడియా కార్యదర్శి సారా శాండర్స్ విలేకరులతో మాట్లాడుతూ ఉత్తర కొరియాతో ప్రపంచానికి ప్రమాదం పొంచి ఉన్నదని, దాని దూకుడుకు కళ్లెం వెయ్యడానికి అన్ని దేశాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. కిమ్ జోంగ్ ఉన్ దూకుడుకు కళ్లెం వేసే అన్ని రకాల అస్త్రాలు తమ వద్ద సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. 2018లో దక్షిణ కొరియాలో జరుగనున్న ఒలింపిక్స్‌లో తాము పాల్గొంటామని కిమ్ జోంగ్ ఉన్ ప్రకటించారని, అయితే ఈ ప్రకటన ప్రభావం దక్షిణ కొరియాతో తమ సంబంధాలపై పడదని శాండర్స్ తెలిపారు.

అమెరికా అణుదాడి విధానం ఎలా ఉంటుందంటే..

ట్రంప్ తన వద్ద కూడా అణుదాడి బటన్ ఉంటుందని పేర్కొన్నప్పటికీ వాస్తవానికి అమెరికా అధ్యక్షుడి వద్ద అలాంటి బటన్‌లు ఏవీ ఉండవు. ఒకదేశంపై అణుదాడి చేయడమనేది అమెరికాలో చాలా రహస్య ప్రక్రియ. అణుదాడి చేయాలని ట్రంప్ భావిస్తే మొదట ఆయన తమ రక్షణ సంస్థ పెంటగాన్‌కు ఒక రహస్య సంకేతాన్ని పంపుతారు. ఈ సంకేతం ఎప్పుడూ ట్రంప్ వద్ద ఒక కార్డులో ఉంటుంది. ఆ కార్డును బిస్కట్ అని పిలుస్తారు. ఆయన పంపిన సంకేతం పెంటగాన్ వద్ద ఉన్న సంకేతంతో సరిపోలాలి. అప్పుడు అధ్యక్షుడు ట్రంప్ అణుదాడికి ఆదేశించారని పెంటగాన్ నిర్ణయించుకొని దాడికి పాల్పడుతుంది.



పాలస్తీనాకు ఆర్థికసాయం నిలిపి వేస్తాం!

శాంతిచర్చలను పునరుద్ధరించకుంటే ఆర్థికసాయం నిలిపి వేస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బుధవారం పాలస్తీనాను హెచ్చరించారు. పాలస్తీనా శరణార్థుల సహాయ పునరావాస కార్యక్రమం కోసం ఐక్యరాజ్యసమితికి ఇతర దేశాల కంటె ఎక్కువగా అమెరికా నిధులు సమకూర్చుతున్నది. 2016లో ఈ విధంగా పాలస్తీనాకు 3.68 కోట్ల డాలర్ల సాయం(రూ.2,336 కోట్లు) అందించింది. తమ మాట విని ఇజ్రాయెల్‌తో శాంతి చర్చలకు ఒప్పుకోకుంటే ఇకపై పాలస్తీనాకు ఆ విధంగా సాయం అందించేది లేదని ట్రంప్ అన్నారు.

త్వరలో దక్షిణ కొరియాతో చర్చలు: ఉత్తర కొరియా

త్వరలో దక్షిణ కొరియాతో ద్వైపాక్షిక చర్చలు జరుపనున్నామని ఉత్తర కొరియా ప్రకటించింది. దక్షిణ కొరియాలో జరుగనున్న ఒలింపిక్స్‌లో తాము పాల్గొంటామని ఉత్తర కొరియా ఇటీవల చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, ఇరు దేశాల మధ్య ఉన్నతస్థాయి చర్చలకు తాము కూడా సిద్ధమేనని దక్షిణ కొరియా పేర్కొంది. ఈనెల 9న ఇరుదేశాల ప్రతినిధులు సమావేశమై పలు అంశాలపై చర్చిస్తారని వివరించింది.

జూన్ వరకు గోనె సంచుల్లోనే ఆహారధాన్యాలు

- శ్రీనగర్-లేహ్ మధ్య రోడ్ టన్నెల్ ప్రాజెక్టుకు రూ.6,809కోట్లు
- జాతీయ జలమార్గం-1 నిర్మాణానికి రూ.5369కోట్లు
- కేంద్ర మంత్రివర్గం నిర్ణయం

న్యూఢిల్లీ, జనవరి 3: చక్కెర, ఆహారధాన్యాల ప్యాకింగ్‌కు తప్పనిసరిగా గోనె సంచులనే వాడాలన్న నిర్ణయాన్ని ఈ ఏడాది జూన్ వరకు కేంద్ర ప్రభుత్వం పొడిగించింది. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ అధ్యక్షతన బుధవారం సమావేశమైన కేంద్ర ఆర్థికవ్యవహారాల మంత్రివర్గ కమిటీ బుధవారం నిర్ణయం తీసుకున్నది. '90శాతం వరకు ఆహారధాన్యాలు, 20శాతం వరకు చక్కెర ఉత్పత్తుల ప్యాకింగ్ ఈ నిర్ణయం కారణంగా గోనెసంచుల్లోకే మారనున్నది. ఫలితంగా దేశంలోని 40లక్షలమంది రైతులు, 3.7లక్షలమంది కార్మికులు ప్రయోజనం పొందుతారు' అని కేంద్ర టెక్స్‌టైల్ శాఖ మంత్రి స్మృతి ఇరానీ వెల్లడించారు. జూట్ మిల్లు కార్మికులకు రావాల్సిన బకాయిలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలతో చర్చించి పరిష్కరించే దిశగా ప్రత్యేక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనున్నట్లు మంత్రివర్గ సమావేశం అనంతరం ఆమె ట్విట్టర్‌లో తెలిపారు. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్‌ను అనుసరించి జూట్ ఉత్పత్తులను వాడటం ద్వారా ఆ రంగానికి ప్రోత్సాహంతోపాటు పర్యావరణానికి మేలు చేసినట్లవుతుందని స్మృతి వివరించారు. పశ్చిమబెంగాల్, ఒరిస్సా, బీహార్, అస్సాం, ఆంధ్రప్రదేశ్, మేఘాలయ, త్రిపుర రాష్ట్రాలతోసహా పలు రాష్ట్రాలు కేంద్ర నిర్ణయంతో లబ్ధి పొందనున్నాయి.

జోజిలా టన్నెల్ నిర్మాణానికి రూ.6,809కోట్లు మంజూరు

జమ్ముకశ్మీర్‌లోని జోజిలా పాస్ వద్ద కేంద్ర ప్రభుత్వం వ్యూహాత్మకంగా చేపట్టిన టన్నెల్ నిర్మాణానికి రూ. 6,809 కోట్లు మంజూరు చేస్తూ కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకున్నది. ఏటా డిసెంబర్ నుంచి ఏప్రిల్ వరకు హిమపాతం కారణంగా మూసుకుపోయే శ్రీనగర్-కార్గిల్-లేహ్ జాతీయరహదారికి ప్రత్యామ్నాయంగా సముద్ర మట్టానికి 11,578 అడుగుల ఎత్తున జోజిలా పాస్ టన్నెల్‌ను నిర్మిస్తున్నారు. 14.2కిలోమీటర్ల పొడవున నిర్మించనున్న డబుల్ రోడ్డు టన్నెల్‌ను రహదారి సౌలభ్యంతోపాటు రక్షణ పరమైన అవసరాలకు వినియోగించుకోనున్నారు. అలాగే జలవినాస్ మార్గ్ ప్రాజెక్టు కింద హల్దియా-వారణాసి మధ్య జాతీయ జలమార్గం-1 (ఎన్‌డబ్ల్యూ-1) నిర్మాణానికి రూ.5,369 కోట్లు మంజూరు చేసే ప్రతిపాదనకూ కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. యూపీ, బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల్లోని పలు నదీతీర ప్రాంతాలను కలుపుతూ ఈ జలమార్గాన్ని నిర్మిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం కింద బ్లాక్ ఓడరేవుల నిర్మాణంలో రాయితీల ఒప్పందాన్ని కేంద్రం సవరించింది. పెట్టుబడులకు అనుకూలంగా నిర్మాణ సంస్థలపై భారాన్ని తగ్గిస్తూ నిర్ణయం తీసుకున్నది. వీటితోపాటు వివిధ దేశాలతో భారత్ చేసుకున్న ఒప్పందాలకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.



31న సూపర్ బ్లూమూన్

వాషింగ్టన్, జనవరి 3: ఒకే నెలలోని రెండవ పౌర్ణమి నాడు సంభవించే అరుదైన సంపూర్ణ చంద్రగ్రహణం (సూపర్ బ్లూమూన్) ఈనెల 31న కనువిందు చేయనుంది. 2018లో ఇది తొలి గ్రహణం. అంతేకాకుండా ఒకే నెలలోని రెండవ పౌర్ణమిన చంద్రగ్రహణం సంభవించడం 150 ఏండ్లలో ఇదే మొదటిసారి. అంతకుముందు 1866 మార్చి 31న సూపర్ బ్లూమూన్ కనిపించింది. భారత ఉపఖండంతోపాటు, పశ్చిమాసియా, తూర్పు ఐరోపా దేశాల్లో ఈ గ్రహణం సంపూర్ణంగా దర్శనమీయనుండగా.. తూర్పు ఆసియా, ఇండోనేషియా, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలో పాక్షికంగా కనిపించనున్నది. మధ్యరాత్రి వేళ 77నిమిషాలపాటు ఈ చంద్రగ్రహణం కొనసాగుతుందని, గ్రహణం భూగోళానికి దక్షిణ దిశగా చంద్రుడు కదలుతాడని నాసా ప్రకటించింది. సూపర్ బ్లూమూన్ సమయంలో చంద్రుడి దిగువభాగం పై భాగంకన్నా ఎక్కువ వెలుతురుతో మెరుస్తుందని తెలిపింది. ఆ తర్వాత బ్లూమూన్ తిరిగి 2028 డిసెంబర్ 31న, 2037 జనవరి 31న రానున్నది.

ఎన్ఎండీసీలో 101 ఖాళీలు

విద్య, ఉద్యోగ సమాచారం

హైదరాబాద్‌లోని ఎన్ఎండీసీ లిమిటెడ్ మెయింటెనెన్స్ అసిస్టెంట్, ల్యాబ్ అసిస్టెంట్ తదితర పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

ఎన్ఎండీసీ ఒక నవరత్న కంపెనీ. కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ పరిధిలోని ప్రభుత్వరంగ సంస్థ. మైనింగ్, మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ సంబంధిత కార్యకలాపాలు నిర్వహిస్తుంది.

- మొత్తం ఖాళీల సంఖ్య - 101

విభాగాల వారీగా ఖాళీలు, అర్హతలు:

- మెయింటెనెన్స్ అసిస్టెంట్ (మెకానికల్) (ట్రెయినీ) - 45 ఖాళీలు
- అర్హతలు: ఐటీఐ వెల్డింగ్/ఫిట్టింగ్ లేదా మోటార్ మెకానిక్ లేదా డీజిల్ మెకానిక్ లేదా ఆటో ఎలక్ట్రీషియన్.
- మెయింటెనెన్స్ అసిస్టెంట్ (ఎలక్ట్రికల్) (ట్రెయినీ) - 47 ఖాళీలు
- అర్హతలు: ఐటీఐలో ఎలక్ట్రికల్ ట్రేడ్ ఉత్తీర్ణత.
- పేస్కేల్: పై రెండు పోస్టులకు మొదటి 12 నెలలు రూ.11,000/- ఇస్తారు. తర్వాతి ఆరు నెలలు రూ. 11,500/- ఇస్తారు. రెగ్యులర్ అయిన తర్వాత రూ. 11,330 - 3% - 20,000/- ఇస్తారు.
- గ్రేడ్ -3 అసిస్టెంట్ ఫిజియోథెరపిస్ట్ - 1 ఖాళీ
- అర్హతలు: ఫిజియోథెరపీ డిగ్రీ. పెద్ద వైద్యశాల/నర్సింగ్‌హోంలో మూడేండ్లు పనిచేసిన అనుభవం ఉండాలి.
- గ్రేడ్ -3 అసిస్టెంట్ ల్యాబ్ టెక్నీషియన్ - 1
- అర్హతలు: సైన్స్ గ్రాడ్యుయేషన్ + మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్‌లో సర్టిఫికెట్ కోర్సు లేదా పదోతరగతితోపాటు మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్‌లో డిప్లొమా
- అనుభవం: డిగ్రీ కోర్సు చేసిన తర్వాత రెండేండ్ల అనుభవం ఉండాలి. దీనిలో కనీసం ఏడాదైనా ల్యాబ్‌లో పనిచేసిన అనుభవం. పదోతరగతి ఉత్తీర్ణులైనవారికి ఐదేండ్ల అనుభవం ఉండాలి. దీనిలో కనీసం నాలుగేండ్లు ల్యాబ్‌లో పనిచేసిన అనుభవం ఉండాలి.
- గ్రేడ్ - 3 అసిస్టెంట్ ఫార్మసిస్ట్ (ట్రెయినీ) - 1
- అర్హతలు: పదోతరగతి/సైన్స్ గ్రాడ్యుయేషన్‌తో పాటు సర్టిఫికెట్/ఫార్మసీలో డిప్లొమా లేదా ఫార్మసీ డిగ్రీ ఉత్తీర్ణత.
- గ్రేడ్ -3 అసిస్టెంట్ డైటీషియన్ (ట్రెయినీ) - 1
- అర్హతలు: బీఎస్సీ/హోం సైన్స్‌లో డిగ్రీతోపాటు డైటెటిక్స్‌లో డిప్లొమా లేదా బీఎస్సీ న్యూట్రిషియన్/డైటెక్స్ లేదా బీఎస్సీ ఫుడ్ అండ్ న్యూట్రిషన్‌లో ఉత్తీర్ణులై ఉండాలి.
- పేస్కేల్: పై నాలుగు పోస్టులకు మొదటి 12 నెలలు రూ. 12,000/-, తర్వాత ఆరునెలలు రూ. 12,500/- ఇస్తారు. రెగ్యులర్ అయిన తర్వాత రూ. 11,670-3% -20,600/- ఇస్తారు.
- గ్రేడ్ - 2 హెచ్ఈఎం (మెకానికల్) (ట్రెయినీ) - 5
- అర్హతలు: మెకానికల్ ఇంజినీరింగ్‌లో మూడేండ్ల డిప్లొమా ఉత్తీర్ణత. హెవీ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉన్నవారికి ప్రాధాన్యం ఇస్తారు.
- పేస్కేల్: మొదటి 12 నెలలు రూ. 12,000/-, తర్వాత ఆరునెలలు రూ. 12,500/- ఇస్తారు. రెగ్యులర్ అయిన తర్వాత రూ. 12,030-3% - 21,220/- ఇస్తారు.
- ఎంపిక విధానం: రాతపరీక్ష, ట్రేడ్‌టెస్ట్/జాబ్ ప్రొఫిషియన్సీ టెస్ట్
- స్టేజ్ - 1: రాతపరీక్ష 100 మార్కులకు ఉంటుంది.
- ప్రశ్నపత్రం ఇంగ్లిష్/హిందీలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ ప్రశ్నలు ఉంటాయి. (ఓఎంఆర్ పద్ధతిలో)
- పరీక్షలో సబ్జెక్టు నాలెడ్జ్ (సంబంధిత ట్రేడ్) -30 మార్కులు. జనరల్ నాలెడ్జ్ - 50 మార్కులు, న్యూమరికల్ రీజనింగ్ ఎబిలిటీ - 20 మార్కులు.
- రాతపరీక్షలో ఎస్సీ/ఎస్టీలకు 30 మార్కులు, ఓబీసీలకు 35 మార్కులు, జనరల్ - 40 మార్కులు క్వాలిఫయింగ్‌గా నిర్ణయించారు.
- రాతపరీక్షలో అర్హత సాధించినవారిని మాత్రమే ట్రేడ్‌టెస్ట్‌కు అనుమతిస్తారు.
- స్టేజ్ - 2: ట్రేడ్‌టెస్ట్/జాబ్ ప్రొఫిషియన్సీ టెస్ట్ ఇది కేవలం అర్హత పరీక్ష మాత్రమే.
- దరఖాస్తు: ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో
- ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు దాఖలు చేయడానికి చివరితేదీ: జనవరి 27
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు చివరితేదీ: జనవరి 28
- ఫీజు: రూ. 150/-
- దరఖాస్తులు పంపాల్సిన చిరునామా:
- పోస్టు బాక్స్ నంబర్: 1352 పోస్ట్ ఆఫీస్, హుమాయూన్‌నగర్, హైదరాబాద్ - 28.
- హెల్ప్‌లైన్: 09674524077
- వెబ్‌సైట్: www.nmdc.co.in



హెచ్ఈసీఎల్‌లో 169 పోస్టులు

హెవీ ఇంజినీరింగ్ కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ఈసీఎల్) ఖాళీగా ఉన్న ట్రేడ్ అప్రెంటిస్ కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

హెచ్ఈసీఎల్ అనేది పబ్లిక్ సెక్టార్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ. దీన్ని 1958లో స్థాపించారు.

- మొత్తం ఖాళీల సంఖ్య: 169
- గ్రాడ్యుయేట్ అప్రెంటిస్-69 ఖాళీలు
- కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-6, మెకానికల్/ప్రొడక్షన్-36, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్-11, సివిల్ ఇంజినీరింగ్-4, మెటలర్జీ పౌండ్రీ టెక్నాలజీ-9, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ అండ్ ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్-3
- టెక్నీషియన్/డిప్లొమా అప్రెంటిస్-100 ఖాళీలు
- కంప్యూటర్/ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ-13, మెకానికల్/ప్రొడక్షన్-46, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్-21, సివిల్ ఇంజినీరింగ్-6, మెటలర్జీ పౌండ్రీ టెక్నాలజీ-4, లైబ్రరీ సైన్స్-1, హోటల్ మేనేజ్‌మెంట్ అండ్ క్యాటరింగ్-1, రిఫ్రిజిరేషన్ అండ్ ఎయిర్ కండిషనింగ్-2, ఇండస్ట్రియల్ ఇంజినీరింగ్ ప్రొడక్షన్ ఇంజినీరింగ్ అండ్ ఇండస్ట్రియల్ మేనేజ్‌మెంట్-2, సెక్రటేరియల్ ప్రాక్టీస్ /అకౌంట్స్-4
- అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ/బోర్డు నుంచి సంబంధిత బ్రాంచీలో ఇంజినీరింగ్‌లో డిప్లొమా/డిగ్రీలో ఉత్తీర్ణత.
- దరఖాస్తు: ఆన్‌లైన్‌లో
- ఎంపిక: రాత పరీక్ష/స్కిల్ టెస్ట్ ద్వారా
- చివరితేదీ: జనవరి 12
- వెబ్‌సైట్: http://www.hecltd.com

ఎన్ఐఎన్‌లో ప్రాజెక్ట్ టెక్నీషియన్లు

హైదరాబాద్ తార్నాకలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్ఐఎన్)లో ప్రాజెక్ట్ టెక్నీషియన్ పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

ఎన్ఐఎన్ సంస్థ ఐసీఎంఆర్ పరిధిలో పనిచేస్తుంది. ప్రస్తుత ఖాళీలను 'సర్వే ఆఫ్ మానిటరింగ్ ది నేషనల్ నాన్ కమ్యూనికేబుల్ డిసీజెస్' ప్రాజెక్ట్ కింద తాత్కాలిక ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు.



- పోస్టు: ప్రాజెక్ట్ టెక్నీషియన్ (ఫీల్డ్ వర్కర్) - 3
- అర్హతలు: ఇంటర్‌లో సైన్స్ సబ్జెక్టులతో ఉత్తీర్ణత. మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్/పీఎండబ్ల్యూ లేదా రేడియాలజీ లేదా రేడియోగ్రఫీ లేదా సంబంధిత సబ్జెక్టుల్లో రెండేండ్ల డిప్లొమా లేదా ఇంటర్ (సైన్స్ సబ్జెక్టులు)తో, ఏడాది కాల పరిమితిగల డీఎంఎల్‌టీతోపాటు ఏడాది అనుభవం ఉండాలి. (బీఎస్సీ డిగ్రీని మూడేండ్ల అనుభవంగా పరిగణిస్తారు.)
- చేయాల్సిన పని: తెలంగాణ, ఏపీ గ్రామాల్లో సమాచారాన్ని సేకరించాల్సి ఉంటుంది.
- వయస్సు: 30 ఏండ్లు మించరాదు.
- జీతం: నెలకు రూ. 16,500/- (కన్సాలిడేటెడ్)
- ఎంపిక: ఇంటర్వ్యూ
- ఇంటర్వ్యూ తేదీ: జనవరి 4 (10.30 గంటల నుంచి)
- పోస్టు: ప్రాజెక్ట్ టెక్నీషియన్ (ల్యాబ్ టెక్నీషియన్) -1
- అర్హతలు: ఇంటర్ (సైన్స్ సబ్జెక్టులతో)తోపాటు రెండేండ్ల డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబొరేటరీ టెక్నీషియన్/పీఎండబ్ల్యూ లేదా రేడియాలజీ లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత. లేదా ఇంటర్‌తోపాటు ఏడాది కాల డీఎంఎల్‌టీ తోపాటు ఏడాది అనుభవం ఉండాలి.
- వయస్సు: 30 ఏండ్లు మించరాదు
- ఎంపిక: జనవరి 4న నిర్వహించే రాతపరీక్ష
- జీతం: నెలకు రూ. 16,500/-
- వెబ్‌సైట్: http://ninindia.org

మేనేజ్‌లో పీజీడీఎం ప్రవేశాలు

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చర్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్) 2018-20 అకడమిక్ ఇయర్‌కుగాను పీజీ డిప్లొమా ఇన్ అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పీజీడీఎం (ఏబీఎం) కోర్స్‌లో ప్రవేశం పొందడానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నది.

వివరాలు:

మేనేజ్‌ను 1987లో ఏర్పాటుచేశారు. ఈ సంస్థలో మేనేజ్‌మెంట్ ట్రెయినింగ్, కన్సల్టెన్సీ, మేనేజ్‌మెంట్ ఎడ్యుకేషన్, రిసెర్చ్, సమాచార సేవలు గురించి మెలకువలు నేర్పిస్తారు.

- కోర్స్ పేరు: అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్ పీజీడీఎం(పీజీ డిప్లొమా)
- అర్హతలు: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీలో 50 శాతం (ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు 45 శాతం) మార్కులతో ఉత్తీర్ణత.
- ఎంపిక: క్యాట్ పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ
- దరఖాస్తు: ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో

చిరునామా:

Principal Coordinator,
PGDM (ABM),
NAtional Institute of Agricultural Extension Management (MANAGE),
Rajendranagar,
Hyderabad–500030.

- చివరి తేదీ: 2018 జనవరి 31
- వెబ్‌సైట్: www.manage.gov.in

స్పోర్ట్స్ కోటాలో 118 పోస్టులు

సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్) స్పోర్ట్స్ కోటాలో ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.

వివరాలు:

సీఐఎస్ఎఫ్ రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలో పనిచేస్తుంది.

- క్రీడాంశాలు: అథ్లెటిక్స్, బాక్సింగ్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, జిమ్నాస్టిక్స్, హాకీ, జూడో, షూటింగ్, స్విమ్మింగ్, వాలీబాల్, రెజ్లింగ్, వెయిట్‌లిఫ్టింగ్.
- పోస్టు: అసిస్టెంట్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎగ్జిక్యూటివ్)
- ఖాళీల సంఖ్య - 31
- పేస్కేల్: 5,200 - 20,200 + గ్రేడ్ పే రూ. 2,800/-
- అర్హతలు: గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణత.
- వయస్సు: 2018, జనవరి 25 నాటికి 20 -25 ఏండ్ల మధ్య ఉండాలి.

శారీరక ప్రమాణాలు:

- పురుషులు: ఎత్తు - 170 సెం.మీ., ఛాతీ - 80-85.సెం.మీ.
- మహిళలు: ఎత్తు - 157 సెం.మీ.
- హెడ్ కానిస్టేబుల్ (జనరల్ డ్యూటీ)
- ఖాళీల సంఖ్య - 87
- పేస్కేల్: రూ. 5,200 -20,200 + గ్రేడ్ పే రూ. 2,200/-
- అర్హతలు: 10+2 లేదా తత్సమాన కోర్సు ఉత్తీర్ణత.
- వయస్సు: 2018, జనవరి 25 నాటికి 18 - 23 ఏండ్ల మధ్య ఉండాలి.

శారీరక ప్రమాణాలు:

- పురుషులు: ఎత్తు - 167 సెం.మీ., ఛాతీ - 81 - 86 సెం.మీ.,
- మహిళలు: ఎత్తు - 154 సెం.మీ.
- ఎంపిక: ట్రయల్ టెస్ట్, ప్రొఫిషియన్సీ టెస్ట్
- అప్లికేషన్ ఫీజు: రూ. 100/-
- దరఖాస్తు: నిర్ణీత నమూనాలో
- చివరితేదీ: జనవరి 25
- వెబ్‌సైట్: http://www.davp.nic.in